బుధవారం
7•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 43
• పేజీలు: 16 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD




## ఇక సెలవు



సుష్మా స్వరాజ్
1952-2019
సీనియర్ బీజేపీ నాయకురాలు

# సుష్మ కన్నుమూత

గుండెపోటుతో ఎయిమ్స్‌లో ఆకస్మిక మృతి

తీవ్ర దిగ్భ్రాంతిలో బీజేపీ శ్రేణులు, ప్రజలు

భారత రాజకీయాల్లో అద్భుత అధ్యాయం ముగిసిందన్న ప్రధాని

సంతాపం తెలిపిన సీఎం కేసీఆర్

**సమకాలీన** దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ (67) మంగళవారం రాత్రి ఆకస్మికంగా కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురైన సుష్మను కుటుంబసభ్యులు రాత్రి 9.30 గంటల సమయంలో ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. గుండెపోటుతో సుష్మ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. సుష్మ కన్నుమూతపై ప్రధాని నరేంద్రమోదీ స్పందిస్తూ.. 'భారత రాజకీయాల్లో అద్భుత అధ్యాయం ముగిసింది. ప్రజాసేవకు, పేద ప్రజల అభ్యున్నతికి తన జీవితాన్ని త్యాగం చేసిన అసమాన నేత మృతికి భారత్ శోకిస్తున్నది. కోట్ల మంది ప్రజలకు సుష్మా స్వరాజ్ స్ఫూర్తిదాయకం' అని పేర్కొన్నారు. సుష్మ ఆకస్మిక మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వివిధ హోదాల్లో దేశానికి ఆమె చేసిన సేవలను సీఎం కొనియాడారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తంచేశారు.

వివరాలు 5వ పేజీలో

## గుండెనిండుగా సజీవ గోదావరి.. నిలువెల్లా పులకించిన సీఎం



మంగళవారం హెలికాప్టర్‌లో గంగ గోదావరిని చూస్తూ విజయసంకేతంతో సీఎం కేసీఆర్



మేడిగడ్డ బరాజ్ ఏరియల్ వ్యూలో సంద్రంలా గంగ గోదావరి

# నమో కశ్మీరం

## పీవోకే, అక్సాయిచిన్.. కశ్మీర్‌లో అంతర్భాగమే



మంగళవారం లోక్‌సభలో మాట్లాడుతున్న హోంమంత్రి అమిత్‌షా

- టీఆర్ఎస్, వైసీపీ, బీజేడీ, బీఎస్పీ, అన్నాడీఎంకే మద్దతు
- ఎస్పీ, ఎన్సీపీ, తృణమూల్ కాంగ్రెస్, జేడీయూ వాకౌట్
- కశ్మీర్ దేశ అంతర్గత వ్యవహారం కాదంటూ కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్

వాటికోసం మా ప్రాణాలైనా అర్పిస్తాం

కశ్మీర్ వివాదానికి యూఎన్ చార్టర్‌తో సంబంధం లేదు

370, 371 అధికరణలను పోల్చడం సరికాదు

లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా




ఆర్టికల్ 370 రద్దు తీర్మానం, కశ్మీర్ విభజన బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:**

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), చైనా అధీనంలోఉన్న అక్సాయిచిన్ జమ్ముకశ్మీర్‌లో అంతర్భాగమేనని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా లోక్‌సభలో తేల్చిచెప్పారు. వాటికోసం తమ ప్రాణాలైనా అర్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. 1965 లో పాకిస్థాన్ దురాక్రమణకు పాల్పడి ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు తూట్లు పొడిచిన నేపథ్యంలో ఇక కశ్మీర్ వివాదానికి యూఎన్ చార్టర్‌తో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రం ఘోర తప్పిదానికి పాల్పడిందన్న విపక్షాల ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తాము చారిత్రక తప్పిదం చేయడం లేదని చారిత్రక తప్పిదాన్ని సరిచేస్తున్నామని చెప్పారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370లోని పలు నిబంధనలను రద్దు చేసే తీర్మానంతోపాటు జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు-2019కు పార్లమెంట్ మంగళవారం ఆమోదం తెలిపింది. లోక్‌సభలో తీర్మానానికి అనుకూలంగా 351 ఓట్లురాగా, వ్యతిరేకంగా 72 ఓట్లు వచ్చాయి. ఓ సభ్యుడు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించే బిల్లుకు 370 మంది సభ్యులు మద్దతు

మిగతా 4వ పేజీలో

# అద్భుతం ఆవిష్కృతమైంది

## 150 కి.మీ. సజీవ నది సాక్షాత్కరిస్తున్నది

అనుకున్నదానికంటే గొప్పగా కనిపిస్తున్నది.. సజీవ గోదావరిని చూసి మనసు పులకించింది

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన అనంతరం సీఎం కేసీఆర్

400 టీఎంసీలు తరలించేలా కాళేశ్వరం ప్రాజెక్టు

45 లక్షల ఎకరాలకు సాగునీరందించి తీరుతాం

కరంటు బిల్లు రూ.15వేల కోట్లయినా భరిస్తాం

కాళేశ్వరం జలాలు రైతులకు ఉచితంగా ఇస్తం

అప్పులుపోయి నాలుగైదు లక్షలు రైతులకు మిగులాలి

అప్పటిదాకా తెలంగాణ రైతులకు సాయం చేస్తం

నిండు గోదావరిని చూసి కొందరికి పిచ్చిలేస్తున్నది

జయప్రకాశ్ నారాయణ్‌ది హాఫ్ నాలెడ్జ్

నేను బతికుండగా తెలంగాణకు అన్యాయం జరుగనివ్వ

మేడిగడ్డ వద్ద రోజూ 50-60 టీఎంసీలు పోతున్నాయి

అందుకే కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు రీడిజైన్ చేశా

రివర్సబుల్ పంపింగ్ కాదు.. ఎత్తిపోత మాత్రమే

ఈ నెల 9 లేదా 12వ తేదీన లింక్- 2 ప్రారంభం

వంద కోట్లతో గొప్పక్షేత్రంగా ధర్మపురిని తీర్చిదిద్దుతం

ఐదారునెలల్లో జర్నలిస్టులు, ఎమ్మెల్యేల కోరిక నెరవేరుతది

ధర్మపురిలో మీడియాతో ముఖ్యమంత్రి కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఒకప్పుడు ఎండిపోయినట్టు కనిపించే గోదావరి.. నేడు మేడిగడ్డ నుంచి ధర్మపురి నరసింహస్వామి పాదాల చెంత వరకు.. సుమారు 150 కిలోమీటర్ల మేర అద్భుతమైన జీవనదిని సాక్షాత్కరిస్తున్నదని, తన కష్టానికి ప్రతిఫలం దక్కిందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతోషం వ్యక్తంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అనుకున్నదానికి మించి గొప్పగా గోదావరి సాక్షాత్కరించిందంటూ ఆనందం వెలిబుచ్చారు. తెలంగాణకు శాశ్వత నీటి వసతి కాళేశ్వరంతోనే సాధ్యమని రుజువైందని చెప్పారు. సజీవ గోదావరిని చూసి తన మనసు పులకించిపోయిందన్నారు. గత ప్రభుత్వాలు అనుసరించిన విధానంలో అయితే 20, 25 ఏండ్లకు కూడా కాళేశ్వరం ప్రాజెక్టు

మిగతా 2వ పేజీలో



## నవోదయం వేచిచూస్తున్నది!

జమ్ముకశ్మీర్ బిల్లుల ఆమోదంపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం

ఇదో చిరస్మరణీయ ఘట్టమని వెల్లడి 4

## వెనక్కి తగ్గిన పసిడి ధర

తులానికి రూ.163 తగ్గుదల 11




## అక్కడ ఆరు వేలు..ఇక్కడ ఆరు లక్షలు!

గోదావరిలో విచిత్రమైన పరిస్థితి

పేరూరు మీదుగా పది లక్షలకుపైగా క్యూసెక్కుల ప్రవాహం

గోదావరి బేసిన్‌లో అలుగుపోస్తున్న 1,834 చెరువులు 8



మంగళవారం జూరాల క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీళ్లు

## ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

- ఆల్మట్టిలో నాలుగు లక్షల క్యూసెక్కులకు పైగా అవుట్‌ఫ్లో
- నేడు జూరాలకు మూడు లక్షల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో
- శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో కరంట్ ఉత్పత్తి

## 15 జిల్లాల్లో ఓ మోస్తరు వానలు

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్

రానున్న 48 గంటల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన

వాతావరణ కేంద్రం వెల్లడి 7



## జయశంకర్ సార్‌ను తెలంగాణ ఎన్నటికీ మరిచిపోదు

జయంతి సందర్భంగా స్మరించుకున్న సీఎం కేసీఆర్

పుట్టుక మీది.. చావు మీది.. బతుకంతా తెలంగాణది 5

ప్రొఫెసర్ జయశంకర్‌కు ట్విట్టర్‌లో కేటీఆర్ నివాళి

### చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 73.00 | రిటైల్ లైవ్ | 95.00 |
| డ్రెస్డ్ | 138.00 | స్కిన్‌లెస్ | 157.00 |

### గుడ్ల ధరలు (వందకు) (రూ.)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 328.00 | రంగారెడ్డి | 328.00 |
| మెదక్ | 328.00 | కరీంనగర్ | 331.00 |
| వరంగల్ | 331.00 | చిల్లర ధర | 3.90 |

## రెవెన్యూ ఉద్యోగికీ తప్పని తిప్పలు

ధర్మగంట

కొత్త పాస్‌పుస్తకం వచ్చాక కూడా భూ బదలాయింపు

భూమిని అమ్మేసుకొన్నారంటూ అధికారుల దబాయింపు 9

న్యాయం చేయాలని వేడుకొంటున్న కామారెడ్డి జిల్లాకు చెందిన నర్సింహారావు



బాధితుడు సల్వాజి నర్సింహారావు

రెవెన్యూ ఉద్యోగులకు తమపర భేదం ఉండదేమో.. భూమి కనిపిస్తే చాలు.. తమ శాఖలో పనిచేసేవారైనా కనికరం చూపరు. కామారెడ్డి కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఓ రెవెన్యూ ఉద్యోగి నర్సింహారావుకు చెందిన భూమి అతనికి తెలియకుండానే అన్యాక్రాంతమైంది. ఇదేమని అడిగితే ఆ భూమిని దశాబ్దాల క్రితమే అమ్మేసుకొన్నావంటూ అధికారులు నిర్లక్ష్యంగా జవాబిచ్చారు. దశాబ్దాల క్రితం అమ్మితే.. భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత కొత్త పాస్‌పుస్తకాలు ఎలా ఇచ్చారంటూ బాధితుడు ప్రశ్నిస్తే అధికారుల నుంచి జవాబు లేదు. ఏం చేయాలో తోచని నర్సింహారావు తనకు న్యాయం చేయాలంటూ 'ధర్మగంట'ను ఆశ్రయించారు.





మంగళవారం మేడిగడ్డ బరాజ్ వద్ద గోదావరి నదికి వాయినం వదులుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్ తదితరులు కూడా ఉన్నారు.



మేడిగడ్డ బరాజ్ వద్ద వ్యూ పాయింట్ నుంచి గోదావరి జలాలను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్ ఉన్నారు.



మేడిగడ్డ బరాజ్‌పై వానలో నడుచుకుంటూ వెళ్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఈటల

# అద్భుతం ఆవిష్కృతమైంది

మొదటిపేజీ తరువాయి...

పూర్తయి ఉండేదికాదని అన్నారు. కానీ.. సమిష్టిగా ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసుకున్నామని చెప్పారు. ఇందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు చెప్పారు. ఇంతపెద్ద సజీవ గోదావరిని తెలంగాణకు ప్రసాదించినందుకు ఇరిగేషన్ డిపార్టుమెంటును అభినందించారు. నిండుగా నీటితో కళకళలాడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టును ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ఏరియల్ వ్యూద్వారా పరిశీలించారు. మేడిగడ్డ బరాజ్‌పై కాలినడకన తిరిగి, గోదావరి తల్లికి వాయినాలు సమర్పించారు. అనంతరం గోలివాడ పంప్‌హౌస్‌ను సందర్శించారు. తదుపరి ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మపురిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టతను, ఆవశ్యకతను వివరించారు. ఈ ప్రాజెక్టుపై పలువురు కుహనా మేధావులు చేస్తున్న విమర్శలను గణాంకాలతో తిప్పికొట్టారు. ఎస్సారెస్పీలోకి ఐదారు టీఎంసీల నీళ్లు కూడా రాలేదని, కానీ.. మేడిగడ్డ దగ్గర రోజుకు 50-60 టీఎంసీల నీళ్లు దిగువకు వెళ్లిపోతున్నాయని చెప్పారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైన్ చేశానని తెలిపారు. వివిధ అంశాలపై సీఎం ఏమన్నారో ఆయన మాటల్లోనే..

## ధర్మపురి వరకు సజీవ గోదావరి

తెలంగాణ సాధించుకోవడంతోపాటు రాష్ట్ర భవిష్యత్తుకోసం శాశ్వత అవసరాలైన సాగునీటి వనరులకోసం తరుగులేని, తిరుగులేని గొప్ప ప్రాజెక్టు నిర్మాణం దాదాపు పూర్తిచేసుకున్నం. ఒకప్పుడు గోదావరి ఎండిపోయి కనిపించేది. ఈరోజు మేడిగడ్డనుంచి ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి పాదాల వరకు సజీవంగా సుమారు 150 కిలోమీటర్లు అద్భుతమైన జీవనది సాక్షాత్కరిస్తున్నది. చాలా సంతోషం. సజీవ గోదావరిని చూసి నా మనసు పులకరించిపోయింది. ఇదే ధర్మపురికి 2003లో పుష్కరాల సందర్భంగా వచ్చి స్వామివారిని దర్శించుకొని, పుష్కరస్నానం చేశాను. ఇక్కడనే నా ఆకాంక్ష వెలిబుచ్చాను. మళ్లీ పుష్కరాల వరకు కచ్చితంగా తెలంగాణ వస్తది.. తెలంగాణలోనే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించుకుందామని చెప్పిన. స్వామి దయ, ఉద్యమ ఫలితాలవల్ల తెలంగాణ వచ్చింది. కొత్త రాష్ట్రమైనప్పటికీ పుష్కరాలను గొప్పగా నిర్వహించుకున్నం. ఆ కీర్తి కూడా మనకు దక్కింది.



జగిత్యాల జిల్లా ధర్మపురిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, ఎంపీలు సంతోష్‌కుమార్, వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, జిల్లా కలెక్టర్ శరత్ కూడా ఉన్నారు.

## కరంటు, నీటి సమస్యలకు పరిష్కారం

అనేక సమస్యల్ని పరిష్కరించుకున్నాం. అతి జటిలంగా ఉన్న కరంటు సమస్య ఇప్పుడు లేదు. దేశంలోనే 24 గంటలపాటు అన్నిరంగాలకు మీటర్లు, మోటర్లు కాలని, ఇన్వర్టర్లు, కన్వర్టర్లు అవసరంలేని అద్భుతమైన, నాణ్యమైన కరంటు సరఫరాచేస్తున్న ఒకేఒక్క రాష్ట్రం తెలంగాణ. అందుకు మనం కచ్చితంగా గర్వపడాలి. దాని తదనంతరం మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కూడా కనుగొన్నాం. మిషన్ భగీరథ అద్భుతమైన ఫలితాన్నిచ్చింది. యావత్ దేశంతోపాటు కేంద్రప్రభుత్వం కూడా మెచ్చుకుంటున్నది. మనదగ్గరికి ప్రతి 15 రోజులకు ఏదో ఒక రాష్ట్ర ప్రభుత్వ అధికారులుగానీ, కేంద్రప్రభుత్వ కార్యదర్శులుగానీ వస్తున్నారు. మే నెలలో భయంకరమైన ఎండలవల్ల మూడు వేల పైచిలుకు ట్యాంకుల నిర్మాణాన్ని నిలిపివేయాలని నేనే చెప్పిన. అవి పూర్తయ్యేదశలో, మీద ట్యాంకు కట్టేదశలో ఉన్నయి. అంతవేడిలో కడితే పగుళ్లువచ్చి ఇబ్బంది వస్తుందని ఆపేయమన్నం. వర్షాకాలం తర్వాత మళ్లీ ప్రారంభించినరు. మరోనెలలో మిషన్ భగీరథ పరిపూర్ణం అవుతుంది. సుమారు 56 లక్షల గృహాలకు మంచినీటిని సరఫరాచేస్తం. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో ధనికులు జలమండలి ద్వారా ఎలాంటి శుద్ధమైన నీళ్లు తాగుతరో.. ఆదిలాబాద్‌లో ఆదివాసీలు, నల్లగొండ జిల్లా తండాల్లోని గిరిజనులు, ఏ చిన్న గ్రామంలోని దళితవాడల్లోనైనా అవే నీళ్లు తాగుతరు.

## సంక్షేమంలో మనకు మనమే సాటి

సంక్షేమంలో తెలంగాణ నంబర్‌వన్. మనను మించినవాడు దేశంలో లేడు. ఇలాంటి రికార్డులు ఎన్నో ఉన్నయి. తెలంగాణ మాత్రమే చేపడుతున్న కేసీఆర్ కిట్స్, కల్యాణలక్ష్మిలాంటి కార్యక్రమాలు అనేకం ఉన్నయి. వాటి సత్ఫలితాలు పేదవారికి అందుతున్నయి. అద్భుతంగా అమలవుతున్న రైతుబంధు, రైతుబీమాలను చూసి దేశమే ఆశ్చర్యపోయింది. రెండు గుంటల భూమి ఉన్న రైతు చనిపోయినా.. ఆయన కుటుంబానికి రూ.ఐదు లక్షలు బీమా కింద ఎలాంటి దరఖాస్తు, దస్త్రం లేకుండా పది రోజుల్లో అకౌంట్లో జమవుతున్నయి. దేశంలో ఇలాంటి పథకాలు ఎక్కడా లేవు. ఎవరూ ప్రయత్నం కూడా చేయలేదు. ఈ మధ్యనే ఒడిశా సీఎం నవీన్‌పట్నాయక్ చేశారు. నేను వెళ్లినపుడు నా ముందే విలేకరులకు చెప్పారు.. ‘నేను నా సహచర సీఎం అమలుచేస్తున్న పథకాలను చూసి గర్వపడుతున్నాను. ఆయన పెట్టిన రైతుబంధు పథకాన్ని కాపీకొట్టి ఇక్కడ కాలియా పేరుతో అమలుచేస్తాం’ అని స్వచ్ఛమైన హృదయంతో చెప్పారు. ఇట్ల మంచి కార్యక్రమాలు చాలా చేసుకున్నం. రైతుల్లో నిరాశ తొలిగి, ఆశావహ పరిస్థితులు నెలకొన్నాయి. కొత్త రాష్ట్రమైనా చక్కటి పంథాతో ముందుకు పోతున్నామనేది నిర్వివాదాంశం.

## గత ప్రభుత్వాలైతే నిర్మాణానికి 20-25 ఏండ్లు

కొన్ని రాజకీయపార్టీలు, కొందరు నాయకులు బీద అరుపులు అరుస్తున్నారు. తెలిసీతెలియక, సగం అవగాహనతో మరికొందరు స్వయంప్రకటిత మేధావులు తప్పుడు ప్రచారంచేస్తున్నారు. ఈరోజు తెలంగాణకు సజీవంగా ఉన్న గోదావరిని చూసి నాకు చాలా ఆనందంగా ఉన్నది. మామూలు ఆనందం కాదు.. ఎందుకంటే ఇది సాధ్యమయ్యే పనికాదు. ఒక బరాజ్ ఒక ప్రాజెక్టుగా, ఒక పంపుహౌసే ఒక ప్రాజెక్టుగా ఉన్నాయి. గత ప్రభుత్వాలు అనుసరించిన విధానమే అయితే 20-25 ఏండ్లలోపు కూడా కట్టరు. అహోరాత్రులు శ్రమించి ఆ ప్రాజెక్టును నేను రీడిజైన్ చేయడమే కాదు.. మా ఇంజినీరింగ్ సిబ్బంది రాత్రి, పగలు లేకుండా భార్యాపిల్లలు, కుటుంబాల్ని వదిలిపెట్టి, ఇక్కడనే ఉండి పూర్తిచేసినరు. వాళ్లందరికీ ధన్యవాదాలు, అభినందనలు. ఇంతపెద్ద సజీవ గోదావరిని తెలంగాణకు ప్రసాదించినందుకు ఇరిగేషన్ డిపార్టుమెంటును హృదయపూర్వకంగా అభినందిస్తున్న.

## ఎల్లంపల్లికి భారం పెరిగింది

ఎల్లంపల్లిపై భారం పెరిగింది. ఒక్క ఎన్టీపీసీకే 20 టీఎంసీల నీళ్లు అవసరం. హైదరాబాద్ జలమండలికి 30 టీఎంసీలు కావాలి. నికరంగా లెక్కలు తీస్తే.. ఎల్లంపల్లి నుంచి 75 టీఎంసీల వినియోగం ఉన్నది. ఎల్లంపల్లికి వచ్చిన తర్వాతనే 400 టీఎంసీలు పోతయి కాబట్టి ఎల్లంపల్లికి రోజుకు మూడు టీఎంసీలు వచ్చేలా ఏర్పాట్లు చేసుకుంటున్నం. వచ్చే ఏడాది జూన్‌నుంచి మేడిగడ్డ బరాజ్ నుంచి ఎల్లంపల్లి బరాజ్‌కు రోజు మూడు టీఎంసీలు తరలిస్తాం. ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్‌కు వచ్చే జూన్, జూలై వరకు రోజుకు రెండు టీఎంసీల తరలింపు మొదలవుతుంది. మల్లన్నసాగర్‌నుంచి చివరన ఉన్న కొండపోచమ్మసాగర్‌కు 7000 క్యూసెక్కుల తరలింపు ఉంటుంది.

## జయప్రకాశ్ నారాయణ్‌ది హాఫ్ నాలెడ్జ్

తెలంగాణ రాష్ట్రం వద్దన్న వ్యక్తి జయప్రకాశ్‌నారాయణ్. అసలు ఆయనెవరు? తెలంగాణకు ఏం సంబంధం? రాష్ట్రం వస్తే కొంపలు అంటుకుంటాయన్న వ్యక్తి. అతిగా మాట్లాడుతున్నడని ఇద్దరు ముగ్గురు నాకూ చెప్పారు. ఆఫ్ నాలెడ్జ్‌తో మాట్లాడుతున్నడు. ఆయన ఏ ప్రాతిపదికన, ఏ సిద్ధాంతం ప్రకారం మాట్లాడుతున్నడు? తెలంగాణ అవసరాలు ఆయనకు తెలుసా? అసలు మేడిగడ్డ ఎక్కడ ఉన్నదో తెలుసా? ఎప్పుడన్న కాళేశ్వరం వచ్చి దండం పెట్టిండా? లేనిపోనివి ఆయనకెందుకు? ఆయన పని ఆయన చేసుకోక అనవసరంగా మాట్లాడటం ఎందుకు? ఆయన మాటల్లో ఈర్ష్య కనిపిస్తున్నది. తెలంగాణ గిట్ల చేసుకుంటదా అనే ఒక అసూయ కనిపిస్తున్నది. ప్రోగ్రెసివ్ థింకింగ్ లేదు. రాష్ట్రాలు, దేశాలు వారి ప్రాధాన్యాల క్రమం పెంచుకుంటరు. దానికి కొన్ని ప్రత్యేక కారణాలుంటయి.

## ఐదారునెలల్లో జర్నలిస్టులు, ఎమ్మెల్యేల కోరిక నెరవేరుతది

జర్నలిస్టులకు ఇండ్లస్థలాల కేసు సుప్రీంకోర్టుకు పోయింది. నేను జడ్జితో కూడా మాట్లాడాను. మంచోచెడో చెప్పుమన్నాను. లేకుంటే ప్రత్యేకంగా చట్టం చేసుకొని కోరిక నెరవేర్చుకుంటం అన్న. ఇవ్వడానికి స్థలాలు చాలా ఉన్నయి. మీతోపాటు మా పార్టీలో ఎమ్మెల్యేలు కొత్తగ గెలిచినవాళ్లు చాలామంది గరీబోళ్లు ఉన్నరు. ముందుగా వాళ్లది, మీది జాగ పంచాయతీ తేల్చుకుందాం. నాకు తెలిసి.. జర్నలిస్టులు, ఎమ్మెల్యేల కోరిక ఐదారునెలల్లో నెరవేరుతది.

## స్వామివారి సన్నిధిలో సీఎం కేసీఆర్

**ధర్మపురి** ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద సీఎం కేసీఆర్‌కు మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, జగిత్యాల కలెక్టర్ శరత్ ఘనస్వాగతం పలికారు. అక్కడినుంచి లక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి చేరుకున్న సీఎంకు వేదపండితులు, అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఘనంగా ఆశీర్వదించారు. శేషప్ప కళావేదికపై ముఖ్యమంత్రిని ఆసీనులను చేసి స్వామివారి ప్రసాదం, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేసి ఘనంగా సన్మానించారు. దీంతో సీఎం కేసీఆర్.. స్వామివారి మొక్కు తీర్చుకున్నట్లయింది. 2015 జూలై 14న గోదావరి పుష్కరాలు ప్రారంభమైన సందర్భంగా సీఎం కేసీఆర్ కుటుంబసమేతంగా వచ్చి గోదావరి స్నానంచేసి పుష్కరాలను ప్రారంభించారు. అదేరోజు సీఎం సమీపబంధువొకరు దివంగతులైనందున ఆరోజు స్వామివారిని దర్శించుకునే అవకాశం లేకుండాపోయింది. గతేదాడి ఆగస్టులో కూడా స్వామివారి దర్శనానికి రావాలనుకున్నా.. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి రావడంతో పర్యటన రద్దయింది.



ధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, ఎంపీలు సంతోష్‌కుమార్, వెంకటేశ్ నేతకాని, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### ఏటా 1709 టీఎంసీలు సముద్రం పాలు

అంకెలతో సహా వెల్లడించిన సీఎం కేసీఆర్

| సంవత్సరం | నీళ్లు (టీఎంసీలలో) |
|---|---|
| 2013-2014 | 3364.5 |
| 2012-2013 | 1446.7 |
| 2011-2012 | 1146.8 |
| 2010-2011 | 1965.1 |
| 2009-2010 | 541.3 |
| 2008-2009 | 766.0 |
| 2007-2008 | 1419.5 |
| 2006-2007 | 2200.5 |
| 2005-2006 | 1875.8 |
| 2004-2005 | 464.7 |
| 2003-2004 | 1230.1 |
| 2002-2003 | 991.5 |
| 2001-2002 | 1104.3 |
| 2000-2001 | 1545.2 |
| 1999-2000 | 1782.8 |
| 1998-1999 | 1739.1 |
| 1997-1998 | 921.1 |
| 1996-1997 | 776.9 |
| 1995-1996 | 1509.4 |
| 1994-1995 | 2984.7 |
| 1993-1994 | 931.1 |
| 1992-1993 | 1558.2 |
| 1991-1992 | 994.9 |
| 1990-1991 | 3271.7 |
| 1989-1990 | 1859.6 |
| 1988-1989 | 3272.8 |
| 1987-1988 | 633.4 |
| 1986-1987 | 1894.8 |
| 1985-1986 | 999.0 |
| 1984-1985 | 923.8 |
| 1983-1984 | 3810.0 |
| 1982-1983 | 1132.7 |
| 1981-1982 | 2232.4 |
| 1980-1981 | 2067.3 |
| 1979-1980 | 1597.7 |
| 1978-1979 | 2408.8 |
| 1977-1978 | 1780.7 |
| 1976-1977 | 2105.3 |
| 1975-1976 | 3130.5 |
| 1974-1975 | 1072.8 |
| 1973-1974 | 2822.1 |
| 1972-1973 | 784.1 |
| 1971-1972 | 1132.4 |
| 1970-1971 | 3001.9 |


(సగటున ఏటా 1709 టీఎంసీలు సముద్రం పాలయ్యాయి)

- కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ

### ముహూర్తం




సూర్యోదయం: 6.01 గంటలకు



సూర్యాస్తమయం: 6.43 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం సప్తమి ఉదయం 11.43 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: స్వాతి రాత్రి 9.36 వరకు, తదుపరి విశాఖ, అమృతఘడియలు: మధ్యాహ్నం 1.06 నుంచి 2.42 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.22 నుంచి 1.57 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.56 నుంచి మధ్యాహ్నం 12.47 వరకు, వర్జ్యం: తె.జా. 3.49 నుంచి 5.25 వరకు.

### లోకం పోకడ




## కాళేశ్వరం కరంటుకు 15వేల కోట్లయినా సిద్ధమే

**మరోసారి** చెప్తున్న.. కరంట్ బిల్లులు ఏటా రూ.5వేల కోట్లు. ఇంకా రూ.15వేల కోట్లు అయినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధం. రైతుల క్షేమం, సాగునీటి, పరిశ్రమల అవసరాలకోసం.. వెరసి తెలంగాణ యావత్ ప్రజల సంక్షేమంకోసం కాబట్టి.. ఎన్ని వేల కోట్లయినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. ఎవరికీ శషభిషలు అవసరంలేదు. కరంట్ బిల్లులపై చర్చచేసి, కంఠశోష తెచ్చుకోవద్దు. ఎంత అరిచినా.. మొత్తుకున్నా ప్రజాసంక్షేమంకోసం మేం చేస్తనే ఉంటం. ఇవన్నీ ప్రజల ముందు ఉంచాలి. ఎందుకంటే ఈ సన్నాసుల బాధలు తప్పుతయి. అరిచి, కరిచి.. ఒకడు 20 కోట్లు అని, ఇంకొక్కడు 10 కోట్ల బిల్లు అని.. పిచ్చిపిచ్చిగా చేస్తున్నరు. పిచ్చి ముదిరింది. గోదావరిని చూస్తుంటే వాళ్లకు గంగ మాదిరిగా ఉన్నది. పిచ్చిలేసిపోతున్నరు. భగీరథ, విద్యుత్ అయిపోయాయి. మిషన్ కాకతీయ అయిపోయింది.. ఇంకా అవుతుంది. నాలుగువేల కోట్లతో చెక్‌డ్యాంలు కడుతున్నం. అదో అద్భుతమైన వనరు అవుతుంది.

### రైతుల అప్పులు పోయేదాకా సాయం

దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎకరాకు ఐదువేల చొప్పున ఇస్తున్నది. నాణ్యమైన ఉచిత కరంట్ 24 గంటలు ఇస్తున్నాం. కాళేశ్వరం జలాలు కూడా ఉచితంగా ఇస్తమని చెప్తున్నం. ఇవన్నీ ఎందుకు ఇయ్యాలంటే.. సమైక్య రాష్ట్రంలో 40, 45వేల బోర్లు వేసి భార్య పుస్తెలు అమ్మి, రైతాంగం అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకొని కుంగిపోయి, కునారిల్లిపోయి, కృశించిపోయింది. నాకు తెలిసి ఇంచుమించు 45 వేల కోట్లు కుమ్మరించారు. నేను కూడా తెలంగాణ రైతునే. నా పొలం కాడ నేనే 30 దాక బోర్లు వేసిన. మూడు బోర్లల్ల నీళ్లు వచ్చినయి. తెలంగాణలో అప్పులేని రైతు లేడు. రెండువేలో నాలుగువేలో ఎంతో ఉంది. వాళ్ల అప్పులన్నీ తీరిపోయి నాలుగో, ఐదో లక్షల రూపాయలు వారికి మిగులాలి. సొంత పెట్టుబడి పెట్టుకునే శక్తి రావాలి. అప్పటివరకు రైతులకు ఈ సాయం చేస్తనే ఉంటం. అది తెలంగాణ, టీఆర్‌ఎస్ పార్టీ నమ్ముతున్న సిద్ధాంతం.

# 575 టీఎంసీల నీళ్లిచ్చే ప్రాజెక్టులు

**గతంలో** ఉన్న ప్రాజెక్టులతోకాకుండా కాళేశ్వరంతో 400 టీఎంసీలు వాడుకుంటం. ఇదికాకుండా వచ్చే ఏడాది పూర్తయ్యే తుపాకులగూడెం బరాజ్‌తోని 75 టీఎంసీల నీటిని వందశాతం నికరంగా వాడుకుంటం. బరాజ్ పని త్వరలోనే పూర్తి అవుతుంది. అక్కడ ఎప్పటికైనా 7 టీఎంసీలవరకు ఉంటయి. 365 రోజులు పంపింగ్ చేసుకునే వీలుంటుంది. దాని దిగువన దుమ్ముగూడెం దగ్గర సీతారామ ప్రాజెక్టును రూ.13 వేల కోట్లతో నిర్మిస్తున్నం. ఇది పూర్తి అయితే 100 టీఎంసీల నీటిని ఖమ్మం జిల్లాకు తీసుకుంటం. వెరసి పాత మహబూబ్‌నగర్ జిల్లా, నల్లగొండ జిల్లాలో సౌత్, వెస్ట్ ప్రాంతాలు మినహాయిస్తే.. మిగిలిన తెలంగాణ మొత్తం గోదావరి నీళ్లు పారుతయి. నేను చెప్పిన లెక్క ప్రకారం 400 టీఎంసీలు కాళేశ్వరం, 100 టీఎంసీలు దుమ్ముగూడెం, 75 టీఎంసీలు దేవాదుల.. మొత్తం 575 టీఎంసీల నీళ్లు ఇచ్చేటి ప్రాజెక్టును మనం పూర్తి చేసుకున్నం. మూడేండ్లలో.. కేంద్రం రూపాయి ఇయ్యకున్నా.. మన సొంత నిధులతోని కట్టుకుంటూ సొంత తెలివితేటలతో అనుమతులన్నీ సంపాదించుకున్నం. తుపాకులగూడెం, దుమ్ముగూడెం ప్రాజెక్టులు రెండూ కలిస్తే అదో వంద కిలోమీటర్ల సజీవ గోదావరి అవుతుంది. అంటే దాదాపు వంద టీఎంసీల నీళ్లను గోదావరి మాత తన ఒడిలోనే ఒడిసిపట్టుకొని తెలంగాణ ప్రజలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటుంది. ఇది ఎవరూ కలలోకూడా అనుకోలేదు. మొదట్లో నాకు కూడా కొన్ని అనుమానాలుండేవి. అనుకున్నది అనుకున్నట్లుగా జరిగిందా? అని చూసేందుకు నేను ప్రత్యక్షంగా అధికారులు, ఫైనాన్స్ సెక్రటరీ, మంత్రి ఈటల రాజేందర్, అనేకమందిని వెంటవేసుకొని చూశాను. రీడిజైనింగ్ సమయంలో లైడార్ సర్వే ఏవిధంగా చేయించినమో.. దానిని కూడా ఎంత వివాదాస్పదం చేశారో మీకు తెలుసు. అయితే మేం ముందుగా ఏదైతే అనుకున్నామో అంతకంటే మేలుగా, గొప్పగా గోదావరి సాక్షాత్కరించడాన్ని నా కండ్లతో స్వయంగా చూసిన. కానీ.. కొంతమంది మీడియా మిత్రులు, జూనియర్లు అవగాహనలేక కొన్ని వార్తలు రాస్తున్నారు. కొంతమంది ప్రగతి నిరోధకులు, రాజకీయ శక్తులు కుట్రలుపన్ని 300 పైచిలుకు కేసులు వేసిండ్రు. అన్నింటినీ అధిగమించి, కావాల్సినవి సాధించి ఫలితాలను ప్రత్యక్షంగా అందుకోబోతున్నం. కాళేశ్వరం మన ముందుకు వచ్చింది. దేవాదుల త్వరలో పూర్తిచేసి 365 రోజులు వాడుకుంటం. సీతారామ ఫలితాలు కనిపిస్తున్నయి. తొందర్లోనే పూర్తిచేసి వచ్చే ఏడాదినుంచి సంపూర్ణంగా వాడుకుంటం. ఈ రకంగా కరంట్ కోతలు లేని, తెలంగాణ.. మంచినీళ్ల బాధలు, ఖాళీ బిందెల ప్రదర్శనలు లేనటువంటి తెలంగాణ.. సాగునీటికి మలమలమాడి బాధపడిన తెలంగాణ పోయి.. సస్యశ్యామలంగా పారే తెలంగాణను టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసింది. దీన్ని కొన్ని రాజకీయశక్తులు రకరకాలుగా అడ్డుకున్నయి. వాళ్లు చేయలే.. చేసినవాళ్లను అంటున్నరు. దీన్ని ప్రజలు గమనించాలి. దీని కోసం నేనే ప్రత్యక్షంగా గోదావరి పరిశీలించిన. ప్రజలకు వాస్తవాలు తెల్వాలని ఈ విషయాలు చెప్తున్న. ఇంకా చాలా చిన్న చిన్న ప్రాజెక్టులు చేస్తున్నం. మహబూబ్‌నగర్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు ప్రారంభించినం. పది లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తున్నం. నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ ఇప్పుడు ఉధృతంగా నడుస్తున్నయి. పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు మొన్ననే రూ.పది వేల కోట్లకు మంజూరు తీసుకున్నం. త్వరలోనే దాన్ని పూర్తిచేస్తం. ఇలా మొత్తంగా వందకు వంద శాతం ఒక కోటీ 20 లక్షల ఎకరాల్లో బంగారు పంటలు పండే సస్యశ్యామల తెలంగాణను సదృశ్యం చేయబోతున్నం. ఇవన్నీ ప్రజల ముందు ఉన్నయి.



### కేసీఆర్ ఉండగా.. తెలంగాణకు నష్టం జరుగదు...

జయప్రకాశ్ నారాయణ్‌కో, ఇంకొగనికో అజీర్తి అయితే నేనేంచేయాలి? నా బాధ ఏం తెలుసు? పండెటోనికెరుక గూనివాటం అంటరు. ఎవని బాధ వానికెరుక. 50 లక్షల రైతు కుటుంబాలకంటే ముఖ్యమైనోళ్లు ఎవరుంటరు? డబ్బులు మిగిల్చుకొని ఏం చేస్తరు? రూ.5000 కోట్లు ఎక్కడ్నో పెట్టి సాధించేదేంది? అది చెప్పుడా జయప్రకాశ్ నారాయణ! తల తోక ప్రాతిపదిక ఉండాలి. ఉట్టిగనే అవాకులు.. చెవాకులు! కొంచెం జాగ్రత్తగా మాట్లాడాలి. ఇది చేస్తున్నది ఎవరు.. కేసీఆర్! కేసీఆర్ ఎవరు.. తెలంగాణ ఉద్యమకర్త! 14 ఏండ్లు అవిశ్రాంతంగా పోరాడి.. సావ తయారై తెలంగాణ తెచ్చిన. అటువంటి కేసీఆర్ బతికుండగా తెలంగాణకు అన్యాయం జరుగనిస్తడా! ఎందుకు జరుగనిస్త! నాకేమన్న పిచ్చిపట్టిందా! సాధ్యమైతదా! నేను బతికుండగా తెలంగాణకు నొక్కు పడనిస్తనా! పైస లాభం జరుగాలని చూస్తాగాని, గీ వయసులో కష్టపడి సాధించిన తెలంగాణకు నష్టం కలుగనిస్తనా? అర్థంలేకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఎలా? వద్దా మనకు ఇప్పుడు కాళేశ్వరం జలాలు? అంటే బొంబాయి, దుబాయి, బొగ్గుబాయి లెక్కనే ఉండాల్నా తెలంగాణ? వలసల రాష్ట్రం కావాల్నా తెలంగాణ? ఈ 5వేల కోట్లు మిగిల్చి ఎవరికి పెట్టాలి కిరీటం? 50 లక్షల మంది రైతులకు పెట్టేది కిరీటం కాదా? ఇట్స్ ఆల్ రబ్బిష్.. ఊరికే చెప్పే మాటలు. దాని గురించి ఎవరూ పట్టించుకోనవసరం లేదు.

మరికొన్ని అంశాలు మూడో పేజీలో...

### గోదావరి బరాజ్‌లకు సంబంధించి వాటర్ స్టోరేజ్ వివరాలు

| బరాజ్ | దూరం (కి.మీ.) | బెడ్ లెవల్ (మీటర్లు) | ఎఫ్‌ఆర్‌ఎల్ (మీటర్లు) | కెపాసిటీ (టీఎంసీలు) |
|---|---|---|---|---|
| మేడిగడ్డ | 40 | 88 | 100 | 16.17 |
| అన్నారం | 31 | 106 | 119 | 10.87 |
| సుందిల్ల | 30 | 118 | 130 | 8.83 |
| ఎల్లంపల్లి | 42 | 129 | 148 | 20.18 |
| తుపాకులగూడెం | 27.4 | 71 | 83 | 6.94 |
| దుమ్ముగూడెం | 55 | 43 | 63 | 36 |
| సదర్‌మాట్ | 9.5 | 268 | 276 | 1.58 |
| మొత్తం | 234.9 | | | 100.57 |

### ధర్మపురి క్షేత్రానికి ఎంతైనా వెచ్చిస్త

ధర్మపురి దేవస్థానం.. నేను మొక్కే.. కొలిచే దేవుడు. అప్పట్లో పుష్కరాలకు వచ్చిన. పుష్కరస్నానం చేసిన తర్వాత అసెంబ్లీలో మాట్లాడుతున్న. అప్పుడు ఆంధ్రాప్రాంత ఎమ్మెల్యేలు ‘అన్నా.. దేవుని దగ్గర రాజకీయం ఏంది?’ అన్నరు. అక్కడే ఉన్నది పంచాయితీ అని చెప్పిన. మీరు గోదావరి పుష్కరాలు అని పెట్టిండ్రు.. కానీ అసలు ఉన్నది మా దగ్గర్నే.. రాజమండ్రి కాదన్న. మా అయ్యగారు లేరా! కొబ్బరికాయ దుకాణాలు లేవా? మా దగ్గర ఎందుకు జరుగకూడదని వాదించిన. అట్ల ధర్మపురి నుంచి చాలా ఐక్యత వచ్చింది. దీంతో లక్షలమంది ధర్మపురికి వచ్చిండ్రు. ఇప్పటికి రూ.50కోట్లు ఇయ్యాలన్నరు. ఇస్తమన్నం. శివాలయాన్ని మంచిగ చేస్తం. ఇంకా 50కోట్లయినా ఇస్తం. మల్లోసారి వచ్చి సాయంత్రం దాకా ఇక్కడ్నే ఉండి పనులు పరిశీలిస్త. ధర్మపురి విశిష్టత ఏమిటంటే స్వామివారి పాదాల చెంత సజీవ గోదావరి ఉంటుంది. గొప్పక్షేత్రంగా ధర్మపురిని తీర్చిదిద్దుతం. నియోజకవర్గంలోని ప్రతి మండలానికి రూ.25 లక్షలు, ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10లక్షలు ఇస్తం. వీధులను వెడల్పు చేసుకోవాలి. వందల ఏండ్ల చరిత్ర ఉన్న సనాతన పుణ్యక్షేత్రం ఇది. బాగా అభివృద్ధి చెందాలి. నీటిశుద్ధి ప్లాంట్లను ఏర్పాటుచేసుకోవాలి. గోదావరిలో పవిత్రస్నానం చేసే పద్ధతి రావాలి. ప్రత్యేకంగా పట్టణాభివృద్ధికి రూ.10కోట్లు వెంటనే విడుదలచేస్తున్న. దాదాపు రూ.100కోట్లతో ధర్మపురి క్షేత్రాన్ని తీర్చిదిద్దుతం. అవసరమైతే ఎక్కువైనా ఖర్చుపెడుతం.



పెద్దపల్లి జిల్లా గోలివాడకు చేరుకున్న కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు

## శభాష్ వెంకటేశ్వర్లు

### నాకున్న నమ్మకాన్ని నిలబెట్టారు

### కాళేశ్వరం ఈఎన్సీకి సీఎం కేసీఆర్ అభినందన

**మంథని, నమస్తే తెలంగాణ:** 'శభాష్.. వెంకటేశ్వర్లు.. శభాష్. గుడ్ జాబ్.. చాలా చక్కగా పనిచేశారు. నాకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టారు. అందరూ అసాధ్యం అంటే సుసాధ్యం చేశాం. ఇది మనందరి సమిష్టి విజయం. కలిసికట్టుగా పనిచేస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయో కాళేశ్వరం ప్రాజెక్టుతో చేసి చూపించాం' అంటూ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం గోలివాడ పంప్‌హౌస్ హెలిప్యాడ్ వద్ద ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుతో సీఎం ప్రత్యేకంగా మాట్లాడారు. 'నాకు తెలంగాణ ఇంజినీర్లపై అపారమైన నమ్మకం ఉండేది. ఈ ప్రాంత ప్రజలు భూసేకరణకు సహకరిస్తారనే విశ్వాసం ఉన్నది కాబట్టే ఈ ప్రాజెక్టు రూపకల్పన చేసేటప్పుడే ఎన్నో తీర్ల చర్చలను జరిపి శ్రీకారం చుట్టాం. అన్నీ అనుకున్నట్లుగానే జరిగాయి. గుడ్ జాబ్ వెంకటేశ్వర్లు.. గుడ్ జాబ్..' అంటూ క్యాంపు కార్యాలయంలోకి వెళ్లారు.



పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడకు చేరుకున్న సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు నడిపల్లి దివాకర్‌రావు, కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు కూడా ఉన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్‌లో గోదావరి జలాలను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ఉన్నారు.

# సజీవ గోదావరి.. పులకించిన సీఎం

### తెలంగాణ కల నెరవేరిందంటూ ఆనందం

- కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించిన సీఎం కేసీఆర్
- ఏరియల్ వ్యూ ద్వారా బరాజ్‌లలో నీటినిల్వ పరిశీలన
- మేడిగడ్డ బరాజ్‌పై కాలినడకన తిరిగిన ముఖ్యమంత్రి
- గోదావరి మాతకు పసుపుకుంకుమ సమర్పణ
- బరాజ్‌ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి
- ఇరిగేషన్ ఉన్నతాధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం

**హైదరాబాద్/మంథని/ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/ధర్మపురి, నమస్తే తెలంగాణ/ధర్మపురి రూరల్:**

తను కన్న కల.. అపూర్వ జలనిధిని ఆవిష్కరించిన వేళ.. ముఖ్యమంత్రి పులకించిపోయారు. సుదీర్ఘ మేధోమథనం.. వేల మంది కార్మికులు, ఇంజినీర్లు, నిపుణుల శ్రమ ఫలితం.. భారీ ప్రాజెక్టుగా సాక్షాత్కరించిన సమయాన.. పట్టరాని ఆనందంతో పరవశులయ్యారు. ఒకవైపు గోదావరి తెలంగాణలో ప్రవేశించేచోట ఎస్సారెస్పీలో చుక్కనీరు లేని సమయాన.. కాళేశ్వరం ప్రాజెక్టుతో మేడిగడ్డ మొదలుకుని.. ధర్మపురి దాకా దాదాపు 150 కిలోమీటర్ల మేర సజీవ జలస్రవంతి కండ్లముందు కళకళలాడుతుంటే.. తెలంగాణ రైతు బంగారు భవితవ్యాన్ని ఊహించుకుని మురిసిపోయారు. తలాపున గోదావరి పారుతున్నా.. బీళ్లకు నీళ్లు లేని దుస్థితి నుంచి.. తెలంగాణ కల నెరవేరిన అద్భుత సన్నివేశాన్ని చూసి.. ఉత్సాహపూరిత ఉద్వేగానికి గురయ్యారు. ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించే సమయంలో అనుకున్నదాన్ని మించి గోదావరిలో కనిపించిన అద్భుత దృశ్యాలు చూసి సంతృప్తి, సంతోషం వ్యక్తంచేశారు. ఆహోరాత్రులు శ్రమించి సజీవ గోదావరిని తెలంగాణకు ప్రసాదించారంటూ సాగునీటిశాఖ ఇంజినీర్లను అభినందించారు. మేడిగడ్డ బరాజ్‌లోని నీటిని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బరాజ్‌కు, అక్కడినుంచి సుందిల్ల బరాజ్, ఎల్లంపల్లి జలాశయానికి ఎత్తిపోసిన నేపథ్యంలో సజీవ గోదావరిని తిలకించేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో పర్యటించారు. ఉన్నతాధికారులతో కలిసి రెండు హెలికాప్టర్లతో కాళేశ్వరం ప్రాజెక్టును ఏరియల్‌వ్యూ ద్వారా పరిశీలించారు. తొలుత మేడిగడ్డ బరాజ్‌కు చేరుకున్న సీఎంకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్దపల్లి, భూపాలపల్లి జెడ్పీ చైర్మన్లు పుట్ట మధూకర్, జక్కు శ్రీహర్షిణి రాకేశ్, జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఆర్ భాస్కరన్ తదితరులు స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి నేరుగా వర్షంలోనే మేడిగడ్డ బరాజ్ వంతెనపైకి చేరుకున్న సీఎం.. గొడుగు సాయంతో మొదట బరాజ్ 70, 71వ నంబర్ గేట్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, పూలు, ఇతర వస్తువులను వదిలి గోదావరికి వాయనం సమర్పించారు. నాణేలు కూడా విడిచిపెట్టారు. అనంతరం కాలినడకన వంతెన మీదుగా 35వ నంబర్ గేటు వరకు వెళ్లారు. బరాజ్‌లో నీటి నిల్వలు, వరద ప్రవాహం, బరాజ్ నిర్వహణపై సాగునీటిశాఖ ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చాలాసేపు వంతెన పైనుంచి బరాజ్‌లోని నీటినిల్వలను చూసి అధికారులతో తన ఆనందాన్ని పంచుకున్నారు. చివరగా బరాజ్ వ్యూ పాయింట్ వద్దకు వచ్చిన సీఎం కేసీఆర్.. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్లతో కొద్దిసేపు సరదాగా గడిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించిన ఇంజినీర్లకు అభినందనలు తెలిపారు. వారితో కలిసి ఫోటోలు దిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు కార్యనిర్వాహక ఇంజినీర్ (ఈఈ) వెంకటరమణారెడ్డి, డీఈలు తిరుపతిరావు, సురేశ్, రామరాజుతోపాటు పలువురు ఇంజినీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు గంటన్నరపాటు మేడిగడ్డ బరాజ్ వద్ద ఆయన పర్యటన కొనసాగింది. పొంగుతున్న గంగమ్మను చూసిన సీఎం.. ఆద్యంతం ఉత్సాహంగా కనిపించారు. అక్కడికి వచ్చిన మహదేవపూర్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలతోనూ మాట్లాడారు.

- ప్రాజెక్టుతో ప్రతి రైతుకు లాభం జరుగాలి
- ముంపునకు గురయ్యే ప్రతి రైతును ఆదుకుంటాం
- గోలివాడ క్యాంపు కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్
- ధర్మపురి నృసింహుడి సన్నిధిలో సీఎం కేసీఆర్ పూజలు
- ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగిన సీఎం పర్యటన



మేడిగడ్డ బరాజ్ వద్ద సీఎం కేసీఆర్‌తో ఇంజినీర్ల గ్రూప్ ఫొటో. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు కూడా ఉన్నారు.

### అందరి సహకారంతోనే వేగంగా ప్రాజెక్టు పూర్తి

మొదటి లింక్‌లో నిర్మించిన బరాజ్‌లు, పంప్‌హౌస్‌ల నిర్మాణంలో ఈ ప్రాంత రైతులు, ప్రజలతోపాటుగా ప్రజాప్రతినిధులు, ఇంజినీర్ల సహకారంతోనే ప్రాజెక్టును వేగవంతంగా పూర్తిచేసుకున్నామని సీఎం అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మొదటి లింక్‌ను విజయవంతంగా పూర్తిచేయడంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను, ఇంజినీర్లను అభినందించారు. పెద్దపల్లి జిల్లాలో నిర్మించిన బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు, ఇతర నిర్మాణాల్లో ఎవరైనా భూములు కోల్పోయి ఉంటే అలాంటి వారందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ముంపు కారణంగా ఎవరైనా రైతులకు పంటనష్టం కలిగితే పరిహారాన్ని సైతం ప్రభుత్వమే చెల్లిస్తుందని భరోసా ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంద్వారా రాష్ట్రంలో ఏ ఒక్క రైతు నష్టపోవద్దనీ, ప్రాజెక్టు నీళ్లతో వారికి లాభమే జరుగాలని చెప్పారు. అనంతరం ధర్మపురికి వెళ్లారు. సీఎం కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన కార్యక్రమంలో మంత్రులు ఈటల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ సంతోష్‌కుమార్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, సీఎం ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సాగునీటిపారుదలశాఖ కార్యదర్శి సోమేశ్‌కుమార్, సీఎం కార్యదర్శి స్మితాసబర్వాల్, సీఎం ఓఎస్డీ భూపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, సాగునీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, ఈఈ రమణారెడ్డి, కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన, జాయింట్ కలెక్టర్ వనజాదేవి, ఎల్‌అండ్‌టీ ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండం పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, పెద్దపల్లి డీసీపీ సుదర్శన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

**సీఎం పర్యటనకు ముందు తర్వాత మేడిగడ్డలో భారీ వర్షం**

ముఖ్యమంత్రి కేసీఆర్ మేడిగడ్డకు చేరుకునే ముందు బరాజ్ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. సీఎం బరాజ్‌కు చేరుకునే సమయంలో వర్షం తగ్గిపోయింది. సీఎం కేసీఆర్ గోలివాడకు బయలుదేరిన తర్వాత మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాంతంలో భారీ వర్షం కురిసింది.

### బరాజ్‌ల నిర్వహణలో అప్రమత్తం

**కాళేశ్వరం** ప్రాజెక్టు బరాజ్‌ల నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సాగునీటిపారుదలశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రాణహితనుంచి కొన్ని లక్షల క్యూసెక్కుల్లో భారీ వరద వస్తున్న నేపథ్యంలో గేట్ల నిర్వహణ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 45 లక్షల ఎకరాలకు సాగునీటిని, పారిశ్రామిక అవసరాలు సహా 80% తెలంగాణకు తాగునీటిని అందించే కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని తక్కువ సమయంలో పూర్తిచేసుకున్నందుకు సంతోషంగా ఉందని సీఎం పేర్కొన్నారు. మేడిగడ్డ ఎగువన ప్రాణహిత నుంచి వస్తున్న వరద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఈ సీజన్‌లో మేడిగడ్డ నుంచి కిందికి ఎంత వరద వెళ్లిందని అధికారులను అడిగారు. ఈ సీజన్‌లో 300 టీఎంసీల నీరు కిందికి వెళ్లినట్లు అధికారులు సీఎంకు వివరించారు. పైనుంచి వచ్చే వరదకు అనుగుణంగా గేట్లు ఎత్తాలని, వీలున్నంతవరకు నదిలో నీటిమట్టాన్ని ఉంచాలని అధికారులకు సీఎం సూచించారు. గోదావరిలో మొత్తం వరద తగ్గిన తరువాత బరాజ్ గేట్లు మూసివేయాలని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మేడిగడ్డ బరాజ్‌ను సకాలంలో నిర్మించి ఈ సీజన్‌కు అందించిన ఎల్ అండ్‌టీ సంస్థను, సాగునీటిపారుదలశాఖ అధికారులను అభినందించారు. ఆ తర్వాత.. ఇటీవల యాగం నిర్వహించిన యాగశాల వద్దకు చేరుకొని అక్కడకు వచ్చిన కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వినతిపత్రాలను తీసుకున్నారు. అనంతరం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ పంప్‌హౌస్‌కు బయల్దేరి వెళ్లారు. పంప్‌హౌస్‌తోపాటు, ఎల్లంపల్లి జలాశయం, గోదావరి తీరాన్ని ఆయన ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అనంతరం గోలివాడ పంప్‌హౌస్ సమీపంలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు.

J.B. INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY
(UGC AUTONOMOUS)
(Accredited by NAAC, Approved by AICTE & Permanently Affiliated to JNTUH)
Bhaskar Nagar, Yenkapally (V), Moinabad (M), R.R.District, Hyderabad-075.
Website: www.jbiet.edu.in Ph: 958413-235127 / 7702299776 / 9989623333.
SPOT ADMISSIONS TSEAMCET-2019
Eligible candidates (who have not taken admission anywhere so far) seeking admission in to Ist year B.Tech in CSE / ECE / EEE / INF/ MECH / ECM / CIVIL / MINING branches can attend Spot Admission with all the original certificates on 08-08-2019 (Thursday) at 10.00 A.M, in the college campus. Selected candidates, have to pay Rs.96,000/- + Admission Fee. A processing fee of Rs. 1,200/- for EAMCET qualified students andRs. 2,000/- for EAMCET non -qualified students has to be paid as per the guidelines of the Convenor, TSEAMCET-2019. Please visit our website: www.jbiet.edu.in for vacancies position. Sd/- PRINCIPAL
Note: Fee Reimbursement is not applicable for Spot Admissions.

JBREC
JOGINPALLY B.R ENGINEERING COLLEGE (JBREC)
(Sponsored by Joginpally B.R. Educational Society)
Accredited by NAAC B++, Affiliated to JNTUH,
Approved by AICTE and is included under Section 2(f) of UGC Act 1956
Bhaskar Nagar, Yenkapally(V), Moinabad(M), R.R District, Hyd -075
Website: www.jbrec.edu.in, Ph: 08413-235684 / 9704924777 / 9000723678 / 9676466680
SPOT ADMISSIONS TSEAMCET - 2019
Eligible candidates (who have not taken admission anywhere so far) seeking admission in to 1st year CSE/ECE/EEE/INF/MEC branches can attend Spot Admission with all the original certificates on 08-08-2019 (Thursday) at 10:00 AM in the college campus. Selected candidates have to pay Rs.87,000/- + Admission fee. A processing fee of Rs.1200/- for EAMCET qualified candidates and Rs.2,000/- for EAMCET non-qualified candidates has to be paid as per the guidelines of the Convenor, TSEAMCET-2019. Please visit our website www.jbrec.edu.in for vacancy position. Sd/- PRINCIPAL
Fee Reimbursement is not applicable for spot admissions
Head Office: 6-3-248/1/1/A, 4th Floor, Bhaskar Plaza, Road No.1, Banjara Hills, Hyderabad-500 034. Ph:040-23391979 / 23301523 / 9866388591 / 9704130091.

KAKATIYA
INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
WARANGAL - 506015.
(An Autonomous Institute under Kakatiya University, Warangal)
NAAC-'A' Graded Institute NIRF-2019 Rank : 180
Ph No. 0870-2564888, website: www.kitsw.ac.in
B.TECH. 1st year SPOT ADMISSIONS (2019-20)
A few seats are vacant in B.Tech. CE, ME, EIE, EEE & ECI
Date : 08-08-2019 (Thursday), Time : 10.30 am
Candidates may attend for spot admission with all original certificates (TSEAMCET-2019 Hall Ticket/Rank Card, SSC Memo, Intermediate Marks Memo, Study Certificates, Caste Certificate, TC etc.) along with the Tuition fee/Other fee of Rs.1,35,400/- at 10.30 a.m. on 08-08-2019 at the office of the Institute. A processing fee of Rs.1200/- or Rs.2000/- shall be collected from TSEAMCET-2019 qualified or unqualified candidates respectively.
Spot admissions will be made as per the guidelines prescribed by the Convenor, TSEAMCET-2019 (Admissions).
Date: 06.08.2019 Sd/- PRINCIPAL

### రివర్సబుల్ పంపింగ్ కాదు.. ఎత్తిపోత మాత్రమే

**కొన్నిసార్లు** పేపర్లలో రివర్సబుల్ పంపింగ్ అని చదువుతున్న. వాస్తవంగా అది రివర్సబుల్ పంపింగ్ కాదు. నీటిని లిఫ్టు చేస్తున్నం. మన రాష్ట్రంలో రివర్సబుల్ పంపింగ్ అనేవి నాగార్జునసాగర్, శ్రీశైలంలోనే ఉన్నయి. కరంటు ఉత్పత్తి చేసే సమయంలో డ్యాం నుంచి నీళ్లు దిగువకు వచ్చినపుడు టర్బయిన్లు ఒక వైపు తిరుగుతయి, దిగువన ఉన్న టెయిల్‌పాండ్ నుంచి వాటినే రివర్స్‌లో లిఫ్టు చేసి మళ్లీ డ్యాంలోకి పోస్తరు. దానిని రివర్సబుల్ పంపింగ్ అంటరు. కాళేశ్వరంలో ఉన్నది లిఫ్టు. ఒక బరాజ్ నుంచి మరో బరాజ్‌కు నీటిని లిఫ్ట్ చేస్తున్నం. గోదావరిలో ప్రవాహం రివర్స్‌లో వస్తది. కానీ అది రివర్సబుల్ పంపింగ్ కాదు. పంపింగ్ అంటే ఎగువకు చేయడమే కదా! కిందకు చేయం.

### గోదావరిలో నాణాలు వేసి మొక్కిన

**'మా ఊరికి..** మా భూమికి రా' అంటూ గోదావరిలో నేను వేసిన నాణాలు.. బహుశా ప్రపంచంలో ఎవరూ వేసి ఉండరు. మంచిర్యాల జిల్లాకు, రాయపట్నం మీదుగాగానీ, గోదావరి బ్రిడ్జి మీద నుంచిగానీ పోతుంటే వాహనం ఆపి నాణాలు వేసేవాన్ని. కొన్ని వందలసార్లు వేసిన. గోదవరిఖని దగ్గరయితే.. పాయ ఎక్కడ ఉన్నదో చూడాలని నడిచి చూసేవాళ్లం. ఇయ్యాల రామగుండం దగ్గర బ్రహ్మాండంగా 20 నుంచి 25 ఫీట్ల ఎత్తున నీళ్లున్నయి. ఇంత గొప్పగా ఇప్పుడు జరిగింది. దీన్ని పాజిటివ్‌గా చూడకుండా.. మంచిని మంచి అనకుండా కువిమర్శలు చేస్తున్నరు. రైతాంగం ఎవ్వరూ ఈ విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

# కాళేశ్వరం @ 400 టీఎంసీలు

### 45 లక్షల ఎకరాలకు సాగునీళ్లు : సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుద్వారానే 400 టీఎంసీల నీటిని తరలించుకుంటామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలన అనంతరం ధర్మపురిలో ఆయన మీడియాతో మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

#### 45 లక్షల ఎకరాలకు సాగునీళ్లు

ప్రాజెక్టుపై పిచ్చివాళ్లు కూస్తున్న కూతలు నాకు అవసరంలేదు. అల్లాటప్పాగా.. ఎల్లయ్య, మల్లయ్య చెప్తే చేసిందికాదు. చాలా పెద్ద ప్రాజెక్టు తోటి చేసినపని. కేంద్ర జలసంఘం 44 సంవత్సరాల రికార్డు దానికి ఆధారం. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎస్సారెస్పీ, ఇంతకుముందు ఉన్న నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టులకు అదనంగా కొత్తగా నికరంగా వందశాతం లభించే నీళ్లు ఒక సంవత్సరంలో 400 టీఎంసీలు. ముఖ్యమంత్రిగా చెప్తున్నా.. దీని తర్వాత ఎవరూ ఇంకోవిధంగా రిపోర్టింగ్ చేయొద్దని కోరుతున్న. మన రాష్ట్రానికి, గౌరవానికి సంబంధించిన విషయమిది. అధికారికంగా చెప్తున్నా. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే 40 లక్షల ఎకరాలు, గ్యాప్‌లో మరో ఐదు లక్షల ఎకరాలు మొత్తంగా 45 లక్షల ఎకరాలకు సాగునీళ్లు అందుతయి. అందుకు 400 టీఎంసీల నీళ్లు తీసుకుంటం. జూన్ నుంచి నవంబర్ వరకు ఆరుమాసాలపాటు నెలకు 60 టీఎంసీల చొప్పున ఎత్తిపోసుకుంటం. అంటే 360 టీఎంసీలు. నవంబర్–జూన్‌వరకు మధ్యలో 70–80టీఎంసీలు వస్తయి. తక్కువ నీళ్లు ఉండే సమయమైనందున అందులో కనిష్ఠంగా 40 టీఎంసీలు వాడుకుంటం. అంటే 360+40=400 టీఎంసీలను ఎలాంటి సమస్య లేకుండా వాడుకుంటం.

#### చాలా ఇంటెలిజెంట్ ప్రాజెక్టు ఇది

మిడ్ మానేరు, లోయర్ మానేరు, సింగూరు, నిజాంసాగర్‌లలో చుక్క నీరు లేదు. కింద నీళ్లు పోతున్నయి. పైన మనకు లేవు. కింద నుంచి తీసుకోవడమే మార్గం. దీనికి 'ఇన్ని వేల కోట్లు ఖర్చు పెడుతరా! కరంట్ బిల్లు ఎంత అయితది? అంటూ కొంతమంది సన్నాసులు మాట్లాడుతున్నరు. 400 టీఎంసీలు తీసుకోవడానికి మనం చెల్లించే కరంట్ బిల్లు రూ.4,992 కోట్లు. ఏటా సుమారు రూ.5 వేల కోట్లు ఖర్చు అవుతుంది. దీన్ని ఇంకా తగ్గించమని చెప్పిన. చాలా తెలివైన (ఇంటెలిజెంట్) ప్రాజెక్టు ఇది. చాలా మల్టిపుల్ ఉపయోగాలుంటయి. ఈ విషయం చాలామందికి తెల్వదు. ఉదాహరణకు మేడిగడ్డను తీసుకుందాం. నిన్నమొన్న ఎల్లంపల్లిలో నీళ్లు లేవు. సడెన్‌గా కడెంనుంచి లక్ష క్యూసెక్కులు వచ్చింది. దాంతోని ఎల్లంపల్లి గేట్లు ఎత్తేవేసే పరిస్థితి వచ్చింది. ఇంకా ఉధృతంగా ఎల్లంపల్లి నుంచి వస్తే మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేయం. ఇప్పటివరకు చెప్పిన 5 వేల మెగావాట్ల విద్యుత్తు, రూ.4,992 కోట్లను ప్రతి సంవత్సరం ఖర్చు పెట్టం.

#### ఇది బహుముఖ ప్రాజెక్టు

ప్రతి నాలుగైదు ఏండ్లకోసారి గోదావరి వరద పైనుంచి బాగావస్తది. ఎస్సారెస్పీ కూడా నిండుతది. అప్పుడు లిఫ్టులను ముట్టు కోం. నేరు గా వరదకాల్వ, కాకతీయకాల్వ ద్వారా మిడ్‌మానేరు, ఎల్‌ఎండీ నింపుకుంటం. మిడ్‌మానేరు నుంచి మల్లన్నసాగర్ నింపుతం. కింద ఇగ అసలే ముట్టుకోం. వరద ఆగిన తర్వాత ఎంత అవసరముంటే అంతే మేడిగడ్డనుంచి తీసుకుంటం. ఎల్లంపల్లికి బాగా వస్తే అక్కడినుంచే తీసుకుంటం. మేడిగడ్డ నుంచి పంప్‌చేయం. ఇలా ప్రాజెక్టు బహుముఖంగా ఉన్నది. చాలా తెలివితేటలు ప్రదర్శించినం. మెదడంతా కరుగదీసినం. ఈ ప్రాజెక్టును సఫలీకృతం చేసేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి వాడుకున్న గోదావరి నదీగర్భం 91వేల ఎకరాలు. గోదారిపై భూములు వృథాకాకుండా, రైతులకు ఎక్కువ నష్టంరాకుండా చూసినం. గత్యంతరం లేనికాన్నే మల్లన్నసాగర్ తీసుకున్నం. అంతేకానీ అవసరంలేనిచోట కట్టలే. ఎక్కడైతే అవసరం లేదో, నదీగర్భాన్ని వాడుకోగలుగుతమో అక్కడే కట్టినం. ఇంతమంచి ప్రాజెక్టును పాజిటివ్ లైన్‌లోకి తెచ్చుకున్నం.

#### కాళేశ్వరంతో ఇతర ప్రాజెక్టులకూ జీవం

శ్రీరాంసాగర్‌కు ఎప్పుడైనా తక్కువ పడితే దానికి కూడా అందిస్తం. ఉదాహరణకు మొన్న మేడిగడ్డ దగ్గర 9.50 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంటే శ్రీరాంసాగర్‌కు నాలుగు వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ఉన్నది. ఎస్సారెస్పీలోకి ఇప్పటికి 9.06 టీఎంసీల నిల్వ ఉన్నది. ఇంకా నీళ్లు వస్తలేవు. చాలా దుర్భరమైన పరిస్థితి. ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి పాదాల చెంత ఏడాదిపాటు గోదావరి ఇట్లనే సజీవంగా ఉంటది. ఈరోజు ఎట్ల ఉందో మే 31న కూడా ఉంటది. ఎక్కడికి పోవాలన్నా ఎల్లంపల్లి వచ్చే పోవాలికాబట్టి ఎప్పటికప్పుడు ఎత్తి పోస్తం. అందుకే సజీవంగా ఉంటది.

#### తెలిసీతెలియక మాట్లాడుతున్నరు

ఎస్సారెస్పీకి నీళ్లు తక్కువ ఉన్నపుడు కాళేశ్వరం ద్వారా అందిస్తం. కొందరు తెలిసీతెలియక, తెలివిలేక రకరకాలుగా మాట్లాడుతున్నరు. మొత్తం 90 టీఎంసీలు ఎత్తిపోయం. ఇప్పుడు ఎస్సారెస్పీలోకి 9 టీఎంసీలు వచ్చినయి, ఇంకో 2–3 టీఎంసీలు రావచ్చు. అంటే 90 టీఎంసీల్లో ఇవిపోను మిగిలిన టీఎంసీలు ఎత్తిపోసుకుంటం. ఎస్సారెస్పీ ఆయకట్టు కిందికి కట్ అయిపోయిన తర్వాత పైన ఏడు లక్షల ఎకరాలు ఉన్నది. అందుకు 70 టీఎంసీలుకావాలి. అందులో 5–10 టీఎంసీలు ఎగువ నుంచి వస్తే ఇంకో 30–40 కావాల్సి వస్తే ఎత్తిపోసుకుంటం. ఇందుకు ఎస్సారెస్పీ వరద కాల్వను రిజర్వాయర్‌గా మలుచుకున్నం. దాంట్లో పంపులు పెట్టుకొని ఎస్సారెస్పీలోకి నీళ్లు ఎత్తిపోసుకొని ఆయకట్టులో రెండుపంటలకు నీళ్లు ఇచ్చుకుంటం. రాబోయే 2–3 ఏండ్లలో పైన ఉన్న నిజాంసాగర్, సింగూరుకు వచ్చే ప్రవాహాలు ఎలాగూ వాటికి ఉన్నా.. రాని సమయాల్లో ప్రత్యామ్నాయంగా అవసరమైతే వాటికి కూడా ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని అం దిస్తాం. హైదరాబాద్‌కు పుష్కలంగా మంచినీళ్లు ఇవ్వగలుగుతం.

#### గోదావరే గతి

కృష్ణానదిలో నీళ్లు తగ్గిపోయినయి. ఆల్మట్టి ఎత్తు పెంపుద్వారా మరో వంద టీఎంసీలు నిలుపుకొంటరు. అందుకే నీటిలభ్యత తక్కువ ఉన్నది. తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకైనా గోదావరి తప్ప మనకు ఇంకోటిలేదు. మేడిగడ్డ దగ్గర 6–9 లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి. ఈ ఆగస్టు ఒకటినుంచి ప్రతిరోజు 50–60 టీఎంసీల నీళ్లు ప్రవహించినయి. అంటే మేడిగడ్డ దగ్గర రోజుకు 50–60 టీఎంసీలు పోతుంటే ఇప్పటికీ ఎస్సారెస్పీలోకి ఐదారు టీఎంసీలు వచ్చిన పరిస్థితిలేదు. మేడిగడ్డ దగ్గరే నీళ్లున్నట్లు మనకు కనిపిస్తున్నది.

#### 88-318 మీటర్లకు ఎత్తిపోత


మేడిగడ్డ దగ్గర గోదావరి బెడ్‌లెవల్ 88 మీటర్లు. అక్కడ మనం వంద మీటర్లస్థాయిలో బరాజ్ నిర్మించినం. 12 మీటర్ల లెవల్‌లో కట్టుకున్నం. దీంతో 40 కిలోమీటర్ల దూరంలోని అన్నారం బరాజ్‌లోకి ఎత్తిపోసుకుంటం. అన్నారం బరాజ్ దగ్గర గోదావరి బెడ్‌లెవల్ 106 మీటర్లు. అక్కడ 13 మీటర్లు పెంచి 119 మీటర్ల లెవల్‌లో బరాజ్ కట్టుకున్నం. సుందిల్ల దగ్గర గోదావరి బెడ్‌లెవల్ 119 మీటర్లు ఉంటే 130 మీటర్లుగ బరాజ్ కట్టుకు న్నం. ఎల్లంపల్లి బెడ్‌లెవల్ 129 మీటర్లు అయితే టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక అవాంతరాలు తొలిగించి బరాజ్‌ను 148 మీటర్ల లెవల్‌లో కట్టుకున్నం. 88 మీటర్ల బెడ్ లెవల్ నుంచి 60 మీటర్లు ఎత్తిపోసుకోవడం ద్వారా 148 మీటర్లకు అంటే ఎల్లంపల్లికి నీటిని తరలిస్తాం. ఎల్లంపల్లి నుంచి 200 మీటర్లకు ఎత్తిపోస్తరు. నందిమేడారంలో వంద మీటర్లు, లక్ష్మీపూర్ దగ్గర మరో వంద మీటర్లు ఎత్తిపోయడం ద్వారా 318 మీటర్ల మీదున్న మిడ్ మానేరుకు నీటిని చేరుస్తం.

#### ఈ నెల 9 లేదా 12న లింక్–2 ప్రారంభం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జలాల ఎత్తిపోతతో మిడ్ మానేరు వరకు తరలింపు పూర్తయితే ప్రాజెక్టు లక్ష్యం దాదాపు 60–65% విజయవంతంగా పూర్తయినట్లే. శ్రావణమాసం అంతా శుభప్రదం కాబట్టి.. శ్రావణ శుక్రవారం గానీ, సోమవారంగానీ మిడ్‌మానేరుకు నీళ్లు విడుదలకావాలని గోలివాడలో సమీక్ష సందర్భంగా ఇంజినీర్లు, వర్కింగ్ ఏజెన్సీలకు చెప్పిన. వీలైతే నేనుగానీ, మంత్రులుగానీ వచ్చి ప్రారంభిస్తం. దాదాపు 67% సాఫల్యత ఆ ప్రాజెక్టుకు వస్తుంది. మిడ్‌మానేరు, లోయర్ మానేరు కూడా ఎప్పుడూ నిండుకుండల్లా ఉంటయి. ఎస్సారెస్పీకి నీళ్లు లేవు, అప్పర్ మానేరు, మిడ్ మానేరు, లోయర్ మానేరు, సింగూరులో చుక్క నీరు లేదనే పరిస్థితి ఉండదు.




అపర భగీరథుడి ఫలం చిత్రమాలిక టాబ్లాయిడ్‌లో..



ఎస్. జైపాల్ రెడ్డి గారు
మాజీ కేంద్రమంత్రి
"ఉత్తమ పార్లమెంటేరియన్"

ద్వాదశ దిన కర్మ
ఆగష్టు 8 (గురువారం), 2019 ఉ॥ 11 గం. నుండి
కె.ఎల్.సి.సి. కన్వెన్షన్, శంషాబాద్,
హైదరాబాద్. ఫోన్: 81425 33456

ఆయన నడిచిన మార్గం... అందరికీ ఆదర్శం.

తామెల్లరు శ్రద్ధాంజలి ఘటించి వారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని మనవి.
కుటుంబ సభ్యులు

# లోక్‌సభ నిరవధిక వాయిదా

**న్యూఢిల్లీ:** లోక్‌సభ మంగళవారం నిరవధికంగా వాయిదా పడింది. 17వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 17 ప్రారంభమయ్యాయి. షెడ్యూల్ ప్రకారం జూలై 26న ముగియాల్సి ఉన్నప్పటికీ, సమావేశాలను ఆగస్టు 7 వరకు ప్రభుత్వం పొడిగించింది. మంగళవారం జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన బిల్లు, తీర్మానం ఆమోదం పొందిన అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి విజ్ఞప్తి మేరకు స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేశారు. అంతకుముందు స్పీకర్ మాట్లాడుతూ.. 1952 నుంచి ఇప్పటివరకు అత్యంత ఫలవంతంగా సాగిన సమావేశాలు ఇవేనని ప్రశంసించారు. 37 రోజుల్లో మొత్తం 280 గంటలు పాటు సమావేశాలు సాగాయని చెప్పారు. 36 బిల్లులకు సభ ఆమోదం తెలిపిందని, 33 బిల్లు ప్రవేశపెట్టారని తెలిపారు. సభ్యులు జీరో అవర్‌లో 1,086 అంశాలను లేవనెత్తారని పేర్కొన్నారు. 265 మంది కొత్తగా ఎన్నికైన సభ్యుల్లో 229 మందికి జీరో అవర్‌లో మాట్లాడే అవకాశం లభించిందని చెప్పారు.


# నెక్స్ట్ టార్గెట్ ఉమ్మడి పౌర స్మృతి?

- ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370 రద్దును వెంటవెంటనే పూర్తిచేసిన అధికార పక్షం
- ఎన్నికల మేనిఫెస్టోలో పౌర స్మృతిని పొందుపరిచిన బీజేపీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** ఆర్టికల్ 370ని రద్దు చేయడంతోపాటు జమ్ముకశ్మీర్‌ను రెండుగా విభజించి కేంద్రం సాహసోపేత నిర్ణయం తీసుకున్నది. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లే కశ్మీర్ అంశాన్ని పూర్తిచేసింది. బీజేపీ ఎన్నికల హామీలో అయోధ్య రామ మందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌర స్మృతి(యూనియన్ సివిల్ కోడ్ - యూసీసీ) లాంటి అంశాలు ప్రముఖంగా కనిపిస్తాయి. 2019 ఎన్నికల్లో సంపూర్ణ మెజార్టీతో అధికారంలోకి రావడంతోనే బీజేపీ కొన్ని కీలక బిల్లులను ప్రవేశపెడుతున్నది. రాజ్యసభలో పూర్తి బలం లేకున్నా.. ఇతర పార్టీల సహకారంతో ఆయా బిల్లులు పాస్ అయ్యేలా కూడా చూస్తున్నది. ట్రిపుల్ తలాక్ బిల్లు దీనికి ఓ ఉదాహరణ కాగా, ఆర్టికల్ 370 రద్దు బిల్లు కూడా తాజాగా ఆ కోవలోకి వచ్చి చేరింది. బీజేపీ మేనిఫెస్టోలో ఉన్న మరో అంశం అయోధ్య వివాదం. ఇది కూడా దాదాపు చివరి దశకు వచ్చేసింది. దీనిపై సుప్రీంకోర్టు మంగళవారం నుంచి రోజువారీ విచారణ చేపట్టింది. వీటి తర్వాత ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ)పై బీజేపీ దృష్టిసారించే అవకాశం ఉన్నదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది తేలిక కాదు. భారత్‌లాంటి భిన్న సంప్రదాయాలున్న దేశంలో యూసీసీ ఆమోదం అంత సులభం కాదని నిపుణులు అంటున్నారు. వ్యక్తిగత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి ఈ బిల్లును తేవాలి. కాగా ఆర్టికల్ 370ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం



తీసుకున్న నిర్ణయం ఆమోదం పొందడం బీజేపీ సాధించిన విజయంగా రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కొన్ని విపక్షాలూ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం గమనార్హం. 'ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం చారిత్రాత్మకం. భారత సమైక్యతకు ఇది బాటలు వేస్తుంది' అని సీనియర్ బీజేపీ నేత అరుణ్ జైట్లీ పేర్కొన్నారు.




# కశ్మీర్‌పై భారత్‌కే హక్కు

- పాక్ దురాక్రమణతో రెఫరెండం అనే ప్రశ్న ముగిసింది
- ఐరాస చార్టర్‌తో కశ్మీర్ వివాదానికి సంబంధం లేదు
- హురియత్ కాన్ఫరెన్స్‌తో చర్చలకు తావు లేదు
- రాష్ట్రపతి ఉత్తర్వుతో 35ఏ రద్దయినట్లే
- లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:**



లోక్‌సభలో మాట్లాడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370లోని పలు నిబంధనల రద్దుకు ప్రతిపాదించిన తీర్మానం, జమ్ముకశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును మంగళవారం లోక్‌సభ ఆమోదించింది. అంతకుముందు తీర్మానం, బిల్లుపై వాడీవేడీ చర్చ సాగింది. చర్చకు హోంమంత్రి అమిత్ షా జవాబిస్తూ.. పాక్ ఆక్రమణలోని జమ్ముకశ్మీర్ భూభాగం తమదేనని భారత్ స్పష్టం చేస్తూనే ఉంటుందన్నారు. కశ్మీర్‌కు ఐరాస చార్టర్ వర్తించే అంశంపై స్పందిస్తూ.. ఈ చార్టర్ ప్రకారం ఒక దేశ సాయుధ బలగాలు మరో దేశ ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించడానికి వీల్లేదన్నారు. '1965లో పాక్ ఈ నిబంధనను ఉల్లంఘించిన నాడు, యూఎన్ చార్టర్ ఉల్లంఘనకు గురైంది. పాక్ దురాక్రమణతో రెఫరెండం అనే ప్రశ్న ముగిసింది. ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌పై ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే హక్కు భారత్‌కు ఉన్నది' అని అన్నారు. కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తూ.. కశ్మీర్ అంశాన్ని ఐరాసకు తీసుకెళ్లింది ఎవరని ప్రశ్నించారు. 1948లో ఏకపక్ష కాల్పుల విరమణను తెచ్చిందెవరని నిలదీశారు. నాడు పరిస్థితి చక్కదిద్దేందుకు సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి ఉంటే నేడు పీవోకే భారత్‌లో అంతర్భాగంగా ఉండేదని చెప్పారు.

### హురియత్ కాన్ఫరెన్స్‌తో చర్చల్లేవు

వేర్పాటువాద హురియత్ కాన్ఫరెన్స్‌తో చర్చలకు తావు లేదన్నారు. 'మేం హురియత్‌తో మాట్లాడాలనుకోవడం లేదు. రాష్ట్ర ప్రజలతో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామన్నారు. ఆర్టికల్ 370 అనేది జమ్ముకశ్మీర్‌కు భారత్‌తో గల సంబంధాలపై సందేహాలను లేవనెత్తుతున్నదన్నారు. ఈ ఆర్టికల్‌ను రద్దు చేస్తూ కేంద్రం ఘోర తప్పిదానికి పాల్పడుతున్నదన్న విపక్షాల ఆరోపణలను ఖండించారు. తాము చారిత్రక తప్పిదం చేయడం లేదని, చారిత్రక తప్పిదాన్ని సరిచేస్తున్నామన్నారు. ఆర్టికల్ 370 రద్దు మతపరమైన ఎజెండా అన్న విపక్షాల ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. 1989 నుంచి ఉగ్రవాదం కారణంగా జమ్ముకశ్మీర్‌లో 41,500 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, ఇందుకు ఆర్టికల్ 370, 35ఏనే కారణమని ఆరోపించారు. రెండు రోజులుగా కశ్మీర్‌లోయలో ఆంక్షలను విధించడాన్ని ఆయన సమర్థించుకున్నారు. అక్కడ శాంతిభద్రతలు సవ్యంగానే ఉన్నాయని, ముందస్తు జాగ్రత్తలో భాగంగానే ఆంక్షలు విధించినట్లు చెప్పారు.

### ఆర్టికల్ 371ను రద్దు చేయబోం

ఆర్టికల్ 370 దుర్వినియోగం చేస్తూ పాకిస్థాన్ జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం, వేర్పాటువాదానికి బీజాలు వేసిందని విమర్శించారు. ఈ అధికరణం వల్ల దేశ చట్టాలు జమ్ముకశ్మీర్‌లో అమలు కాకపోవడంతో ఉగ్రవాదం పెరిగిందన్నారు. 370, 371 అధికరణలను పోల్చడం సరికాదని, ప్రజలను తప్పుదోవపట్టించేందుకే వీటిని పోలుస్తున్నారని మండిపడ్డారు. ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హక్కులు కల్పించే ఆర్టికల్ 371ను రద్దుచేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. జమ్ముకశ్మీర్ యువతకు కాంగ్రెస్ చేసిందేమీ లేదని విమర్శించారు.

### రాష్ట్రపతి ఉత్తర్వుతో 35ఏ రద్దయినట్లే..

అంతకుముందు బిల్లుపై చర్చ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ.. లడఖ్‌కు కేంద్రపాలిత ప్రాంత హోదా ఇవ్వాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని, మోదీ ప్రభుత్వం దాన్ని నెరవేర్చిందని చెప్పారు. 'జమ్ముకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం. అందులో ఎలాంటి సందేహానికి తావులేదు. నేను జమ్ము కశ్మీర్ అని అన్నానంటే.. అందులో పీవోకే, అక్సాయిచిన్ కూడా కలిపి ఉంటాయి' అని షా పేర్కొన్నారు. కొత్త నిబంధనలు పీవోకేకు కూడా వర్తిస్తాయా అని ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. అందుకోసం తమ ప్రాణాలైనా అర్పిస్తామని బదులిచ్చారు. 'భారత రాజ్యాంగంలోని అన్ని నిబంధనలు జమ్ము కశ్మీర్‌కు కూడా అమలుచేస్తూ రాష్ట్రపతి సోమవారం రాజ్యాంగ ఉత్తర్వు-2019పై సంతకం చేశారు. దీనర్థం ఆర్టికల్ 35ఏ ఇక రద్దయినట్లే' అని షా పేర్కొన్నారు.

### రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం..

కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ మాట్లాడుతూ.. జమ్ముకశ్మీర్, జునాగఢ్, హైదరాబాద్.. భారత్‌లో అంతర్భాగం అయ్యాయంటే.. అందుకు దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూనే కారణమని చెప్పారు. దీనికి అమిత్ షా స్పందిస్తూ.. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కృషిని తక్కువ చేస్తున్నారనడానికి ఇదో ఉదాహరణ అని పేర్కొన్నారు. 'ఈ బిల్లును సువర్ణాక్షరాలతో లిఖించాలి' అని అన్నారు. ఈ బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం ప్రజల హక్కులను ఉల్లంఘించడమేనని ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను అమిత్‌షా తోసిపుచ్చారు. అనంతరం తివారీ మాట్లాడుతూ.. కేంద్రం నిర్ణయం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని ధ్వజమెత్తారు.

## కశ్మీర్ అంతర్గత వ్యవహారమా?

సభలో చర్చ సందర్భంగా అమిత్ షా, కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ.. పీవోకేపై ప్రభుత్వ వైఖరి ఏమిటని ప్రశ్నించారు. బిల్లులు ప్రవేశపెట్టడం వెనుక చట్టబద్ధతపై ప్రశ్నలు లేవనెత్తారు.'మీరు పీవోకే గురించి ఆలోచిస్తున్నట్లు నాకనిపించడం లేదు. నిబంధనలను ఉల్లంఘించి ఓ రాష్ట్రాన్ని రాత్రికిరాత్రి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చారు ' అని అధిర్ విమర్శించారు. రాష్ట్రాన్ని విభజించాక కూడా జమ్ముకశ్మీర్ అంశం అంతర్గత వ్యవహారమేనా అని ఆయన ప్రశ్నించారు. 'జమ్ముకశ్మీర్ ద్వైపాక్షిక అంశమని, ఇందులో జోక్యం చేసుకోవద్దని విదేశాంగ మంత్రి జైశంకర్ ఇటీవల అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియోకు స్పష్టం చేశారు. మరి జమ్ముకశ్మీర్ అంతర్గత వ్యవహారమా? మాకు తెలుసుకోవాలని ఉంది?' అని ప్రశ్నించారు. 'మీరు అంతర్గత వ్యవహారమంటున్నారు. కానీ 1948 నుంచి ఐరాస ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నది. సిమ్లా ఒప్పం దం, లాహోర్ డిక్లరేషన్‌పై మనం సంతకాలు చేశాం. మరి ఇది ద్వైపాక్షిక అంశమా? అంతర్గత వ్యవహారమా' అని ప్రశ్నించారు. దీనికి అమిత్ షా స్పందిస్తూ.. కశ్మీర్‌పై ఐరాస జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ సలహా ఇస్తున్నదా అని నిలదీశారు. 'జమ్ముకశ్మీర్‌పై ప్రవేశపెట్టిన బిల్లులు చట్టబద్ధం. రాజ్యాంగబద్ధం కూడా' అని అన్నారు. హోం మంత్రి ఎందుకు ఆవేశపడుతున్నారని కొంద రు విపక్ష సభ్యులు ప్రశ్నించగా.. 'పీవోకే భారత్‌లో అంతర్భాగం కాదని మీరు భావిస్తున్నందునే నేను ఆగ్రహంగా ఉన్నా' అని షా బదులిచ్చారు.



లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి



హోంమంత్రి అమిత్ షాను అభినందిస్తున్న ప్రధాని మోదీ

## నవోదయం వేచిచూస్తున్నది!

- జమ్ముకశ్మీర్ బిల్లుల ఆమోదంపై ప్రధాని మోదీ హర్షం
- ఇదో చిరస్మరణీయ ఘట్టమని వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** జమ్ముకశ్మీర్ పునర్విభజన బిల్లు మంగళవారం లోక్‌సభ ఆమోదం పొందడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఇదో చిరస్మరణీయ ఘట్టం అని అభివర్ణించారు. స్వార్థపూరిత సమూహాల సంకెళ్లను తెంచుకున్న కశ్మీరీల కోసం కొత్త ఉదయం వేచి చూస్తున్నదన్నారు. '130 కోట్ల మంది భారతీయుల కలల సాకారానికి మనం కలిసే ఉన్నాం. జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన మైలురాయి లాంటి బిల్లులు అత్యధికుల మద్దతుతో ఆమోదం పొందాయి' అని లోక్‌సభలో జమ్ముకశ్మీర్ పునర్విభజన బిల్లు ఆమోదించాక ట్విట్టర్ వేదికగా ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 'ప్రజల సాధికారత కోసం పాటుపడకుండా, భావోద్వేగ పూరిత బెదిరింపులతో ప్రజల్ని పట్టించుకోని కొందరి సంకెళ్ల నుంచి జమ్ముకశ్మీర్ ప్రజలకు విముక్తి లభించింది. సరికొత్త ఉదయం, మరింత మెరుగైన దినం మీ కోసం వేచి చూస్తున్నది' అని తెలిపారు. జమ్ముకశ్మీర్, లడఖ్ సోదర, సోదరీమణుల ధైర్యం, నిబద్ధతకు వందనాలంటూ మరో ట్వీట్‌లో ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లులు కశ్మీర్‌ను దేశ అంతర్భాగంలోకి తేవడంతోపాటు అక్కడి యువత నైపుణ్యాలకు తగిన అవకాశాలు కల్పిస్తాయన్నారు. జమ్ము, కశ్మీర్, లడఖ్‌కు సంబంధించిన కీలక బిల్లులను సర్దార్ పటేల్, బీ ఆర్ అంబేద్కర్, శ్యామ ప్రసాద ముఖర్జీకి నివాళులుగా మోదీ అభివర్ణించారు. బిల్లులు ఆమోదానికి మద్దతిచ్చిన వివిధ పార్టీల ఎంపీలకు శుభాకాంక్షలు తెలిపారు. 'శాంతి, ప్రజాశ్రేయస్సు, అభివృద్ధి కోసం వివిధ పార్టీల ఎంపీలు విబేధాలకతీతంగా కీలక బిల్లులకు మద్దతివ్వడం జమ్ముకశ్మీర్, లడక్ ప్రజలు గర్వంగా భావించాలి. రాజ్యసభలో 125:61, లోక్‌సభలో 370:70 ఎంపీల మద్దతుతో పునర్విభజన బిల్లు ఆమోదం పొందింది' అని అన్నారు. కీలక బిల్లులను ప్రవేశ పెట్టడంలో ప్రముఖ పాత్ర వహించిన హోం మంత్రి అమిత్ షాను ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంటు ఉభయ సభలను సజావుగా నడిపించిన ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రశంసించారు.

## రాష్ట్రపతి ఉత్తర్వులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ను రద్దు చేస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉత్తర్వులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలైంది. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే రాష్ట్రపతి ఈ ఉత్తర్వులను జారీ చేశారని, ఇలా జారీ చేయడం అక్రమమని పిటిషన్‌ను దాఖలు చేసిన న్యాయవాది ఎంఎల్ శర్మ తెలిపారు. తన పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరుపాలని న్యాయస్థానాన్ని శర్మ బుధవారం కోరే అవకాశముంది.

## కశ్మీరీల కోసం ఎంత వరకైనా వెళ తాం

### పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ బాజ్వా

**ఇస్లామాబాద్:** కశ్మీరీలకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు 'ఎంతవరకైనా వెళ్లేందుకు' తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయని పాకిస్థాన్ సైన్యాధిపతి జనరల్ ఖ్వామర్ జావెద్ బాజ్వా స్పష్టంచేశారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణాన్ని రద్దు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో ఆర్మీ కార్ప్స్ కమాండర్ల సదస్సు జరిగింది. జనరల్ బాజ్వా అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు పూర్తిగా 'కశ్మీర్' అంశంపైనే చర్చించింది. 'కశ్మీరీల పోరాటం తుదికంటా సాగేందుకు వారికి పాక్ సైన్యం అండగా నిలుస్తుంది. అందుకు మేం సిద్ధమయ్యాం. మా బాధ్యతలు పూర్తిగా నిర్వర్తించే వరకు ఎంత వరకైనా వెళతాం' అని పేర్కొన్నారు. కశ్మీర్‌పై భారత ప్రభుత్వ చర్యలను తిరస్కరిస్తూ పాకిస్థాన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి పూర్తిగా మద్దతునిస్తున్నట్లు సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణాన్ని గానీ, 35-ఏ అధికరణాన్ని గానీ పాకిస్థాన్ ఏనాడూ గుర్తించలేదని సైన్యం పేర్కొంది.

# ఫరూఖ్‌ను నిర్బంధించలేదు.. అరెస్ట్ చేయలేదు..

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:**

జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లాను నిర్బంధించడం కానీ, అరెస్ట్ చేయడం కానీ చేయలేదని, ఆయన ఇష్టప్రకారమే ఇంట్లో ఉన్నారని అమిత్ షా లోక్‌సభలో స్పష్టం చేశారు. 'ఆయన బాగానే ఉన్నారు. ఇంటి నుంచి బయటకు రాకూడదని ఆయన అనుకున్నప్పుడు.. గన్ గురిపెట్టి ఆయనను తీసుకురాలేం' అని షా వ్యాఖ్యానించారు. లోక్‌సభలో చర్చ సందర్భంగా ఫరూఖ్ సభకు హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ నేత శశిథరూర్ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో షా పై విధంగా సమాధానమిచ్చారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఫరూఖ్ కుమారుడు ఒమర్ అబ్దుల్లా, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీతో పాటు పలువురు జమ్ముకశ్మీర్ నేతలను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు, ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సూలే మాట్లాడుతూ.. ఫరూఖ్ గైర్హాజరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ఫరూఖ్ లేకుండా ఈ బిల్లుపై చర్చ పరిపూర్ణం కాదన్నారు.సభలో ఫరూఖ్, సూలే పక్కపక్కన కూర్చుంటారు. అమిత్ షా స్పందిస్తూ.. 'ఫరూఖ్‌ను నిర్బంధించలేదు.. అరెస్ట్ చేయలేదు.. ఇష్టపూర్వకంగానే ఆయన ఇంట్లో ఉన్నారు' అని బదులిచ్చారు. ఫరూఖ్ అనారోగ్యంతో ఉన్నారని సూలే పేర్కొనగా.. ఆయనకు వైద్యులు చికిత్స చేస్తారని, తాను కాదు అని షా సమాధానమిచ్చారు. అనంతరం శశిథరూర్ కూడా ఫరూఖ్ గైర్హాజరుపై ప్రశ్నించగా, ఆయనను అరెస్ట్ చేయలేదని షా మరోసారి స్పష్టం చేశారు.

# హృదయాలనూ విభజిస్తారా?

- నియంతృత్వ పాలన అమల్లోకి వచ్చింది
- ఇంట్లో నా అంతట నేనే ఉన్నానన్న అమిత్ షా వ్యాఖ్యలు అబద్ధం..
- నన్ను గృహనిర్బంధం చేశారు
- కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ఫరూఖ్ అబ్దుల్లా
- ఆర్టికల్ 370 రాజ్యాంగ హామీ అని వెల్లడి

**శ్రీనగర్/న్యూఢిల్లీ, ఆగస్టు 6:** జమ్ముకశ్మీర్ పునర్విభజన, 370 అధికరణం రద్దుపై కేంద్రం తీసుకున్న నిర్ణయం అప్రజాస్వామికమైందని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు. తనను అదుపులోకి తీసుకొని ఇంట్లోనే నిర్బంధించారని ఆయన మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జమ్ముకశ్మీర్‌ను విభజించిన ప్రభుత్వం తమ హృదయాలను కూడా విభజిస్తుందా? అని ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. దేశంలో ప్రజాస్వామ్యపాలన పోయి నియంతృత్వ అధికారం అమల్లోకి వచ్చిందని ఆయన ధ్వజమెత్తారు. ఫరూఖ్ అబ్దుల్లా ఆయన ఇష్టప్రకారమే ఇంటివద్ద ఉన్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో వెల్లడించడంపై ఆయన స్పందించారు. తనను అదుపులోకి తీసుకొని ఇంట్లోనే నిర్బంధించారని, దీనిపై హోంమంత్రి అబద్ధం చెప్పారని ఫరూఖ్ అబ్దుల్లా మండిపడ్డారు. మీడియాతో మాట్లాడటానికి తాను తలుపులను బద్దలు కొట్టుకొని వచ్చానని అన్నారు. 'హోంమంత్రి వ్యాఖ్యలను నేను విన్నాను. ఆయన ఇలాంటి అబద్ధాలు ఎలా చెప్పగలరు. లోపల ఉన్న వాళ్లు బయటకు వెళ్లకుండా, బయట ఉన్న వాళ్లు లోపలికి రాకుండా మా ఇంటి ముందు ఓ డీఎస్పీ కాపలా కాస్తుంటే నేను ఎలా బయటకి రాగలను?' అని ప్రశ్నించారు. జమ్ముకశ్మీర్‌పై ప్రభుత్వ నిర్ణయాన్ని తూర్పారబడుతూ.. అబ్దుల్లా ఉద్వేగానికి లోనయ్యారు. 'వాళ్లు ప్రాంతాల్ని విభజించారు. హృదయాలను కూడా విభజిస్తారా? హిందువులు, ముస్లింలను కూడా విభజిస్తారా? ఐకమత్యం, లౌకిక భావనలు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరిది ఈ దేశం. గత డెబ్బై ఏండ్లుగా మేం యుద్ధం చేశాం. ఇప్పుడు దోషులుగా మారాల్సి వస్తున్నది' అని అన్నారు. 'ప్రజాస్వామ్యపాలన పోయి నియంతృత్వ అధికారం అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం ఎంత మందిని అరెస్టు చేసిందో నాకు తెలియదు' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎటువంటి ఉత్తర్వులు లేకుండా మమ్మల్ని గృహ నిర్బంధంలో ఉంచారు. మేము చట్టాన్ని గౌరవిస్తాం. మేము రాళ్లు రువ్వేవాళ్లం కాదు, హంతకులమూ కాదు. తుపాకీ సంస్కృతిని మేము పాటించలేదు. మహాత్ముడి బాటలో నడిచాం. అయినప్పటికీ, ప్రభుత్వం ఎందుకు ఇలా చేసింది? అవసరమేంటి?' అని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా ఇది(కశ్మీర్ విభజన, 370 అధికరణం రద్దు) జరిగిందనే వాదనను తప్పుపడుతూ.. సుప్రీంకోర్టులో ఉన్న ఈ అంశంపై హోం మంత్రి ఎలా నిర్ణయం తీసుకుంటారని, ఆర్టికల్ 370 రాష్ట్రపతి ఉత్తర్వు కాదని, అది ఒక రాజ్యాంగ హామీ అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఫరూఖ్ అబ్దుల్లా మంగళవారం సభకు రాకపోవడం సభ్యులను ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిపై ఎన్సీపీ నేత సుప్రియా సూలే అడగ్గా.. 'ఆయన్ను అరెస్టు చేయలేదు. అదుపులోకి తీసుకోలేదు. ఆయన ఇష్ట ప్రకారమే ఇంట్లో ఉన్నారు' అని అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఆయన అనారోగ్యంతో ఉన్నారా అని ఆమె అడగ్గా.. 'నేను వైద్యం చేయట్లేదు. అది వైద్యులు చెప్పాల్సిన విషయం' అని షా బదులిచ్చారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఫరూఖ్ అబ్దుల్లా

# రద్దు సమంజసమే

- 370 అధికరణం వల్లే కశ్మీర్‌లోయలో ఉగ్రవాద, వేర్పాటువాద కార్యకలాపాలు
- శ్యామాప్రసాద ముఖర్జీ మేనల్లుడు రిటైర్డ్ జస్టిస్ చిత్తాతోష్ ముఖర్జీ

**కోల్‌కతా:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే 370వ అధికరణం రద్దు చేయడంపై భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ మేనల్లుడు, రిటైర్డ్ జస్టిస్ చిత్తాతోష్ ముఖర్జీ హర్షం వ్యక్తం చేశారు. దీని రద్దు కోసమే తన మేనమామ పోరాడారని పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ చెప్పారు. ఈ అధికరణంలోని నిబంధనలు 'అసమ్మతి'ని ప్రోత్సహించాయన్నారు. దీని వల్లే జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద, వేర్పాటువాద కార్యకలాపాలు కొనసాగాయన్నారు. 370 అధికరణంలోని నిబంధనల రద్దు చట్టవిరుద్ధంగానీ, రాజ్యాంగవిరుద్ధంగానీ కాదన్నారు. 'ఇది (370 అధికరణం) తాత్కాలిక నిబంధనే. కనిపిస్తున్నా శాశ్వతం కాదు' అని చెప్పారు.మాజీ సంస్థానాధీశులకు రాజాభరణాలను రద్దుచేస్తూ మాజీ ప్రధాని ఇందిర నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు.



# నమో కశ్మీరం

మొదటిపేజీ తరువాయి...

తెలుపగా, 70 మంది వ్యతిరేకంగా ఓటువేశారు. ఈ తీర్మానం, బిల్లుకు సోమవారమే రాజ్యసభ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఓటింగ్ ముందు, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు (ములాయం సింగ్ యాదవ్ మినహా), ఎన్సీపీ సభ్యులు వాకౌట్ చేశారు. ఓటింగ్‌లో తాము పాల్గొనబోమని ముందే చెప్పిన తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు ముందుగానే సభ నుంచి వెళ్లిపోయారు. ఎన్డీఏ మిత్రపక్షం జేడీయూ కూడా సభ నుంచి వాకౌట్ చేసింది. పలువురు కాంగ్రెస్ సభ్యులతో పాటు, ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ డివిజన్ ఓటింగ్ కోసం పట్టుబట్టారు. టీఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్, బీజేడీ, బీఎస్పీ, అన్నాడీఎంకే సభ్యులు తీర్మానానికి, బిల్లుకు మద్దతుగా ఓటేశారు. అనంతరం పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడింది. బీజేపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు మోదీ 2.0 ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 90 రోజుల అనంతరం ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సోమవారం సంచలన నిర్ణయం తీసుకున్న విషయ తెలిసిందే. అలాగే జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. దీంతో జమ్ముకశ్మీర్ చట్టసభ కలిగిన కేంద్రపాలిత ప్రాంతంగా, లడఖ్ చట్టసభ లేని కేంద్రపాలిత ప్రాంతంగా విడిపోనున్నాయి. మరోవైపు జమ్ముకశ్మీర్ రిజర్వేషన్ (రెండో సవరణ) బిల్లు-2019ను కేంద్రం ఉపసంహరించుకుంది. బిల్లులో పొందుపరిచిన అంశాలు ఆటోమేటిక్‌గా అమల్లోకి వస్తాయని అమిత్ షా పేర్కొన్నారు. మరోవైపు కేంద్రం తీసుకున్న నిర్ణయంపై నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనను అదుపులోకి తీసుకుని ఇంట్లోనే నిర్బంధించారని ధ్వజమెత్తారు. జమ్ముకశ్మీర్‌ను విభజించిన ప్రభుత్వం తమ హృదయాలను కూడా విభజిస్తుందా అని ఉద్వేగంగా వ్యాఖ్యానించారు. తాను ఇష్టపూర్వకంగానే ఇంట్లో ఉన్నానన్న అమిత్ షా వ్యాఖ్యలను ఆయన ఖండించారు. భాగస్వామ్య పక్షాలతో చర్చించకుండా కేంద్రం జమ్ముకశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దుచేసిందని విపక్షాలు దుయ్యబట్టాయి. కేంద్రం నిర్ణయం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. మరోవైపు కశ్మీర్ అంతర్గత వ్యవహారం కాదంటూ ఆ పార్టీ శాసనసభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్ చేసుకున్నట్లయింది. ఆయన వ్యాఖ్యలపై ఆ పార్టీ అధినేత్రి, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా, ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ న్యాయవాది ఎంఎల్ శర్మ మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీని పరిగణనలోకి తీసుకోకుండా ఉత్తర్వులు జారీ చేయడం అక్రమమని ఆయన అందులో ఆరోపించారు.

# కశ్మీర్ విభజనను వ్యతిరేకిస్తాం: మమత



**కోల్‌కతా, ఆగస్టు 6:** జమ్ముకశ్మీర్ విభజన బిల్లును తాము గట్టిగా వ్యతిరేకిస్తామని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మంగళవారం అన్నారు. స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న అధికరణల రద్దు నిర్ణయంపై కేంద్రం అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరుపాల్సి ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. 'కశ్మీర్ సమస్యపై ఎలాంటి చర్చ, ఓటింగ్ లేదు. ఇది ప్రజాస్వామ్య పద్ధతి కాదు. మా పార్టీ ఓటింగ్‌కు దూరంగా ఉండటం బిల్లుకు మద్దతిచ్చినట్లు కాదు. పంటి నుంచి గోరు వరకు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తాం' అని మమతా బెనర్జీ చెప్పారు. జమ్ముకశ్మీర్ మాజీ సీఎంలు మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా గృహ నిర్బంధాన్ని ఆమె తప్పుపట్టారు. 'సీనియర్ నేతలైన ఫరూక్ అబ్దుల్లా సభకు రాకపోవడంపై ఎలాంటి సమాచారం లేదు. మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాను అరెస్ట్ చేసినట్లు మీడియా ద్వారా తెలుసుకున్నాం. వారు ఉగ్రవాదులు కాదు... కశ్మీర్ ప్రజలు. మన సోదరీ సోదరులు. వారిని దూరం చేయకూడదు. ప్రజాస్వామ్యానికి కట్టుబడి కేంద్ర ప్రభుత్వం వారిని వెంటనే విడుదల చేయాలి' అని మమతా బెనర్జీ డిమాండ్ చేశారు.

# రద్దుతో కశ్మీరీలకు లబ్ధి: మాయావతి



**లక్నో, ఆగస్టు 6:** ఆర్టికల్ 370ను రద్దు చేయడం వల్ల జమ్ముకశ్మీర్ ప్రజలకు లబ్ధి చేకూరే అవకాశముందని బీఎస్పీ అధినేత్రి మాయావతి తెలిపారు. ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం చేకూరాలంటే ఆర్టికల్ 370ను రద్దు చేయాలని ప్రజలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. వారి డిమాండ్ ఇప్పుడు నెరవేరింది' అని మాయావతి ట్వీట్ చేశారు. అలాగే లడక్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేయాలన్న డిమాండ్ కూడా ఎప్పటి నుంచో ఉన్నదని, దీన్ని కూడా కేంద్ర ప్రభుత్వం నెరవేర్చిందని పేర్కొన్నారు.

## దేశమంటే మనుషులు సరిహద్దులు కాదు

### జమ్ముకశ్మీర్ బిల్లులపై నిప్పులు చెరిగిన రాహుల్

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న అధికరణం 370 రద్దు, జమ్ముకశ్మీర్ పునర్విభజన బిల్లుపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మంగళవారం ట్విట్టర్ వేదికగా స్పందించారు. భారతదేశం ప్రజల సమైక్యతతో ఏర్పడిందని ఇది భూఖండాలతో కాదని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు. అధికార దుర్వినియోగంతో జమ్ముకశ్మీర్‌ను రెండుగా విడదీసి.. దేశ భద్రత తీవ్రమైన పరిణామాల్ని ఎదుర్కొనేలా చేశారని దుయ్యబట్టారు. కశ్మీర్‌లో ప్రజాప్రతినిధులను జైళ్లలో పెట్టడం, గృహ నిర్బంధంలో ఉంచడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. వాళ్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'జమ్మూకశ్మీర్‌ను ఏకపక్షంగా విడదీయడం ద్వారానో, ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రతినిధులను జైళ్లలో వేయడం ద్వారానో జాతి సమైక్యత పెరుగదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీస్తుంది. ఎందుకంటే ఈ దేశం మనుషుల ఐక్యతతో ఏర్పడింది కానీ, భూఖండాలతో కాదు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తే జాతీయ భద్రతకు తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి' అని రాహుల్ ట్వీట్ చేశారు.



# సుష్మాస్వరాజ్ ఆకస్మిక మృతి

## గుండెపోటుతో ఎయిమ్స్‌లో కన్నుమూత.. తీవ్ర దిగ్భ్రాంతిలో బీజేపీ శ్రేణులు

### సుష్మ సేవలు చిరస్మరణీయం: రాష్ట్రపతి కోవింద్

### భారత రాజకీయాల్లో అద్భుత అధ్యాయం ముగిసిందన్న ప్రధాని.. సంతాపం తెలిపిన సీఎం కేసీఆర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** విదేశాంగ శాఖ మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత సుష్మా స్వరాజ్ (67) మంగళవారం రాత్రి ఆకస్మికంగా కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి 9.30 సమయంలో ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. గుండెపోటుతో సుష్మ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. సుష్మా స్వరాజ్‌ను దవాఖానలో చేర్చిన వెంటనే హర్షవర్ధన్, రాజ్‌నాథ్‌సింగ్, స్మృతి ఇరానీ, ప్రకాశ్ జవదేకర్ తదితర సీనియర్ మంత్రులు ఎయిమ్స్‌కు చేరుకున్నారు. 2016లో సుష్మ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. అనారోగ్య కారణాలతో గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆమె పోటీకి దూరంగా ఉన్నారు. సుష్మా స్వరాజ్‌కు భర్త స్వరాజ్ కౌషల్, కూతురు బన్సూరి ఉన్నారు. సుష్మ ఆకస్మిక మృతితో బీజేపీ శ్రేణులు, ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

**'సాయం చేసేందుకు ఎప్పుడూ ముందుండేవారు'**

సుష్మ ఆకస్మిక కన్నుమూతపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ.. 'సుష్మ మృతి వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రియమైన నేతను దేశం కోల్పోయింది. సాయం చేసేందుకు సుష్మ ఎప్పుడూ ముందుండేవారు. దేశ ప్రజలకు ఆమె చేసిన సేవలు చిరస్మరణీయం' అని కొనియాడారు. సుష్మ ఆకస్మిక మరణంపై ప్రధాని ట్విట్టర్‌లో పలు పోస్టులు చేశారు. 'భారత రాజకీయాల్లో మహోన్నత అధ్యాయం ముగిసింది. ప్రజా సేవకు, పేద ప్రజల అభ్యున్నతికి తన జీవితాన్ని త్యాగం చేసిన అసమాన నేత మృతికి భారత్ శోకిస్తున్నది. కోట్లాది మంది ప్రజలకు సుష్మా స్వరాజ్ స్ఫూర్తిదాయకం. సుష్మా స్వరాజ్ గొప్ప వక్త, విశిష్ట పార్లమెంటేరియన్. పార్టీలకతీతంగా ఆమెకు అభిమానులన్నారు. సిద్ధాంతాలు, బీజేపీ ప్రయోజనాల విషయంలో ఆమెది రాజీపడేతత్వం కాదు. పార్టీ కోసం ఆమె ఎనలేని కృషి చేశారు. అద్భుతమైన అడ్మినిస్ట్రేటర్ అయిన సుష్మ తాను బాధ్యతలు చేపట్టిన ప్రతి శాఖలోనూ ఉన్నత ప్రమాణాలను నెలకొల్పారు. వివిధ దేశాలతో దేశ సంబంధాలను బలోపేతం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. సహచర భారతీయులు ప్రపంచంలో ఏమూలన బాధల్లో సాయం అందించి కారుణ్యం చూపారు' అని ప్రధాని కొనియాడారు. 'సుష్మా స్వరాజ్ మృతి అత్యంత బాధాకరం. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం' అని బీజేపీ పేర్కొంది. సుష్మా స్వరాజ్ అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగనున్నాయి.

### అంచెలంచెలుగా ప్రస్థానం

- **1977-82:** హర్యానా శాసన సభకు తొలిసారి ఎన్నిక
- **1977-79:** హర్యానా ప్రభుత్వంలో కార్మిక, ఉపాధి మంత్రిగా బాధ్యతలు
- **1987-90:** హర్యానా శాసనసభ సభ్యురాలిగా రెండోసారి ఎన్నిక
- **1987-90:** విద్య, ఆహార, పౌరసరఫరాల మంత్రిత్వ శాఖల బాధ్యతలు
- **1990-96:** రాజ్యసభకు తొలిసారి ఎన్నిక
- **1996-97:** 11వ లోక్‌సభకు ఎన్నిక (ఎంపీగా రెండోసారి: 1996 మే 15- 1997 డిసెంబర్4)
- **1996:** (మే 16 – జూన్ 1) కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రిగా బాధ్యతలు
- **1998-99:** 12వ లోక్‌సభకు ఎన్నిక (ఎంపీగా మూడోసారి: 1998 మార్చి 10- 1999 ఏప్రిల్ 26)
- **1998:** (మార్చి 19- అక్టోబర్ 12) కేంద్ర సమాచార, ప్రసారశాఖతోపాటు అదనంగా టెలీకమ్యూనికేషన్ల శాఖ బాధ్యతలు
- **1998:** (అక్టోబర్ 13- డిసెంబర్ 3) ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి
- **1998:** (నవంబర్) హజ్ ఖాస్ నియోజకవర్గం నుంచి ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నిక. అనంతరం రాజీనామా. లోక్‌సభ సభ్యురాలిగా కొనసాగింపు
- **2000-06:** రాజసభ్యకు ఎన్నిక (ఎంపీగా నాలుగోసారి)
- **2000-03:** (2000 సెప్టెంబర్ 30- 2003 జనవరి 29) కేంద్ర సమాచార, ప్రసారశాఖ బాధ్యతలు
- **2003-04:** (2003 జనవరి 29- 2004 మే 22) కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, పార్లమెంటరీ వ్యవహారాల బాధ్యతలు
- **2006-09:** (2006 ఏప్రిల్) రాజ్యసభకు ఎన్నిక (ఎంపీగా ఐదోసారి)
- **2009-14:** (2009 మే 16- 2014 మే 18) 15వ లోక్‌సభకు ఎన్నిక (ఎంపీగా ఆరోసారి)
- **2009-09:** ( 2009 జూన్ 3 – 2009 డిసెంబర్ 21) లోక్‌సభలో ప్రతిపక్ష ఉప నేత
- **2009-14:** (2009 డిసెంబర్ 21- 2014 మే 18) లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా అద్వానీ స్థానం భర్తీ
- **2014-19:** (2014 మే 26 నుంచి ) 16వ లోక్‌సభకు ఎన్నిక (ఎంపీగా ఏడోసారి)
- **2014-19:** (2014 మే 26- 2019 మే 29) కేంద్ర విదేశాంగ మంత్రిగా బాధ్యతలు

సుష్మ మరణం తీవ్ర దిగ్భ్రాంతికి, వేదనకు గురిచేసింది.

**- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

సుష్మస్వరాజ్ మరణ వార్త షాక్‌కు గురిచేసింది. ఈవార్తను జీర్ణించుకోలేకపోతున్నాం. దేశం మొత్తం శోకిస్తున్నది. మరీ ముఖ్యంగా విదేశాంగ శాఖ.

**- విదేశాంగ మంత్రి జైశంకర్**

అసమాన రాజకీయ నేత, గొప్ప వ్యక్త, విభిన్న పార్లమెంటేరియన్, పార్టీలకతీ తంగా స్నేహసంబంధాలను కలిగి ఉన్న సుష్మ మృతి దిగ్భాంతి కలిగించింది. ఆమె ఆత్మకు శాంతి కలగాలి. ఓం శాంతి.

**- కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ**

### సుష్మ చివరి ట్వీట్

ఆర్టికల్ 370 రద్దుతోపాటు, జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించిన అనంతరం ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ మంగళవారం సాయంత్రం సుష్మ ట్వీట్ చేశారు. 'ప్రధాని నరేంద్రమోదీజీ ధన్యవాదాలు. నా జీవితంలో ఇలాంటి రోజు కోసమే ఎదురు చూస్తున్నాను' అని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

## రాజకీయాలపై చెరగని ముద్ర

- ఢిల్లీ మొదటి మహిళా ముఖ్యమంత్రి.. యువ క్యాబినెట్ మంత్రిగా రికార్డు
- ఏడుసార్లు పార్లమెంటుకు, మూడుసార్లు అసెంబ్లీకి ప్రాతినిధ్యం
- ఇందిర తర్వాత విదేశాంగశాఖను నిర్వర్తించిన రెండో మహిళా నేత

**ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించి, న్యాయవాద వృత్తితో జీవితాన్ని ఆరంభించి.. జీవితపు తొలినాళ్లలోనే రాజకీయాల్లో ప్రవేశించి.. దేశరాజకీయాలపై చెరగని ముద్ర వేసిన సుష్మాస్వరాజ్ ప్రస్థానం ఎంతో ప్రత్యేకమైనది. ముఖ్యంగా.. మహిళలకు స్ఫూర్తి కలిగించే జీవితం ఆమెది..**

1970లో రాజకీయ రంగప్రవేశం చేసిన సుష్మ.. లోక్‌సభలో ప్రతిపక్షనేత, కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారు. కేంద్రమంత్రిగా, ఢిల్లీ ముఖ్యమంత్రిగా పనిచేసిన సుష్మాస్వరాజ్ భారతదేశపు మహిళా రాజకీయ నేతలలో ప్రత్యేక స్థానం సంపాదించారు. ఇందిరా గాంధీ తర్వాత విదేశాంగ శాఖ విధులను నిర్వర్తించిన రెండో మహిళా నేతగా సుష్మ రికార్డు సృష్టించారు. ఏడుసార్లు పార్లమెంటుకు, మూడుసార్లు అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. ఢిల్లీకి మొదటి మహిళా ముఖ్యమంత్రిగా ఆమె పనిచేశారు. భారతదేశ అత్యుత్తమ ప్రియమైన రాజకీయ నేతగా ప్రముఖ అమెరికా దినపత్రిక 'వాల్ స్ట్రీట్‌జార్నల్' సుష్మను ప్రశంసించింది.



బాల్యంలో..



భర్తతో సుష్మాస్వరాజ్

#### విద్యాభ్యాసం

సుష్మాస్వరాజ్ 1952 ఫిబ్రవరి 14న హర్యానాలోని అంబాలాలో జన్మించారు. ఆమె తండ్రి హార్దేవ్‌శర్మ, తల్లి లక్ష్మి దేవి. సనాతన ధర్మ కాలేజీ నుంచి రాజకీయ శాస్త్రంలో సుష్మ డిగ్రీ చేశారు. చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1973లో సుప్రీంకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించారు.

#### రాజకీయ జీవితం

1970వ దశకంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. ఏడుసార్లు ఎంపీగా, మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. 25 ఏండ్ల వయసులోనే హర్యానా కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 1998 అక్టోబర్ 13 నుంచి డిసెంబరు 3వరకు ఢిల్లీ సీఎంగా పనిచేశారు. ఢిల్లీకి మొదటి మహిళా ముఖ్యమంత్రిగా ఆమె రికార్డులకెక్కారు. 1996లో 13 రోజుల అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వంలో ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖకు మంత్రిగా ఆమె పనిచేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో 2014-2019 వరకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిగా ఆమె సేవలు అందించారు.

#### ఎమర్జెన్సీ తొలి రోజుల్లో వివాహం

దేశంలో ఎమర్జెన్సీ అమలులోకి వచ్చిన ప్రారంభంలోనే 1975 జూలై 13న సుష్మా స్వరాజ్ వివాహం ఆమె సహచర న్యాయవాది స్వరాజ్ కౌశల్‌తో జరిగింది. ఎమర్జెన్సీ కింద జైలుపాలైన సోషలిస్టు నాయకుడు జార్జి ఫెర్నాండెజ్ తరపున వాదిస్తున్నప్పుడు సుష్మ, స్వరాజ్ కౌశల్ దగ్గరయ్యారు. సుష్మాస్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్ ప్రముఖ న్యాయవాది. మిజోరాం గవర్నరుగా కౌశల్ పనిచేశారు.

#### యువ క్యాబినెట్ మంత్రిగా రికార్డు

1977లో ఇరవై ఐదేండ్ల వయసులో హర్యానా క్యాబినెట్ మంత్రిగా నియమితురాలైన సుష్మాస్వరాజ్.. దేశంలోనే అత్యంత పిన్నవయసులోనే మంత్రి అయిన వ్యక్తిగా రికార్డుల్లోకెక్కారు.

#### లలిత్ మోదీకి ఎన్వోసీపై వివాదం

ఐపీఎల్ కుంభకోణంలో నిందితుడు లలిత్ మోదీ తన భార్యకు పోర్చుగల్‌లో చికిత్స కోసం బ్రిటన్‌లో బస చేసేందుకు అనుమతి కోరాడు. దీనిపై ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా బ్రిటన్ కోరిన 'ఎన్వోసీ'ని నాటి విదేశాంగ మంత్రిగా సుష్మ జారీ చేయడం వివాదాస్పదమైంది. అదే సమయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం పడనివ్వరాదని బ్రిటన్ హైకమిషనర్‌కు ఆమె సూచించారు. అయితే లలిత్ మోదీకి ప్రయాణ వీసా జారీ చేసేందుకు ఆమె సహాయం చేశారని కొందరు విమర్శలు చేశారు.

## సుష్మాస్వరాజ్ మృతిపై కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ మరణం పట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వివిధ హోదాల్లో సుష్మాస్వరాజ్ దేశానికి చేసిన సేవలను సీఎం కొనియాడారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సుష్మాస్వరాజ్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



మంగళ వారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా తెలంగాణభవన్‌లో జయశంకర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించిన పార్లమెంట్ సభ్యులు

## ఘనంగా జయశంకర్ జయంతి

- తెలంగాణభవన్‌లో నివాళులర్పించిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జయశంకర్ కలలు సాకారమవుతున్నాయి
- ఢిల్లీ తెలంగాణభవన్‌లో నివాళులర్పించిన టీఆర్‌ఎస్ ఎంపీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను తెలంగాణభవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణభవన్‌లోని జయశంకర్ విగ్రహానికి టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పూలమాలవేసి, నివాళులు అర్పించారు. అంతకుముందు తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేశారు. రాష్ట్ర సాధన ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ ఊపిరి పోశారని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణకు ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, జీ జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్‌రాజు, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, టీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

**తెలంగాణ అభివృద్ధికి జయశంకర్ ఆశీస్సులు**

ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలతో తెలంగాణ సాధించుకున్నామని, సీఎం కేసీఆర్ నేతృత్వంలో జయశంకర్ కలలు స్వరాష్ట్రంలో సాకారమవుతున్నాయని లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు అన్నారు. ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీఆర్‌ఎస్ ఎంపీలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నామా మాట్లాడుతూ.. జయశంకర్ మార్గంలో రాష్ట్రం బంగారు తెలంగాణగా మారుతున్నదన్నారు. జయశంకర్‌తో తనకు సుదీర్ఘకాల పరిచయం ఉన్నదని, తెలంగాణ నినాదాన్ని ప్రాణంతో ఉంచిన వ్యక్తి ఆయనేనని ఎంపీ కెప్టెన్ వీ లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ పాత్ర మరువలేనిదని ఎంపీ బండా ప్రకాశ్ పేర్కొన్నారు. తనకు ఆయనతో 40 ఏండ్ల అనుబంధం ఉన్నదని గుర్తుచేసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమమే జయశంకర్‌కు ఘనమైన నివాళులని, సీఎం కేసీఆర్ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఇస్తున్నారని చెప్పారు. జయశంకర్ ఆశయాలను సీఎం కేసీఆర్ ముందుకు తీసుకుపోతున్నారని, తెలంగాణ పునర్నిర్మాణం జరుగుతున్నదని ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్ అన్నారు.

### జయశంకర్ సార్‌ను తెలంగాణ మరువదు

#### జయంతి సందర్భంగా స్మరించుకున్న సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ భావజాల వ్యాప్తికోసం జీవితమంతా కృషిచేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరిచిపోదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్ ఆయనను స్మరించుకున్నారు. జయశంకర్ సార్‌ను భావితరాలు గుర్తుంచుకొనేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు.

### పుట్టుక మీది.. చావు మీది.. బతుకంతా తెలంగాణది

#### ట్విట్టర్‌లో కేటీఆర్ నివాళి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ ట్వీట్‌చేశారు. 'పుట్టుక మీది.. చావు మీది.. బతుకంతా తెలంగాణది' అని కేటీఆర్ నివాళి అర్పించారు.

### విముక్తి పాఠాలు నేర్పిన మహోపాధ్యాయులు

#### ట్విట్టర్‌లో మాజీ ఎంపీ కవిత నివాళి

'తెలంగాణ ఉద్యమానికి ఊతమిచ్చి ప్రజలకు విముక్తి పాఠాలు నేర్పిన మహోపాధ్యాయులు, ఆజన్మాంతం తెలంగాణనే స్వప్నించి, శ్రమించిన కర్మయోగి.. తెలంగాణ దిక్సూచి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి నివాళులు. మహాత్మా మీరు చూపిన తోవలో తెలంగాణ ఉద్యమ లక్ష్యాలకు పునరంకితమవుతాం' అని కవిత ట్వీట్‌చేశారు.

## దివ్యాంగుడైన కార్యకర్తకు కేటీఆర్ భరోసా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త దివ్యాంగుడైన పల్లె కృష్ణయ్యకు అన్ని విధాలా అండగా ఉంటామని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయి అంగవైకల్యంతో బాధపడుతున్న కృష్ణయ్యకు.. రెండువారాల క్రితం కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా కేటీఆర్ మిత్రుడొకరు కృత్రిమ కాలును అందించారు. కృష్ణయ్య మంగళవారం కేటీఆర్‌ను స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టీఆర్‌ఎస్ సీనియర్ నేత పల్లా ప్రవీణ్‌రెడ్డి ప్రగతిభవన్‌కు కృష్ణయ్యను తీసుకొచ్చి కేటీఆర్‌కు కలిపించారు. కృష్ణయ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న కేటీఆర్.. జీవనోపాధి కోసం చిన్న దుకాణం పెట్టుకునేందుకు రుణ సదుపాయం కల్పించేందుకు సహకరిస్తామని భరోసాఇచ్చారు.



హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న పార్టీ కార్యకర్త పల్లె కృష్ణయ్య. చిత్రంలో సీనియర్ నేత పల్లా ప్రవీణ్‌రెడ్డి కూడా ఉన్నారు.

## తెలంగాణ చిన్నమ్మ

- ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటులో సుష్మాస్వరాజ్ విశేషకృషి
- కేసీఆర్ ఉద్యమానికి అండదండలందించిన నేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణ అండదండలందించిన బీజేపీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్‌కు తెలంగాణతో.. తెలంగాణ ప్రజలతో ప్రత్యేకంగా అనుబంధం ఉన్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు క్రమంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసి.. తెలంగాణ ఉద్యమ తీవ్రతను, అమరుల త్యాగాలను పార్లమెంట్‌లో ఏకరువుపెట్టారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు బిల్లును ప్రవేశపెడితే సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రకటించి.. మాటనిలుపుకున్నారు. తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్ ఆమరణ దీక్ష, తదనంతర పరిణామాలను సుష్మాస్వరాజ్ అప్పటి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. కేసీఆర్ చేసిన ఉద్యమానికి అండగా.. మద్దతుగా నిలిచారు. లోక్‌సభలో నిరసన తెలుపుతున్న కేసీఆర్‌కు అండగా నిలబడి మాట్లాడారు. నాలుగు లక్షల మంది ఉద్యోగులు, వేలమంది న్యాయవాదులు, తెలంగాణ ప్రజలు యావత్తూ.. ధర్నాలు, హర్తాళ్లు, నిరసనలు తెలుపుతూ ఉంటే.. కేంద్రం ఏం చేస్తున్నది..? కనీసం వారి బాధ ఏమిటనేది తెలుసుకోవద్దా..? అంటూ నిలదీశారు. తెలంగాణ ఉద్యమపక్షాన నిలిచారు. వెంటనే బిల్లు పెట్టండి మద్దతు ఇస్తామంటూ భరోసా ఇచ్చారు. దీనితో తెలంగాణ ప్రజలందరూ సుష్మాస్వరాజ్ అంటే ప్రత్యేకంగా ఆదరాభిమానాలు వ్యక్తంచేసేవారు. ఈ నేపథ్యంలోనే 'తెలంగాణ చిన్నమ్మ'గా ఆమె పేరుగాంచారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత.. కేంద్రంలో ఏర్పడిన మంత్రివర్గంలో ఆమె విదేశీ వ్యవహారాలశాఖను చాకచక్యంగా, సమర్థంగా నిర్వహించారు. వందల మంది వలస కార్మికులు, ఉపాధికోసం వెళ్ళినవారు గల్ఫ్ తదితర దేశాల్లో అనేక కష్టనష్టాల బారిన పడినప్పుడు తెలంగాణ ప్రభుత్వం కోరిన వెంటనే సుష్మాస్వరాజ్ స్పందించేవారు. బాధితులను సొంతూరికి తీసుకురావడంలో ఆమె చూపించే చొరవను పలువురు గల్ఫ్ కార్మికులు, నేతలు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆపదలో ఆదుకునే 'తెలంగాణ చిన్నమ్మ'గా మరోసారి ఆమె తెలంగాణ ప్రజలకు ఆత్మీయురాలయ్యారు. సుష్మాస్వరాజ్ చివరిసారిగా హైదరాబాద్‌కు గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్‌కు హాజరయ్యారు. ప్రధాని వెంట వచ్చిన ఆమె.. అంతర్జాతీయ సమావేశంలోనూ.. తెలంగాణ చిన్నమ్మను.. అంటూ చెప్పడంతో.. సమావేశం యావత్తూ.. హర్షధ్వానాలతో మిన్నంటింది. అంతగా ఆమె తెలంగాణ ప్రజలకు ఆత్మీయులయ్యారు.



## 9 మంది చిన్నారులు మృతి

### 11 మంది పిల్లలకు గాయాలు.. ఉత్తరాఖండ్‌లో ఘటన

**డెహ్రాడూన్, ఆగస్టు 6:** స్కూలు వ్యాను లోయలో పడిన ఘటనలో 9 మంది చిన్నారులు మృతి చెందగా మరో 11 మంది గాయపడ్డారు. ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ గర్వాల్ జిల్లాలో మంగళవారం ఉదయం ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఏంజెల్స్ ఇంటర్నేషనల్ స్కూలుకు చెందిన వ్యాను కాంగ్‌సాలి–మదన్నేగి మార్గంలో లాంబగాన్ వద్ద అదుపు తప్పి 200 మీటర్ల లోయలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ వాహనం నుంచి దూకి అక్కడి నుంచి పారిపోగా చిన్నారులు బలైపోయారు.

**బస్సుపై కొండరాళ్లు పడి ఆరుగురు మృతి**

ఉత్తరాఖండ్‌లో జరిగిన మరో ప్రమాదంలో ఆరుగురు యాత్రికులు మృతి చెందగా ఎనిమిది మంది గాయపడ్డారు. బద్రీనాథ్ నుంచి యాత్రికులతో ప్రయాణిస్తున్న బస్సుపై చమోలీ జిల్లా లాంబగాడ్ వద్ద పెద్ద కొండరాళ్లు పడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు చమోలీ ఎస్పీ యశ్వంత్ చౌహాన్ తెలిపారు.



ఉత్తరాఖండ్‌లో లోయలో పడిన వ్యాన్

## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం

### ముగ్గురు చిన్నారులతోసహా ఆరుగురు మృతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** దేశ రాజధానిలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులతోసహా ఆరుగురు మృతి చెందగా మరో 13 మంది ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణ ఢిల్లీ జకీర్ నగర్‌లోని నాలుగంతస్తుల భవనంలో ఉదయం 2.30 గంటలకు కరెంటు మీటర్ల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయని అధికారులు తెలిపారు. దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన సీఎం అరవింద్ కేజ్రీవాల్, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షల పరిహారాన్ని ప్రకటించారు.



జమ్ముకశ్మీర్, లడాఖ్‌పై తీసుకున్న నిర్ణయానికి, భారత్‌తో పూర్తిగా కలిసిపోవడానికి మద్దతు ఇస్తున్నా. రాజ్యాంగ ప్రక్రియను అనుసరిస్తే బాగుండేది. ఎటువంటి ప్రశ్నలు ఎదురయ్యేవి కావు. అయినప్పటికీ ఇది మన దేశ ప్రయోజనాల కోసమే, నేను మద్దతు ఇస్తున్నా.

**జ్యోతిరాదిత్య సింధియా, కాంగ్రెస్ నేత**

21వ శతాబ్దంలో 370వ అధికరణం ఉండవలసిన అవసరం లేదనేది నా అభిప్రాయం. ఈ చర్య దేశ ప్రయోజనాల కోసమే కాకుండా జమ్ముకశ్మీర్‌కు లబ్ధి చేకూరుతుంది. దీనిని శాంతియుత వాతావరణంలో అమలుచేయడం ప్రభుత్వ బాధ్యత.

**దీపేందర్ హుడా , హర్యానాలోని కాంగ్రెస్ పార్టీ ప్రముఖుడు**



**చరిత్రలో నేడు**



**1927**

అమెరికా-కెనడా మధ్య 'శాంతి వంతెన' ప్రారంభం.

**1940**

డిగాలే ఫ్రెంచి ప్రభుత్వాన్ని గుర్తించిన బ్రిటిష్ ప్రధాని చర్చిల్





**1961**

ఆర్థిక వ్యవస్థలో అమెరికాను అధిగమిస్తామని ప్రకటించిన నికితా కృశ్చేవ్.

భారత ప్రభుత్వం భారీ బలగాలను మోహరించి కశ్మీర్ పాక్షిక స్వయం ప్రతిపత్తిని రద్దుచేయడం తప్పుడు చర్య, ప్రమాదకరం. దీనివల్ల రక్తపాతం చోటుచేసుకోవడమే కాకుండా, పాకిస్థాన్‌తో సంబంధాలు వికటిస్తాయి. ఈ రాజ్యాంగ మార్పు సుప్రీంకోర్టు ముందు తేలిపోయే అవకాశం ఉన్నది. అయితే భయాందోళనలు ఇప్పటికే మొదలయ్యాయి. అమెరికా, చైనా తమ వివాదంలో కశ్మీర్‌ను పావుగా వాడుకోవద్దు. ఇందుకు బదులుగా ఈ దేశాలు ఐక్యరాజ్యసమితితో కలిసి భారత్ చర్య ప్రాంతీయ సంక్షోభానికి దారితీయకుండా కృషిచేయాలె..

**ది న్యూయార్క్ టైమ్స్**

నేపాల్‌లోని ఆరు విశ్వవిద్యాలయాల వీసీల పదవీకాలం ముగిసినందున కొత్తవారిని నియమించవలసి ఉన్నది. ఈ నియామక ప్రక్రియను హేతుబద్ధంగా, పారదర్శకంగా సాగించాలె. వీసీలు దార్శనికులై, నాయకత్వ లక్షణాలతోపాటు బోధన, పరిశోధన అనుభవం కలిగి ఉండాలె. భారత్‌లోని జేఎన్‌యూ అనుసరిస్తున్న విధానం అనుసరణీయమైనది. అమెరికాలో ప్రెసిడెంట్ (వీసీ)ని ట్రస్టీలు, వ్యవస్థాగత ప్రయోజనకర్తలు ఎన్నుకుంటారు. విద్యా సంస్థలను స్వతంత్రంగా పనిచేసే పరిస్థితులు కల్పిస్తేనే ఇప్పుడున్న అరాచకత్వం తొలిగిపోతుంది.

**ది హిమాలయన్ టైమ్స్**



# సత్వర న్యాయం

సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 31 నుంచి 34కు పెంచుతూ కేంద్రమంత్రి మండలి నిర్ణయం తీసుకోవటం ఆహ్వానించదగ్గది. ప్రధాన న్యాయమూర్తితో సహా ఇప్పుడు భారత అత్యున్నత న్యాయస్థానంలో న్యాయమూర్తుల సంఖ్య 34కు చేరుకున్నది. సుప్రీంకోర్టులో కేసుల పరిష్కారం విషయంలో న్యాయమూర్తులపై ఉన్న పనిభారాన్ని తగ్గించేందుకు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గగోయ్ విజ్ఞప్తి మేరకు కేంద్రం న్యాయమూర్తుల సంఖ్యను ఈ మధ్యనే పెంచింది. గత నెల జూలై 11 నాటికి సుప్రీంకోర్టులో 59,331 కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. క్రమంగా పెండింగ్ కేసుల సంఖ్య పెరిగిపోతున్న తీరుతో ఆందోళన వ్యక్తంచేసిన గగోయ్, సత్వర న్యాయాన్ని అందించేందుకు న్యాయమూర్తుల సంఖ్యను పెంచటం పరిష్కారంగా భావించారు. పనిభారం దృష్ట్యా న్యాయమూర్తుల సంఖ్యను గతంలోనూ పెంచటం జరిగింది. 2009లో కూడా న్యాయమూర్తుల సంఖ్యను 26 నుంచి 31కి పెంచారు. అయినా నాటినుంచి అపరిష్కృత కేసుల సంఖ్య తగ్గిన దాఖలాలు లేవు. మరింతగా పెండింగ్ కేసుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్న పరిస్థితి ఉన్నది. పెండింగ్ కేసుల సమస్య ఒక్క సుప్రీంకోర్టుకు సంబంధించిందే కాదు. దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసులు గుట్టల్లా పేరుకుపోయాయి. ఒకానొక అధ్యయనం ప్రకారం దేశంలో వివిధ కోర్టుల్లో మూడు కోట్లకు పైచిలుకు పెండింగ్ కేసులున్నాయి. ప్రస్తుత సుప్రీం ప్రధాన న్యాయమూర్తి చెప్పినదాని ప్రకారమే దేశంలో 2కోట్ల 10 లక్షల క్రిమినల్ కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. కోటికి పైగా కేసుల్లో సమన్లే జారీ కాలేదు. 20 ఏండ్లుగా తేలని కేసులు రెండు లక్షలకు పైగా ఉన్నాయి. 35 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులు 51 వేలు. దిగువ, సబార్డినేట్ కోర్టుల్లో రెండు కోట్ల 70 లక్షలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇప్పుడున్న వ్యవస్థ పనితీరుతో పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు మరో 350 ఏండ్లు పడుతుందని అంచనా. జడ్జీల సంఖ్యను పెంచటం ద్వారానే పెండింగ్ కేసుల సమస్యకు పరిష్కారం ఉంటుందనుకోలేం. అయితే పెండింగ్ కేసుల పరిష్కారం కోసం గతంలోనూ అనేక మంది న్యాయమూర్తులు తమదైన పద్ధతిలో ప్రయత్నించారు. జస్టిస్ టీఎస్ఎస్ ఠాకూర్, జస్టిస్ సరోష్ హోమీ కపాడియా, జస్టిస్ ఆర్.ఎం. లోథా లాంటివారు న్యాయమూర్తులు ఎక్కువ పనిగంటలు పనిచేయటం మూలంగా పెండింగ్ కేసుల పరిష్కారానికి మార్గం వేయాలని వాంఛించారు. అత్యవసర సేవల సంస్థలు నీటి సరఫరా, విద్యుత్, వైద్యం లాంటి వ్యవస్థలు ఏవిధంగానైతే పనిచేస్తాయో ఆ విధంగానే న్యాయ వ్యవస్థలు అత్యవసర వ్యవస్థలుగా పనిచేయాలని దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరోవైపు కోర్టులకు పనిదినాలు పెంచటానికి సెలవులను తగ్గించటానికి ప్రయత్నించారు. వేసవి, చలికాలం సెలవులతో పాటు పండుగల పేరిట సెలవులు అన్ని కలిపి కూడా ఇతర దేశాలతో పోలిస్తే కనిష్ఠంగా ఉన్నాయని వారు తెలిపారు. ఏటా సుప్రీంకోర్టు 193 రోజులు, హైకోర్టులు 210, దిగువ న్యాయస్థానాలు 245 రోజులు పనిచేస్తున్నాయి. పనిదినాలు, పనిగంటలు పెం చటం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలని వారు భావించారు. కానీ న్యాయవాద సంఘాలు, లా కమిషన్ కూడా సహకరించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

> **ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగానే కాదు, అతి విశిష్ట, నిష్పాక్షిక వ్యవస్థగా భారతీయ న్యాయవ్యవస్థకు కీర్తి ప్రతిష్ఠలున్నాయి. న్యాయం ఎంత గొప్పదైనా అది దేశంలోని అందరికీ సత్వరమే అందే పరిస్థితి లేనప్పుడు చట్టబద్ధ పాలన అర్థం లేనిదిగానే మిగులుతుంది. కాబట్టి న్యాయవ్యవస్థను వికేంద్రీకరణ చేయాల్సిన ఆవశ్యకత ఉన్నది. దేశంలోని నాలుగు ప్రధా న మెట్రో నగరాల్లో సుప్రీం బేంచీలను ఏర్పాటుచేస్తే ఢిల్లీ కేంద్రంగా సుప్రీంపై భారం తగ్గటమే గాక, ప్రజలకు చేరువగా న్యాయవ్యవస్థ చేరినట్లు ఉంటుందన్నది కొందరు న్యాయకోవిదుల అభిప్రాయం.**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగానే కాదు, అతి విశిష్ట, నిష్పాక్షిక వ్యవస్థగా భారతీయ న్యాయవ్యవస్థకు కీర్తి ప్రతిష్ఠలున్నాయి. న్యాయం ఎంత గొప్పదైనా అది దేశంలోని అందరికీ సత్వరమే అందే పరిస్థితి లేనప్పుడు చట్టబద్ధ పాలన అర్థం లేనిదిగానే మిగులుతుంది. కాబట్టి న్యాయవ్యవస్థను వికేంద్రీకరణ చేయాల్సిన ఆవశ్యకత ఉన్నది. దేశంలోని నాలుగు ప్రధాన మెట్రో నగరాల్లో సుప్రీం బేంచీలను ఏర్పాటుచేస్తే ఢిల్లీ కేంద్రంగా సుప్రీంపై భారం తగ్గటమే గాక, ప్రజలకు చేరువగా న్యాయవ్యవస్థ చేరినట్లు ఉంటుందన్నది కొందరు న్యాయకోవిదుల అభిప్రాయం. రాజ్యాంగ ఆదేశసూత్రాల్లోని 39(ఏ) అధికరణం–న్యాయం పొందటాన్ని అత్యంత ముఖ్యమైన మానవ హక్కుగా వ్యాఖ్యానిస్తున్నది. దురదృష్టవశాత్తూ ఢిల్లీ దాకా వెళ్లి న్యాయం కోసం పోరాడే ఆర్థిక స్థోమత ఉన్నవారికి ఇబ్బంది ఉండదు. కానీ సుదూర ప్రాంతాల్లో ఉండి ఆర్థిక, దూరభారాలు భరించలేని వారు ఇబ్బందులు పడుతున్నారు. సుప్రీంకోర్టులోని కేసుల గణాంకాలు కూడా దీన్నే చెబుతున్నాయి. ఉత్తరభారత రాష్ట్రాల నుంచి ఉన్నన్ని కేసులు దక్షిణ భారత రాష్ట్రాల నుంచి లేకపోవటం దీనికి తార్కాణం. కాలానుగుణంగా అవసరాల కోసం అనేక దేశాలు న్యాయవ్యవస్థలో మార్పులు తీసుకొచ్చాయి. రాజ్యాంగపరమైన అంశాల కోసం, సివిల్, క్రిమినల్ కేసుల విచారణం కోసం 55 దేశాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటయ్యాయి. రాజ్యాంగపరమైన మౌలిక విషయాల సమీక్ష కోసం, సివిల్, క్రిమినల్ కేసుల కోసం సుప్రీంకోర్టును భిన్నమైన బాధ్యతలతో వికేంద్రీకరించటం నేటి ఆవశ్యకత. ఆ దిశగా ఆలోచించి, అడుగులువేసినప్పుడే సత్వర, సమాన న్యాయం అందరికీ అందుబాటులోకి వస్తుంది.

**జనగళం**

## దేశానికి శుభోదయం

డెబ్బై ఏండ్లుగా ఎదురుచూస్తున్న భారత ప్రజల ఆకాంక్షలు నెరవేరాయి. ఆర్టికల్ 370ని చెత్తబుట్టలో పడేసింది ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం. ఈ చర్యతో దేశంలోని రాష్ట్రాలన్నింటికీ ఒకే చట్టం వర్తిస్తుంది. అన్ని రాష్ట్రాలకూ సమాన ప్రతిపత్తి ఉంటుంది. ఈ సాహసోపేతమైన నిర్ణయానికి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాలకు దేశంలోని సమస్త ప్రజానీకం జేజేలు పలుకుతున్నది. దేశంలోని ప్రతిపక్ష పార్టీలు, ప్రాంతీయపార్టీలు స్వాగతిస్తున్నాయి. ఇది హర్షణీయం. దేశాన్ని యాభై ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ చేయలేని పని బీజేపీ చేసిందని అభినందించాల్సిందిపోయి వ్యతిరేకించటం సిగ్గుచేటు. ఇకనైనా కాంగ్రెస్ వైఖరిలో మార్పురావాలె.

**- గులాబీల మల్లారెడ్డి, కరీంనగర్**

## పిల్లల్లో సత్ప్రవర్తన అలవర్చాలి

పిల్లల పట్ల కఠినంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో తల్లిదండ్రులు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పిల్లల పట్ల కఠినంగా వ్యవహరించే హక్కు తల్లిదండ్రులకు కూడా లేదని చట్టాలు చెబుతున్నాయి. అందుకే ముందునుంచే పిల్లల్లో మంచి నడవడికను అలవాటు చేయాలి. ఉదయాన్నే నిద్రలేపడం, వ్యక్తిగత శుభ్రత, పొద్దున లేచి చదువుకోవడం, రాత్రి తొందరగా నిద్రపోవడం, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచడం లాంటివి అలవాటు చేయాలి. మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం లాంటి విషయాల పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి. ఇలాంటి జాగ్రత్తలు పిల్లల్లో సత్ప్రవర్తనకు బీజం వేస్తాయనడంలో సందేహం లేదు. పిల్లలు ఎక్కువ శాతం తల్లి దండ్రులను అనుకరిస్తూ ఉంటారు. కాబట్టి తల్లిదండ్రులు పై విషయాలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. చిన్నారుల చుట్టూ సానుకూల, సంతోషకరమైన వాతావరణాన్ని ఏర్పరుచాలి. దీనివల్ల పిల్లల్లో క్రమశిక్షణ ఏర్పడుతుంది. వారిలోని నైపుణ్యాలను వెలికితీసి ఏయేరంగంలో వారు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారో ఆ దిశగా పిల్లలను ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. అప్పుడే తమ పిల్లలు విజయం వైపు దూసుకువెళ్తారనే విషయం తల్లిదండ్రులు మరువకూడదు. ఆ దిశగా తల్లిదండ్రులు బాధ్యతలు తీసుకోవాలె.

**- నర్మాల మనీశ్, లక్ష్మీనగర్, కరీంనగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**జాతీయం**



**కె.వి.రవికుమార్**

# కశ్మీర్ నిర్ణయం ఎటు దారితీస్తుంది?

**కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని నాటి నెహ్రూ ప్రభుత్వం ఇవ్వటం ఒక పెద్ద తప్పని, ఏ రాష్ట్రానికి లేని హోదాను దానికే ఎందుకు ఇవ్వాలని.. సోషల్ మీడియాలో చరిత్రను చదువుకున్నవాళ్లు వీరావేశంతో ప్రశ్నిస్తున్నారు. కానీ, వాళ్లు తెలుసుకోవాల్సింది ఏమిటంటే.. అప్పుడు ఆ స్వయంప్రతిపత్తిని బిచ్చం వేసినట్లు కశ్మీరీలకు ఇవ్వలేదు. జమ్ముకశ్మీర్ అనే రాష్ట్రం మనదేశంలోనే ఏకైక ముస్లిం మెజారిటీ (జనాభాలో 70 శాతం) రాష్ట్రం.**

జేమ్స్‌బాండ్ తరహాలో నాటకీయ, ఏకపక్ష నిర్ణయాలు తీసుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అత్యంత వివాదాస్పదమైన రీతిలో మరో నిర్ణయం తీసుకున్నారు. గతంలో కూడా ఇదేవిధంగా నోట్ల రద్దును ఉన్నపళంగా ప్రకటించి.. నల్లధనాన్ని అదుపు చేస్తానని, అరికడతానని మోదీ ప్రకటించారు. కానీ, ఆ నిర్ణయం ఆయన చెప్పిన లక్ష్యాన్ని ఏ మాత్రం సాధించకపోగా.. కొన్ని కోట్ల మంది దేశ ప్రజల్ని ముఖ్యంగా మధ్యతరగతిని, పేదలను తీవ్ర ఇబ్బందుల పాల్జేసింది. బ్యాంకుల ముందు పడిగాపులు గాస్తూ, ఇంట్లో, బ్యాంకులో దాచుకున్న డబ్బులు ఎందుకూ పనికిరాకుండా పోయాయనే బాధతో, షాక్‌తో కొందరు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు మళ్లీ, మోదీ తనదైన రీతిలో ఓ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఏడు దశాబ్దాలుగా స్వయంప్రతిపత్తిని కలిగి ఉన్న జమ్ముకశ్మీర్‌కు ఆ హోదాను రద్దుచేయటమేగాక, ఆ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి, జమ్ముకశ్మీర్‌ను అసెంబ్లీ ఉన్న కేంద్రపాలిత ప్రాంతంగా మార్చివేశారు. తద్వారా దానిని ఒక మున్సిపాలిటీ స్థాయికి మార్చివేశారు. ఈ అవమానాన్ని జమ్ముకశ్మీర్ ప్రజలు ముఖ్యంగా కశ్మీరీలు ఎంత మేరకు జీర్ణం చేసుకుంటారు? ఏ విధంగా దీనిని వాళ్లు తీసుకుంటారు? వాళ్ల ప్రతిస్పందన ఎలా ఉంటుంది? అన్నదానిపై వాళ్ల భవిష్య త్తే కాదు.. మిగిలిన భారతదేశ భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంటుంది.

ఈ సమయంలో తెలంగాణ గురించి ప్రస్తావించుకోవాల్సిన అవసరం ఉన్నది. 1956లో అప్పటి హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాలు కలిసి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైనప్పుడు.. ఈ విలీనం ఆంధ్రకు లాభకరంగా, హైదరాబాద్‌కు నష్టదాయకంగా పరిణమిస్తుందని హైదరాబాద్ నాయకులు భావించారు. ఆంధ్రకు హైదరాబాద్ రాష్ట్రం ఒక వలసగా మారిపోతుందని, తద్వారా ఇక్కడి ప్రజలు, నాయకులు నష్టపోతారని అనుమానించారు. ఈ అనుమానాలను దూరం చేయటానికి, ఇరు రాష్ట్రాల విలీనానికి వీలుగా పెద్ద మనుషుల ఒప్పందం (జెంటిల్మెన్ అగ్రిమెంట్) పేరుతో ఇరు రాష్ట్రాల నేతలు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. కానీ, ఆ ఒప్పందం కాగితాలకే పరిమితమై.. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైన మరుక్షణం నుంచే ఒప్పందంలోని అంశాలను ఆంధ్ర నాయకులు గాలికి వదిలేశారు. దీని ఫలితంగానే తెలంగాణలో మళ్లీ స్వరాష్ట్ర ఆకాంక్ష మొగ్గ తొడుగటం, 1969లో అది ప్రళయ భీకరరూపాన్ని సంతరించుకోవటం, అంతటి ఉద్యమాన్ని నాటి ఆంధ్ర పాలకులు నెత్తురుటేర్లలో ముంచి అణిచివేయటం మనముందున్న చరిత్ర. అయినప్పటికీ, తెలంగాణ అసంతృప్తి, ఆకాంక్ష అణిగిపోలేదు. అది మళ్లీ తలెత్తింది. అనేక ఉద్యమాలు, టీఆర్‌ఎస్ సారథ్యంలో జరిగిన రాజకీయ పోరాటాలు, ఎంతోమంది బలిదానాలతో స్వరాష్ట్రం సాకారమైనాక గాని, ఆ అసంతృప్తి చల్లారలేదు. పెద్దమనుషుల ఒప్పందాన్ని పక్కనబెట్టి తమ ప్రాంత అస్తిత్వాన్ని అణిచివేసినందుకే తెలంగాణ ఇంతగా తిరుగబడి చివరికి అనుకున్న లక్ష్యాన్ని సాధించిన తర్వాతగాని శాంతించలేదు. అటువంటిది, తమకున్న ప్రత్యేక ప్రతిపత్తిని, స్వయం ప్రతిపత్తిని కాలరాసి, ఏకంగా కేంద్రం చేతివేళ్లతో ఆడుకునే ఒక మున్సిపాలిటీలాగా తమ ప్రాంతాన్ని మారిస్తే కశ్మీరీలు ఊరుకుంటారా అన్న ప్రశ్న ఇక్కడ తలెత్తుతున్నది.

నిజమే, కశ్మీరీలకు లభించిన స్వయంప్రతిపత్తి వాళ్లకు ప్రగతి ఫలాలను అందించటం మాట అటుంచి, వాళ్ల మాతృభూమిని మరుభూమిగా మార్చిన మాట వాస్తవమే. కానీ, ఈ పాపం ఎవరి ఫలితం? స్వయంప్రతిపత్తిని ఇచ్చిన మాటేగానీ, దానిని పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వాలు (నాటి నెహ్రూ సర్కార్ నుంచీ) ఎన్నడు అమలుచేశాయి? కశ్మీర్‌ను ఒక భూ ఖండంగా





మాత్రమే గానీ, అక్కడ ప్రజల అవసరాలను, అభివృద్ధిని ఎప్పుడు పట్టించుకున్నాయి? అత్యద్భుతమైన ప్రకృతి అందాలకు నెలవైన కశ్మీర్‌ను అభివృద్ధి చేసి, అక్కడి ప్రజలకు ఉద్యోగాలు, విద్య, వైద్యం, వ్యవసాయానికి తగిన సదుపాయాలు కల్పిస్తే.. భారత్ నుంచి విడిపోతామన్న నినాదాన్ని, ఆజాద్ కశ్మీర్ అనే నినాదాన్ని ఎందుకు వాళ్లు భుజానికెత్తుకునే పరిస్థితి వస్తుంది? ఆ నినాదం వారికేమైన శాంతిని, సుఖాన్నిచ్చిందా? ఆ నినాదం కోసం కొన్ని వేలమంది యువకులు సైన్యంతో జరిగిన ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. జీవితం సుఖసంతోషాలతో ఉంటే, అందమైన భవిష్యత్తును సాకారం చేసుకునే పరిస్థితులే ఉంటే... తుపాకి పట్టుకొని, పట్టుమని 20–25 ఏండ్లు కూడా నిండకుండానే చావును కౌగిలించుకోవటానికి వాళ్లకేమైనా పిచ్చా? ఎల్బీనగర్ చౌరస్తాలో తననుతాను మంటల్లో కాల్చుకుంటూ కూడా జై తెలంగాణ నినాదాలు చేస్తూ తనువు చాలించిన శ్రీకాంతాచారికి పిచ్చి లేచి ఆ పని చేశాడా? లేక, ఆంధ్రపాలనలో తెలంగాణ బాగుపడదు, స్వరాష్ట్రం అయితేనే అభివృద్ధి సాధ్యమవుతుంది.. ఆ లక్ష్యసాధన కోసం నా ప్రాణాలను ఒక సమిధగా ధారపోస్తున్నా అన్న అవగాహనతో ఆ పని చేశాడా?


కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని నాటి నెహ్రూ ప్రభుత్వం ఇవ్వటం ఒక పెద్ద తప్పని, ఏ రాష్ట్రానికి లేని హోదాను దానికే ఎందుకు ఇవ్వాలని.. సోషల్ మీడియాలో చరిత్రను చదువుకున్నవాళ్లు వీరావేశంతో ప్రశ్నిస్తున్నారు. కానీ, వాళ్లు తెలుసుకోవాల్సింది ఏమిటంటే.. అప్పుడు ఆ స్వయంప్రతిపత్తిని బిచ్చం వేసినట్లు కశ్మీరీలకు ఇవ్వలేదు. జమ్ముకశ్మీర్ అనే రాష్ట్రం మనదేశంలోనే ఏకైక ముస్లిం మెజారిటీ (జనాభాలో 70 శాతం) రాష్ట్రం. కాబట్టి, పాకిస్థాన్ వ్యవస్థాపకుడు జిన్నా ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతం ప్రకారం, విలీనంపై సంస్థానాలకు నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన హక్కు ప్రకారం నాడు వాళ్లు పాకిస్థాన్‌లోనే కలువొచ్చు. అందుకు అక్కడి భౌగోళిక పరిస్థితులు కూడా ఎంతో అనుకూలం. కానీ, కశ్మీరీల ప్రజాస్వామ ఉద్యమ నేత షేక్ అబ్దుల్లా.. తమ రాష్ట్రంలో ఉన్న హిందువులు, బౌద్ధులు వంటి మైనారిటీలకు ఇస్లాం మతరాజ్యమైన పాకిస్థాన్‌లో హక్కులు లేకుండా పోతాయని భావించి సెక్యులర్ రాజ్యమైన భారత్‌లో కలువటానికి ముందుకొచ్చారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా హైదరాబాద్ రాజ్యంలో అన్నిమతాల ప్రజలు పాల్గొన్నట్లుగా, జమ్ముకశ్మీర్ పాలకుడు హరిసింగ్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా హక్కుల కోసం, ప్రజాస్వామ్యం కోసం అక్కడి ప్రజలు మతాలకతీతంగా పాల్గొన్నారు. ఆ ఉద్యమ నేతగా షేక్‌అబ్దుల్లా ఆవిర్భవించారు. ఆ ఉద్యమ సంప్రదాయాలను పాటిస్తూ, ఆయన భారత్‌లో కలువటానికే మొగ్గుచూపారు. అందుకని, ఆయనను నాటి పాకిస్థాన్ నేతలు భారత్ ఏజెంట్ అని, ఇస్లాం ద్రోహి అని తిట్టిపోశారు. అయినా ఆయన చలించలేదు. మరోవైపు, భారత రాజ్యాంగం రూపకల్పన సందర్భంగా.. అప్పటివరకూ స్వతంత్రంగా ఉన్న సంస్థానాలకు తమవైన రాజ్యాంగాలను రూపొందించుకునే హక్కును, భారత రాజ్యాంగంలో మార్పులను సూచించే హక్కులను అప్పటి భారత రాజ్యాంగసభ ఇచ్చింది. ఈ మేరకు పలు సంస్థానాలు చేసిన సూచనలను రాజ్యాంగంలో పొందుపరిచారు. కశ్మీర్ మాత్రం తమకు రక్షణ, సమాచారం, విదేశాంగ వ్యవహారాలు, ఆర్థికం తప్ప అన్నిరంగాల్లో స్వయంప్రతిపత్తి కావాలని డిమాండ్ చేసింది. దానికి రాజ్యాంగసభ ఆమోదించింది. ఈ విధంగానే ఆర్టికల్ 370 ఉనికిలోకి వచ్చింది.

> **ప్రస్తుతం జమ్ముకశ్మీర్ అభివృద్ధికి ఈ ఆర్టికల్ 370 పెద్ద అవరోధం అన్నట్లుగా మోదీ ప్రభుత్వం దానిని రద్దు చేసింది. వచ్చే ఎన్నికల వరకూ, రానున్న ఐదేండ్లలో ఆ రాష్ట్రాన్ని భూతల స్వర్గంగా చేసి మళ్లీ నిలబెడుతామని చెబుతుంది. నోట్లరద్దు సందర్భంగా కూడా ఇటువంటి ప్రగల్భాలే పలికింది. కానీ, ఏమైందో చూశాం. ఇప్పుడు, ఈ విషయంలోనూ మోదీ సర్కార్ ఏ మేరకు మాటలను ఆచరణకు తీసుకొస్తుందన్నదానిపై సందేహాలు నెలకొనటం సహజం.**

ప్రస్తుతం జమ్ముకశ్మీర్ అభివృద్ధికి ఈ ఆర్టికల్ 370 పెద్ద అవరోధం అన్నట్లుగా మోదీ ప్రభుత్వం దానిని రద్దు చేసింది. వచ్చే ఎన్నికల వరకూ, రానున్న ఐదేండ్లలో ఆ రాష్ట్రాన్ని భూతల స్వర్గంగా చేసి మళ్లీ నిలబెడుతామని చెబుతుంది. నోట్ల రద్దు సందర్భంగా కూడా ఇటువంటి ప్రగల్భాలే పలికింది. కానీ, ఏమైందో చూశాం. ఇప్పుడు, ఈ విషయంలోనూ మోదీ సర్కార్ ఏ మేరకు మాటలను ఆచరణకు తీసుకొస్తుందన్నదానిపై సందేహాలు నెలకొనటం సహజం. ఈలోపు, కశ్మీరీలు దీనిపై ఎలా స్పందిస్తారన్నది మరో పెద్ద ప్రశ్న. వారి ప్రమేయం ఏ మాత్రం లేకుండా, వారికి సంబంధించిన కీలకమైన నిర్ణయాలు తీసుకుంటే.. 'మమ్మల్ని అభివృద్ధి చేయటానికే ఇదంతా మీరు చేస్తున్నారు. ఆ విషయం మాకు తెలియదా? రండి స్వాగతం' అని స్వాగతం పలుకుతారా? లేక, ఈ ఏకపక్ష నిర్ణయాన్ని అత్యంత అవమానకరంగా భావించి ప్రతిఘటిస్తారా? అన్నది భవిష్యత్తులో కాని తేలదు. రెండోది జరిగితే మాత్రం.. కశ్మీర్ చిచ్చు ఇప్పటివరకూ మనం చూసినదాని కన్నా మరింత పెరిగే ప్రమాదం ఉన్నది.

# రైతుకోసం ఎంతైనా ఖర్చుచేయొచ్చు

**కాళేశ్వరం**



**శ్రీధర్‌రావు దేశ్‌పాండే**

రాష్ట్రంలో రైతాంగానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు అందించాలంటే ఎత్తిపోతలు తప్ప మార్గం లేదని అందరూ అంగీకరిస్తున్నదే. అదే సమయంలో ఎత్తిపోతలకు కరంటు ఖర్చు గురించి గగ్గోలు పెడుతారు. అభూతకల్పనలతో ప్రజలను, తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తారు. ఎత్తిపోతలు లేకుండా రాష్ట్రం రైతాంగానికి సాగునీరు ఇవ్వలేము. పంపులు నడిస్తే కరంటు కాలుతుంది. రాష్ట్రంలో ఏఎంఆర్‌పీ, నాగార్జునసాగర్ ఎల్‌ఎల్‌సీ (నల్లగొండ), కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, తుమ్మిళ్ళ (మహబూబ్‌నగర్), భక్తరామదాసు (ఖమ్మం), అలీసాగర్, గుత్ప, చౌటుపల్లి హనుమంతరెడ్డి (నిజామాబాద్), గూడెం (మంచిర్యాల్), ఎల్లంపల్లి (కరీంనగర్) పథకాలు విజయవంతంగా రైతాంగానికి సేవలందిస్తున్నాయి. ఈ ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు సాగునీరు అందించేందుకు సిద్ధమవుతున్నది. మరో మూడేండ్లలో పాలమూరు రంగారెడ్డి, సీతారామ, డిండి, చిన్న కాళేశ్వరం, తుమ్మిడిహట్టి, చనాఖా కోరాటా ఎత్తిపోతల పథకాలు సాగునీరు అందించడానికి సిద్ధమవుతాయి. వీటన్నింటికి సుమారు 9 వేల మెగావాట్ల కరంటు అవసరం పడుతుందని ఇంజినీర్ల అంచనా. వీటికి ఏటా 10 నుంచి 15 వేల కోట్ల కరంటు బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసి ఉంటుంది. భవిష్యత్తులో ఇది ఏ ప్రభుత్వానికైనా తప్పదు. ఈ ఖర్చుంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి తెలుసు. ఒక నెలకే 10 కోట్ల కరంటు బిల్లా అని ఆశ్చర్యపోతున్న మేతావులు తెలుసుకోవాల్సిన విషయం ఏమంటే..

కాళేశ్వరం ప్రాజెక్టులో లింక్ 1లో ఉన్న కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ళ వద్ద ఉన్న పంపులు 5, 10 హెచ్‌పీల వ్యవసాయ పంపులు కావు. ఒక్కొక్కటి 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పంపులు. అంటే 55 వేల హెచ్‌పీ పంపులన్న మాట. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇవి చిన్నవి. లింక్ 2లో ఉన్నవి 125, 139 మెగావాట్ల భారీ పంపులు. ప్రపంచంలోనే అతిపెద్దవి. వీటితో పాటు 85, 105.. ఇట్లా రకరకాల రేటింగ్ కలిన పంపులు కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో బిగిస్తున్నారు. 22 పంప్ హౌజుల్లో మొత్తం 85 పంపులు బిగిస్తారు. ఇవన్నీ నడిచినప్పుడు 4600 మెగావాట్ల కరంటు అవసరమవుతుందని ఒక అంచనా. అయితే అన్ని పంపులు ఒకేసారి నడిచే సందర్భం అసలు ఏర్పడకపోవచ్చు. శ్రీరాంసాగర్‌కు వరద వస్తే గ్రావిటీ ద్వారానే మిడ్‌మానేరు, లోయర్ మానేరు, ఎల్లంపల్లి, కింద సుందిళ్ళ, అన్నారం బరాజ్‌లు నిండుతాయి. అప్పుడు లింక్ 1, 2లో పంపులను నడిపే అవసరం రాదు. మిడ్‌మానేరు నుంచే పంపులు తిప్పడం జరుగుతుంది. ఈ పరిస్థితి ప్రతీ మూడేండ్లకోసారి ఏర్పడే అవకాశం ఉన్నది. శ్రీరాంసాగర్

**కరంటు ఖర్చుపై వాస్తవాలు-2**



వద్ద నీరు లేకున్నా ఎల్లంపల్లికి వరద రావచ్చు. అప్పుడు లింక్ 1లో పంపులు నడుపరు. లింక్ 2లో పంపుల ద్వారా మిడ్ మానేరుకు, అక్కడినుంచి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌కు, శ్రీరాంసాగర్‌కు నీటికి ఎత్తిపోస్తారు. ఈ రెండు చోట్లలో నీరు లేనప్పుడే మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం జరుగుతుంది.

ఎల్లంపల్లికి వరద వస్తుందని తెలిసిన తర్వాత లింక్ 1లోని అన్ని పంపులను ఆపివేయడం జరిగింది. 15 ఏండ్ల తర్వాత మానేరు వాగు నుంచి వరద అన్నారం బరాజ్‌లోకి చేరింది. ఎంత నీరు వస్తున్నదో అంటే నీరు బయటకు పంపడం జరుగుతున్నది. ప్రకృతిని కొంత మేరకే నియంత్రించడం సాధ్యం. ఆ తర్వాత ప్రకృతి ధర్మాన్ని అనుసరించక తప్పదు. ఇంజినీర్లు అదే పని చేస్తుంటే దీనిపై కూడా పెద్ద నాయకులు అనుకునేవాళ్లు కూడా తిప్పిపోతలు అని వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఎగువన నీరు లేనప్పుడు ప్రాణహిత నీటిని పైకి గోదావరిలోకి ఎట్లా ఎదురెక్కించవచ్చునో మన అనుభవంలోనికి వచ్చింది. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ–ఎల్లంపల్లి లింక్ ఎంత ముఖ్యమైనదో, ఎంతటి ప్రాధాన్యం కలిగినదో ప్రజలకు అర్థమైంది. మరొక విషయమేమంటే మేడి గడ్డ, అన్నారం, సుందిళ్ళ పంపులను ఈ సంవత్సరం మొదటిసాటి ట్రయల్ రన్ చేశారు. ఈ సందర్భంగా కరంటు ఎక్కు వ కాలుతుంది. ఒకసారి పంపులు సిం క్రనైజ్ అయిన తర్వాత స్విచ్ ఆన్ చేయగానే పంపింగ్ మొదలవుతుంది. కరంటు తక్కువ కాలుతుంది. పూర్తి సామర్థ్యంతో నీరు పంపు అవుతుంది. ఈ సాంకేతికాంశం తెలియనివారు 'ఒక టీఎంసీ ఒక కోటి బిల్లా' అని ఆశ్చర్యపోతున్నారు. కొత్తగా గృహ ప్రవేశం చేసినరోజు ఎక్కువ కనంటు కాలుతుంది. ఇంట్లో అన్ని లైట్లు, ఫ్యాన్లు, ఫ్లడ్ లైట్లు, డెకరేషన్ లైట్లు వెలుగుతాయి. ఆ తర్వాత కరంటు వినియోగం మామూలుగానే ఉంటుంది. ఇదీ అంతే.

ఈ కరంటు బిల్లుల సంగతి ఇంజినీర్లకు, ప్రభుత్వ పెద్దలకు ముందే తెలుసు. ఇందులో ఆశ్చర్యపోవాల్సిన అంశమే లేదు. తెలంగాణలో ఎత్తిపోతలు లేకుండా రైతాంగానికి నీరు ఇవ్వలేము. ఈ సంగతి కాళేశ్వరం విమర్శకులకు తెలుసు. ప్రజలను కన్ఫ్యూజ్ చేయడానికే ఈ ప్రచారం. ఉమ్మడి ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల పథకానికి అయినా ఈ కరంటు ఖర్చు ఉండేదే. తుమ్మిడిహట్టి కట్టి ఉంటే కరంటు ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా నీరు ఎల్లంపల్లికి చేరి ఉండేవనే వారి వాదన తప్పు. అక్కడ కూడా 40 మీటర్ల లిఫ్ట్ ఉన్న సంగతిని వారు మరిచిపోతున్నారు. లేదా మరుగునపెడుతున్నారు. కరంటు బిల్లుల విషప్రచారాన్ని ప్రజలు ఎంత మాత్రం పట్టించుకునే స్థితిలో లేరు.

> **ఈ కరంటు బిల్లుల సంగతి ఇంజినీర్లకు, ప్రభుత్వ పెద్దలకు ముందే తెలుసు. ఇందులో ఆశ్చర్యపోవాల్సిన అంశమే లేదు. తెలంగాణలో ఎత్తిపోతలు లేకుండా రైతాంగానికి నీరు ఇవ్వలేము. ఈ సంగతి కాళేశ్వరం విమర్శకులకు తెలుసు. ప్రజలను కన్ఫ్యూజ్ చేయడానికే ఈ ప్రచారం. ఉమ్మడి ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల పథకానికి అయినా ఈ కరంటు ఖర్చు ఉండేదే. తుమ్మిడిహట్టి కట్టి ఉంటే కరంటు ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా నీరు ఎల్లంపల్లికి చేరి ఉండేవనే వారి వాదన తప్పు.**

**(ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ నల్ల వెంకటేశ్వర్లుల సౌజన్యంతో..)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



ఖమ్మంలో ఆర్చరీ క్రీడాప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే అజయ్‌కుమార్

## రాష్ట్రంలో భారీగా ఉపాధి శిక్షణాకేంద్రాలు

▪ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మయూరిసెంటర్:** రాష్ట్రప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నదని ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నిరుద్యోగ యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు భారీగా ఉపాధిశిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మంగళవారం ఖమ్మంలో ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌తోకలిసి మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రారంభించారు. డీఆర్డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధి, శిక్షణ కేంద్రాన్ని, వీడీయోవోస్ కాలనీలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించారు. సర్దార్‌పటేల్ స్టేడియంలో రూ.8.60 లక్షల వ్యయంతో విలువిద్యక్రీడ(ఆర్చరీ) ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్నదని చెప్పారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ బాలసాని, జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, క్రీడా సాధికారత ఎండీ దినకర్‌బాబు, జేసీ అనురాగ్‌జయంతి, మేయర్ పాపాలాల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిరిసిల్లకు కేటీఆర్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు చేరుకుంటారు. సిరిసిల్లలోని పొదుపు భవనంలో జరిగే జిల్లాపరిషత్ మొదటి సర్వసభ్య సమావేశానికి హాజరవుతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో టీఆర్‌ఎస్ సిరిసిల్ల బూత్‌లెవెల్ కమిటీ సభ్యుల సమావేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు. శివనగర్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులను రెండు గంటలకు ప్రారంభించి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.



సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో మంగళవారం ఎమ్మెల్యే గాదరి కిశోర్, కలెక్టర్ అమయ్‌కుమార్‌తోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు ఓ రైతు పొలంలో వరినాట్లు వేసి అందరిని ఆకట్టుకున్నారు. - తుంగతుర్తి



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వరంగల్ రూరల్ జిల్లాలోని పాకాల సరస్సు నీటి మట్టం రోజురోజుకూ పెరుగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 30.3 అడుగులు కాగా మంగళవారం 16 అడుగులకు నీరు చేరుకున్నది. బుధవారం ఉదయానికి నీటిమట్టం 17 అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నదని అధికారులు పేర్కొన్నారు. - ఖానాపురం



# 15 జిల్లాల్లో ఓ మోస్తరు వానలు

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ ▪ సాగు పనుల్లో రైతన్న

అత్యధికంగా లింగంపేటలో 66.4 మి.మీ. వర్షం

48 గంటల్లో రాష్ట్రంలో వర్షాలు.. కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీగా

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో కురుస్తున్న వర్షం



మత్తడి దూకుతున్న కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం మెంగారం చెరువు

**హైదరాబాద్ నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మంగళవారం దాదాపు 15 జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం కారణంగా వాగులు, చెరువుల్లోకి నీరు చేరుతున్నది. రైతులు సైతం వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలో 66.4 మి.మీ., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో 55.5 మి.మీ.వర్షపాతం నమోదైంది. ఉత్తర బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారినందున రాగల 48 గంటల్లో రాష్ట్రంలో వర్షాలు పడే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదన్నారు.

**భద్రాద్రి జిల్లాలో..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తున్నది. దుమ్ముగూడెం మండలంలో 55.5 మి.మీ., మణుగూరులో 48.2 మి.మీ., పినపాకలో 39.8 మి.మీ., అశ్వాపురంలో 39.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటు వర్షపాతం 19.6 మి.మీటర్లుగా రికార్డయింది. ఖమ్మం నగరంతోపాటు పలు మండలాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా బోనకల్‌లో 44.2 మి.మీ., ముదిగొండలో 40.2మి.మీ., నేలకొండపల్లిలో 35.8 మి.మీ., వర్షపాతం నమోదైంది.

**ఉమ్మడి వరంగల్‌లో..**

వరంగల్ అర్బన్ నగరంలో మంగళవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. జిల్లాలో ముసురు పట్టుకున్నది. వరంగల్ రూరల్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

**నిజామాబాద్‌లో..**

నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయి. మంగళవారం జిల్లాకేంద్రంతోపాటు డిచ్‌పల్లి, ఇందల్వాయి, బాల్కొండ, ఆర్మూర్, భీమ్‌గల్, మోపాల్ మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. నిజామాబాద్ నగరంలో సాయంత్రం, రాత్రి రెండు విడుతలుగా ఓ మోస్తరు వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా మంగళవారం ఓ మోస్తరు వాన కురిసింది. లింగంపేట మండలంలో అత్యధికంగా 66.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. పలు వీధుల్లో రోడ్లపై వరద నీరు నిలిచింది. తిర్యాణి మండలంలోని పలు గ్రామాల్లో వర్షం పడగా, చెలిమెల వాగు ప్రాజెక్టు మత్తడి దూకుతున్నది. నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా మిర్యాలగూడలో 25.6 మి.మీటర్లు కురిసింది. వికారాబాద్ జిల్లాలో వారం రోజులుగా తుంపర్లతో కూడిన ఎడతెరిపి లేని వర్షం కురుస్తున్నది. మంగళవారం వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, ధారూరు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. తాండూరు మండలంలో 41.0 మి.మీ., బషీరాబాద్ 39 మి.మీ., పరిగి 35 మి.మీ., యాలాల మండలంలో 32 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

**ఉమ్మడి కరీంనగర్‌లో..**

కరీంనగర్ జిల్లాలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రామగుడు, హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లంతకుంట, సైదాపూర్, తిమ్మాపూర్, మానకొండూర్, శంకరపట్నం, గన్నేరువరం తదితర మండలాల్లో ఓ మోస్తరు, చొప్పదండి, కరీంనగర్, గంగాధర, చిగురుమామిడి మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది.

**సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్..**

వర్షం కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి భారీగా నీరు వచ్చి చేరడంతో మంగళవారం రెండు షిఫ్టుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. మోటర్లు, ఇతర యంత్రాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొత్తగూడెంలోని జీకేవోసీ, జేవీఆర్ వోసీ 1, జేవీఆర్ వోసీ2, కిస్టారం వోసీ, ఇల్లెందులోని జేకే వోసీ, కోయగూడెం ఓసీ2, కోయగూడెం ఓసీ 3, మణుగూరులోని పీకేవోసీ 2, పీకేవోసీ 4, మణుగూరు ఓసీ, కొండాపురం ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది.

### గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల వర్షం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో అల్పపీడన ప్రభావం కొనసాగుతున్నది. మంగళవారం పలు చోట్ల ఓ మోస్తరు నుంచి తేలికపాటి జల్లులు కురిశాయి. రాజేంద్రనగర్, అత్తాపూర్, మెహిదీపట్నం, బంజారాహిల్స్, బేగంపేట, అమీర్‌పేట, అల్వాల్, సికింద్రాబాద్, లాల్‌బజార్, షేక్‌పేట, మాదాపూర్, పాతబస్తీ, మహేశ్వరం, సరూర్‌నగర్, నాగోల్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

**వచ్చే మూడు రోజులపాటు గ్రేటర్‌లో వర్షం**

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారిందని, రాగల మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఒకటి రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు.

### భారీ వర్ష సూచన..

పశ్చిమ బెంగాల్, ఒడిశా తీర ప్రాంతాలను ఆనుకొని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం మంగళవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో వాయుగుండంగా మారింది. ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు దగ్గరలో వాయవ్య బంగాళాఖాతంలో ఒడిశా బాలాసోర్‌కు ఆగ్నేయ దిశగా 160 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. ఇది రాగల 24 గంటల్లో మరింత తీవ్ర వాయుగుండంగా మారే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఇది మరో 48 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా ఒడిశా, పశ్చిమబెంగాల్ తీరాల మీదుగా ప్రయాణించే అవకాశమున్నదని తెలిపారు. కాగా తెలంగాణ రాష్ట్రంలో రాగల 48 గంటల్లో రుతుపవనాలు చురుకుగా కదిలి పలు చోట్ల ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నదన్నారు. కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురియవచ్చన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో మొక్క నాటుతున్న మంత్రి నిరంజన్ రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

## జయశంకర్ ఆశయసాధనకు కృషి

▪ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**బిజినేపల్లి:** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో నాలుగున్నర కోట్లతో నిర్మించిన బాలికల వ్యవసాయ హాస్టల్ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ సాధనలో జయశంకర్ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. కార్యక్రమం లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మావతి, జయశంకర్ వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజిన్ నుంచి విడిపోయిన బోగీలు

**ఓదెల:** కొలనూర్– పెద్దపల్లి రైల్వేస్టేషన్ల మధ్యన కొత్తపల్లి స్టేషన్ సమీపంలో మంగళవారం కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలతో ఇంజిన్ విడిపోయింది. కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12758) పెద్దపల్లి జంక్షన్ నుంచి బయలుదేరి వెళ్తుండగా కొత్తపల్లి స్టేషన్ సమీపంలో బోగీలతో లింకు ఊడిపోగా, ఇంజిన్ అరకిలో మీటర్ దూరం వెళ్లింది. గమనించిన లోకోపైలెట్లు వెంటనే తెరుకుని ఇంజిన్‌ను వెనక్కి తీసుకువచ్చి బోగీలకు లింకు చేశారు. సాయంత్రం 5.40గంటల ప్రాంతంలో కప్లింగ్ ఊడిపోవడం దాదాపు 40 నిమిషాల పాటు రైలు నిలిచిపోయింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.



బోగీలతో విడిపోయిన రైలు ఇంజిన్



వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆయన కుటుంబసభ్యులు



టీఎన్జీవో కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయవర్సిటీలో జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ప్రవీణ్‌రావు తదితరులు

# జయశంకర్ సార్‌కు ఘన నివాళి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో జయశంకర్ విగ్రహానికి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. హన్మకొండలో జయశంకర్ విగ్రహానికి ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, అరూరి రమేశ్, జయశంకర్ సార్ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, కవి గేయ రచయిత పెద్దింటి అశోక్ పాల్గొని నివాళులర్పించారు. నల్లగొండలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, దేవరకొండలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్, నకిరేకల్ లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**ఉద్యోగసంఘాల ఆధ్వర్యంలో..**

హైదరాబాద్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఉద్యోగసంఘాలు ఘనంగా నిర్వహించాయి. టీఎన్జీవో భవన్‌లో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, అసోసియేట్ అధ్యక్షులు రేచల్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు రాయకంటి ప్రతాప్ తదితరులు, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా నివాళులర్పించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు. టీజీవో హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో టీజీవో హైదరాబాద్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, సీపీవో రామబ్రహ్మం, సుజాత, లతీఫ్, లక్ష్మీనారాయణ, పవన్, రమానందం పాల్గొన్నారు. భాగ్యనగర్ తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీటీఎన్జీవో అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి బలరాం, కోశాధికారి మల్లారెడ్డి పాల్గొన్నారు. స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీలో నిర్వహించిన కార్యక్రమంలో మోటరు వెహికిల్ ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీసీ పాపారావు, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు రమేశ్, మమతాప్రసాద్, రవీందర్, అన్వర్, నరేందర్, సుధాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు. తెలంగాణ గ్రూప్–1 అధికారుల సంఘం ఆధ్వర్యంలో సంఘం ప్రధాన కార్యదర్శి హనుమంత్‌నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కామారెడ్డి జిల్లా బాన్సువాడలో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి



బీసీ కమిషన్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కమిషన్ చైర్మన్ రాములు, సభ్యులు వకుళాభరణం, జూలూరు

**డీజీపీ కార్యాలయంలో..**


డీజీపీ కార్యాలయంలో డీజీపీ ఎం మహేందర్ రెడ్డి జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అదనపు డీజీలు జితేందర్, గోవింద్‌సింగ్, శివధర్‌రెడ్డి, ఐజీ సంజయ్‌జైన్ పాల్గొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, ఏసీబీ కేంద్ర కార్యాలయంలో ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు, టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, కార్యదర్శి వాణీప్రసాద్, టీఎస్‌ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఆ సంస్థ సీఎండీ రఘుమారెడ్డితో పాటు డైరెక్టర్లు రాములు, సీహెచ్ మదన్‌మోహన్‌రావు, స్వామిరెడ్డి, నర్సింహారావు పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బస్‌భవన్‌లో టీఎస్‌ఆర్టీసీ ఈడీలు పురుషోత్తం, టీవీ రావు, వినోద్, యాదగిరి, వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్ రావు, జూలూరు గౌరీశంకర్ తదితరులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంక్షేమ భవన్‌లో ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్ పీ కరుణాకర్, ఏడీ వేణుగోపాల్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**వ్యవసాయ వర్సిటీలో..**

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జయశంకర్ విగ్రహానికి ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్ పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య కార్యాలయంలో సంస్థ చైర్మన్ లోకా భూమారెడ్డి, ఎండీ శ్రీనివాస్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

**న్యూజిలాండ్‌లో ..**

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను తెలంగాణ జాగృతి న్యూజిలాండ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తూ వైద్య శిబిరం ఏర్పాటుచేశారు.



అంబేద్కర్ వర్సిటీలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ టీ పాపిరెడ్డి



హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి



సిరిసిల్లలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్



చింతమడకలో వైద్య పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి

### దేశంలో తొలిసారిగా

## చింతమడకలో ఆరోగ్యసూచిక

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొనసాగుతున్న వైద్యశిబిరం

రెండోరోజు 715 మందికి పరీక్షలు

**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** దేశంలోనే ప్రప్రథమంగా ఆరోగ్య సూచికను రూపొందిస్తున్న గ్రామంగా చింతమడక నిలువనున్నదని ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆరోగ్య తెలంగాణ సాధన దిశగా సీఎం కేసీఆర్ ఆలోచన చేయగా చింతమడక నుంచే ఆరోగ్య సూచిక తయారీకి మొదటి అడుగుపడిందన్నారు. సిద్దిపేట జిల్లా చింతమడకలో రెండోరోజైన మంగళవారం వైద్యశిబిరం కొనసాగింది. కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, జేసీ పద్మాకర్‌తో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన మందులను అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరం 15 రోజులపాటు కొనసాగుతుందన్నారు.

**715 మందికి వైద్య పరీక్షలు**

ఈ వైద్య శిబిరంలో రెండోరోజు 715 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రక్త, టూడీ ఇకో, ఈసీజీ, రొమ్ము పరీక్షలు, ఎక్స్‌రే, క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేశారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన ఎమ్మెల్యే బాల్క సుమన్ బృందానికి ప్రాజెక్టు వివరాలు వెల్లడిస్తున్న ఇంజినీర్

## 'కన్నెపల్లి' సందర్శించిన సిరిసిల్ల రైతులు

**కాళేశ్వరం (జయశంకర్ భూపాలపల్లి):** కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సుమారు వెయ్యి మంది రైతులు చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. పంప్‌హౌస్ వ్యూ పాయింట్ వద్దకు చేరుకొని మోటర్లను పరిశీలించారు. అక్కడే రైతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రొజెక్టర్ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి డీఈఈ సూర్యప్రకాశ్ వివరించారు. అనంతరం బాల్క సుమన్ రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగాల గురించి వివరించారు. అక్కడ నుంచి బయలుదేరి కాళేశ్వరం వద్ద పారుతున్న గోదావరిని, డెలివరీ సిస్టర్న్ నుంచి గ్రావిటీ కెనాల్‌ను పరిశీలించారు. అనంతరం మేడిగడ్డ బరాజ్ సందర్శనకు వెళ్లారు.




సుందిల్లలో రెండో మోటర్ ఆన్‌చేయడంతో డెలివరీ సిస్టర్న్ నుంచి కిందికి దూకుతున్న జలాలు

## సుందిల్ల పంప్‌హౌస్‌లో వెట్‌రన్

**మంథని, నమస్తే తెలంగాణ/అంతర్గాం:** సుందిల్ల బరాజ్‌లోని నీటిని ఎల్లంపల్లి జలాశయంలో నింపేందుకు అంతర్గాం మండలంలో గోలివాడలోని సుందిల్ల పంప్‌హౌస్‌లోని 2, 3వ మోటర్లకు మంగళవారం సాయంత్రం వెట్‌రన్‌ను నిర్వహించారు. వారంక్రితం ఒక టో మోటర్ వెట్‌రన్‌ను విజయవంతం చేయగా, మంగళవారం 2, 3వ మోటర్లకు వేర్వేరుగా వెట్‌రన్ నిర్వహించారు. ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల పథకాల ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి, ఈఈ బండ విష్ణుప్రసాద్ ఆధ్వర్యంలో వెట్‌రన్ జరిగింది. డెలివరీ సిస్టర్న్ నుంచి బయటికి దుంకిన జలాలు ఎల్లంపల్లి అప్రోచ్ కెనాల్ ద్వారా డ్రాప్‌పాయింట్ వద్ద ఎల్లంపల్లి జలాశయంలోకి చేరాయి.



కాళేశ్వరం ప్యాకేజీ 8లో భాగంగా రామడుగు వద్ద ఏర్పాటుచేసిన బాహుబలి మోటర్లు



ఎత్తిపోతలకు సిద్ధంగా ఉన్న పంపింగ్ స్టేషన్


తెలంగాణ ప్రభుత్వం
**పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ**
**ప్రాంతీయ అధికారి కార్యాలయం, PR ప్రాంతీయ కార్యాలయం, ఆదిలాబాద్**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**
**NIT No. 55 & 56 RO/2019-20** **తేది: 1-8-2019**
ఆదిలాబాద్ రీజియన్‌లో వివిధ గ్రాంట్ల క్రింద దిగువ పనుల కోసం టెండర్లు కోరబడుచున్నవి. **పని పేరు & సుమారు అంచనా వ్యయం:** 1) నిర్మల్ జిల్లా ఖానాపూర్ (గ్రామం & మండలం) వద్ద మదర్సా-ఇ-దారుల్-ఉలుం సిద్ధిఖియా వద్ద ప్రహరీగోడ, కిచెన్ షెడ్ మరియు బాత్ రూం నిర్మాణం-రూ. 15.00 లక్షలు 2) ఆదిలాబాద్ జిల్లా, మావల మండలం, బత్తీస్ వర్గావ్ (గ్రా) వద్ద వన్ స్టాప్ (సఖి) సెంటర్ నిర్మాణం-రూ. 48.00 లక్షలు. గ్రాంట్ : 1) వక్ఫ్ సంస్థలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ & ఆర్థిక సహాయం 2) WCD & SC శాఖ. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో టెండరు డాక్యుమెంట్లు 8-8-2019 నుండి 16-8-2019 మధ్య లభిస్తాయి. తదుపరి వివరాలను **www.tender.telangana.gov.in**పై ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నుండి పొందవచ్చును.
DIPR RO No. 822-DP/CL/Advt/1/2019-20, Dt: 06/08/2019 సం/- ప్రాంతీయ అధికారి (PR) ప్రాంతీయ కార్యాలయం, ఆదిలాబాద్



**తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్**
(తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ)
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన-20**
10 పనుల కొరకు టెండరు నం.లు T120 to T129/2019-20, తేది: 03.08.2019 కొరకు సివిల్ పనులకు టెండర్లు కోరబడుతున్నవి. వరుసగా "టెండరు నం.లు జిల్లాలో గల పని & మొత్తం ECV (రూ. లక్షలలో)" దిగువ విధంగా ఉన్నవి: T120- సిద్దిపేట-1-13.14; T121-సంగారెడ్డి-1-12.85; T122-వరంగల్-1-18.21; T123-రాజన్న సిరిసిల్ల-1-6.62; T24-జగిత్యాల-1-5.17; T125-జయశంకర్ భూపాలపల్లి-1-8.20; T126-మెదక్-1-15.11; T127-జనగాం-1-5.23; T128- మంచిర్యాల & నిర్మల్-1-1.15; T129- పెద్దపల్లి-1-6.97; **ఆన్‌లైన్‌లో షెడ్యూల్ లభ్యత:** 06.08.2019 నుండి. **టెండరు నం.లు** T120, T121, T122, T123, T124, T125, T126, T127, T128 & T129 **కొరకు బిడ్లు దాఖలుకు చివరి తేదీ/సమయం:** తేది. 13.08.19/సా. 5.00 గం||. తదుపరి వివరాలను వెబ్‌సైట్ @www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO. No. 291-PP/CL/Advt/1/2019-20, Dt: 06/08/2019



తెలంగాణ ప్రభుత్వం
**రోడ్లు మరియు భవనాల శాఖ (NH విభాగం)**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటనకు సవరణ**
**NIT No. SE(R&B) NH/HYD/13/2019-20** **తేది: 16-07-2019**
**NIT ప్రకారం :** టెండరుదార్లు టెండరు డాక్యుమెంట్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా **www.tender.telangana.gov.in** నుండి 22-07-2019న మ. 3.00 గం.నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
**చదువుకోవలసినది:** టెండరుదార్లు టెండరు డాక్యుమెంట్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా **www.tender.telangana.gov.in** నుండి 8-8-2019న మ. 3.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, (R&B), NH సర్కిల్, హైదరాబాద్
DIPR RO No. 293-PP/CL/Advt/1/2019-20, Dt: 06/08/2019



**రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ**
**భారత ప్రభుత్వం**
**ప్రకటన**
న్యూ ఢిల్లీ, 11 జూలై, 2019
**S.O.2487 (E):-** జాతీయ రహదారుల చట్టం, 1956 (48 ఆఫ్ 1956)లోని సెక్షన్ 3Aలో సబ్-సెక్షన్ (1) (ఇకమీదట సదరు చట్టంగా నిర్దేశించబడును) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, **తెలంగాణ** రాష్ట్రంలోని **నల్గొండ** జిల్లాలో కి.మీ. 113.9 నుండి కి.మీ. 113.1 (రెవెన్యూ డివిజినల్ ఆఫీస్, దేవరకొండ) వరకు భూమి స్ట్రెచ్‌లో **NH-167** నిర్మాణం (వెడల్పుచేయుట/పేవ్డ్ షోల్డర్‌తో రెండు లేన్లు/నాలుగు లేనిగ్ మొ||) నిర్వహణ, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కోసం దిగువ షెడ్యూలులో ఇవ్వబడిన సంక్షిప్త వివరణగల భూమి ప్రజోపయోగార్థం కావలసివున్నదని, కేంద్ర ప్రభుత్వం సంతృప్తి చెందిన తర్వాత సదరు భూసేకరణకు తన ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది.
సదరు భూమిలో ప్రయోజనం గల ఏ వ్యక్తి అయినా అధికారిక గెజెట్‌లో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఇరవై ఒక్క రోజులలోగా సదరు చట్టంలోని సెక్షన్ 3C లోని సబ్ సెక్షన్ (1) క్రింద, పైన తెలిపిన అవసరార్థం సదరు భూమి ఉపయోగానికి ఆక్షేపణ తెలియజేయవచ్చును. అట్టి ప్రతి ఆక్షేపణ సమర్థప్రాధికారికి అంటే రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్, దేవరకొండవారికి వ్రాతపూర్వకముగా తగిన కారణాలతో తెలియజేయవలెను మరియు ఆక్షేపణదారుకు స్వయంగా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా విచారణ జరిపేందుకు సమర్థప్రాధికారి అవకాశం కల్పిస్తారు మరియు ఏవేని అట్టి ఆక్షేపణలన్నీ విచారించిన తర్వాత మరియు సమర్థప్రాధికారి అవసరమని భావిస్తే తదుపరి విచారణ జరిపిన తర్వాత ఆక్షేపణలను అనుమతిస్తూ లేదా అనుమతించకుండా ఉత్తర్వు జారీచేస్తారు.
సదరు చట్టంలోని సెక్షన్ 3Cలోని సబ్ సెక్షన్ (2) క్రింద సమర్థప్రాధికారి చేసే ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది. వారి ప్రకటన క్రింద సేకరించబడవలసిన భూమి ప్లాన్లు మరియు భూమి ఇతర వివరాలు పైన తెలిపిన సమర్థప్రాధికారి కార్యాలయంలో లభిస్తాయి మరియు ఆసక్తిగల వ్యక్తులు తనిఖీ చేసుకోవచ్చును.
**షెడ్యూలు**
తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో **NH-167** (రెవెన్యూ డివిజినల్ ఆఫీస్, దేవరకొండ) నుండి భూమి స్ట్రెచ్‌లో **NH-167**లో ఉన్న కట్టడాలతో లేదా కట్టడాలు లేకుండా సేకరించబడనున్న భూమి సంక్షిప్త వివరణ.
**రాష్ట్రం: తెలంగాణ** **జిల్లా: నల్గొండ**

| క్ర. సం. | సర్వే/ప్లాట్ నంబర్ | భూమి రకం | భూమి స్వభావం | విస్తీర్ణం (స్థానిక యూనిట్‌లో) (చ.మీ.) | విస్తీర్ణం (హెక్టార్లలో) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| **తాలూకా: పెద్ద ఆదిశెర్ల పల్లె గ్రామం: ఘన్‌పూర్** | | | | | |
| 1. | 445 | ప్రైవేట్ (పట్టా) | వ్యవసాయ (మెట్ట) | 2,833.0000000 | 0.2833000 |
| **గ్రామం: పెద్ద ఆదిశెర్ల పల్లె** | | | | | |
| 1. | 249 | ప్రైవేట్ (పట్టా) | వ్యవసాయ (మెట్ట) | 2,428.3000000 | 0.2428300 |
| 2. | 250 | ప్రైవేట్ (పట్టా) | వ్యవసాయ (మెట్ట) | 2,529.4800000 | 0.2529480 |
| 3. | 252 | ప్రైవేట్ (పట్టా) | వ్యవసాయ (మెట్ట) | 2,225.9400000 | 0.2225940 |
| 4. | 253 | ప్రైవేట్ (పట్టా) | వ్యవసాయ (మెట్ట) | 1,618.8700000 | 0.1618870 |
| | | | **మొత్తం** | 11,635.5900 | 1.1636 |

**[F.No.NH-167-TS-2017-18-43/3A]**
రాజేష్ గుప్తా, డిప్యూటీ సెక్రటరీ


# ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

- నేడు జూరాలకు మూడు లక్షల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో
- శ్రీశైలంకు భారీగా ఇన్‌ఫ్లో.. తుంగభద్రకు మొదలైన వరద

జలాభిషేకం

**హైదరాబాద్/మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ:** కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. గంట గంటకూ ఎగువ నుంచి వరద ప్రవాహం పెరుగుతున్నది. ఎగువ నుంచి భారీగా వరదలు వస్తుండటంతో మంగళవారం ఆల్మట్టికి భారీ ఎత్తున క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. మంగళవారం రాత్రి వరకు వరకు 2.79 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఆల్మట్టి నుంచి దిగువకు దాదాపు నాలుగు లక్షల క్యూసెక్కులను విడుదలచేస్తున్నారు. దీంతో నారాయణపుర జలాశయానికి 3.93 లక్షల క్యూసెక్కులు వస్తున్నాయి. మంగళవారం నారాయణపుర డ్యాం నుంచి అన్ని గేట్లు ఎత్తి దిగువకు 3.82 లక్షల క్యూసెక్కులు విడిచిపెట్టారు. జూరాల ప్రాజెక్టుకు 2.78 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. జూరాల నుంచి ఔట్ ఫ్లో 3.11 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. జూరాల ప్రాజెక్టు అన్ని గేట్లు ఎత్తి, మూడు లక్షల క్యూసెక్కుల మేర జలాలను విడుదల చేయడంతో శ్రీశైలం జలాశయానికి వరదపోటు మొదలైంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 137.26 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. శ్రీశైలం పవర్‌హౌస్‌లోని కుడి ఎడమల ప్లాంట్ల నుంచి నిరంతరంగా విద్యుదుత్పత్తిచేస్తున్నారు. తెలంగాణ వైపు ఉన్న విద్యుత్ ప్లాంట్‌లోని ఆరు యూనిట్లలో 900 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుండగా.. ఏపీ వైపు ఉన్న ప్లాంట్ నుంచి కూడా మంగళవారం విద్యుదుత్పత్తి ప్రారంభించారు. వరదను బట్టి దిగువకు నీటి విడుదలను పెంచాలని కేంద్ర జలసంఘం అధికారులు ఆదేశాలిచ్చారు. మరోవైపు శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు కృష్ణాజలాలు ఉరకలెత్తాయి. మంగళవారం రాత్రి 10 గంటల వరకు 74,286 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రానున్న రెండురోజుల్లో లక్ష క్యూసెక్కులకు పైగా వరద రానున్నట్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో 509 అడుగుల మేర నీటిమట్టం ఉన్నది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు సాగర్‌లో 2.66 టీఎంసీల నీరు వచ్చిచేరింది. వరద ఇలాగే కొనసాగితే.. నాలుగైదు రోజుల్లో శ్రీశైలం జలాశయం అన్ని గేట్లను ఎత్తే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు.

**తుంగభద్రకు పెరిగిన వరద**

తుంగభద్రకు ఎగువ నుంచి వరద పెరిగింది. కర్ణాటక ఇరిగేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తుంగడ్యాం నుంచి ఇప్పటికే 70,080 క్యూసెక్కులు వదలడంతో.. బుధవారం మధ్యాహ్నానికి హోస్పేట చేరే అవకాశం ఉన్నది. ప్రస్తుతం తుంగభద్రలో 37.78 టీఎంసీల నీరు నిల్వఉండగా.. 30,967 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. తాగునీటికి 1,138 క్యూసెక్కులను కాల్వలకు విడుదలచేస్తున్నారు.



ఎగువ నుంచి భారీగా వరదనీరు చేరడంతో కళకళలాడుతున్న శ్రీశైలం జలాశయం

**వివిధ ప్రాజెక్టులలో మంగళవారం నీటి మట్టాల వివరాలు...**

| రిజర్వాయర్ | ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1698.33 | 129.72 | 96.51 | 2,79,332 | 4,00,000 |
| నారాయణపుర | 1615.00 | 1606.92 | 37.64 | 21.89 | 3,60,000 | 3,93,800 |
| జూరాల | 1045.00 | 1044.23 | 9.66 | 8.241 | 2,78,000 | 3,11,801 |
| తుంగభద్ర | 1633.00 | 1611.29 | 100.86 | 37.78 | 30,967 | 1138 |
| శ్రీశైలం | 885.00 | 868.9 | 215.81 | 137.26 | 3,09,405 | 82,699 |
| నాగార్జునసాగర్ | 590.00 | 509.00 | 312.05 | 129.98 | 74,286 | 810 |
| సింగూరు | 1717.93 | 1670.52 | 29.91 | 0.47 | 20 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.28 | 17.80 | 0.13 | 41 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1054.80 | 90.31 | 9.14 | 6850 | 266 |
| లోయర్‌మానేర్ | 920.00 | 881.55 | 24.07 | 3.44 | 204 | |
| మిడ్ మానేరు | 1043.31 | 993.08 | 25.873 | 3.44 | 83 | |
| కడెం | 700.00 | 695.08 | 7.60 | 6.38 | 3051 | 7954 |
| ఎల్లంపల్లి | 485.56 | 484.97 | 20.18 | 19.61 | 25502 | 33224 |

# అక్కడ ఆరు వేలు.. ఇక్కడ ఆరు లక్షలు..

- గోదావరిలో విచిత్రమైన పరిస్థితి
- పేరూరు మీదుగా పది లక్షలకు పైగా క్యూసెక్కుల ప్రవాహం
- గోదావరి బేసిన్‌లో అలుగుపోస్తున్న 1,834 చెరువులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దశాబ్దాలుగా ఎక్కువ కాలం కనిపిస్తున్న దృశ్యమే గోదావరిలో మరోసారి కనిపిస్తున్నది. ప్రధాన గోదావరి నుంచి శ్రీరాంసాగర్ జలాశయానికి నామమాత్రపు వరద వస్తుండగా.. దిగువన మేడిగడ్డ మీదుగా లక్షల క్యూసెక్కుల జలాలు ప్రవహిస్తున్నాయి. ఎస్సారెస్పీకి ఆరువేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే.. మేడిగడ్డ వద్ద మాత్రం ఆరు లక్షల క్యూసెక్కులకు పైగా ప్రవాహాన్ని మోసుకుపోతున్నది. శ్రీరాంసాగర్‌లోకి మంగళవారం సాయంత్రం వరకు వచ్చిన జలాలు కేవలం 3.24 టీఎంసీలు మాత్రమే. మంగళవారం సాయంత్రం ఆరుగంటల సమయానికి కడెం రిజర్వాయర్‌కు 3 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అవుట్‌ఫ్లో 7,954 క్యూసెక్కులుగా నమోదైంది. ఎల్లంపల్లి జలాశయం ప్రస్తుతం నిండుకుండలా మారింది. 20.18 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యానికిగాను 19.61 టీఎంసీల నిల్వ ఉన్నది. ఎగువనుంచి 25,502 క్యూసెక్కుల వరద వస్తున్న దరిమిలా అధికారులు జలాశయంలోని పది గేట్లు ఎత్తి 33,224 కూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నారు.



తాలిపేరు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో విడుదలవుతున్న వరదనీరు

**అలుగు పోస్తున్న చెరువులు**

గోదావరి బేసిన్‌లో 20,156 చెరువులకుగాను 1834 చెరువులు అలుగుపోస్తున్నాయి. కృష్ణా బేసిన్‌లో 72 చెరువులు అలుగుపోస్తున్నాయి.

**అన్నారం బరాజ్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో**

**కాళేశ్వరం:** కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బరాజ్‌కు ఇన్‌ఫ్లో తగ్గుతున్నది. మంగళవారం బరాజ్‌కు 4,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. సుందిల్ల బరాజ్ గేట్లు తెరవడంతో 25 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. దీంతో ఇంజినీర్లు అన్నారం బరాజ్‌లో ఆరు గేట్లు తెరిచి 26 వేల క్యూసెక్కుల నీటిని విడుదలచేశారు. బరాజ్‌లో మొత్తం 11.20 మీటర్లకు గోదావరి నీరు చేరిందని, 7.02 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని ఇంజినీర్లు తెలిపారు. కన్నెపల్లిలో 12 రోజులుగా మోటర్లను బంద్‌చేసి ఉంచారు.

**భద్రాద్రి వద్ద గోదావరి తగ్గుముఖం**

**భద్రాచలం:** భద్రాచలం పట్టణం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు 39.1 అడుగులకు తగ్గింది. ఎగువన భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరికి వరద మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు.

**తాలిపేరుకు వరద తాకిడి**

**చర్ల రూరల్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకి వరద తాకిడి తగిలింది. మంగళవారం సాయంత్రం మొత్తం 8 గేట్ల ద్వారా 23,100 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

# హెచ్‌ఎండీఏ ప్రతిపాదన మేరకే..

- హెరిటేజ్ భవనాల జాబితా తొలిగింపుపై ప్రభుత్వ వివరణ
- రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్‌ఎండీఏ రాసిన లేఖ హైకోర్టుకు అందజేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) ప్రతిపాదన మేరకే హుడా జోనింగ్ రెగ్యులేషన్స్ యాక్ట్‌లోని రెగ్యులేషన్ 13 (హెరిటేజ్ భవనాల జాబితా)ను తొలిగించామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు వివరించింది. హెచ్‌ఎండీఏ కమిషన్ రాసిన లేఖను అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు మంగళవారం హైకోర్టుకు సమర్పించారు. సోమవారం మిర్ అస్గర్‌హుస్సేన్ దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రెగ్యులేషన్ 13ను తొలిగించే అధికారం ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు. దీనిపై ఏఏజీ రామచంద్రరావు మంగళవారం ప్రతివాదన వినిపించారు. రెగ్యులేషన్ 13.. ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ యాక్ట్-1975లోని 59వ సెక్షన్‌కు విరుద్ధంగా ఉన్నందున దాన్ని తొలిగించాల్సిందిగా హెచ్‌ఎండీఏ చేసిన ప్రతిపాదన మేరకే 183 జీవో ద్వారా రెగ్యులేషన్ 13ను తొలిగించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 101 ప్రకారం పాత చట్టాలను యథాతథంగా లేదా సవరణలతో అమలుచేసుకునే అవకాశం తెలంగాణ ప్రభుత్వానికి ఉన్నదని, 101 సెక్షన్‌ను అనువర్తింపజేసే క్రమంలో అవసరంలేని నిబంధనలను తొలిగించాలంటూ హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. ధర్మాసనం జోక్యం చేసుకొని.. హెచ్‌ఎండీఏ రాసిన లేఖలో రెగ్యులేషన్ 13ను తొలిగించాలని పేర్కొనలేదు కదా? అని ప్రశ్నించింది. దీనికి ఏఏజీ స్పందిస్తూ.. హెచ్‌ఎండీఏ లేఖలో ప్రత్యేకంగా పేర్కొనకపోయినప్పటికీ అధికారుల మధ్య చర్చకు సంబంధించిన నోట్‌ఫైల్‌లో రెగ్యులేషన్ 13ను తొలిగించాలని ఉన్నదని పేర్కొన్నారు. ఈ వాదనను ఆలకించిన ధర్మాసనం తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.

# వేగంగా ఎత్తిపోతల పనులు

- అధికారులతో సమీక్షించిన ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎత్తిపోతల పథకాలను వేగంగా పూర్తిచేసేందుకు కృషిచేస్తున్నామని నీటిపారుదల అభివృద్ధి మండలి (ఐడీసీ) చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో అన్నిజిల్లాల ఈఈలు, డీఈలతో ఐడీసీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత 582 ఎత్తిపోతల పథకాలు తెలంగాణ పరిధిలోకి వచ్చాయని చెప్పారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో 130 లిఫ్టులు మరమ్మతు చేయించి 1.25 లక్షల ఎకరాలకు ఐడీసీ ద్వారా సాగునీరు అందించామని వెల్లడించారు. కొత్తగా 31 ఎత్తిపోతలకు డీపీఆర్‌లు సిద్ధంచేసినట్టు తెలిపారు. 125 పాత, 24 కొత్త ఎత్తిపోతల పథకాలు వేగంగా పూర్తిచేస్తున్నామని, 10 లిఫ్టుల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో భూ సేకరణ చట్టాన్ని అమలుచేసే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లామని, నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్టు చెప్పారు. కార్పొరేషన్ పరిధిలో ఎత్తిపోతలు నిర్మించేందుకు గతంలో రెండు, మూడేండ్ల ఒప్పందకాలం ఉండేదని, అయితే ఇప్పుడు ఆ సమయాన్ని కుదించి ఏడాదికే పరిమితం చేశామన్నారు. గతంలో మాదిరిగా కాకుండా అత్యవసరం అయితేనే పనులు నిలిచిపోయినవాటికి కొనసాగింపు ఇస్తున్నామని స్పష్టంచేశారు. నిర్మాణపనుల్లో జాప్యం జరుగకుండా పర్యవేక్షిస్తున్నామని ఈద శంకర్‌రెడ్డి తెలిపారు.



# గూడెంకు హరితతోరణం!

- 500కుపైగా మొక్కలతో పచ్చనిహారం
- కనువిందు చేస్తున్న పూలమొక్కలు

**దండేపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం సత్ఫలితాలను ఇస్తున్నది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం ఎత్తిపోతల పథకం ఆవరణలో మొదటి విడుత హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నేడు చెట్లుగా మారి చల్లదనాన్ని, ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో నాటిన మొక్కలు ఆలయాలు, పవిత్రస్నానాలకు వచ్చే భక్తులకు కనువిందుచేస్తున్నాయి. మొత్తం ఐదెకరాల స్థలంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం ఆవరణలో ఎటుచూసినా పచ్చని వృక్షాలు, అందమైన పూలమొక్కలు, ఆకర్షణీయమైన మొక్కలు దాదాపు 500 వరకు ఉన్నాయి. ఇక్కడ కానుగతోపాటు మర్రి, రావి, తదితర వృక్షాలను పెంచుతున్నారు. ఆవరణలో ఎటుచూసినా గుబురుగా పెరిగిన చెట్లు అడవిని తలపిస్తున్నాయి. నీడనిచ్చే పెద్దపెద్ద చెట్లతోపాటు ఆహ్లాదాన్ని పంచే మొక్కలూ ఉన్నాయి. ఎత్తిపోతల పథకం ఇరువైపులా పెంచిన చెట్లు గూడెం రహదారి వెంట ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**అందమైన పూలమొక్కలు**

హరిత చైతన్యం

గూడెం ఎత్తిపోతల పథకం ఆవరణలో పెంచుతున్న అందమైన పూల మొక్కలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. మల్లె, గులాబీలు, చక్రపూలు, కాగితపు పూలు, నూరు వరహాలు, మందారం, గన్నేరు ఇలా రకరకాల మొక్కలను పెంచుతున్నారు. వీటితోపాటు పెంచుతున్న క్రోటాన్ మొక్కలు చక్కటి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు ముగ్గురు సిబ్బంది ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాటికి నీరు పోస్తూ సంరక్షిస్తున్నారు. ఈ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాటిన వేపమొక్క ఏపుగా పెరుగడం విశేషం.



మంచిర్యాల జిల్లా గూడెం ఎత్తిపోతల పథకం ప్రాంగణంలో ఏపుగా పెరిగిన మొదటి విడుత హరితహారం మొక్కలు



జన్నారం మండలం మహ్మదాబాద్ నర్సరీలో 2015 జూలై 5న సీఎం కేసీఆర్ నాటిన మొక్క (ఫైల్)



జన్నారం మండలం మహ్మదాబాద్ నర్సరీలో ఏపుగా పెరిగిన సీఎం కేసీఆర్ నాటిన వేపమొక్క

# ఇంతై ఇంతింతై..!

- నాలుగేండ్ల క్రితం జన్నారం ఫారెస్ట్, గూడెం ఎత్తిపోతల వద్ద మొక్కలు నాటిన సీఎం కేసీఆర్

**జన్నారం/దండేపల్లి:** ఇంతై ఇంతింతై.. అన్నట్టుగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హరితహారంలో భాగంగా మంచిర్యాల జిల్లాలో నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరుగుతూ ఆకర్షిస్తున్నాయి. జన్నారం డివిజన్ తాళ్లపేట రేంజ్ మహ్మదాబాద్ నర్సరీలో రెండోవిడుత హరితహారంలో భాగంగా సీఎం కేసీఆర్ నాటిన మొక్క ఇప్పుడు ఏపుగా పెరుగుతున్నది. ఇప్పుడు ఆ ప్రాంతం పచ్చదనంతో ఎంతో కళకళలాడుతున్నది. దండేపల్లి మండలం గూడెంశ్రీ సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ 2015 జూలై 5వ తేదీన నాటిన వేపమొక్క నేడు పెరిగి పెద్దదయ్యింది. ఈ వేపమొక్కను కాపాడేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ముగ్గురు సిబ్బందిలో గూడెం గ్రామానికి చెందిన చిరంజీవి అనే వ్యక్తి సీఎం నాటిన మొక్కను సంరక్షించేందుకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండుపూటలా నీరు పోయడంతోపాటు మొక్క చుట్టూ కలుపు పెరుగకుండా చూశారు. పెరిగి పెద్దదవుతున్న వేపమొక్కకు ఆధారంగా కర్రలు పాతుతూ సంరక్షించారు. దీంతో అది నేడు పెరిగి పెద్దదయ్యింది. నాడు సీఎం కేసీఆర్ వెంట వచ్చిన అప్పటి నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, అప్పటి ఎంపీ సుమన్, ఎమ్మెల్యే దివాకర్‌రావు, స్థానిక నాయకులు నాటిన మొక్కలు కూడా నేడు వృక్షాలుగా ఎదగడం విశేషం.

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

/NTDAILYONLINE

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.



# రెవెన్యూ ఉద్యోగికీ తప్పని తిప్పలు

- కొత్త పాస్‌పుస్తకం వచ్చాక కూడా భూ బదలాయింపు
- భూమిని అమ్మేసుకొన్నారంటూ అధికారుల దబాయింపు
- న్యాయం చేయాలని వేడుకొంటున్న కామారెడ్డి జిల్లాకు చెందిన నర్సింహారావు

**ఎల్లారెడ్డిపేట:** రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన సల్వాజి సుందరయ్య పేరిట 4.06 ఎకరాల పట్టా భూమి ఉండేది. 2010 వరకు ఈ భూమి ఆయన పేరిటే ఉన్నది. ఆయనకు ముగ్గురు కొడుకులు (కాంతారావు, సుధాకర్‌రావు, కమలాకర్‌రావు). వీరిలో కాంతారావుకు సంతానం లేదు. ఆయన అనారోగ్యంతో 2001లో చనిపోయాడు. మరో కొడుకు కమలాకర్‌రావు కూడా 2002లో రోడ్డు ప్రమాదంలో మరణించారు. కమలాకర్‌రావుకు ఒక కొడుకు నర్సింహారావు, ముగ్గురు కూతుళ్లు ప్రమీలారాణి, లక్ష్మీప్రసన్న (ఇద్దరికి వివాహం అయ్యింది), సమత ఉన్నారు. ఈ క్రమంలో సుందరయ్యకు చెందిన 4.06 ఎకరాల పట్టాభూమిని 2.03 ఎకరాల చొప్పున 2010 లో ఆయన కొడుకు సుధాకర్‌రావు, మనుమడు నర్సింహారావు తమ పేరిట పట్టా చేయించుకొన్నారు. సర్వే నంబర్లు 1102/1, 1104, 11/5, 498/సీ, 92/7 లోని 2.03 ఎకరాలు నర్సింహారావుకు భాగంగా సంక్రమించింది. అందుకు సంబంధించి పాస్‌పుస్తకాలు కూడా అందాయి. 2018లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా కొత్త పాస్‌పుస్తకాలు కూడా వచ్చాయి. రైతుబంధు కింద పెట్టుబడి సాయం మాత్రం ఆయన ఖాతాలో జమకాలేదు. దీంతో ఆందోళన చెందిన నర్సింహారావు ఎల్లారెడ్డిపేట తాసిల్ వెళ్లి అధికారులను సంప్రదించారు. సర్వేనంబర్ 92/7 లోని తన 26 గుంటల భూమిని అన్‌సైన్ (ఎవరికీ కేటాయించని భూమి) చేసినట్లు చెప్పడంతో కంగుతిన్నాడు. 92/7 సర్వే నంబర్‌లోని 26 గుంటల భూమి వివరాలు తనకు జారీ చేసిన కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకంలో స్పష్టంగా నమోదై ఉన్నది. అయినా తన భూమిని 'ఎందుకు అన్‌సైన్ చేశారో?' చెప్పాలని సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకొన్నాడు. సమాచార హక్కు చట్టం కింద రెవెన్యూ అధికారులు నర్సింహారావుకు వివరణ ఇచ్చారు. 'ఆ భూమిని వెంకటాపూర్‌కే చెందిన అల్లె కమల అనే మహిళ కొనుగోలు చేశారని, అందులో సేద్యం కూడా చేస్తున్నారని, చుట్టుపక్కలవారిని విచారణచేయగా అది నిజమేనని తేలిందనీ, అందువల్ల సదరు 26 గుంటల భూమిని అన్‌సైన్‌చేసినట్లు ఆ వివరణలో పేర్కొన్నట్లు నర్సింహారావు తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం తన వద్దే ఉన్నదని తాను భూమికి ఎవరికీ అమ్మలేదని.. అలాంటప్పుడు భూమిని అమ్మినట్లుగా అధికారులు ఏ ప్రాతిపదికన చెప్తారని ఆవేదన వ్యక్తంచేశారు. స్వయంగా రెవెన్యూశాఖ ఉద్యోగినైన తననే ముప్పుతిప్పలు పెడుతున్నారని, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని నర్సింహారావు వాపోతున్నారు. తన సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



తన పాస్‌బుక్ చూపుతున్న నర్సింహారావు

### భూమి ఎవరిదో నిర్ధారిస్తాం

**నర్సింహారావు** భూమి విషయం ఇటీవలే నాకు తెలిసింది. ఆ భూమిని ఇంకా ఎవ్వరికీ ఆర్వోఆర్ (రికార్డ్స్ ఆఫ్ రైట్స్) చేయలేదు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి, ఆధారాలను తీసుకుని భూమి ఎవరిదనేది నిర్ధారిస్తాం.

శ్రీకాంత్, తాసిల్దార్, ఎల్లారెడ్డిపేట

### రెవెన్యూ ఉద్యోగిగా బాధగా ఉన్నది..

**నేను** నిజామాబాద్ జిల్లాలో జూనియర్ అసిస్టెంట్‌గా, కామారెడ్డి జిల్లా జుక్కల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, ప్రస్తుతం కామారెడ్డి కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులను నిర్వర్తిస్తున్నా. అవినీతి మచ్చలేని ఉద్యోగిగా కలెక్టర్ సత్యనారాయణ చేతులమీదుగా అవార్డును అందుకున్నా. నాకే అన్యాయం జరగడం బాధగా ఉంది. నేనూ రెవెన్యూ సిబ్బంది అక్రమాలకు బాధితుణ్ణి అవుతానని ఎన్నడూ అనుకోలేదు. నాకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నా.

– సల్వాజి నర్సింహారావు,
సీనియర్ అసిస్టెంట్ (కామారెడ్డి)

## వృద్ధురాలితో రెవెన్యూ ఆటలు!

- తన భూమిని వేరొకరికి పట్టాచేశారు
- ఇతరుల భూమిని ఆమె పాస్‌బుక్‌లో ఎక్కించారు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన మంచిర్యాల జిల్లా కాసిపేటకు చెందిన కోట లక్ష్మి



పాత పాస్‌బుక్, కొత్త పాస్‌బుక్‌ను చూపిస్తున్న వృద్ధురాలు కోట లక్ష్మి

**కాసిపేట:** రెవెన్యూ అధికారుల లీలలకు ఇది పరాకాష్ట. వీరుచేసిన ఘనకార్యానికి ఓ వృద్ధురాలు నానా అవస్థలు పడుతున్నారు. ఆమె పేరిట ఉన్న భూమిని మరొకరికి రాసిచ్చి.. వేరొకరి భూమిని ఆమె పేరిట రాసేశారు. ఈ తప్పును సరిదిద్దాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకొనేవారేలేరు. దీంతో విసిగిపోయిన ఆ వృద్ధురాలు ధర్మగంటను ఆశ్రయించారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రానికి చెందిన కోట లక్ష్మికి ఇదే మండలం పెద్దనపల్లి శివారులోని సర్వే నంబర్ 5/344లో 1.30 ఎకరాల పట్టా భూమి ఉన్నది. ఆ భూమిలో సేద్యంచేసుకొని జీవనంసాగిస్తున్నారు. ఆమె 2018లో పహాణిని పరిశీలించగా.. తనకు చెందిన సర్వే నంబర్ 5-344లో తన పేరుకు బదులుగా జాడి రాకేశ్‌కుమార్ పేరు పట్టాదారుడిగా ఉండటం గమనించి.. షాక్ తిన్నారు. వెంటనే ఈ సమస్యను తాసిల్దార్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా, భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో కొత్త పాస్‌బుక్ ఇచ్చిన రెవెన్యూ అధికారులు.. ఆమెకు సర్వే నంబర్ 5/250/1లో 1.30 ఎకరాలు భూమి ఉన్నట్టు నమోదుచేశారు. నిజానికి సదరు సర్వే నంబర్‌లో ఆమెకు సెంటు భూమి కూడా లేదు. అది ఎవరిదో తెలియదు. లక్ష్మికి చెందిన సర్వే నంబర్‌లోని భూమిని ఇతరులకు రాసేసి, వేరొకరి భూమిని ఆమె పేరిట పట్టాచేయడం రెవెన్యూ అధికారులకే చెల్లింది. ఈ తప్పును సరిదిద్దాలంటూ ఆ వృద్ధురాలు చేస్తున్న విన్నపాలు అరణ్యరోదనలుగానే మిగిలిపోతున్నాయి.

## మా మాట!

### రైతుల కష్టాలను తీర్చిన 'ధర్మగంట'



**నమస్తే** తెలంగాణలో 'ధర్మగంట' శీర్షికతో రెవెన్యూ సమస్యలపై వార్తలు ప్రచురితమవుతుండటంతో అధికారుల్లో వణుకు పుట్టింది. సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారు. నాకు రాంపూర్‌లో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో కొత్త పాస్‌పుస్తకం కావాలని తాసిల్దార్ కార్యాలయానికి వెళితే ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం ధర్మగంట పేరుతో వార్తలు వస్తుండటంతో అధికారులు వెంటనే పిలిచిమరి పాస్‌పుస్తకం ఇచ్చారు. రైతులకు ఇప్పుడు ఏదంటే అది తక్షణమే తయారు చేసి ఇస్తున్నరు. గతంలో పంట నష్టపరిహారం కోసం నివేదిక ఇవ్వాలంటే లంచం డిమాండ్ చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి తక్షణమే సమస్యలను పరిష్కరిస్తుండడం పట్ల సంతోషంగా ఉంది.

– చురకంటి బాల్‌రెడ్డి,
రాంపూర్,హుజూరాబాద్ మండలం

### కొత్త రెవెన్యూ చట్టం తీసుకురావాల్సిందే



**సీఎం** కేసీఆర్ కొత్త రెవెన్యూ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రెవెన్యూశాఖలోని పాతపద్ధతులతో భూరికార్డులు తయారుచేయడం వల్ల ఎన్నో లోపాలు ఏర్పడుతున్నాయి. రెవెన్యూ కార్యాలయాల్లో పైసా ఇవ్వనిదే పని జరగడం లేదు. వెంటనే రెవెన్యూశాఖను ప్రక్షాళన చేసి భూ సమస్యలన్నింటినీ ఆన్‌లైన్‌లో పరిష్కరించేలా వీలు కల్పించాలి. కొత్త రెవెన్యూ చట్టం తెచ్చి ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా సీఎం కేసీఆర్ చర్యలు తీసుకోవాలి. కేసీఆర్ కొత్త రెవెన్యూ పాలసీని అన్ని వర్గాలు స్వాగతిస్తాయి.

– మాదం సమ్మయ్యయాదవ్,
కందుగుల, హుజూరాబాద్ మండలం

### రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

**సీఎం** కేసీఆర్ చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమంతో రైతులకు మేలు జరిగింది. అయితే, కొంతమంది రెవెన్యూ అధికారుల లంచగొండితనం, బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం కారణంగా రికార్డుల్లో తప్పులు దొర్లాయి. ఇష్టానుసారంగా రికార్డులు రాశారు. ఒకరి భూములు మరొకరికి రాసి, ఉన్నదానికంటే తక్కువ నమోదుచేసి రైతులను అవస్థపెడుతున్నారు. ఇలాంటి బాగోతాలన్నింటినీ 'నమస్తే తెలంగాణ' దినపత్రిక 'ధర్మగంట' ద్వారా వెలుగులోకి తీసుకొనిరావడం అభినందనీయం. ధర్మగంట చేస్తున్న ప్రయత్నం రెవెన్యూ అధికారుల్లో ఎంతోకొంత కదిలిక తెచ్చిందనడంలో సందేహంలేదు. భూరికార్డులతోపాటు రెవెన్యూ వ్యవస్థను కూడా సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉన్నది. ఈ దిశగా సీఎం కేసీఆర్ ఆలోచించడం అభినందనీయం. రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన విషయంలో ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలబడాలి.

– శ్రీనివాస్‌రావు, హైదరాబాద్

భారత ప్రభుత్వము

## రోడ్డు రవాణా మరియు రహదార్ల మంత్రిత్వ శాఖ

### బహిరంగ ప్రకటన

No.E/423/2018 (NH చట్టం 1956లోని సెక్షన్ 3G(3) క్రింద) తేది:27-07-2019

తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి డివిజన్‌లో ప్రస్తుత కి.మీ. 67 నుంచి కి.మీ. 88 వరకు జాతీయ రహదారి -167 పైన టోల్ ప్లాజాల నిర్మాణం మరియు చిన్న మరియు భారీ వంతెనలు వెడల్పు చేయుట, పటిష్టపరచుట మరియు నిర్మాణం కోసం భారత రాజపత్రం, అసాధారణ పత్రం పార్ట్-II, సెక్షను 3, ఉప -సెక్షను (ii)లో ప్రచురించబడిన ప్రకటన నంబరు S.O. 2338 (E) తేది: 03-07-2019 ప్రకారం జాతీయ రహదార్ల చట్టం, 1956 (48 ఆఫ్ 1956)లోని సెక్షన్ 3D (2) క్రింద దిగువ షెడ్యూల్‌లో తెలిపిన భూములు, కట్టడాలు మరియు చెట్లు మొదలైన వాటితోపాటు ఎటువంటి తాకట్టు రుణభారాలు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించినవి. అట్టి భూములలో ప్రయోజనం గల వ్యక్తులందరూ భూమిలో వారి హక్కులకు సంబంధించిన అసలు డాక్యుమెంట్లు మరియు జిరాక్స్ కాపీలతో స్వయంగా లేదా ఏజెంట్ ద్వారా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా ప్రతీ తహసీల్ కార్యాలయానికి ఎదురుగా దిగువ తెలిపిన తేదీలలో రెవెన్యూ డివిజినల్ కార్యాలయం, కల్వకుర్తి వద్ద గల భూసేకరణ కోసం సమర్థ ప్రాధికారి (CALA) మరియు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, కల్వకుర్తి నాగర్ కర్నూలు జిల్లా వారి సమక్షంలో హాజరు కావలెను మరియు సదరు భూములలో తమ సంబంధిత ప్రయోజనాన్ని తెలియజేయవలసిందిగా కోరబడుచున్నారు.

| క్ర. సం. | జిల్లా పేరు | మండలం పేరు | గ్రామం పేరు | విచారణ ప్రదేశం | తేది మరియు సమయం |
|---|---|---|---|---|---|
| 1 | నాగర్ కర్నూలు | చారకొండ | చారకొండ | తహశీల్ కార్యాలయం చారకొండ | 19-08-2019న ఉ.11.00 గం.లకు |

#### షెడ్యూల్

తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ రహదారి నెం. 167లో కి.మీ. 67 నుండి కి.మీ. 88 వరకు (కల్వకుర్తి-మల్లెపల్లి సెక్షన్) భూమి స్ట్రెచ్‌లోకి వచ్చే కట్టడాలతో లేదా లేకుండా సేకరించవలసిన భూమి సంక్షిప్త వివరణ.

| క్ర. సం. | సర్వే నం. ప్లాట్ నం. | భూమి రకం | భూమి స్వభావం | విస్తీర్ణం చ.మీ.లలో | యజమాని / ప్రయోజనం గల వ్యక్తి పేరు | కట్టడాలు ఏవైన ఉంటే |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| జిల్లా: నాగర్‌కర్నూల్ | | | | మండలం: | చారకొండ | గ్రామం: చారకొండ |
| 1 | 24 | పట్టా | మాగాణి | 1011.70 | కావలి లింగయ్య తండ్రి: వెంకటయ్య | |
| | | | మొత్తం | 1011.70 | | |
| 2 | 25 | పట్టా | మెట్ట | 4755.00 | మాడ్గుల సంపతయ్య తండ్రి రామకిష్టయ్య | |
| 3 | | పట్టా | మెట్ట | 202.34 | మాడ్గుల సత్తయ్య తండ్రి రామకిష్టయ్య | |
| | | | మొత్తం | 4957.34 | | |
| 4 | 35 | పట్టా | మెట్ట | 1517.55 | చింతపల్లి చిన్న మల్లయ్య తండ్రి నర్సింహులు | 4 సెంధి చెట్లు |
| 5 | | పట్టా | మెట్ట | 1517.55 | చింతపల్లి పెద్ద మల్లయ్య తండ్రి నర్సింహులు | 4 సెంధి చెట్లు, 1 తాడి చెట్టు |
| 6 | 35 | పట్టా | మెట్ట | 1517.55 | కుంభం నిర్మలమ్మ భర్త చిన్న రాములు | |
| 7 | | పట్టా | మెట్ట | 1517.55 | వావిళ్ళ మంజుల భర్త రామస్వామి | |
| | | | మొత్తం | 6070.2 | | |
| 8 | 36 | పట్టా | మెట్ట | 505.85 | కుంభం సాయి తండ్రి చిన్న రాములు | 3 తాడి చెట్లు |
| 9 | | పట్టా | మెట్ట | 505.85 | కుంభం నరేష్ తండ్రి చిన్న రాములు | |
| | | | మొత్తం | 1011.7 | | |
| 10 | 38 | ప్రైవేట్ | మెట్ట | 303.51 | నారోజు భారతమ్మ భర్త జంగయ్య | |
| 11 | | ప్రైవేట్ | మెట్ట | 303.51 | నారోజు అఖిలాండమ్మ భర్త లక్ష్మయ్య | |
| 12 | | ప్రైవేట్ | మెట్ట | 303.51 | నారోజు నారాయణ చారి తండ్రి నర్సింహులు | |
| 13 | | ప్రైవేట్ | మెట్ట | 303.51 | నారోజు అనసూయమ్మ భర్త రాములు | |
| | | | మొత్తం | 1214.04 | | |
| 14 | 39 | పట్టా | మాగాణి | 101.17 | గుడిపాటి సుబ్బయ్య తండ్రి నారయ్య | |
| 15 | | పట్టా | మాగాణి | 101.17 | జులూరి శంకరయ్య తండ్రి బాల నారాయణ | |
| 16 | | పట్టా | మాగాణి | 101.17 | జులూరి లింగయ్య తండ్రి బాల నారాయణ | |
| 17 | | పట్టా | మాగాణి | 101.17 | జులూరి సురేష్ తండ్రి బాల నారాయణ | |
| | | | మొత్తం | 404.68 | | |
| 18 | 40 | పట్టా | మాగాణి | 404.68 | బొంతు బొక్కమ్మ భర్త కాశయ్య | |
| 19 | | పట్టా | మాగాణి | 101.17 | చారకొండ నారమ్మ భర్త చిన్న అంజయ్య | |
| 20 | | పట్టా | మాగాణి | 101.17 | చారకొండ అంజమ్మ భర్త కృష్ణయ్య | |
| 21 | | పట్టా | మాగాణి | 101.17 | చారకొండ కొండల్ తండ్రి పెద్ద అంజయ్య | |
| 22 | | పట్టా | మాగాణి | 101.17 | చారకొండ తిరుమలేష్ తండ్రి పెద్ద అంజయ్య | |
| 23 | | పట్టా | మాగాణి | 202.34 | ముదిగొండ రామేశ్వరమ్మ భర్త కాశయ్య | |
| 24 | | పట్టా | మాగాణి | 202.34 | పెద్దాపురం భూలక్ష్మమ్మ భర్త భరీమ్ | |
| 25 | | పట్టా | మాగాణి | 404.68 | పల్లేటి యాదమ్మ భర్త జంగయ్య | |
| 26 | | పట్టా | మాగాణి | 404.68 | జంతుక బాలయ్య తండ్రి నారయ్య | |
| 27 | | పట్టా | మాగాణి | 202.34 | గ్యార అంజయ్య తండ్రి రామయ్య | |
| 28 | | పట్టా | మాగాణి | 202.34 | గ్యార శంకర్ తండ్రి రామయ్య | |
| 29 | | పట్టా | మాగాణి | 404.68 | కొప్పు బాలమ్మ భర్త జంగయ్య | |
| | | | మొత్తం | 2832.76 | | |
| 30 | 41 | పట్టా | మాగాణి | 404.68 | కొప్పు బాలమ్మ భర్త జంగయ్య | |
| 31 | | పట్టా | మాగాణి | 303.51 | కొౖట పెద్దయ్య తండ్రి సాయన్న | ఖాళీ స్థలం |
| 32 | | పట్టా | మాగాణి | 303.51 | కుంభం అంజయ్య తండ్రి వెంకటయ్య | |
| | | | మొత్తం | 1011.7 | | |
| 33 | 44 | పట్టా | మాగాణి | 304.00 | జల్ల బాలనారాయణ తండ్రి పెద్దయ్య | టిన్ షెడ్ ఇల్లు |
| 34 | | పట్టా | మాగాణి | 354.00 | సందూరి చిట్టెమ్మ తండ్రి వెంకట్రాములు | RCC ఇల్లు |
| 35 | | పట్టా | మాగాణి | 354.00 | ఆఫీస్ గెల్వయ్య తండ్రి రామచంద్రం | RCC ఇల్లు |
| 36 | | పట్టా | మాగాణి | 354.00 | రాచమళ్ళ చంద్రశేఖర్ తండ్రి లక్ష్మినారాయణ | RCC ఇల్లు |
| 37 | | పట్టా | మాగాణి | 354.00 | పాలకూర్ల వెంకటమ్మ భర్త శ్రీనయ్య | ఉడెన్ రూఫ్ ఇల్లు |
| | | | మొత్తం | 1720.00 | | |
| 38 | 46 | పట్టా | మాగాణి | 556.4 | నల్ల ముత్యాలు తండ్రి లక్ష్మయ్య | RCC ఇల్లు |
| 39 | | పట్టా | మాగాణి | 556.4 | నల్ల రాములమ్మ తండ్రి లక్ష్మయ్య | RCC ఇల్లు |
| 40 | | పట్టా | మాగాణి | 556.4 | గ్యారర అంతయ్య తండ్రి ముత్తయ్య | RCC ఇల్లు |
| 41 | | పట్టా | మాగాణి | 556.4 | కొౖట కృష్ణమ్మ భర్త రామయ్య | ప్లాట్ |
| 42 | | పట్టా | మాగాణి | 607.2 | గ్యార సాయిలు తండ్రి ముత్తయ్య | |
| | | | మొత్తం | 2832.8 | | |
| 43 | 47 | పట్టా | మాగాణి | 303.51 | కనక గిరిజమ్మ భర్త వెంకటయ్య | RCC ఇల్లు |
| 44 | | పట్టా | మాగాణి | 303.51 | మునగుల లోకేష్ తండ్రి పాండయ్య | ప్లాట్ |
| 45 | | పట్టా | మాగాణి | 303.51 | సమరయ్య తండ్రి అంజయ్య | ప్లాట్ |
| 46 | | పట్టా | మాగాణి | 303.51 | సుందరయ్య తండ్రి అంజయ్య | ప్లాట్ |
| 47 | | పట్టా | మాగాణి | 202.34 | గుండె లక్ష్మమ్మ భర్త రాములు | ప్లాట్ |
| 48 | | పట్టా | మాగాణి | 202.34 | బొల్లంపల్లి కృష్ణయ్య తండ్రి రాఘవులు | RCC ఇల్లు |
| 49 | | పట్టా | మాగాణి | 303.51 | కుంభం అంజయ్య తండ్రి వెంకటయ్య | RCC ఇల్లు |
| | | | మొత్తం | 1922.23 | | |
| 50 | 52 | పట్టా | మెట్ట | 202.34 | కుంభం కొండయ్య తండ్రి లక్ష్మయ్య | |
| 51 | | పట్టా | మెట్ట | 101.17 | కుంభం సుమంతమ్మ భర్త కొండయ్య | |
| | | | మొత్తం | 303.51 | | |
| 52 | 53 | పట్టా | మెట్ట | 2124.57 | నారోజు భారతమ్మ భర్త జంగయ్య | |
| 53 | | పట్టా | మెట్ట | 2023.4 | నారోజు అఖిలాండమ్మ భర్త లక్ష్మయ్య | |
| 54 | | పట్టా | మెట్ట | 2023.4 | నారోజు నారాయణ చారి తండ్రి నర్సింహులు | |
| 55 | | పట్టా | మెట్ట | 2023.4 | నారోజు అనసూయమ్మ భర్త రాములు | |
| | | | మొత్తం | 8194.77 | | |
| 56 | 85 | పట్టా | మాగాణి | 101.17 | నెదవునూరి బ్రహ్మం తండ్రి రామచంద్రయ్య | షాప్ |
| 57 | | పట్టా | మాగాణి | 101.17 | ఎరోకలి నారయ్య తండ్రి కనకయ్య | ఉడెన్ రూఫ్ ఇల్లు |
| 58 | | పట్టా | మాగాణి | 101.17 | మందన్ లక్ష్మిబాయి భర్త నారాయణసింగ్ | ఉడెన్ రూఫ్ ఇల్లు |
| 59 | | పట్టా | మాగాణి | 101.17 | గుండె జగదీశ్వరమ్మ తండ్రి నారయ్య | ఉడెన్ రూఫ్ ఇల్లు |
| 60 | | పట్టా | మాగాణి | 101.17 | కాటమ్ చంద్రయ్య తండ్రి జంగయ్య | ఉడెన్ రూఫ్ ఇల్లు |
| 61 | | పట్టా | మాగాణి | 101.17 | నెదవునూరి గోపాల్ తండ్రి కృష్ణయ్య | కూలగొట్టిన ఇల్లు |
| 62 | | పట్టా | మాగాణి | 101.17 | కందికంటి భారతమ్మ భర్త కృష్ణయ్య | ఉడెన్ రూఫ్ ఇల్లు |
| 63 | | పట్టా | మాగాణి | 101.17 | నెదవునూరి నిషాంత్ కుమార్ తండ్రి కృష్ణయ్య | కూలగొట్టిన ఇల్లు |
| 64 | | పట్టా | మాగాణి | 101.17 | కందికంటి శివకుమార్ తండ్రి కృష్ణయ్య | ఖాళీ స్థలము |
| 65 | | పట్టా | మాగాణి | 101.17 | మందెళ్ళ శివలింగం తండ్రి పర్వతాలు | RCC ఇల్లు |
| 66 | | పట్టా | మాగాణి | 101.17 | గుండె సత్తయ్య తండ్రి పర్వతాలు | RCC ఇల్లు |
| 67 | | పట్టా | మాగాణి | 101.17 | గుండె అంజయ్య తండ్రి పర్వతాలు | RCC ఇల్లు |
| 68 | | పట్టా | మాగాణి | 101.17 | గుండె కృష్ణయ్య తండ్రి పర్వతాలు | RCC ఇల్లు |
| 69 | | పట్టా | మాగాణి | 101.17 | కాసోజు శంకరచారి తండ్రి కృష్ణయ్య | కూలగొట్టిన ఇల్లు |
| 70 | | పట్టా | మాగాణి | 101.17 | కాసోజు లక్ష్మాచారి తండ్రి కృష్ణయ్య | షాప్ మరియు ఇల్లు |
| 71 | | పట్టా | మాగాణి | 101.17 | కాసోజు భూపతిచారి తండ్రి కృష్ణయ్య | కూలగొట్టిన ఇల్లు |
| 72 | | పట్టా | మాగాణి | 101.17 | కాసోజు రవి తండ్రి కృష్ణయ్య | కూలగొట్టిన ఇల్లు |
| 73 | | పట్టా | మాగాణి | 101.17 | వీరమళ్ళ కరుణాకర్ తండ్రి నర్సింహ్మ | RCC ఇల్లు |
| 74 | | పట్టా | మాగాణి | 101.17 | గుండె బాలయ్య తండ్రి నారయ్య | RCC ఇల్లు |
| 75 | | పట్టా | మాగాణి | 101.17 | గుండె శిరీష భర్త అంజయ్య | ఖాళీ స్థలము |
| 76 | | పట్టా | మాగాణి | 101.17 | గుండె రామస్వామి తండ్రి నారయ్య | RCC ఇల్లు |
| 77 | | పట్టా | మాగాణి | 101.17 | సిమర్ల అశోక్ తండ్రి రాంరెడ్డి | ఉడెన్ రూఫ్ ఇల్లు |
| 78 | | పట్టా | మాగాణి | 101.17 | సిమర్ల పర్వత్ రెడ్డి తండ్రి రాంరెడ్డి | ఉడెన్ రూఫ్ ఇల్లు |
| 79 | | పట్టా | మాగాణి | 101.17 | సిమర్ల శ్రీనివాస్ రెడ్డి తండ్రి రాంరెడ్డి | ఉడెన్ రూఫ్ ఇల్లు |
| | | | మొత్తం | 2428.08 | | |
| 80 | 760 | ప్రభుత్వ | మెట్ట | 2023.00 | కగుల బళ్ళయ్య తండ్రి దుర్గయ్య | |
| | | | మొత్తం | 2023.00 | | |
| 81 | 762 | పట్టా | మెట్ట | 1821.00 | బిట్ల కాంతమ్మ భర్త నారాయణ రెడ్డి | |
| | | | మొత్తం | 1821.00 | | |
| 82 | 763 | పట్టా | మెట్ట | 3949.65 | బిట్ల కాంతమ్మ భర్త నారాయణ రెడ్డి | |
| 83 | | పట్టా | మెట్ట | 385.00 | నూనె సైదమ్మ భర్త లక్ష్మయ్య | RCC ఇల్లు |
| 84 | | పట్టా | మెట్ట | 218.00 | నూనె విష్ణు తండ్రి పెద్దయ్య | RCC ఇల్లు |
| | | | మొత్తం | 4552.65 | | |
| 85 | 764 | పట్టా | మెట్ట | 1517.55 | బిట్ల నారాయణ రెడ్డి తండ్రి దుర్గారెడ్డి | |
| | | | మొత్తం | 1517.55 | | |
| 86 | 765 | పట్టా | మెట్ట | 2074.00 | బిట్ల విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి రాంరెడ్డి | |
| 87 | | పట్టా | మెట్ట | 2074.00 | బిట్ల వెంకట్ రెడ్డి తండ్రి దుర్గారెడ్డి | |
| | | | మొత్తం | 4148.00 | | |
| 88 | 772 | పట్టా | మాగాణి | 1214.00 | ఇల బుచ్చయ్య తండ్రి నర్సింహ | |
| | | | మొత్తం | 1214.00 | | |
| 89 | 773 | పట్టా | మాగాణి | 101.17 | జంతుక శ్రీను తండ్రి లింగయ్య | |
| 90 | | పట్టా | మాగాణి | 101.17 | జంతుక కొండల్ తండ్రి లింగయ్య | |
| | | | మొత్తం | 202.34 | | |
| 91 | 778 | ప్రభుత్వ | మెట్ట | 1214.00 | ప్రభుత్వ భూమి | |
| | | | మొత్తం | 1214.00 | | |
| | | | పూర్తి మొత్తం | 52608.09 | | |

రెవిన్యూ డివిజినల్ ఆఫీసర్
కల్వకుర్తి, నాగర్ కర్నూలు జిల్లా

**పీకేఎల్‌లో నేడు**
యూపీ X తలైవాస్ -7.30గం.
పాట్నా X హర్యానా -8.30గం.
స్టార్ స్పోర్ట్స్‌లో

## పీవోకేనూ సెట్ చేస్తాం..

### అఫ్రిదికి గంభీర్ కౌంటర్



**న్యూఢిల్లీ:** సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే టీమ్ఇండియా మాజీ ఓపెనర్, ప్రస్తుత బీజేపీ ఎంపీ గౌతమ్ గంభీర్‌కు.. పాకిస్థాన్ మాజీ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిదికి మధ్య మరోసారి మాటల యుద్ధం జరిగింది. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన జమ్ముకశ్మీర్ 370వ ఆర్టికల్ రద్దుపై అఫ్రిది అసంబద్ధ వ్యాఖ్యలు చేయడంతో ఆగ్రహించిన గౌతీ అతడికి గట్టి కౌంటర్ ఇచ్చాడు. 'ఐక్యరాజ్య సమితి (ఐరాస) తీర్మానం ప్రకారం కశ్మీర్ ప్రజలకు ప్రాథమిక హక్కులు కల్పించాలి. ఐరాస అసలేం చేస్తున్నది నిద్రపోతున్నదా? కశ్మీర్‌లో నేరాలు జరుగుతున్న విషయాన్ని గుర్తించాలి. అది మానవత్వానికే ముప్పు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై జోక్యం చేసుకోని మధ్యవర్తిత్వం జరపాలి' అని అఫ్రిది ట్విట్టర్ వేదికగా భారత్‌పై అక్కసు వెల్లగక్కాడు. దీనిపై గంభీర్ స్పందిస్తూ.. 'ఈ విషయాన్ని వెల్లడించినందుకు అఫ్రిదిని అభినందించాలి 'మానవ హక్కుల హననం', 'ప్రేరేపిత హింస' వంటి పెద్ద పెద్ద పదాలు వాడుతున్న అఫ్రిది ఒక చిన్న విషయాన్ని మర్చిపోయాడు. ఇవన్నీ జరుగుతున్నది పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లోనే కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అతి త్వరలోనే అక్కడి పరిస్థితులను కూడా సరి చేస్తాం. కుమారా..' అని ట్విట్టర్‌లో బదులిచ్చాడు. జమ్ము కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే 370వ ఆర్టికల్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి.. రాష్ర్టాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన విషయం తెలిసిందే.

## రాహుల్ ద్రవిడ్‌కు నోటీసులు



**న్యూఢిల్లీ :** పరస్పర విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని టీమ్ఇండియా మాజీ కెప్టెన్, జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) ప్రస్తుత డైరెక్టర్ రాహుల్ ద్రవిడ్‌కు బీసీసీఐ ఎథిక్స్ అధికారి నోటీసులు జారీ చేశారు. మధ్యప్రదేశ్ క్రికెట్ సంఘం శాశ్వత సభ్యుడు సంజీవ్ గుప్తా.. ఫిర్యాదు చేయడంతో ద్రవిడ్‌కు బీసీసీఐ అంబుడ్స్‌మన్, ఎథిక్స్ ఆఫీసర్ జస్టిస్ డీకే జైన్ నోటీసులు పంపారు. ఎన్‌సీఏ డైరెక్టర్‌గా ఉంటూ అదే విధంగా ఐపీఎల్లో చెన్నై సూపర్‌కింగ్స్ యాజమాన్యమైన ఇండియా సిమెంట్స్ గ్రూప్‌లో ద్రవిడ్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నాడని గుప్తా ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇది పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకు వస్తుందని తెలిపాడు. దీంతో ఈ విషయంపై రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ద్రవిడ్‌కు నోటీసులు పంపామని, అతడి వాదన ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని జస్టిస్ జైన్ తెలిపారు.

## తొమ్మిదో ర్యాంక్‌లో సాత్విక్ జోడీ



**న్యూఢిల్లీ:** థాయ్‌లాండ్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ దక్కించుకుని చరిత్ర సృష్టించిన భారత యువ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి, చిరాగ్ శెట్టి తాజా ప్రపంచ బ్యాడ్మింటన్(బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో సత్తాచాటారు. మంగళవారం విడుదలైన ర్యాంకింగ్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ డబుల్స్‌లో ఏడు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని తొమ్మిదో ర్యాంక్‌కు చేరుకుంది. గత ఆదివారం జరిగిన థాయ్‌లాండ్ ఓపెన్ డబుల్స్ టైటిల్ గెలవడం ద్వారా సాత్విక్, చిరాగ్ జంట ర్యాంకింగ్స్‌ను మెరుగుపరుచుకుంది. మను అత్రి, సుమిత్ రెడ్డి ద్వయం 25వ ర్యాంక్‌లో నిలిచింది. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో పెద్ద మార్పులేమి చోటు చేసుకోలేదు. కిడాంబి శ్రీకాంత్(10), సమీర్‌వర్మ(13), సాయి ప్రణీత్(19), ప్రణయ్(31), సౌరవ్ వర్మ (44) ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, సైనా నెహ్వాల్ వరుసగా ఐదు, ఎనిమిది ర్యాంక్‌ల్లో ఉన్నారు. మహిళల డబుల్స్‌లో రాష్ట్ర యువ షట్లర్ సిక్కిరెడ్డి, అశ్విని పొనప్ప ద్వయం 23వ ర్యాంక్‌లో ఉంది.

## రవిశాస్త్రికే మొగ్గు!



**న్యూఢిల్లీ:** భారత్ చీఫ్ కోచ్‌గా రవిశాస్త్రిని తిరిగి కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నట్లు తెలుస్తున్నది. దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ) సభ్యుడు ఒకరు మీడియాతో మాట్లాడుతూ శాస్త్రి కోచింగ్‌లో ప్రస్తుతం టీమ్ఇండియా మెరుగ్గా రాణిస్తున్నదని, అలాంటప్పుడు వేరే వారి గురించి ఆలోచించడం తగదని అన్నట్లు సమాచారం. 'జట్టు కోసం విదేశీ కోచ్‌ను తీసుకురావాల్సిన అవసరం లేదు. అవును గ్యారీ కిర్‌స్టెన్ లాంటి వాళ్లు దరఖాస్తు చేసుకున్నా..భారతీయునికే ప్రథమ ప్రాధాన్యం. శాస్త్రి కోచింగ్‌లో టీమ్ఇండియా నిలకడగా రాణిస్తున్నది..కావున ఇప్పటికిప్పుడు మార్పు ఎందుకు? అందుకే శాస్త్రికి తిరిగి కాంట్రాక్టు పునరుద్ధరిస్తే బాగుంటుంది' అని సీఏసీ సభ్యుడొకరు అన్నారు. ఇదిలా ఉంటే సీవోఏ చీఫ్ వినోద్ రాయ్ ఇప్పటికే కోచ్ ఎంపిక విషయంలో పూర్తి క్లారిటీ ఇచ్చారు. సీఏసీ తీసుకునే నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి ప్రధాన కోచ్ ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. కోచ్ ఎంపికకు బోర్డు నుంచి ఇంకా తేదీలు ఖరారు కానప్పటికీ త్వరలోనే అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూలు చేసే అవకాశం కనిపిస్తున్నది.

**బౌలింగ్ కోచ్‌కు జోషి దరఖాస్తు**

భారత బౌలింగ్ కోచ్ పదవికి మాజీ క్రికెటర్ సునీల్ జోషి దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పటివరకు స్పిన్ బౌలింగ్‌కు ప్రత్యేక కోచ్ ఎవరు లేరని, కానీ జట్టుకు అవసరముందని జోషి అన్నాడు. 'అవును నేను కోచ్ పదవి కోసం దరఖాస్తు చేసుకున్నాను. బంగ్లాదేశ్‌తో రెండున్నర ఏండ్లు కోచ్‌గా పూర్తి చేసుకున్న నేను మరో సవాలుకు సిద్ధంగా ఉన్నాను. ప్రస్తుతం జట్టుకు స్పిన్ బౌలింగ్ కోచ్ లేనప్పటికీ నా అనుభవం ఉపయోగపడుతుందనుకుంటున్నా. అది నేనైనా ఎవరైనా ఫర్వాలేదు' అని జోషి అన్నాడు.

## స్మిత్ ప్రదర్శన అత్యుత్తమం : లాంగర్



**బర్మింగ్‌హామ్ :** ఇంగ్లండ్ గడ్డపై జరిగిన యాషెస్ సిరీస్ తొలి టెస్టులో ఆసీస్ మాజీ సారథి స్టీవ్ స్మిత్ రెండు అద్భుత శతకాలు సాధించిన సంగతి తెలిసిందే. బాల్ ట్యాంపరింగ్ ఉదంతం అనంతరం ఏడాది నిషేధం తర్వాత అతడు ఆడిన తొలి టెస్టు ఇదే కావడం విశేషం. ఈ నేపథ్యంలో స్మిత్‌ను ఆసీస్ కోచ్ జస్టిన్ లాంగర్ ప్రశంసలతో ముంచెత్తాడు. తొలుత లెగ్ స్పిన్నర్‌గా జట్టులోకి వచ్చిన స్మిత్.. పూర్తిస్థాయి బ్యాట్స్‌మన్‌గా ప్రపంచ అత్యుత్తమ ఆటగాడిగా ఎదిగాడని చెప్పాడు. 'విరాట్ కోహ్లీయే నేను చూసిన అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అని గతంలో చెప్పా. అయితే ఎడ్జ్‌బాస్టన్ ప్రదర్శనతో స్మిత్ మరోస్థాయికి చేరుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో తీవ్రమైన ఒత్తిడి మధ్య అద్భుతంగా ఆడాడు. నైపుణ్యం మాత్రమే కాకుండా అపారమైన ధైర్యం, ఏకాగ్రత, శారీరక, మానసిక దృఢత్వాన్ని స్మిత్ కనబరిచాడు' అని లాంగర్ అన్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు పడగొట్టిన స్పిన్నర్ లియాన్‌ను కూడా ప్రశంసించాడు. బంతిని చక్కగా నియంత్రిస్తూ స్పిన్, బౌన్స్‌తో అద్భుతంగా బౌలింగ్ చేశాడని అన్నాడు. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా సోమవారం ముగిసిన యాషెస్ తొలి టెస్టులో ఆస్ట్రేలియా 251 పరుగుల భారీ తేడాతో గెలుపొంది.. టెస్టు చాంపియన్‌షిప్‌లో పాయింట్ల ఖాతాను తెరిచింది.

### స్మిత్ @ 3

**దుబాయ్:** ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో మూడో ర్యాంక్‌కు ఎగబాకాడు. యాషెస్ సిరీస్ తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీల (144, 142)తో అదరగొట్టిన స్మిత్ 903 పాయింట్లతో భారత బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా(881)ను వెనక్కి నెట్టి మూడో స్థానానికి చేరాడు. బాల్ ట్యాంపరింగ్ ఉదంతంతో ఏడాది పాటు ఆటకు దూరమైన స్మిత్ బరిలో దిగిన తొలి టెస్టులోనే దుమ్మురేపాడు. టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ (922) అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (913) రెండో ర్యాంక్‌లో ఉన్నాడు. పుజారా నాలుగో స్థానానికి చేరాడు.

# మూడోది మనదే

### చివరి టీ20లోనూ వెస్టిండీస్‌పై విజయం
### నిప్పులు చెరిగిన దీపక్ చాహర్.. ఫిఫ్టీలతో మెరిసిన కోహ్లీ, పంత్
### ఇరుజట్ల మధ్య గురువారం తొలి వన్డే










**ఫార్మాట్ ఏదైనా లక్ష్యఛేదనలో వికెట్లు చేతిలో ఉంటే విజయం తథ్యం అనే అంశాన్ని టీమ్ఇండియా మరోమారు రుజువు చేసింది. మూడో టీ20లో ఇదే మంత్రాన్ని జపించిన కోహ్లీ అండ్ కో అలవోక విజయంతో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. వచ్చే ఏడాది జరుగనున్న టీ20 ప్రపంచ కప్ కోసం ఇప్పటి నుంచే సన్నాహకాలు ప్రారంభించామంటున్న టీమ్ మేనేజ్‌మెంట్ తొలి పరీక్షలో పాసైంది. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ వెస్టిండీస్‌ను వారి గడ్డపై ఓడించి వైట్‌వాష్ పూర్తి చేసింది. బౌలింగ్‌లో యువ పేసర్లు దీపక్ చాహర్, సైనీ అదరగొడితే.. బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్ దుమ్మురేపారు.**

**గయానా:** యువ ఆటగాళ్ల సత్తా పరీక్షించాలనుకున్న టీమ్ఇండియాకు సానుకూల ఫలితం వచ్చింది. వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌లో ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గి సిరీస్ చేజిక్కించుకున్న టీమ్ఇండియా చివరిదైన మూడో టీ20లోనూ గెలిచి క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా నిర్ణీత సమయం కంటే గంట ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచిన విరాట్ కోహ్లీ బౌలింగ్ ఎంచుకున్నాడు. యువ పేసర్లు దీపక్ చాహర్ (3/4), నవదీప్ సైనీ (2/34) విజృంభించడంతో.. మొదట బ్యాటింగ్ చేసిన విండీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 146 పరుగులు చేసింది. సీనియర్ ఆలౌరౌండర్ కీరన్ పొలార్డ్ (45 బంతుల్లో 58; 1 ఫోర్, 6 సిక్సర్లు) అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. ఆఖర్లో పావెల్ (20 బంతుల్లో 32 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్సర్లు) ధాటిగా ఆడాడు. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్ 19.1 ఓవర్లలో 3 వికెట్లకు 150 పరుగులు చేసింది. రిషబ్ పంత్ (42 బంతుల్లో 65 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) అంతర్జాతీయ టీ20ల్లో తొలి హాఫ్‌సెంచరీ నమోదు చేసుకోగా.. కోహ్లీ (45 బంతుల్లో 59; 6 ఫోర్లు) చక్కటి ఇన్నింగ్స్‌తో రాణించాడు. ఈ మ్యాచ్‌లో భారత్ మూడు మార్పులతో బరిలో దిగింది. గత రెండు మ్యాచ్‌ల్లో రాణించిన వైస్ కెప్టెన్ రోహిత్ శర్మకు విశ్రాంతినిచ్చి అతడి స్థానంలో లోకేశ్ రాహుల్‌ను తుదిజట్టులోకి తీసుకున్నారు. ఖలీల్ ప్లేస్‌లో దీపక్ చాహర్‌కు చాన్స్ దక్కగా.. అతడి సోదరుడు రాహుల్ చాహర్ ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేశాడు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు రెస్ట్ ఇచ్చి రాహుల్ చహర్‌ను ఎంపిక చేశారు.

బౌలింగ్‌లో విజృంభించిన దీపక్ చహర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, కృనాల్ పాండ్యాకు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ గురువారం ఇక్కడే జరుగనుంది.

**ఎట్టకేలకు గాడినపడ్డ పంత్**

ఒకింత కష్టసాధ్యమైన లక్ష్యఛేదనకు బరిలో దిగిన భారత్‌కు ఓపెనర్లు లోకేశ్ రాహుల్ (20; 2 ఫోర్లు, 1 సిక్స్), శిఖర్ ధావన్ (3) మంచి ఆరంభాన్ని ఇవ్వలేకపోయారు. గాయం కారణంగా వన్డే ప్రపంచకప్ నుంచి అర్ధాంతరంగా తప్పుకున్న శిఖర్ ధవన్ ఈ సిరీస్‌లో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విఫలమయ్యాడు. లెగ్‌స్టంప్‌పై నుంచి దూసుకొచ్చిన షార్ట్ పిచ్ బంతిని నేరుగా ఫైన్ లెగ్‌లో నిల్చున్న కాట్రెల్ చేతికి ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. కోహ్లీ, పంత్ ఆచితూచి ఆడటంతో పవర్ ప్లే ముగిసే సమయానికి భారత్ 2 వికెట్ల నష్టానికి 34 పరుగులే చేసింది. ముఖ్యంగా గత రెండు మ్యాచ్‌ల్లో తప్పుడు షాట్లు ఆడి మూల్యం చెల్లించుకున్న పంత్ ఈ సారి సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. ఆరంభంలో సింగిల్స్‌కే అధిక ప్రాధాన్యం ఇచ్చిన ఈ జోడీ.. కుదురుకున్నాక ధాటిగా ఆడింది. సాధించాల్సిన లక్ష్యం ఎక్కువగా లేకపోవడంతో అనవసర ప్రయోగాలకు వెళ్లకుండా ఒక్కో పరుగు జతచేస్తూ టార్గెట్‌ను కరిగించింది. విజయానికి 42 బంతుల్లో 62 పరుగులు చేయాల్సిన దశలో ఈ జోడీ కాస్త దూకుడు పెంచింది. కోహ్లీ 3 ఫోర్లు బాదితే.. పంత్ ఓ సిక్స్, 2 ఫోర్లు కొట్టడంతో టార్గెట్ 18 బంతుల్లో 18కి చేరింది. మూడో వికెట్‌కు 106 పరుగులు జోడించాక విజయం ముంగిట కెప్టెన్ ఔటైనా.. మనీశ్ పాండే (2 నాటౌట్)తో కలిసి పంత్ జట్టును విజయతీరాలకు చేర్చాడు.

**దడదడలాడించిన దీపక్ చాహర్**

భారీ వర్షం కారణంగా నిస్సారంగా మారిన పిచ్‌పై టాస్ గెలిచిన కెప్టెన్ కోహ్లీ.. కరీబియన్లను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. సారథి నమ్మకాన్ని నిలబెడుతూ.. ఆరంభంలో పేసర్లు రెచ్చిపోయారు. టోర్నీలో తొలి మ్యాచ్ ఆడుతున్న దీపక్ చహర్ వరుస ఓవర్లలో మూడు వికెట్లు పడగొట్టి టీమ్ఇండియాకు శుభారంభం అందించాడు. రెండో ఓవర్‌లో చక్కటి బంతితో సునీల్ నరైన్ (2)ను ఔట్ చేసి దీపక్.. మరుసటి ఓవర్ తొలి బంతికే లూయిస్ (10)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఐదో బంతికి హెట్‌మైర్ కూడా ఎల్బీగా వెనుదిరిగాడు. దీంతో పవర్ ప్లే ముగిసేసరికి వెస్టిండీస్ 3 వికెట్ల నష్టానికి 22 పరుగులే చేసింది. ఆరంభంలోనే వికెట్లు పడ్డా పొలార్డ్ ఏమాంత్ర వెరవకుండా భారీ షాట్లకు దిగాడు. స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకొని విరుచుకుపడ్డాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో రాహుల్ చాహర్ వేసిన రెండో బంతినే స్టాండ్స్‌లోకి పంపిన పొలార్డ్.. తదుపరి ఓవర్‌లో అతడికి రెండు సిక్సర్లు రుచి చూపించాడు. వాషింగ్టన సుందర్ ఓవర్‌లోనూ పొలార్డ్ భారీ సిక్సర్ బాదడంతో 10 ఓవర్లు ముగిసేసరికి విండీస్ 58/3తో నిలిచింది. మరో ఎండ్‌లో పూరన్ (17) సహకారం అందించడంతో పొలార్డ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు.




నాలుగో వికెట్‌కు 66 పరుగులు జోడించాక పూరన్‌ను సైనీ ఔట్ చేశాడు. బౌలర్లకు సహకారం లభిస్తున్న పిచ్‌పై సంయమనంతో ఆడిన పొలార్డ్ 40 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత స్కోరు వేగం పెంచే క్రమంలో పొలార్డ్ ఔట్‌కాగా.. చివర్లో బ్రాత్‌వైట్ (10), అలెన్ (8 నాటౌట్)తో కలిసి పావెల్ విలువైన పరుగులు జోడించాడు.

### స్కోరు బోర్డు

**వెస్టిండీస్:** లూయిస్ (ఎల్బీ) దీపక్ 10, నరైన్ (సి) సైనీ (బి) దీపక్ 2, హెట్‌మైర్ (ఎల్బీ) దీపక్ 1, పొలార్డ్ (బి) సైనీ 58, పూరన్ (సి) పంత్ (బి) సైనీ 17, పావెల్ (నాటౌట్) 32, బ్రాత్‌వైట్ (సి) సుందర్ (బి) రాహుల్ చాహర్ 10, అలెన్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు:** 8, **మొత్తం:** 20 ఓవర్లలో 146/6. **వికెట్ల పతనం:** 1-4, 2-13, 3-14, 4-80, 5-105, 6-119, **బౌలింగ్:** భువనేశ్వర్ 3-0-19-0, దీపక్ 3-1-4-3, సైనీ 4-0-34-2, రాహుల్ చాహర్ 3-0-27-1, సుందర్ 3-0-23-0, కృనాల్ 4-0-35-0.

**భారత్:** రాహుల్ (సి) పూరన్ (బి) అలెన్ 20, ధావన్ (సి) కాట్రెల్ (బి) థామస్ 3, కోహ్లీ (సి) లూయిస్ (బి) థామస్ 59, పంత్ (నాటౌట్) 65, పాండే (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు:** 1, **మొత్తం:** 19.1 ఓవర్లలో 150/3. **వికెట్ల పతనం:** 1-10, 2-27, 3-133, **బౌలింగ్:** కాట్రెల్ 4-0-26-0, థామస్ 4-0-29-2, అలెన్ 3-0-18-1, నరైన్ 4-0-29-0, బ్రాత్‌వైట్ 2.1-0-25-0, పాల్ 2-0-23-0.

### టీ20ల్లో మూడో బ్రదర్స్ జోడీ




ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియా తరపున చాహర్ బ్రదర్స్.. దీపక్ చాహర్, రాహుల్ చాహర్ కలిసి బరిలో దిగారు. ఇప్పటికే అంతర్జాతీయ టీ20ల్లో భారత్ తరపున పఠాన్ బ్రదర్స్.. ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్, పాండ్యా బ్రదర్స్.. హార్దిక్ పాండ్యా, కృనాల్ పాండ్యా సత్తా చాటగా.. తాజాగా దీపక్ చాహర్, రాహుల్ చాహర్ ఆ జాబితాలో చేరారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆకట్టుకున్న దీపక్ చాహర్ ఇప్పటికే టీమ్ఇండియా తరపున చక్కటి ప్రదర్శన చేయగా.. మంగళవారం పోరులో రాహుల్ చాహర్ అరంగేట్రం చేశాడు. ఐపీఎల్లో ముంబై ఇండియన్స్ తరపున అదరగొట్టిన రాహుల్ చాహర్ తొలి మ్యాచ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. అన్న పేస్‌తో బెంబేలెత్తించిన పిచ్‌పై తమ్ముడు ఆరంభంలో కాస్త ఎక్కువ పరుగులు ఇచ్చుకున్నా చివర్లో బ్రాత్‌వైట్ వికెట్ పడగొట్టి సంబురాలు జరుపుకున్నాడు. మ్యాచ్ ఆరంభానికి ముందు కెప్టెన్ విరాట్ కోహ్లీ.. రాహుల్ చాహర్‌కు టీమ్ఇండియా క్యాప్ అందించి జట్టులోకి ఆహ్వానించాడు. 20 ఏండ్ల రాహుల్ చాహర్ భారత్ తరపున అరంగేట్రం చేసిన నాలుగో పిన్నవయస్కుడిగా నిలిచాడు. అంతకుముందు అమర్‌నాథ్ బ్రదర్స్.. మొహిందర్ అమర్‌నాథ్, సురిందర్ అమర్‌నాథ్ కూడా భారత్ తరపున అంతర్జాతీయ స్థాయిలో కలిసి ఆడారు.

## పొలార్డ్‌కు జరిమానా

**దుబాయ్ :** వెస్టిండీస్ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్‌పై జరిమానా వేటు పడింది. భారత్‌తో ఫ్లోరిడాలో గత ఆదివారం జరిగిన రెండో టీ20 సందర్భంగా అంపైర్ల ఆదేశాన్ని మీరాడని తేల్చిన ఐసీసీ.. అతడి మ్యాచ్ ఫీజులో 20శాతం కోతతో పాటు డీమెరిట్ పాయింట్‌ను విధించింది. ఆ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో సబ్‌స్టిట్యూట్ కోసం పొలార్డ్ పలుమార్లు మరో ఆటగాడిని పిలువగా.. ముందుగా తమ అనుమతి తీసుకోవాలని అంపైర్లు సూచించారు. అలాగే ఓవర్ పూర్తయ్యే వరకు ఆగాలని చెప్పారు. అయినా ఆ ఆదేశాలు పాటించకుండా పొలార్డ్ ఓవర్ మధ్యలోనే మైదానాన్ని వీడాడు. ఈ అంశం పై అంపైర్లు ఫిర్యాదు చేయగా, రిఫరీ విచారణ జరిపి జరిమానా విధించాడు.

## నోబాల్ నిర్ణయం థర్డ్ అంపైర్‌కు

**న్యూఢిల్లీ :** బౌలర్ల ఫ్రంట్‌ఫుట్ నోబాల్స్‌ను థర్డ్ అంపైర్ ప్రకటించే పద్ధతిని ఐసీసీ త్వరలో ప్రయోగాత్మకంగా తీసుకురానుంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఆరు నెలల పాటు పలు సిరీస్‌ల్లో ఈ నూతన పద్ధతిని అమలు చేయాలని నిర్ణయించుకుంది. ఒకవేళ ఈ ప్రయోగం విజయవంతమైతే నోబాల్‌పై నిర్ణయం తీసుకునే హక్కును అన్‌ఫీల్డ్ అంపైర్లు కోల్పోనున్నారు. 2016లో ఇంగ్లండ్-పాక్ మధ్య జరిగిన సిరీస్‌లో దీన్ని అమలు చేసినా.. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా నిలిపివేయగా.. మరోసారి ప్రయోగించాలని ఐసీసీ నిర్ణయించింది. 'బౌలర్ బంతి వేసిన క్షణాల్లోనే ఫ్రంట్‌ఫుట్ ఇమేజ్ థర్డ్ అంపైర్‌కు కనబడుతుంది. ఒకవేళ బౌలర్ గీత దాటినట్టు కనిపిస్తే నోబాల్‌గా ప్రకటించాలని ఆన్‌ఫీల్డ్ అంపైర్‌కు చెబుతాడు. సరైన బంతే అయితే ఎలాంటి సంప్రదింపులు చేయరు. క్రికెట్ కమిటీ సలహా మేరకు మరోసారి ఈపద్ధతిని ప్రయోగించేందుకు నిర్ణయించాం' అని ఐసీసీ జనరల్ సెక్రటరీ జెఫ్ అల్లార్డైస్ పేర్కొన్నారు.

### విజ్జీ ట్రోఫీకి అర్జున్ ఎంపిక



**ముంబై :** విజ్జీ ట్రోఫీ వన్డే టోర్నీకి ఎంపికైన ముంబై జట్టులో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కొడుకు అర్జున్ చోటు దక్కించుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 22 నుంచి జరగనున్న ఈ టోర్నీ కోసం 15మంది ఆటగాళ్లతో కూడిన జట్టును ముంబై క్రికెట్ సంఘం మంగళవారం వెల్లడించింది.

## హైదరాబాద్ ఓపెన్ ప్రారంభం



మంగళ వారం గచ్చిబౌలి స్టేడియంలో హైదరాబాద్ ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: స్థానిక గచ్చిబౌలి స్టేడియం వేదికగా హైదరాబాద్ బ్యాడ్మింటన్ ఓపెన్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 6 నుంచి 11 వరకు జరిగే టోర్నీని శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. భారత బ్యాడ్మింటన్ సమాఖ్య(బీఏఐ) ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నీలో వివిధ దేశాల నుంచి దాదాపు 300 మంది ఆటగాళ్లు పోటీపడనున్నారు. పురుషుల, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలుగా జరిగే టోర్నీ ప్రైజ్‌మనీని నిర్వాహకులు రూ.53. 24 లక్షలుగా ప్రకటించారు. తొలి రోజు జరిగిన వేర్వేరు విభాగపు మ్యాచ్‌ల్లో రాష్ట్ర యువ షట్లర్లు సుమిత్ రెడ్డి, రాహుల్ యాదవ్ విజయాలతో ముందంజ వేయగా, లక్ష్యసేన్, గురుసాయి దత్ తమ తొలి రౌండ్‌లోనే ఓటమి పాలయ్యారు.

## ఎరుపు బంతితోనే దులీప్ ట్రోఫీ

**న్యూఢిల్లీ :** గత మూడు సీజన్లుగా గులాబీ బంతితో డే అండ్ నైట్ ఫార్మాట్‌లో జరిగిన దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో బీసీసీఐ మార్పులు చేసింది. ఫైనల్ మినహా అన్ని మ్యాచ్‌లు ఎరుపు బంతితో, పగటి పూటే నిర్వహించాలని నిర్ణయించింది. ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 9 వరకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఫైనల్ మాత్రమే డే అండ్ నైట్‌గా జరగనుంది. ఈ సీజన్‌లో మూడు జట్లు తలపడనుండగా.. భారత భవిష్యత్ స్టార్ శుభ్‌మన్ గిల్ ఇండియా-బ్లూ జట్టుకు, భారత్-ఏ తరపున అదరగొడుతున్న ఓపెనర్ ప్రియాంక్ పంచల్ ఇండియా-రెడ్‌కు, విదర్భ రంజీ జట్టు కెప్టెన్ ఫయాజ్ ఫజల్ ఇండియా-గ్రీన్ జట్టుకు సారథులుగా వ్యవహరించనున్నారు. సెప్టెంబర్ 5-9 వరకు జరిగే ఫైనల్ మ్యాచ్ మాత్రం స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. 'చిన్నస్వామి స్టేడియంలో ఫ్లడ్‌లైట్స్ ఉన్నాయి. కానీ ప్రత్యక్ష ప్రసారం లేని కారణంగా లైట్స్ కింద నిర్వహించకూడదని నిర్ణయించాం. ఫైనల్ మాత్రమే డై అండ్ నైట్‌గా జరుగుతుంది. ఈ మ్యాచ్ ఒక్కటే ప్రత్యక్ష ప్రసారమవుతుంది' అని బీసీసీఐ క్రికెట్ వ్యవహారాల జీఎం సాబా కరీమ్ తెలిపారు. గులాబీ బంతితో సమీప భవిష్యత్తులో టీమ్ఇండియా ఆడే అవకాశాలు కనిపించడం లేదని, టెస్టు చాంపియన్‌షిప్‌లోనూ డే అండ్ నైట్ మ్యాచ్‌లు లేవని ఆయన చెప్పారు. అందుకే ఎరుపు బంతితో టోర్నీ నిర్వహిస్తున్నామని, అలాగైతేనే జాతీయ జట్టుకు ఎంపికయ్యే ఆటగాళ్లు సరైన విధంగా సిద్ధమవుతారని భావిస్తున్నామని కరీమ్ చెప్పారు. భారత్-ఏ సహ రంజీల్లో మంచి ప్రదర్శన చేసిన ఆటగాళ్లను దులీప్ ట్రోఫీకి ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. గ్రీన్ జట్టు తరపున హైదరాబాదీ బ్యాట్స్‌మన్ అక్షత్ రెడ్డి బరిలోకి దిగనున్నాడు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 36,977 | 10,948 |
| ↗277 | ↗86 |

ముడి చమురు (బ్రెంట్) ↘ 59.52 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 36.807 |
| 22 క్యారెట్లు | 36.635 |
| వెండి (కిలో) | 43.020 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 67.80 | 73.00 |
| యూరో | 75.80 | 82.30 |
| బహ్రెయిన్ దినార్ | 178.00 | 192.00 |
| కువైట్ దినార్ | 222.50 | 234.50 |
| సౌదీ రియాల్ | 17.80 | 19.60 |
| యూఏఈ దిర్హామ్ | 18.10 | 19.00 |

## నేడే ఆర్బీఐ సమీక్ష

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రిజర్వుబ్యాంక్ తన మూడో ద్వైమాసిక సమీక్షను బుధవారం ప్రకటించబోతున్నది. ద్రవ్యోల్బణం అదుపులోకి రావడంతో ఈ సమీక్షలో వడ్డీరేట్లను పావు శాతం తగ్గించే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యులు కలిగిన ఎంపీసీ బుధవారం సమావేశమై వడ్డీరేట్లకు సంబంధించి నిర్ణయాన్ని ప్రకటించనున్నది.

# ఇక పెట్రోల్ పంపుల్లో పొత్తు

- రిలయన్స్, బీపీ కొత్త జాయింట్ వెంచర్
- వచ్చే ఐదేండ్లలో 5,500 బంకులు ఏర్పాటు
- ఏటీఎఫ్ అమ్మకాలకూ సిద్ధం




**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్), బ్రిటీష్ పెట్రోలియం (బీపీ) కలయికలో పెట్రోల్ పంపులు రానున్నాయి. దేశీయంగా కలిసి పెట్రో అమ్మకాలను చేపట్టేందుకు ఇరు సంస్థలు అంగీకరించాయి. ఈ మేరకు మంగళవారం ఒప్పందంపై సంతకాలు కూడా జరిగిపోయాయి. ఇందులో భాగంగానే ఓ జాయింట్ వెంచర్ (జేవీ)ను రిలయన్స్, బీపీలు ఏర్పాటు చేస్తుండగా, కొత్త సంస్థలో రిలయన్స్‌కు 51 శాతం వాటా ఉంటే, బీపీకి 49 శాతం వాటా ఉండనున్నది. వచ్చే ఐదేండ్లలో 5,500 పెట్రోల్ పంపుల నిర్వహణే లక్ష్యంగా ఈ జాయింట్ వెంచర్ ముందుకు సాగుతుందని మంగళవారం విడుదల చేసిన ఓ సంయుక్త ప్రకటనలో ఇరు సంస్థలు స్పష్టం చేశాయి. దేశంలోని ఎయిర్‌లైన్స్‌కు విమాన యాన ఇంధనాన్నీ (ఏటీఎఫ్) సరఫరా చేస్తామని ఈ సందర్భంగా ఆర్ఐఎల్, బీపీ స్పష్టం చేశాయి. ప్రస్తుతం ఈ రెండు సంస్థలు కలిసి చమురు, గ్యాస్ ఉత్పత్తిని చేస్తున్న విషయం తెలిసిందే. కృష్ణ-గోదావరి (కేజీ) బేసిన్‌లో ముడి చమురు బావులను, గ్యాస్ నిక్షేపాలను తవ్వుతున్నాయి. ఈ క్రమంలో రిటైల్ వ్యాపారంలోనూ కలిసి నడువాలని ఈ దిగ్గజాలు నిర్ణయించాయి.

**ఇది మూడో ఒప్పందం**

2011 నుంచి రిలయన్స్-బీపీ మధ్య ఇది మూడో జాయింట్ వెంచర్ కావడం విశేషం. తొలుత రిలయన్స్‌కు చెందిన 21 చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి బ్లాకుల్లో 7.2 బిలియన్ డాలర్లతో బీపీ వాటాలు కొన్నది. ఆ తర్వాత ఇండియా గ్యాస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మరో జేవీని ఏర్పాటు చేసింది. ఇందులో 50:50 వాటాలున్నాయి. ఇప్పుడు 51:49 భాగస్వామ్యంతో రిటైల్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో దాదాపు 65 వేల పెట్రోల్ పంపులున్నాయి. ఇందులో 58,174 ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలవే. వీటిని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లు నిర్వహిస్తున్నాయి. ఇక 5,244 పెట్రోల్ పంపులను రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్ ఆధ్వర్యంలోని నయరా ఎనర్జీ (ఎస్సార్ ఆయిల్) నడుపుతున్నది. వచ్చే 2-3 ఏండ్లలో వీటిని 7 వేలకు పైగా చేయాలని ఎస్సార్ యోచిస్తున్నది. అలాగే రాయల్ డచ్ షెల్‌కు 151 బంకులున్నాయి. వీటిని 150-200 బంకులకు పెంచాలని ప్రయత్నిస్తున్నది. ఇక రిలయన్స్‌కు 1,400 బంకులున్నాయి. కాగా, దేశంలో 3,500 బంకులను ఏర్పాటు చేసేందుకు 2016లోనే బీపీకి కేంద్ర ప్రభుత్వం లైసెన్సు ఇచ్చింది. ఇది తాజా జాయింట్ వెంచర్‌కు లాభించనున్నది.

### జేవీలోకి ఇప్పుడున్న బంకులు

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికే పెట్రో రిటైల్ వ్యాపారం చేస్తుండగా, దేశవ్యాప్తంగా 1,400 బంకులున్నాయి. వివిధ విమానాశ్రయాల్లో మరో 31 ఏటీఎఫ్ బంకులనూ కలిగి ఉన్నది. ఈ నేపథ్యంలో తాజా జాయింట్ వెంచర్‌లో ఇవి విలీనమైపోనున్నాయి. అయితే ఇందుకుగాను రిలయన్స్‌కు బీపీ ఎంత మొత్తం చెల్లిస్తున్నదన్న వివరాలు మాత్రం తెలియరాలేదు. నగదు రూపంలో కాకుండా వాటాల్లో ఏమైనా లావాదేవీలకు ఆస్కారముందా? అన్న కోణంలోనూ వివరాలు బయటకు రావడం లేదు. కాగా, రాబోయే కొద్ది నెలల్లో పెట్టుబడులకు అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. ఇరు సంస్థ మధ్య ఒప్పందం జరిగిందని, దీనిపై రెండు వర్గాల ప్రతినిధులు సంతకాలు చేశారన్నారు. గుజరాత్‌లోని జమ్‌నగర్ వద్దగల చమురు రిఫైనరీల్లో వాటా విక్రయం కోసం సౌదీ ఆరామ్కోతో రిలయన్స్ చర్చలు జరుపుతున్న వేళ బీపీతో ఒప్పందం కుదిరింది. రిఫైనరీల్లో పావు శాతం వాటా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న సౌదీ ఆరామ్కో.. రిలయన్స్‌తో దేశీయంగా రిటైల్ అమ్మకాలకూ ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో రిలయన్స్, బీపీల రిటైల్ ఔట్‌లెట్ల ఒప్పందం ప్రాధాన్యతను సంతరించుకున్నది.



హైలెవల్ కమిటీ సమావేశానికి హాజరై నివేదికను విడుదల చేస్తున్న సీఎస్ ఎస్‌కే జోషి. చిత్రంలో టెస్కాబ్ ప్రెసిడెంట్ కొండూరు రవీందర్ తదితరులు

# 'సహకార' తీరు భేష్

- రైతులకు రుణాలివ్వడంలో బ్యాంకులు ముందుండాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతులకు త్వరితగతిన రుణాలు ఇవ్వడంలో సహకార బ్యాంకులు ముందుండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి అన్నారు. ప్రస్తుత సహకార వ్యవస్థ పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేసిన ఆయన..రైతులకు మెరుగైన సేవలు అందించడానికి మరిన్ని కీలక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సహకార వ్యవస్థ బలోపేతానికి, విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం కోసం ఏర్పాటు చేసిన అత్యున్నత స్థాయి కమిటీ (హైలెవల్ కమిటీ) సమావేశం మంగళవారంఎస్‌కే జోషి అధ్యక్షతన జరిగింది.

**కంప్యూటరీకరణ అభినందనీయం**

దేశంలో మొట్టమొదటిసారిగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణపై సమీక్షించారు. చాలా పకడ్బందీగా రాష్ట్రప్రభుత్వం, నాబార్డ్, టెస్కాబ్ పూర్తి సమన్వయంతో ఈ కార్యక్రమంలో చేపట్టడం అభినందనీయమన్నారు. దేశంలోని మిగతా రాష్ట్రాలకు పీఏసీఎస్ కంప్యూటరీకరణలో తెలంగాణ రాష్ట్రం తలమానికంగా ఉండడాన్ని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అభినందించారు. రాబోయే రోజుల్లో ప్రతినెల పురోగతిపై వ్యవసాయ, సహకార శాఖ రిజిస్ట్రార్, టెస్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ సమీక్ష నిర్వహించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని సీఎస్ ఆదేశించారు.

**కొత్తగా 16 డీసీసీబీ శాఖల ఏర్పాటు**

డీసీసీబీల విజ్ఞప్తి మేరకు కొత్తగా 16 శాఖలను ప్రారంభించడానికి అనుమతిచ్చినట్లు ఆయన తెలిపారు. ఆదిలాబాద్ డీసీసీబీలో 6, కరీంనగర్ డీసీసీబీలో 5, మెదక్ డీసీసీబీలో 5 శాఖలను ఏర్పాటు చేయడానికి సమావేశం అనుమతిచ్చింది. దేశస్థాయిలో పీఏసీఎస్‌లలో మానవ వనరుల పెంపు కోసం రాష్ట్ర సహకార బ్యాంకుల జాతీయ సమాఖ్య (ఎన్ఏఎఫ్ఎస్‌సీవోబీ)ఆధ్వర్యంలో టెస్కాబ్ ప్రెసిడెంట్ కొండూరు రవీందర్ అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన కమిటీ నివేదికను ఈ సమావేశంలో విడుదల చేశారు.

**సీఈవోల నియామకానికి గ్రీన్‌సిగ్నల్**

కొన్ని కారణాల వల్ల నిలిచిపోయిన డీసీసీబీ సీఈవోల నియామకానికి కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో అతిత్వరలో ఆరు డీసీసీబీలలో సీఈవో నియామకాల ప్రక్రియ మొదలుకానున్నది. ప్రభుత్వం నుంచి రావాల్సిన పావలా వడ్డీ రుణాలు, వడ్డీలేని రుణాల వడ్డీ బకాయిలు, దీర్ఘకాలిక రుణాలపై వడ్డీ రాయితీ బకాయిలను త్వరగా విడుదల చేయాలని టెస్కాబ్ అధ్యక్షులు రవీందర్‌రావు కోరారు. తదుపరి అత్యున్నతస్థాయి కమిటీ సమావేశం ఈనెల 16న నిర్వహించాలని సమావేశం నిర్ణయించినట్లు ఎండీ మురళీధర్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో సీఎస్‌తో పాటు వ్యవసాయ సహకార శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారధి, నాబార్డ్ మేనేజర్ విజయ్‌కుమార్, ఆర్బీఐ జీఎం మేఘనాథ్, రిజిస్ట్రార్ శ్రీనాథాచారి, నాబార్డ్ జనరల్ మేనేజర్ షరీఫ్‌లు హాజరయ్యారు.

# కలిసి నడుద్దాం

- నిర్మాణ రంగంలో భారత్, ఇజ్రాయెల్ బంధం బలపడాలి
- ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూ

**టెల్ అవీవ్ నుంచి కింగ్ జాన్సన్ కొయ్యడ**

భారతీయ నిర్మాణ రంగ సంస్థలు ఇజ్రాయెల్ సంస్థలతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని ఆ దేశ ప్రధాన మంత్రి బెంజిమెన్ నెతన్యాహూ కోరారు. మంగళవారం ఇక్కడ ఇంటర్ కాంటినెంటల్ హోటల్లో ప్రారంభమైన న్యాట్కాన్ 2019 సదస్సును ఉద్దేశించి ఆయన లైవ్ టెలికాస్ట్‌లో మాట్లాడారు. భారత్‌తో కలిసి పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఆధునిక పరిజ్ఞానం వల్ల ప్రపంచం సరికొత్త మార్పులను సంతరించుకుంటున్నదని, అందుకే భారత్, ఇజ్రాయెల్ దేశాలు భద్రతా, వ్యవసాయం, సైబర్, ఐటీ తదితర రంగాల్లో కలిసికట్టుగా పని చేయాలని తాను భారత ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే నిర్మాణ రంగంలోనూ సరికొత్త పోకడలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇజ్రాయెల్ నిర్మాణ రంగ మంత్రి డా.ఇఫాత్ శషాన్ బిటోన్ మాట్లాడుతూ.. 1992లో భారత్-ఇజ్రాయెల్ ద్వైపాక్షిక వాణిజ్యం 200 మిలియన్ డాలర్లుగా ఉంటే, ఇప్పుడు 5.5 బిలియన్ డాలర్లకు చేరుకుందని వెల్లడించారు.




న్యాట్కాన్ 2019 సదస్సులో పాల్గొన్న భారత్-ఇజ్రాయెల్ నిర్మాణ రంగ ప్రతినిధులు

ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరముందన్న ఆయన ఆధునిక ఆవిష్కరణలపై దృష్టిసారిస్తే ప్రపంచంలో భారత్-ఇజ్రాయెల్ అద్భుతాలనే సృష్టించగలవన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మున్సిపాలిటీల్లో ఆధునిక పరిజ్ఞానంతో సరికొత్త ఆవిష్కరణలను చేపట్టామని తెలిపారు. ముంబై సమీపంలోని థానేలోగల ఒక ప్రాంతంలో నివాసితులకు ఉపయోగపడేలా ఆధునిక ఆవిష్కరణల్ని అందజేశామన్నారు. ఈ సందర్భంగా సీబీఆర్ఈ ఎండీ అన్షుమన్ మ్యాగజీన్ మాట్లాడుతూ.. 2030 నాటికి ఒక బిలియన్ చదరపు అడుగుల ఆఫీసు స్థలానికి డిమాండ్ ఏర్పడనుందన్నారు. క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు సతీష్ మగర్ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లను చేరుకునే దిశగా పరుగులు పెడుతున్నదని, ఇందులో రియల్ ఎస్టేట్ రంగం కీలకపాత్ర పోషిస్తుందన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. కలిసికట్టుగా పనిచేస్తే అసాధ్యమనేదేదీ లేదన్న ఆయన డెవలపర్లందరూ కొనుగోలుదారులను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. కాగా, ఈ సదస్సును విజయవంతం చేయడంలో సాయం చేసిన ప్రతి ఒక్కరికీ క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు గుమ్మి రాం రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ మాజీ జాతీయ అధ్యక్షుడు సీ శేఖర్ రెడ్డి, ఎస్ రాంరెడ్డి, చెరుకు రామచంద్రా రెడ్డి, ప్రదీప్ రెడ్డి, ఆదిత్యా గౌరా, ఏషియా పసిఫిక్ ఎండీ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలుదారుల ఆశల్ని నెరవేర్చాలి: రేణు సూద్

భారతీయ నిర్మాణ రంగంలో సంక్లిష్టమైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కొనుగోలుదారుల ఆకాంక్షలకు తగ్గట్టుగా నిర్మాణాల్ని చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ ఎండీ రేణు సూద్ కర్నాడ్ అభిప్రాయపడ్డారు. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. భారతీయ నిర్మాణ రంగాన్ని నగదు కొరత తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నదని తెలిపారు. రెరా, బినామీ లావాదేవీల చట్టానికి సవరణలతో నిర్మాణ రంగంలో పారదర్శకత నెలకొనే అవకాశం ఉందన్నారు. కాకపోతే ప్రస్తుతం దేశవ్యాప్తంగా నిలిచిపోయిన ప్రాజెక్టులు మళ్లీ పట్టాలపైకెక్కాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే ప్రస్తుతం మన దేశీయ నిర్మాణ రంగం ముందున్న అతిపెద్ద సవాల్ అని ఆమె అభివర్ణించారు. రియల్ సంస్థలన్నీ ఆధునిక పరిజ్ఞానం మీద పెట్టుబడి పెట్టాలని సూచించారు.

## టైటాన్ లాభం రూ.364 కోట్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** టాటా గ్రూపునకు చెందిన టైటాన్ కంపెనీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన మూడు నెలలకాలానికి సంస్థ రూ.363.74 కోట్ల కన్సాలిడేట్ లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.328.15 కోట్ల లాభంతో పోలిస్తే 10.84 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ విక్రయాలు రూ.4,406.57 కోట్ల నుంచి రూ.5,095.10 కోట్లకు పెరిగాయి. వృద్ధి 15.62 శాతంగా ఉన్నది. నిర్వహణ ఖర్చులు 16.60 శాతం పెరిగి రూ.4,687.47 కోట్లకు చేరుకోవడంతో లాభాల్లో భారీ వృద్ధిని నమోదు చేసుకోలేకపోయింది. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో గడియారాల విభాగం నుంచి రూ.716.11 కోట్లు, జ్యువెల్లరీ నుంచి రూ.4,164 కోట్లు, కంటి అద్దాల విక్రయంతో రూ.148.78 కోట్లు లభించాయి.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు

**ముంబై, ఆగస్టు 6:** దేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థయైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్..తన ఖాతాదారులకు ఊరటనిచ్చింది. బుధవారం నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల రుణాలపై వడ్డీరేటును 0.10 శాతం తగ్గిస్తున్నట్లు పరకటించింది. రిజర్వు బ్యాంక్ ప్రకటించనున్న పరపతి సమీక్ష కంటే ఒక్కరోజు ముందు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించడం విశేషం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఏడాది కాల పరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8.60 శాతానికి తగ్గనున్నది. ఒకరోజు కాలపరిమితి కలిగిన రుణాల నుంచి మూడేండ్ల రుణాల వరకు వడ్డీరేట్లలో కోత విధించింది.

# లాభాల్లోకి సెంట్రల్ బ్యాంక్

క్యూ1లో రూ.118 కోట్లుగా నమోదు

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** ప్రభుత్వరంగ సంస్థ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చింది. జూన్ 30తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.118.33 కోట్ల లాభాన్ని గడించింది. మొండి బకాయిలకోసం కేటాయింపులు తగ్గుముఖం పట్టడం లాభాల్లోకి రావడానికి దోహదం చేసిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. అంతక్రితం ఏడాది ఇదే కాలానికిగాను బ్యాంక్ రూ.1,522.24 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. 2018-19 ఏడాది తొలి త్రైమాసికంలో రూ.5,904.82 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం ఈసారికిగాను రూ.6,493.55 కోట్లకు చేరుకున్నది. సమీక్షకాలంలో బాయక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 22.17 శాతం నుంచి 19.93 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ కూడా 10.58 శాతం నుంచి 7.98 శాతానికి దిగొచ్చింది. విలువపరంగా చూస్తే స్థూల నిరర్థక ఆస్తుల విలువ రూ.38,777.66 కోట్ల నుంచి రూ.32,908.44 కోట్లకు తగ్గగా, నికర ఎన్‌పీఏ రూ.16,086.25 కోట్ల నుంచి రూ.11,440.59 కోట్లకు తగ్గాయి. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి గత త్రైమాసికంలో రూ.897.42 కోట్ల నిధులను మాత్రమే కేటాయించింది.

# గ్రాన్యూల్స్ ఔషధానికి యూఎస్ఎఫ్‌డీఏ గ్రీన్‌సిగ్నల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియాకు చెందిన అంఫాటామైన్ సల్ఫేట్ ట్యాబ్లెట్ ఔషధానికి అమెరికా నియంత్రణ మండలి యూఎస్ఎఫ్‌డీఏ అనుమతినిచ్చింది. గ్రాన్యూల్స్‌కు చెందిన అనుబంధ సంస్థ పెట్టుకున్న ఏఎన్‌డీఏ దరఖాస్తును పరిశీలించిన యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్గ్ అడ్మినిస్ట్రేషన్(యూఎస్ఎఫ్‌డీఏ)..అంఫాటామైన్ సల్ఫేట్ 5ఎంజీ, 10 ఎంజీల ట్యాబ్లెట్లకు అక్కడి మార్కెట్లో విడుదల చేయడానికి లైన్‌క్లియర్ అయింది. అర్బోర్ ఫార్మాస్యూటికల్స్ ఎల్ఎల్‌సీకి చెందిన ఎవికియో ట్యాబ్లెట్‌కు జనరిక్ వెర్షన్‌గా గ్రాన్యూల్స్ ఈ ట్యాబ్లెట్‌ను తయారు చేసింది. కంపెనీ షేరు ధర 2.12 శాతం బలపడి రూ.91.50 వద్ద స్థిరపడింది.

# వడ్డీరేట్ల తగ్గింపు ఆశలతో..

- 277 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్

**ముంబై, ఆగస్టు 6:** గత కొన్ని రోజులుగా నష్టాల్లో ట్రేడవుతున్న స్టాక్ మార్కెట్లకు కాస్త రిలీఫ్ ర్యాలీ దొరికింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో ద్వైమాసికపు సమీక్షలో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు ఉండటంతో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరిపారు. ఫలితంగా ఐదు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయిన సూచీలు ఒక్కసారిగా లాభాల్లోకి మళ్లాయి. ప్రారంభం నుంచే లాభాల బాట పట్టిన సూచీలు ఒక దశలో 500 పాయింట్లకు పైగా లాభపడి 37 వేల పైకి చేరుకున్నది. ఆ తర్వాత మదుపరుల ఈస్థాయి లాభాలను నిలుపుకోలేక పోవడంతో చివరకు 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 36,976.85 వద్ద ముగిసింది. నిన్నటితో పోలిస్తే 277.01 పాయింట్లు లాభపడినట్లు అయింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 85.65 పాయింట్లు లాభపడి 10,948.25 వద్ద ముగిసింది.

**బ్యాంక్, వాహన రంగ షేర్లకు డిమాండ్**


బ్యాంకింగ్, వాహన రంగ షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఎగపడ్డారు. వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు ఉండటంతో ఈ రంగాలకు సంబంధించిన షేర్లలో క్రయవిక్రయాలు జోరందుకున్నాయి. మార్కెట్లో యెస్ బ్యాంక్ అత్యధికంగా 5.30 శాతం లాభపడింది. వీటితోపాటు టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి, ఏషియన్ పెయింట్స్, హీరో మోటోకార్ప్‌ల షేర్లు కూడా నాలుగు శాతం వరకు అధికమయ్యాయి. కానీ, పవర్‌గ్రిడ్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటర్స్, బజాజ్ ఆటో, వేదాంత, ఇన్ఫోసిస్, ఐటీసీలు మాత్రం 1.52 శాతం వరకు పతనమయ్యాయి. రంగాలవారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్, టెలికం, రియల్టీ, ఇండస్ట్రీయల్, ఆర్థికం, బ్యాంకెక్స్, మెటల్‌లు రెండు శాతానికి పైగా లాభపడగా..ఇంధనం, ఐటీ, టెక్, ఆయిల్ అండ్ గ్యాస్‌లు స్వల్పంగా నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో ర్యాలీ కొనసాగింది. 1,637 స్టాక్‌లు లాభపడగా, 809 నష్టపోయాయి. మరోవైపు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల్లో నెలకొన్న ఆందోళన కొనసాగుతున్నది.



# రికార్డు నుంచి పసిడి వెనక్కి

- రూ.163 తగ్గిన తులం ధర

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** రికార్డు స్థాయికి చేరుకున్న పసిడి వెనక్కితగ్గింది. ఆభరణాల వర్తకుల నుంచి కొనుగోళ్లు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయంగా అంతంత మాత్రంగానే డిమాండ్ ఉండటంలో దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.163 తగ్గి రూ.36,807 వద్ద ముగిసింది. బంగారంతోపాటు కిలో వెండి ధర రూ.80 తగ్గి రూ.43,020 వద్ద ముగిసిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ఒక ప్రకటనలో వెల్లడించింది. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర స్వల్పంగా తగ్గి 1,462.50 డాలర్లకు పడిపోగా, వెండి కూడా 16.43 డాలర్ల వద్ద ముగిసింది.



# ఒకేరోజు రూ.8 లక్షల కోట్లు

- నష్టపోయిన ప్రపంచ కుబేరులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధమేఘాలు ఆ దేశా స్టాక్ మార్కెట్లపై తీవ్రంగా ప్రభావం చూపాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలడంతో ప్రపంచ కుబేరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 మంది సంపన్న వర్గాలు 117 బిలియన్ డాలర్ల సంపదను ఒకేరోజు కోల్పోయారు. మన కరెన్సీలో ఇది రూ.8 లక్షలకోట్లకు పైమాటే. వీరిలో 21 మంది బిలియన్ డాలర్ల కంటే అధిక సంపదను కోల్పోయినట్లు బ్లూంబర్గ్ బిలియనీర్ల ఇండెక్స్ తాజాగా వెల్లడించింది. వీరిలో అమెజాన్ ఫౌండర్ జెఫ్ బెజోస్ అత్యధికంగా 3.4 బిలియన్ డాలర్ల సంపద హరించుకుపోయింది. అయినప్పటికీ ఆయన 110 బిలియన్ డాలర్లతో ప్రపంచ కుబేరుల జాబితాలో తొలిస్థానంలో ఉన్నారు. అలాగే బెర్నాడ్ అర్నాల్ట్ 3.2 బిలియన్ డాలర్లు కోల్పోగా, మార్క్ జూకర్‌బర్గ్ 2.8 బిలియన్ డాలర్లు, ముకేశ్ అంబానీ 2.4 బిలియన్ డాలరుల, బిల్‌గేట్స్ 2 బిలియన్ డాలర్ల సంపద హరించుకుపోయింది.

# అది చైనా మాయాజాలం

**వాషింగ్టన్/బీజింగ్, ఆగస్టు 6:**

యువాన్ విలువ పతనం వెనుక చైనా కుట్ర దాగి ఉందని అమెరికా ఆరోపించింది. చైనాపై కరెన్సీ మ్యానిపులేటర్ ముద్ర వేసింది. దురుద్దేశపూరితంగానే చైనా తమ కరెన్సీ విలువను తగ్గించుకుంటున్నదని, తద్వారా అన్యాయమైన పోటీ ప్రయోజనాలను పొందాలని చూస్తున్నదని అగ్రరాజ్యం ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమవారం అమెరికా డాలర్‌తో పోల్చితే చైనా యువాన్ విలువ 7 డాలర్ల దిగువకు క్షీణించిన విషయం తెలిసిందే. యువాన్ ఈ స్థాయికి దిగజారడం 11 ఏండ్లలో ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో చైనా కావాలనే యువాన్ విలువను పడిపోయేలా చేస్తున్నదని అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్టీవెన్ మ్నూచిన్ ధ్వజమెత్తారు. చైనా అవకాశవాదం అందరికీ తెలిసిందేనని, స్వప్రయోజనాల కోసం కరెన్సీ విలువను పెంచడం, తగ్గించడం చేస్తూనే ఉంటుందని అన్నారు. నిజానికి 2016లో అధ్యక్ష ఎన్నికల సందర్భంగానే చైనాను కరెన్సీ మ్యానిపులేటర్‌గా ట్రంప్ అభివర్ణించారు. చైనాతో అమెరికాకు జరుగుతున్న నష్టాన్ని వివరిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే తాము అధికారంలోకి వస్తే చైనాపై కరెన్సీ మ్యానిపులేటర్ ముద్ర వేస్తామనీ ప్రకటించారు. అయితే ఆర్థిక మంత్రిత్వ శాఖ వేచిచూసే ధోరణిని అవలంభించింది. ఈ విషయంలో తుది నిర్ణయానికి రాలేకపోయింది. కాగా, అధ్యక్ష పదవీ కాలం దగ్గరపడుతున్న వేళ చైనాపై ట్రంప్ దూకుడు పెంచారు. ఈ క్రమంలో ఇప్పుడు అధికారికంగా కరెన్సీ మ్యానిపులేటర్ ముద్ర వేశారు. 'అక్రమ వాణిజ్య కార్యకలాపాలు, కరెన్సీ మ్యానిపులేషన్‌తో అమెరికా నుంచి చైనా వందలాది బిలియన్ డాలర్లను పొందుతూనే ఉన్నది. ఇప్పుడు ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధాన్నీ సొమ్ము చేసుకోవాలని చూస్తున్నది. ఈ క్రమంలోనే నెమ్మదిగా తమ కరెన్సీ యువాన్ విలువను తగ్గిస్తూపోతున్నది' అని ట్రంప్ ట్వీట్ చేశారు. మరోవైపు చైనా కరెన్సీ మ్యానిపులేషన్ చేస్తుందంటూ అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)కి అమెరికా ఫిర్యాదు చేసింది.

**చైనా ఎదురుదాడి**

యువాన్ క్షీణతపై అమెరికా వ్యాఖ్యలను చైనా ఖండించింది. కరెన్సీ మ్యానిపులేటర్‌గా వేసిన ముద్రను ఆ దేశ సెంట్రల్ బ్యాంక్ తోసిపుచ్చింది. అమెరికాది విధేయతలేని ఏకపక్ష సిద్ధాంతమని మండిపడింది. అమెరికా రక్షణాత్మక ధోరణి.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, మార్కెట్లను దెబ్బ తీస్తున్నదని విరుచుకుపడింది. పెద్ద దేశాలు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, చిన్న దేశాల అభివృద్ధిని కోరుతూ ప్రపంచ వృద్ధికి దోహదం చేయాలంటూ ట్రంప్‌కు నీతి బోధ చేసింది. ప్రపంచాన్ని నెమ్మదిగా నాశనం చేయాలని ఉద్దేశపూర్వకంగానే అమెరికా కంకణం కట్టుకున్నదని చైనా ధ్వజమెత్తింది. ఇదిలావుంటే చైనాతో వాణిజ్య ఒప్పందానికి ట్రంప్ సిద్ధంగా ఉన్నారని, అయితే న్యాయబద్ధంగా ఉండాలని వైట్‌హౌజ్ ఎకనామిక్ అడ్వైజర్ లర్రీ కుడ్లో మంగళవారం తెలిపారు.

### వాణిజ్య యుద్ధం తీవ్రం

అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా అధికారికంగా నిషేధించింది. దీంతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం తీవ్రరూపం దాల్చినట్లైంది. అమెరికాకు చైనా నాలుగో అతిపెద్ద వినియోగదారుగా ఉన్నది. ఈ క్రమంలో చైనా నిర్ణయం అమెరికా వ్యవసాయ ఆధారిత కంపెనీల అమ్మకాలను ప్రభావితం చేస్తుందని, రైతుల పంట కొనుగోళ్లకూ దెబ్బేనని, దీంతో అగ్రరాజ్య జీడీపీ కూడా ప్రమాదంలో పడవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే నెల ఆరంభం నుంచి అమెరికాలోకి దిగుమతి అవుతున్న చైనా వస్తు, ఉత్పత్తుల్లో మరో 300 బిలియన్ డాలర్ల విలువైన వాటిపై 10 శాతం సుంకాలు వేస్తామని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకార సుంకాలు ఉంటాయని చైనా కూడా తేల్చి చెప్పిన సంగతీ విదితమే.

యువాన్ విలువ క్షీణతపై అమెరికా • కరెన్సీ మ్యానిపులేటర్‌గా ముద్ర



# జంటనగరాల మణిహారం 'మెట్రో రైల్'

- గవర్నర్ నరసింహన్ ప్రశంసలు
- మనవరాలితో కలిసి మెట్రోలో నరసింహన్ దంపతుల ప్రయాణం

**అమీర్‌పేట్, నమస్తే తెలంగాణ:** అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యున్నతంగా తీర్చిదిద్దిన మెట్రో రైలు ప్రాజెక్ట్ జంటనగరాలకు మణిహారం వంటిదని రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రశంసించారు. హైదరాబాద్‌లో మెట్రో ఎంతో సౌకర్యవంతంగా ఉన్నదని, నగర ప్రజలు మెట్రోను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు. మంగళవారం గవర్నర్ నరసింహన్ దంపతులు మనవరాలితో కలిసి మెట్రోలో ప్రయాణించారు. మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో కలిసి అమీర్‌పేట్ జంక్షన్‌లో మెట్రో రైలెక్కి సాధారణ ప్రయాణికుల్లాగా నాగోల్ వరకు వెళ్లారు. అక్కడ ఎల్అండ్‌టీ ఎంఆర్ఎల్ ఎండీ కేవీబీ రెడ్డిసహా సంస్థ అధికారులు గవర్నర్‌కు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ ఉప్పల్ మెట్రో డిపోను సందర్శించారు. అత్యాధునిక వసతులతో కూడిన కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, మెట్రో పనిచేసే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ పండ్ల మొక్కలను నాటిన గవర్నర్ దంపతులు.. అనంతరం మెట్రో ఎక్కి బేగంపేటలో దిగారు.



మనవరాలితో కలిసి మెట్రోరైలులో ప్రయాణిస్తున్న గవర్నర్ నరసింహన్ దంపతులు

# 10 వరకు టీఆర్ఎస్ ఎన్నారై సభ్యత్వ నమోదు

**కేటీఆర్‌తో ఎన్నారై పాలసీపై చర్చించిన టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్ఎస్ ఎన్నారై సభ్యత్వ గడువును ఈ నెల 10 వరకు పొడిగిస్తూ టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్ణయం తీసుకున్నారు. కొన్ని దేశాల్లో తెలంగాణ ఎన్నారైలు ఆన్‌లైన్‌లో టీఆర్ఎస్ సభ్యత్వం తీసుకునేటప్పుడు సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సభ్యత్వ గడువు పొడిగించాలని టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల మంగళవారం ఆయనకు విజ్ఞప్తి చేశారు. టీఆర్ఎస్ ఎన్నారై శాఖలు ఉన్న 40 దేశాలనుంచి సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తున్నదని మహేశ్ బిగాల తెలిపారు. వేలసంఖ్యలో సభ్యత్వాలు నమోదవుతుండటంపై కేటీఆర్ అభినందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి త్వరలోనే ఎన్నారై పాలసీపైనా నిర్ణయం తీసుకుంటామని కేటీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. గల్ఫ్‌లో చనిపోయినవారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని మహేశ్ బిగాల కేటీఆర్‌ను కోరారు.



ఎన్నారై పాలసీ గురించి కేటీఆర్‌తో చర్చిస్తున్న టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల



# నిధులపై జెడ్పీ సీఈవోలకు అధికారాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని జిల్లా పరిషత్‌లలో నిధుల కేటాయింపు, విడుదల, పంపిణీ అధికారాలన్నీ ఇకనుంచి జెడ్పీ సీఈవోలకే కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో జెడ్పీల్లో నిధుల విడుదల అధికారాలు డిప్యూటీ సీఈవోలకు ఉండేవి. జెడ్పీ సీఈవోలు ఫైళ్లను ఆమోదించిన తర్వాత నిధుల కేటాయింపు, విడుదల, పంపిణీ అధికారాలు డిప్యూటీ సీఈవోలకు ఉండేవి. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు, 32 జెడ్పీల్లో నూతన పాలకవర్గాలు కొలువుదీరిన నేపథ్యంలో పాలనాసౌలభ్యం కోసం ప్రభుత్వం డిప్యూటీ సీఈవోల పోస్టులను రద్దుచేసింది. వారిస్థానంలో ప్రతి జిల్లా పరిషత్‌కు ఏవో పోస్టు ఇచ్చారు. కొన్ని జిల్లాల్లో ఏవో పోస్టుల్లో ఉన్న అధికారులు కొత్తవారు కావడం, నిధుల వినియోగంలో సరైన అవగాహన లేకపోవడం వల్ల వారికి నిధుల విడుదల, కేటాయింపులపై అధికారాలు ఇవ్వలేదు. ఇకనుంచి నిధుల అంశంలో పూర్తిస్థాయి అధికారాలన్నీ జెడ్పీ సీఈవోలకే ఉంటాయని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

# సకాలంలో ఎరువులు, విత్తనాలు

- జాప్యంలేకుండా మార్క్‌ఫెడ్ సరఫరాచేయాలి
- భూసార పరీక్షల కార్డులు 15 రోజుల్లో రైతులకు అందజేయాలి
- వ్యవసాయం, మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థలపై సమీక్షలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని రైతులకు సకాలంలోఎరువులు, విత్తనాలను అందజేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ప్రాథమిక సహకార సంఘం, మార్క్‌ఫెడ్ వద్ద ఎలాంటి జాప్యం జరుగకూడదని అన్నారు. వ్యవసాయ, మార్క్‌ఫెడ్, విత్తన అభివృద్ధి సంస్థలపై మంగళవారం ఉన్నతాధికారులతో సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కుమ్రంభీం ఆసిఫాబాద్, నారాయణపేట జిల్లాల్లో సాధారణ కన్నా అత్యధిక వర్షపాతం, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో తక్కువ, మిగతా అన్ని జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని మంత్రికి అధికారులు వివరించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు జిల్లాలవారీగా డిమాండ్ ఎంతున్నది? ప్రస్తుతం ఎక్కడ ఎంత నిల్వ ఉన్నది? ఎంత అవసరమో పరిశీలించి ఎక్కడా ఎరువులు, విత్తనాలు తక్కువ కాకుండా సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖ ఇంజినీర్లతో మాట్లాడి ఎంత ఆయకట్టుకు సాగునీరు రాబోతున్నది క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన అంచనాలు తీసుకోవాలన్నారు.

### నకిలీ ఎరువుల నివారణకు చెక్‌పోస్టులు

ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా వస్తున్న నకిలీ ఎరువుల నివారణకు కలెక్టర్ల సహకారంతో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భూసార పరీక్ష కార్డులను రైతులకు 15 రోజుల్లో అందజేయాలన్నారు. రైతుల సమగ్ర సమాచారాన్ని సీఎం కేసీఆర్ ఆదేశాల ప్రకారం వెంటనే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఎరువులు, పురుగుమందుల నిల్వకోసం గోదాంలను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, వేసవిలో వేరుశనగ విత్తనాల కొరత రాకుండా ఇప్పటినుంచే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఒక్క ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే 1.50 లక్షల క్వింటాళ్ల అవసరం ఉన్న నేపథ్యంలో దీనికి సంబంధించి నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ఎవరికీ నష్టం లేకుండా అందరికీ ఆమోదయోగ్యమైన నివేదిక తయారుచేయాలని ఆదేశించారు. అవసరమైతే ఒక కమిటీని ఏర్పాటుచేసుకోవాలని మంత్రి సూచించారు.



ఎరువులు, విత్తనాల సరఫరాపై మంగళ వారం సచివాలయంలో వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

## రిజిస్ట్రేషన్లశాఖ నుంచి చలానా యాప్

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** స్థిరాస్తుల కొనుగోలు, అమ్మకాల సందర్భంగా చలానాను మొబైల్ నుంచే చెల్లించేలా 'చలానా యాప్'ను రిజిస్ట్రేషన్లశాఖ రూపొందించింది. ఇప్పటివరకు ఎస్బీఐకి వెళ్లి రిజిస్ట్రేషన్‌కు అవసరమైన 6 శాతం స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజును ఈ-చలానా రూపంలో చెల్లించాల్సివచ్చేది. ప్రస్తుతం గూగుల్ ప్లేస్టోర్‌లోటీ-రిజిస్ట్రేషన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని టీ-చలానా ద్వారా రుసుం చెల్లించవచ్చు.యాప్‌ను బుధవారం నుంచి అందుబాటులోకి తెస్తున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ జేసీ వేముల శ్రీనివాసులు తెలిపారు.

## ప్రధానితో ఏపీ సీఎం భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రధాని మోదీతో ఏపీ సీఎం జగన్ మంగళవారం ఢిల్లీలో పార్లమెంట్ కార్యాలయంలో 45 నిమిషాలపాటు భేటీ అయ్యారు. ఏపీకి అంశాలను ప్రధాని వద్ద జగన్ ప్రస్తావించినట్టు తెలుస్తున్నది.

## 10న సీపీజీఈటీ ఫలితాలు

**ఉస్మానియా యూనివర్సిటీ:** రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి తొలిసారి నిర్వహించిన సీపీజీఈటీ- 2019 ఫలితాలు 10న విడుదల చేస్తున్నట్టు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్ కిషన్ తెలిపారు. 46 పీజీ, నాలుగు ఇంటిగ్రేటెడ్ పీజీ, పది పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు.

## మత్తయ్యపై కేసు నమోదు

**ఉస్మానియా యూనివర్సిటీ:** దళిత క్రైస్తవ ధర్మ పరిరక్షణ సమితి సభ్యుడు జెరూసలెం మత్తయ్యపై ఓయూఠాణాలో కేసు నమోదైంది. తార్నాకలో ఉండే మామిడాల కనకరాజు(30) ప్రభుత్వోద్యోగి. ఈ ఏడాది జనవరిలో ఏలియా, కోటేశ్వర్‌రావులు వ్యాపారం పేరుతో రూ.14 లక్షలకు మోసం చేశారని ఆయన ఓయూ పోలీసులకు ఫిర్యాదుచేశారు. నిందితులు అరెస్టుకాగా, కేసును వాపస్‌తీసుకోవాలని మత్తయ్య బెదిరిస్తున్నాడని కనకయ్య ఫిర్యాదుచేయగా, పోలీసులు కేసు నమోదుచేశారు.

# సచివాలయ తరలింపు ఏర్పాట్లు ముమ్మరం

- అధికారులతో సీఎస్ జోషి సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సచివాలయం తరలింపు ప్రక్రియను అధికారులు ముమ్మరం చేశారు. తుది కార్యాచరణలో భాగంగా బూర్గుల రామకృష్ణారావుభవన్‌లో మరమ్మతులు చేయిస్తున్నారు. మరమ్మతు పనులు నెలాఖరుకల్లా పూర్తిచేసి మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులకు చాంబర్లు, ఇతర సదుపాయాలు సమకూర్చనున్నారు. ఇంధన, రెవెన్యూ, జీఏడీ శాఖల ప్రత్యేక ప్రధానకార్యదర్శులతోపాటు ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి, రోడ్లు, భవనాలశాఖ ఈఎన్సీలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి మంగళవారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సచివాలయాన్ని తరలించేందుకు బూర్గుల రామకృష్ణారావు భవన్‌ను ఎప్పటిలోగా సిద్ధం చేయగలరని ఈఎన్సీని అడిగారు. ఈ నెలాఖరుకల్లా మొత్తం ఏర్పాట్లు చేసి సచివాలయం తరలించి అక్కడ కార్యాలయాలు నిర్వహించుకొనేలా చేయగలమని ఈఎన్సీ వివరించినట్లు తెలిసింది. ఈ మేరకు పూర్తిస్థాయి నివేదిక బుధవారం ఇవ్వాలని ఆయనను సీఎస్ సూచించారు. ప్రస్తుతం ఉన్న సచివాలయాన్ని బీఆర్కే భవన్‌కు మార్చాలని నిర్ణయించిన తరువాత.. ఆ భవన్‌లో ఉన్న కార్యాలయాల తరలింపు చేపట్టారు. బీఆర్కే భవన్ అంచనాలు సిద్ధంచేసి.. ఏ అంతస్తులో ఎవరు ఉండాలి అనేది నిర్ణయించారు. దీనికి అనుగుణంగా కార్యాలయాలను రోడ్లు, భవనాలశాఖ సిద్ధం చేయనున్నది.



# 78 డిగ్రీ కాలేజీల్లో జీరో అడ్మిషన్లు

- దోస్త్ కన్వీనర్ లింబాద్రి వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దోస్త్-2019 పరిధిలో ఉన్న 987 డిగ్రీ కాలేజీల్లో 78 కాలేజీలు ప్రవేశాల ఖాతా తెరువలేదు. ఆ కాలేజీల్లో ప్రవేశాలను పొందేందుకు కనీసం ఒక్కరు కూడా ముందురాలేదు. గతేడాది 54 కాలేజీల్లో జీరో అడ్మిషన్లు నమోదవగా.. ఈ ఏడాదిలో ఆ జాబితాలో మరో 24 కాలేజీలు చేరాయి. ఈ ఏడాది తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 6, శాతవాహన యూనివర్సిటీలో పరిధిలో 10, కేయూ పరిధిలో 26, మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో 13, ఓయూ పరిధిలో 18, పాలమూరు యూనివర్సిటీ పరిధిలో 5 కాలేజీల్లో జీరో అడ్మిషన్లు నమోదయ్యాయని దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. ఈ ఏడాది వివిధ కాలేజీల్లోని 727 కోర్సుల్లో కూడా జీరో అడ్మిషన్లే నమోదయ్యాయని, ముఖ్యంగా బీఎస్సీలో లైఫ్‌సైన్స్ లాంటి కొన్ని కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులెవరూ ముందుకు రావడంలేదని ఆయన చెప్పారు. అయితే మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న కోర్సులతోపాటు ఎక్కువ ఉద్యోగావకాశాలున్న కోర్సులకు డిమాండ్ పెరుగుతున్నదని లింబాద్రి తెలిపారు.

## కెనడాలో తెలంగాణ యువకుడి ఆత్మహత్య

- చెరువులో దూకి బలవన్మరణం
- ఆర్థిక ఇబ్బందులే కారణం

**తుక్కుగూడ:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంఖాల్ గ్రామానికి చెందిన బుస్సు జగన్‌మోహన్‌రెడ్డి (29) కెనడాలోని టొరంటోలో ఆత్మహత్య చేసుకున్నారు. గతనెల 27న ఉద్యోగ నిమిత్తం టొరంటోకు వెళ్లిన రెండ్రోజులకే ఆర్థిక ఇబ్బందుల కారణంగా అక్కడున్న చెరువులో దూకి జగన్‌మోహన్‌రెడ్డి బలవన్మరణానికి పాల్పడినట్టు తెలుస్తున్నది. స్థానిక పోలీసులు చెరువులో ఉన్న గుర్తుతెలియని మృతదేహాన్ని స్వాధీనంచేసుకోగా.. జేబులో ఉన్న చీటీ ఆధారంగా జగన్‌మోహన్‌రెడ్డిగా గుర్తించారు.



జగన్‌మోహన్‌రెడ్డి

# అమరవీరుల స్ఫూర్తిని చాటుతాం

- స్మృతిచిహ్నం నిర్మాణపనులను పరిశీలించిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రాణాలర్పించిన అమరవీరుల జ్ఞాపకార్థం నిర్మిస్తున్న స్మారక చిహ్నం తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని చాటిచెప్పేలా ఉంటుందని రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. దీనిని హైదరాబాద్ లుంబినిపార్క్ సమీపంలో 3.20 ఎకరాల స్థలంలో రూ.వందకోట్ల ఖర్చుతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని అమరవీరుల స్మారకచిహ్నం నిర్మాణపనులను మంత్రి పరిశీలించారు. తెలంగాణ ఉద్యమంలో 369 మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారని గుర్తుచేశారు. 1969 ఉద్యమంలో అమరులైనవారి గుర్తుగా అసెంబ్లీ ఎదుట అమరవీరుల స్తూపం నిర్మించారని, మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఆ స్తూపం స్ఫూర్తినిచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని భావితరాలకు అందించడంతోపాటు, అమరుల త్యాగాలను గుర్తుచేయడానికి ఈ స్మృతిచిహ్నం నిర్మిస్తున్నట్టు చెప్పారు. పార్కింగ్‌తోపాటు మ్యూజియం, ఫొటోగ్యాలరీ, ఆడియోరూం తదితర సౌకర్యాలతో అత్యంత నాణ్యతతో నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి, ఇతర ఇంజినీర్లు పాల్గొన్నారు.



లుంబినీపార్కు సమీపంలో తెలంగాణ అమరవీరుల స్మృతిచిహ్నం నిర్మాణపనులను పరిశీలిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



జూలో మృతిచెందిన తెల్లపులి (వినయ్)

## జూలో తెల్లపులి మృతి

**చార్మినార్:** హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో రాయల్ బెంగాల్ టైగర్ జాతికి చెందిన మగ తెల్లపులి (వినయ్) అనారోగ్యంతో మృతి చెందింది. 21 ఏండ్ల ఆరునెలల వయసున్న పులికి కొంతకాలంగా ప్రత్యేక చికిత్స అందిస్తున్నామని జూ క్యూరేటర్ క్షితజా చెప్పారు. సోమవారం రాత్రి 11 పులి మృతి చెందిందని వివరించారు. .

## కోనేరు కృష్ణకు బెయిల్ నిరాకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అటవీ అధికారులపై దాడి కేసులో నిందితుడు కోనేరు కృష్ణకు బెయిల్ మంజూరుకు హైకోర్టు నిరాకరించింది. తప్పుడు ఆరోపణలతో పోలీసులు కేసులు నమోదుచేశారని, బెయిల్ ఇవ్వాలని కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేస్తున్నట్టు మంగళవారం ధర్మాసనం ప్రకటించింది.

## 69 మున్సిపాల్టీల్లో ఎన్నికలకు నిరాకరణ

- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో వార్డుల విభజన, ఇతర ప్రక్రియలపై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాని 69 మున్సిపాల్టీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అనుమతించాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిపాదనను ఆమోదించేందుకు హైకోర్టు నిరాకరించింది. వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియకు కేటాయించిన సమయాన్ని తగ్గిస్తూ జారీచేసిన జీవోలను సవాల్ చేస్తున్నామని, ఆ జీవోల ప్రకారం ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని పిటిషనర్లు వాదించడంతో 69 మున్సిపాల్టీల్లో ఎన్నికల నిర్వహణకు హైకోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. పిటిషనర్ల వాదనపై ఈ నెల 9లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.

# నేతన్నల జీవితాల్లో కొత్త వెలుగులు

- ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ప్రభుత్వ పథకాలు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**తెలంగాణ ఏర్పడ్డాక నేతన్నల బతుకులు మారిపోయాయి. సీఎం కేసీఆర్ రూపొందించిన పథకాలు ఇప్పుడు దేశంలో అన్నిరాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం గత రెండేండ్లుగా చేనేతదినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నది. గతంలో నేత కార్మికులు ఉపాధికోసం వలసలు వెళ్లారు. ఈ వృత్తికి మళ్లీ జీవంపోయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అందుకు అనుగుణంగా పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు.

**బ్రాండ్ అంబాసిడర్‌గా కేటీఆర్**

చేనేత వస్త్రాల విక్రయాలను పెంచడానికి గతంలో పరిశ్రమలు, ఐటీ, చేనేత, జౌళిశాఖ మంత్రిగా వ్యవహరించిన కే తారకరామారావు పెద్ద ఉద్యమాన్నే చేపట్టారు. చేనేతకు తానే బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. ప్రతి సోమవారం ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, ప్రైవేటు కంపెనీల ఉద్యోగులు చేనేత వస్త్రాలను ధరించే విధంగా పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలన్నింటినీ చేనేత కళాకారులకు ఆర్డర్లు ఇస్తున్నారు. నూలు, రంగు, రసాయనాలపై 50శాతం రాయితీ ఇస్తున్నది. నేతన్నకు చేయూత పథకం ద్వారా ప్రతినెలా ఆదాయంలో 8 శాతం జమచేస్తే.. ప్రభుత్వం 16 శాతం జమచేస్తున్నది. వ్యక్తిగత రుణాలు లక్ష వరకు మాఫీచేశారు. బడ్జెట్‌లోనూ రెండేండ్లుగా రూ.400 కోట్ల చొప్పున చేనేతకు కేటాయిస్తున్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో చేనేత వస్త్రప్రదర్శన ఏర్పాటుచేశారు. వారంపాటు ఈ ప్రదర్శన కొనసాగుతుంది. బుధవారం సాయంత్రం కొండాపూర్‌లోని ఆర్ట్ గ్యాలరీలో ఫ్యాషన్‌షో ఏర్పాటుచేశారు. తేలియా రుమాల్, మహదేవ్‌పూర్ టస్సర్ సిల్క్‌వస్త్రాలతో ఫ్యాషన్‌షో నిర్వహిస్తారు. రాష్ట్ర మంత్రి మహమూద్‌అలీ ఈ ప్రదర్శనను ప్రారంభిస్తారు. నేత కార్మికులకు చేనేత అవార్డులు ప్రదానంచేస్తారు.






కృష్ణమ్మకు ఎగువ నుంచి భారీగా వస్తున్న వరదనీటితో కళ కళ లాడుతున్న జూరాల ప్రాజెక్టును చూసేందుకు సందర్శకులు పోటెత్తారు. కొన్ని రోజులుగా నిత్యం ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదుల చేస్తుండటంతో జలప్రవాహాన్ని వీక్షిస్తూ సందర్శకులు ఆహ్లాదకరమైన వాతావరణంలో సరదగా గడుపుతున్నారు. కృష్ణమ్మ పరవళ్లను కెమెరాలతో బంధిస్తూ జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. జూరాల ప్రాజెక్టు వద్ద తాత్కాలిక దుకాణాలు కూడా వెలిశాయి. మత్స్యకారులు అక్కడే చేపలు పట్టి విక్రయిస్తుండటంతో ఆ రుచులను ఆస్వాదిస్తూ పర్యాటకులు సేదతీరుతున్నారు. -హైదరాబాద్, నమస్తే తెలంగాణ

# ఆవుదూడల ఉత్పత్తే లక్ష్యం

- కామారెడ్డిలో రెండువేల ఆవులపై తొలి ప్రయోగం

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** ఆవుల సంఖ్యతోపాటు పాల ఉత్పత్తి పెంచడానికి పెయ్య (ఆవు) దూడలను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ (టీఎస్ఎల్డీఏ) చర్యలు చేపడుతున్నది. ఇందుకోసం కరీంనగర్‌లోని వీర్యనాళికల కేంద్ర పరిసరాల్లో లింగ నిర్ధారణ వీర్య ప్రయోగశాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నది. వచ్చే ఐదేండ్లలో ఏటా రెండు లక్షల డోసుల వీర్యం ఉత్పత్తి లక్ష్యంగా అమెరికా సాంకేతికతను ఈ ప్రయోగశాలలో అందుబాటులోకి తీసుకురానున్నది. రెండునెలల కిందటే దీనికోసం టెండర్లు ఆహ్వానించగా కొన్ని సంస్థల నుంచి దరఖాస్తులు వచ్చాయని టీఎస్ఎల్డీఏ సీఈవో డాక్టర్ మంజువాణి తెలిపారు. ప్రయోగశాల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో రూ.47.5 కోట్ల నిధులు సమకూర్చనున్నాయి. ప్రయోగశాలలో సాహీవాల్, ముర్ర జాతి పశువుల వీర్యాన్ని లింగ నిర్ధారణ అనంతరం ఎంపికచేసిన ఆవులకు ఇవ్వనున్నారు. ప్రయోగాత్మకంగా కామారెడ్డి జిల్లాలో రెండువేల ఆవులపై ప్రయోగం చేయాలని నిర్ణయించారు.

## బీఫార్మసీలో 6,262 సీట్లు భర్తీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 119 బీఫార్మసీ కళాశాలల్లో 93.8 శాతం సీట్లు నిండాయని అడ్మిషన్ కమిటీ కన్వీనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎంసెట్ (బైపీసీ) విభాగం సీట్ల కేటాయింపు పూర్తిచేశారు. దీని ప్రకారం బీఫార్మసీలో 6,679 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 6,262 సీట్లు నిండాయని, 417 సీట్లు మిగిలాయని తెలిపారు. 54 ఫార్మాడీ కళాశాలల్లో 1,093 సీట్లు ఉండగా.. అన్ని సీట్లు భర్తీ అయ్యాయని, బయోటెక్నాలజీ కళాశాలలో ఉన్న 21 సీట్లు నిండాయని చెప్పారు.

## లోడ్ క్రమబద్ధీకరణకు ముగిసిన గడువు

- పథకాన్ని నిలిపివేసినట్టు ప్రకటించిన ఎస్పీడీసీఎల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గృహ విద్యుత్ వినియోగదారులు (ఎల్టీ-1క్యాటగిరి) అదనపు లోడ్‌ను స్వచ్ఛందంగా క్రమబద్ధీకరణ పథకం గడువు ముగిసింది. ఎల్టీ-1 క్యాటగిరి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకొన్నవారికి తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్సీ) ఆదేశాల మేరకు డెవలప్‌మెంట్ ఛార్జీలో 50 శాతం రాయితీని కల్పించే పథకాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీన ఎస్పీడీసీఎల్ ప్రారంభించింది. మొదట్లో ఆరునెలల పాటు ఈ పథకాన్ని కొనసాగించేందుకు ఈఆర్సీ అనుమతించింది. దాని ప్రకారం మంగళవారంతో గడువు ముగిసినందున ఈ పథకాన్ని నిలిపివేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. గడువు తేదీ వరకు 16,600 కనెక్షన్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులు వచ్చినట్టు పేర్కొన్నది.

## ప్రస్తుత విధివిధానాలే అమలుచేయాలి

- కార్మికశాఖకు విన్నవించిన పలు విద్యుత్ సంఘాల నేతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లపై ప్రస్తుతం ఉన్న విధివిధానాలనే అమలుచేయాలని పలు విద్యుత్ సంఘాల నేతలు కార్మికశాఖకు విన్నవించారు. సోమవారం కార్మికశాఖ జాయింట్ కమిషనర్ ఈ గంగాధర్, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, డైరెక్టర్ అశోక్‌కుమార్ సమక్షంలో జరిగిన చర్చల్లో కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. జెన్‌కోలో మాత్రమే సర్వీస్ రూల్స్ ఉన్నాయని, మిగతా విద్యుత్ సంస్థల్లో లేవని తెలిపారు. ఫలితంగానే ఆర్టిజన్స్‌కు ప్రత్యేక విధివిధానాలను అమలుచేస్తున్నట్టు స్పష్టంచేశారు. చర్చల్లో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (1535) రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ వజీర్, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు వెంకట్ నాయక్, అబ్దుల్‌తఖీ, హుస్సేన్, అజీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు గెస్ట్‌లెక్చర్లు ఇప్పించాలి

- మోడల్ స్కూల్ వార్షిక సదస్సులో విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచేందుకు వివిధ రంగాలకు చెందిన నిపుణులతో ప్రతి నెల గెస్ట్‌లెక్చర్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి సూచించారు. మంగళవారం తెలుగు యూనివర్సిటీలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ సొసైటీ, తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీ వార్షిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు వారంలో ఒకరోజు కేటాయించాలన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద కార్పొరేట్ సంస్థలు, పూర్వ విద్యార్థులు ఆర్థిక సహకారం అందించాలన్నారు. పదో తరగతిలో ఉత్తమ జీపీఏ, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు, ఐఐటీ, నీట్, ఐఐఐటీల్లో సీట్లు సాధించడంతోపాటు ఆటలు ఆడటం, మొక్కలు నాటడం.. తదితర అంశాల్లో పురోగతి చూపిన పలువురు మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లను ఘనంగా సత్కరించారు.





# 24, 25 తేదీల్లో నార్ కాంక్లేవ్

- హైదరాబాద్‌లో మరో ప్రతిష్ఠాత్మక సదస్సు
- కాంక్లేవ్ వివరాలు వెల్లడించిన సంస్థ ప్రెసిడెంట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఆగస్టు 24, 25 తేదీల్లో 'గేమ్ చేంజర్' థీమ్‌తో 11వ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్- ఇండియా (నార్) కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ ప్రెసిడెంట్ సుమంత్‌రెడ్డి చెప్పారు. ఇందులో 1500 మందికిపైగా ప్రతినిధులు, 15 నుంచి 20 మంది ప్రముఖ వక్తలు పాల్గొంటారని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంక్లేవ్‌లో భాగంగా 22 సెషన్లు నిర్వహిస్తున్నామని, రెరా, ఆఫీస్ స్పేస్ తదితర అంశాలపై చర్చలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో నార్ కార్యదర్శి సరిత్‌కుమార్, జాయింట్ సెక్రటరీ తారక్ పాల్గొన్నారు.

# మద్య నిషేధంలో ఏపీ తొలి అడుగు

- 20 శాతం అమ్మకాలు తగ్గించే విధానాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీలో మద్య నిషేధం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. తొలివిడుతగా 20 శాతం మద్యం అమ్మకాలు తగ్గించేలా చర్యలకు పూనుకున్నది. కార్పొరేషన్ ద్వారా అమ్మకాలు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం విధివిధానాలు రూపొందిస్తున్నది. 4,377 షాపులకుగాను 3,500 షాపుల్లోనే మద్యం అమ్మకాలకు రంగంసిద్ధం చేస్తున్నది.



నమస్తే తెలంగాణ
జిందగీ
బుధవారం 7 ఆగస్టు 2019
WWW. NTNEWS.COM
/nt.zindagi


## 80 వేల మంది గుండెల్లో..

**ఆమె జీవితకాలం మొత్తం ఎదుటివారికోసం తాపత్రయపడింది. వారికోసం ఎన్నో సంస్థలు ప్రారంభించి అవార్డులు అందుకుంది. 80 వేల మంది మహిళలకు జీవితాన్నిచ్చింది. అందుకేనేమో ఇప్పుడామె లేకపోయినా పేరుమాత్రం అందరి గుండెల్లో నిలిచిపోయింది.**




గుజరాత్‌కు చెందిన అరుణాబెన్ శంకర్‌ప్రసాద్ దేశాయ్ 1946లో వికాస్ విద్యాలయాన్ని స్థాపించింది. పిల్లల కోసం ప్రాథమిక పాఠశాల, రెండు ఉన్నత పాఠశాలలు , పాలిటెక్నిక్, హస్తకళా కళాశాలలను స్థాపించింది. కొన్ని గ్రామాలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ పనులతో ఉపాధి కల్పించింది. పేద ప్రజలకు ఆశ్రయం, ఆరోగ్య సంరక్షణ, విద్య అందించడానికి ఒక వ్యవస్థాపక గృహాన్ని ప్రారంభించింది. కాస్మోపాలిటన్ హాస్టల్‌తో 800 మందికి పైగా బాలికలకు సహాయపడింది. అందుకుగాను అరుణాబెన్‌కు 2005లో జమ్నాలాల్ బజాజ్ అవార్డు ప్రదానం చేశారు. దీంతో పాటు 1981లో శిశు సంక్షేమ రంగానికి అవార్డు, 1989లో మహిళా సురక్ష అవార్డు, 2002లో శ్రీ రాజీవ్ గాంధీ మానవ సేవల పురస్కారాలు అందుకుంది. 83 ఏండ్ల వయసులో 2007 ఫిబ్రవరి 18న అరుణాబెన్ మరణించింది. ఈ వికాస్ విద్యాలయాన్ని గుజరాత్ ప్రభుత్వం సౌరాష్ట్ర పిల్లల చట్టం కింద పిల్లల సంక్షేమానికి 'ఫిట్ పర్సన్ ఇనిస్టిట్యూట్'గా పరిగణిస్తున్నది. ఆమె స్థాపించిన సంస్థలు వందలాది మందికి సహాయపడుతున్నాయి. భారతదేశంలోని ప్రముఖ సామాజిక కార్యకర్తలలో ఒకరిగా ఆమె పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది.

# తెలంగాణ చేనేత సౌఖ్యం!




ప్రోత్సాహం, ఆదరణ, ప్రచారం.. ఈ మూడు లభిస్తే ఏ రంగానికైనా ఢోకా ఉండదు. ఏ ఉత్పత్తికైనా డిమాండ్ పెరగాలన్నా, మార్కెటింగ్ లభించాలన్నా ఇంతకంటే ఏం కావాలి? పని చేసే శక్తి ఉంది. అంతకంటే నేర్పు ఉంది. గతంలో ఈ మూడు లభించలేదు. కానీ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కార్మికులకు, మాస్టర్ వీవర్లకు ప్రోత్సాహం లభిస్తున్నది. ప్రచారం విస్తృతంగా దొరికింది. ఇంకేముంది.. ఆదరణ నాలుగింతలైంది. అందుకే ఇప్పుడు చేనేత రంగంపై చర్చించుకోవాలంటే రాష్ట్రావిర్భావానికి ముందు, తర్వాత చెప్పుకోవాలి.





**వెండి జరి,** నాణ్యమైన సిల్క్‌తో చీరలను నేయగల నేర్పు తెలంగాణ చేనేత కార్మికుల సొంతం. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో ఈ రంగానికి విస్తృత ప్రచారం లభించింది. అందుకే ఇప్పుడు ఐటీ, పారిశ్రామిక, సినీ, క్రీడా, వ్యాపార, వాణిజ్య రంగాలకు విస్తరించింది. ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించాలన్న పిలుపు అనూహ్య ఫలితాలను ఇచ్చింది.

### తీరొక్క ఉత్పత్తులు

ఖాదీ వస్త్రాలకు గిరాకీ ఉన్నప్పటికీ ఖాదీలో తెలుపు మాత్రమే ఉంటుండడంతో రాజకీయ నాయకులకు మాత్రమే పరిమితం అనే భావన ఏర్పడింది. దీని నుంచి బయటకు వచ్చేందుకు మంచి అవుట్‌లుక్ రావడానికి అన్ని రంగులతో ఖాదీని నేస్తున్నారు. లాక్మే ఫ్యాషన్ వీక్ (ఎల్‌ఎఫ్‌డబ్ల్యూ) సమ్మర్-రీసోర్స్ డిజైన్లను ప్రదర్శించారు. ఖాదీకి ఆధునిక పోకడలను అద్ది ఔరా అనిపించారు. ఫ్యాషన్ వీక్‌లో ఖాదీ వస్త్రాలనే ప్రదర్శించారు. సాంప్రదాయక చేనేతలోనే పార్సి, కశ్మీరీ, చికంకారి, కుచ్చి వంటి ఎంబ్రాయిడరీ చేసి తయారు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో మగ్గాలు ఉన్నాయి. తొలుత కార్మికులను చైతన్యవంతులను చేయడం, అవసరమైన శిక్షణ ఇవ్వడం నిత్యకృత్యం. ఆకర్షణీయమైన వస్త్రాలను నేస్తే ఫ్యాషన్ ప్రియులు ఇష్టపడుతారని డిజైనర్స్ అభిప్రాయం. నేటి యువతకు అవసరమైన వస్త్రాలను, డిమాండ్‌ను గుర్తించినప్పుడు చేనేత రంగానికి పూర్వవైభవం వస్తుందంటారు.

### ఆర్గానిక్ వస్త్రాల్లోనూ మేటి

ఆర్గానిక్ వస్త్రాల ఉత్పత్తి కూడా కొనసాగుతున్నది. ఇక్కడి ఉత్పత్తులు అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, ఫిన్‌లాండ్, కొరియా, యూరప్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

లాస్‌ఏంజిల్స్, న్యూయార్క్, లండన్, తైవాన్ లాస్‌వేగాస్‌లో టెక్స్‌టైల్స్ ప్రదర్శనలను ఏర్పాటు చేసి వీటిపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలో మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లు, కార్మికులతో ఏకంగా మ్యాక్స్ సొసైటీలు ఏర్పడుతున్నాయి.

### ప్రధాని మెచ్చిన వస్త్రం

ఇండియా ఆఫ్రికా ఫోరం సమ్మిట్-2015లో పాల్గొన్న 60 మంది విదేశీ ప్రతినిధులు ధరించిన విభిన్న వస్త్రాలు తెలంగాణ ఉత్పత్తులే. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులకు కేంద్ర ప్రభుత్వం ముందుగానే వస్త్రాలను కుట్టించి బహుకరించింది. దీని కోసం హ్యాండీక్రాఫ్ట్ హ్యాండ్లూం ఎక్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనే సంస్థ దేశవ్యాప్తంగా శాంపిళ్లను సేకరించింది. వాటిల్లో నల్లగొండ జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన ప్రముఖ మాస్టర్ వీవర్ గజం అంజయ్య పంపిన 66 శాంపిళ్లనే ప్రధాని ఆమోదంతో అధికారులు ఎంపిక చేయడం విశేషం. ఇవి తెలంగాణకు ప్రత్యేకంగా గుర్తింపునిచ్చిన ఇక్కత్, దూప్యాన్ సిల్క్ రకాలే.

#### సాంస్కృతిక గుర్తు:

తెలంగాణ వచ్చిన తర్వాత చేనేత సాంస్కృతిక గుర్తుగా మారింది. ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించాలన్న కేటీఆర్ పిలుపుతో మార్కెటింగ్ ట్రెండ్ మారింది. కల్చరల్ సింబల్‌గా చూస్తున్నారు. ఇక్కత్, తేలియా రుమాల్ వంటి ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట, గొల్లభామ వంటి వాటికి ఆదరణ లభించింది. తెలంగాణ ప్రభుత్వం అనుసరించిన మార్కెటింగ్, ప్రచార ట్రెండ్‌ను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. ప్రస్తుతం కస్టమర్ ఉత్పత్తిదారుడి నుంచే నేరుగా కొనుగోలు చేయాలనుకుంటున్నాడు. దాంతో మధ్యవర్తులు తగ్గిపోతున్నారు.



**సుధ,** యూఎన్డీపీ దిశ భాగస్వామి

### విభిన్న వస్త్ర తెలంగాణ

నల్లగొండ, వరంగల్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇక్కత్, ఉప్పాడ, జమ్దానీ, కంచీ, రాజ్‌కోట్ (గుజరాత్ నమూనా), ఇక్కత్‌లో కోటా (రాజస్థాన్ డిజైన్లు) రకాల చీరలు ఉత్పత్తి చేస్తున్నారు. తాజాగా వీటన్నింటినీ ఆర్గానిక్, సహజ రంగులతోనూ రూపొందిస్తున్నారు. రూ.5 వేలు మొదలుకొని రూ.3 లక్షల దాకా పలికే చీరలను నేసే కార్మికులు ఉన్నారు. అలాగే నల్లగొండ జిల్లాలో కొందరు ఔత్సాహిక మాస్టర్ వీవర్లు లెనిన్‌తో ప్రయోగాలు చేస్తున్నారు. లెనిన్/లెనిన్, లెనిన్/కాటన్, లెనిన్/సిల్క్‌తో చీరలను నేయిస్తున్నారు. కళాంకారి కాటన్ చీరలను వెజిటెబుల్ కలర్స్‌తో ఉత్పత్తి చేస్తున్నారు. సిల్క్ మాదిరిగానే చేతితో డిజైన్లను అల్లిస్తున్నారు.

### అహింసా సిల్క్ అదరహో

తెలంగాణలోనే ఉత్పత్తి అవుతున్న అహింసా సిల్క్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. రాజేంద్రనగర్ మండలం మణికొండ పంచవటికాలనీలో నివాసముండే రిటైర్డ్ ఆప్కో అధికారి కుసుమ రాజయ్య అనేక పరిశోధనల ఫలితమే ఈ బ్రాండ్. ఫ్యాబ్రిక్, షూటింగ్, షర్టింగ్, టేబుల్ క్లాత్స్, కర్టెన్లు, చీరలు, డ్రెస్ మెటీరియల్స్ వంటి అనేక రకాల ఉత్పత్తులకు దేశ విదేశాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. కేవలం శాంపిళ్లు చూసి ఆర్డర్ ఇవ్వడం ద్వారానే ఉత్పత్తి చేస్తున్నప్పటికీ డిమాండ్ బాగుండడం విశేషం. హైదరాబాద్‌కు వచ్చే దేశ విదేశీ ఫ్యాషన్ డిజైనర్లు పంచవటికాలనీలోని రాజయ్య ఇంటిని సందర్శిస్తుంటారు. వస్త్ర ప్రపంచంలో ఇక్కత్‌తో పాటు ఇతర తెలంగాణ బ్రాండ్లకు అనూహ్యంగా డిమాండ్ పెరుగుతున్నది.

### అద్భుతాల సృష్టి

ఇక్కత్, టస్సర్ సిల్క్, పట్టు.. వస్త్రాలతో యువతను ఆకట్టుకునే రీతిలో డ్రెస్సులను రూపొందిస్తున్నారు. ముడిసరుకులో నాణ్యతకు పెద్ద పీట వేస్తుండడంతో వస్త్రాలకు మంచి ప్రాచుర్యం లభిస్తున్నది. డ్రెస్సులు, ఓవర్‌కోట్స్, టాప్స్, స్కర్టులు, కుర్తాస్, బాటమ్స్, దుప్పటాలు తయారు చేస్తున్నారు. వీకెండ్‌లో ధరించేందుకు చేనేత వస్త్రాలతో రూపొందించిన పలు డిజైన్లు ఆకట్టుకుంటున్నాయి. హ్యాండ్లూం ఇక్కత్ కాటన్‌తో బ్లూ వేవ్ ప్యాటరన్, సిల్క్, హ్యాండ్లూం ఇక్కత్ స్కర్టులు, హ్యాండ్లూం ఇక్కత్ కాటన్ సిల్క్ క్రాప్ టాప్‌లు, బోట్‌నెక్ ఇక్కత్ మోటిఫ్ కాటన్‌తో షర్టులు, హ్యాండ్లూం ఇక్కత్ ఫ్లేర్ షిఫ్ట్ డ్రెస్ వంటి రకాలతో ఆకట్టుకుంటున్నాయి.

#### కేటీఆర్ ప్రచారంతో:



చేనేతకు పాజిటివ్ వేవ్స్ మొదలయ్యాయి. కేటీఆర్ తనదైన శైలిలో ప్రచారం కల్పించారు. ఇప్పుడు చేనేత కార్మికుడు, మాస్టర్ వీవర్ వారి ఉత్పత్తులను అమ్ముకునేందుకు ప్రభుత్వం మీద ఆధారపడకుండా బయట మార్కెట్లో స్వేచ్ఛగా, లాభదాయకంగా విక్రయిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో చేనేత వస్త్రాలను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్న వారు అనేకం ఉన్నారు.

**యర్రమాద వెంకన్ననేత,**
జాతీయ చేనేత దినోత్సవ రూపకర్త

#### ప్రోత్సాహం చాలు :



చేనేత రంగానికి ఇప్పుడు ఢోకా లేదు. మార్కెటింగ్‌కు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం కూడా చేనేతకు విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నది. దాంతో అన్ని వర్గాలకు చేరుతున్నది. జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ద్వారా మరింత ప్రచారం కల్పించినట్లవుతుంది. అలాగే చేనేత వస్త్రాల ప్రత్యేకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

**తడ్కక యాదగిరి,**
జాతీయ చేనేత బోర్డు మాజీ సభ్యుడు



... **శిరందాస్ ప్రవీణ్‌కుమార్**
సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి

## అమ్మాయి డోలు బాజా



**డోలు వాయించడం అబ్బాయిలకే వస్తుందా? 'నేనూ వాయించగలను' అని చూపిస్తున్నదో అమ్మాయి. రిథమ్‌లో వాయిస్తుంటే అందరూ కాళ్లు కదపాల్సిందే! పెండిళ్లలో ఆ డోలు చప్పుడు అందరినీ మంత్రముగ్ధుల్ని చేస్తుంది.**


చండీగఢ్‌కు చెందిన జాహన్ గీత్ సింగ్ 14 యేండ్లకే 'భారతదేశ డోల్ అమ్మాయి'గా పేరు తెచ్చుకున్నది. జాహన్ ఏ పెండ్లికి వెళ్లినా అక్కడ మగవాళ్లే డోలు వాయించడం చూసింది. ఆడవాళ్లు ఎందుకు వాయించకూడదని అనుకున్నది. అన్నింటిలో ముందుండే మహిళలు దీంట్లో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ఆలోచించింది. డోలు నేర్చుకుంటానని తండ్రిని అడిగింది. ఆమె తండ్రి హరిచరణ్ సింగ్ కొడుకు కంటే కూతురు ఏ మాత్రం తీసిపోదని నమ్మే మనిషి. అందుకే కూతురు పేరు జహాన్ గీత్ కౌర్‌కు బదులుగా జహాన్ గీత్ సింగ్ అని పిలుస్తుంటాడు. డోలు బరువు కనీసం 8 కిలోల వరకు ఉంటుంది. జహాన్ దీన్ని పట్టుకొని వాయించడం ఛాలెంజింగ్‌గా తీసుకున్నది. జహాన్‌కు పంజాబ్ సంస్కృతి అంటే బాగా ఇష్టం. అక్కడ డోలు లేకుండా వేడుక జరుగదు. ఆమె ఫ్రెండ్స్ చాలా మంది గిటార్, సితార్, హార్మోనియం వంటి వాయిద్యాలను ఎంచుకుంటే.. జహాన్ మాత్రం డోలువైపు మొగ్గుచూపింది. సర్దార్ కర్తార్ సింగ్ దగ్గర శిక్షణలో చేరింది. మొదట్లో ఆయన నేర్పడానికి ఒప్పుకోలేదు. ఆ తర్వాత జహాన్‌ను కూతురిగా స్వీకరించి గురువు అయ్యాడు. స్కూల్ తర్వాత రోజుకు 3 గంటల కేత్రాల సరిహద్దుల్లో డోలు ప్రాక్టీస్ చేసేది. ఆ బరువును మోయలేక, ఆ డప్పు వాయిస్తుంటే చేతులకు రక్తస్రావం అయ్యేది. అయినా అవేవీ పట్టించుకోకుండా పట్టుదలతో జహాన్ డోలు నేర్చుకుంది. ఈ మధ్య డోలు వాయించే వీడియోలను సోషల్ మీడియాలో పెట్టడం ప్రారంభించింది. ఆ వీడియోలకు రెండు లక్షల మంది వ్యూయర్లున్నారు. ప్రస్తుతం 21 ఏండ్ల జహాన్ లా చదువుతున్నది.

## మేకప్‌తో పని లేకుండా..



**అందం విషయంలో ఏ ఒక్కరూ రాజీ పడరు. ఎలాంటి క్రీములు, మేకప్ ప్రొడక్ట్స్ వాడకుండా ఆ కాలంలో వాళ్లు చాలా అందంగా ఉండేవారు. వారిలా అందంగా ఫ్రెష్‌గా కనిపించాలనుకుంటే ఈ కింది చిట్కాలు ప్రయత్నించండి.**

- వేపనూనె, నిమ్మరసం రెండింటినీ బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఆరిన తర్వాత నీటితో శుభ్రపరుచుకోవాలి. వీటిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాను నివారిస్తాయి. దాంతో చర్మంపై మచ్చలు తగ్గుతాయి.
- వేప నూనె, నిమ్మరసాన్ని సమానంగా కలుపాలి. ఈ మిశ్రమాఇన్న ముఖానికి రాయాలి. ఈ కాంబినేషన్ చర్మంలోని కొల్లాజెన్‌ను నివారిస్తుంది. ఏజింగ్ లక్షణాలను తగ్గిస్తుంది. ఇది చర్మంపై ముడుతలు కనబడకుండా చేస్తుంది.
- నిమ్మరసం, వేపనూనె మిశ్రమం బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇది చర్మం మీద గ్రేట్‌గా పనిచేస్తుంది. దాంతో స్కిన్ టోన్ మెరుగుపడుతుంది. చర్మాన్ని పిగ్మెంటేషన్ నుంచి కాపాడడంలో సహాయపడుతుంది.
- ఈ రెండింటి మిశ్రమం యాంటీసెప్టిక్‌గా పనిచేస్తుంది. ఇది మైనర్ బర్న్స్, రాషెస్, దురద వంటి లక్షణాలను నివారిస్తుంది.
- వేప, నిమ్మరసం మిశ్రమం నేచురల్ స్కిన్ టోనర్‌గా పనిచేస్తుంది. ఇది చర్మ రంధ్రాలను తగ్గించడానికి, స్కిన్ ఎలాసిటి పెంచడానికి సహాయపడుతుంది. దీంతో చర్మం మరింత మృదువుగా కనబడుతుంది.
- ఈ రెండింటి మిశ్రమంలోని నేచురల్ సామర్థ్యం వల్ల చర్మ రంధ్రాలను తెరుచుకునేలా చేసి మలినాలను తగ్గిస్తుంది. అంతేకాకుండా చర్మ రంధ్రాలను శుభ్రం చేసి చర్మం హెల్దీగా కనబడేలా చేస్తుంది.




## కిడ్నీ ఇవ్వాలంటే ఒకే బ్లడ్‌గ్రూప్ ఉండాలా?

**మా వారి వయసు 30 ఏండ్లు. కొంతకాలంగా అతనికి కాళ్లలో వాపు, బీపీ, వాంతులు వస్తుండడంతో డాక్టర్‌ను సంప్రదించాం. అన్ని రకాల పరీక్షలు చేసి క్రానిక్ కిడ్నీ సమస్య ఉన్నట్లు నిర్ధారించారు. డయాలసిస్ ప్రారంభించారు. వారానికి మూడుసార్లు చేస్తున్నారు. అయితే కిడ్నీ మార్పిడియే ఉత్తమం అని డాక్టర్ సలహా ఇచ్చారు. నా బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్. మా ఆయనది బీ పాజిటివ్. మా వారికి నా కిడ్నీ ఇద్దాం అనుకుంటున్నా. అయితే బ్లడ్ గ్రూపులు కలువకపోతే కిడ్నీ ఇవ్వడానికి అవకాశం లేదా? దయచేసి తెలుపగలరు.**

**- గీత,** సీతాఫల్‌మండి


బ్లడ్‌గ్రూప్‌లు కలువకపోయినా కిడ్నీ మార్పిడి వీలవుతుంది. ఆ అనుమానాలే వద్దు. మీరు కచ్చితంగా కిడ్నీ ఇవ్వాలి అనుకుంటే మీ వారికి నిస్సందేహంగా ఇవ్వొచ్చు. ఏబీఓఇన్ కంపటబుల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనే ఆధునిక వైద్య ప్రక్రియలో భాగంగా ఇలా ఇవ్వవచ్చు. వారానికి మూడుసార్లు డయాలసిస్ అంటున్నారు కాబట్టి సమస్య తీవ్రంగానే ఉన్నట్లు తెలుస్తుంది. దీనికి కిడ్నీ మార్పిడియే పరిష్కారం. ఏబీఓఇన్ పద్ధతి ద్వారా ప్రత్యేకమైన ప్లాస్మా ఫెరాసిస్ ప్రక్రియ ద్వారా వేర్వేరు బ్లడ్‌గ్రూపుల్లోని యాంటీజెన్‌ను కలిసేలా చేస్తారు. ఇదొక వరం లాంటిది. మీ వారికి మీరు కిడ్నీ దానం చేసి కొత్త జీవితాన్ని పొందవచ్చు. ఆల్ ది బెస్ట్.



**డాక్టర్ శశికిరణ్**
కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
మలక్‌పేట్

నమస్తే తెలంగాణ
# యువ
[ కరీంనగర్ ]
బుధవారం 7 ఆగస్టు 2019

## మంచిమాట



మర్యాదగా వినడం, వివేకంతో సమాధానమివ్వడం, ప్రశాంతంగా ఆలోచించడం, నిష్పాక్షికంగా నిర్ణయం తీసుకోవడం ప్రతి మనిషికీ అవసరం.

- సోక్రటీస్

## వాట్సప్ మెసేజ్

ఒక మహిళ 6 సంవత్సరాల పిల్లవాడితో రైలులో ప్రయాణిస్తున్నది. వారిద్దరూ పుస్తకాలు చదువుతున్నారు. తోటి ప్రయాణికులలో చాలా మందికి ఇది నమ్మశక్యంగా అనిపించలేదు. అప్పుడు వారిలో ఒకరు లేచి ''మామ్! ప్రస్తుతం ప్రపంచంలోని పిల్లలంతా స్మార్ట్‌ఫోన్‌లతో ఆడుతున్నారు. కానీ, ఈ పిల్లవాడు ట్రెయిన్ ఎక్కినప్పటి నుంచి చూస్తున్నా, పక్కకు చూడకుండా పుస్తకంలోనే తలదూర్చి ఉన్నాడు. ఇతడు ఫోన్‌తో ఎందుకు ఆడడం లేదు. పిల్లవాడు ఇలా ఎలా మీ మాట వింటున్నాడు. అతన్ని ఇలా ఎలా తయారు చేశారు'' అని అడిగారు. దానికి ఆ మహిళ ప్రశాంతంగా ''సర్, పిల్లలు మన మాట వినరు. వారు తల్లిదండ్రులను ఫాలో అవుతారు'' అని సమాధానం ఇచ్చింది.

## ఏం డైలాగ్ గురూ..



మా నాన్న దృష్టిలో భార్య అంటే నచ్చి తెచ్చుకునే బాధ్యత. పిల్లలు మోయాలనిపించే బరువు. కానీ నా దృష్టిలో నాన్నంటే ఓ మర్చిపోలేని జ్ఞాపకం. (సన్నాఫ్ సత్యమూర్తి సినిమాలోని డైలాగ్)

## నవ్వుకొందాం

భార్యాభర్తలైన సుబ్బు, శ్రావణి ఏడు గంటలు ఏకధాటిగా దెబ్బలాడి అలసిపోయారు. చివరికి
సుబ్బు : సరే పైన దేవుడున్నాడు. నాది తప్పయితే నేనే పోతాను.. నీది తప్పయితే నువ్వే పోతావు అన్నాడు.
శ్రావణి : గుళ్లో అమ్మోరుంది. నాది తప్పయితే నా పసుపు కుంకుమలే పోతాయిలే అంది.

## అద్భుత ఛాయాచిత్రకారుడు

**ఫొటోగ్రాఫర్ అనగానే మనకు ఠక్కున వెలిగేది ఫొటోలు తీస్తాడని. కానీ ఆ ఫొటోల్లో జీవితాల్ని చూపించగలగడమే అతడిలోని ప్రత్యేక స్టైల్. అతనే కరీంనగర్‌కు చెందిన వారాల అన్వేష్. అందరిలా ఫొటోలు తీస్తే మజా ఏముంటుందనుకున్న ఆ యువకుడు ప్రపంచాన్ని భిన్నంగా చూపించే ప్రయత్నం చేస్తున్నాడు. ఇటీవలె జాతీయ ఫిలిం ఇనిస్టిట్యూట్ పరీక్షల్లో ప్రతిభచాటి శభాష్ అనిపించుకున్నాడు.**



కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, సినీ విమర్శకుడు వారాల ఆనంద్ కుమారుడే 24 ఏండ్ల వారాల అన్వేష్. ఫొటోగ్రఫీపై మక్కువ ఉన్న అన్వేష్ ప్రముఖ ఫొటోగ్రాఫర్‌ల పనితనాన్ని నిశితంగా పరిశీలించేవాడు. వాటిలో వేర్వేరు శైలిలను గమనించాడు. నీడలు, ప్రతిబింబాలను తన కెమెరాలో బంధించి ఫొటోగ్రఫికి కొత్తదనాన్ని తీసుకువచ్చాడు. తన కంటికి కనపడిన ప్రతిదాన్ని కూడా తన కెమెరాలో బంధించడం మాత్రమే కాక, ఆయన తీసిన ప్రతి ఫొటోలోనూ జీవితాలు ప్రతిబింబించేలా తీయడం అన్వేష్ ప్రత్యేకత.



సినిమాటోగ్రఫీ, ఫొటోగ్రఫీ పట్ల తనకున్న మక్కువతో ఇస్రోలో చేస్తున్న తన ఉద్యోగాన్ని కూడా వదిలేశాడు. ఇటీవలి వరకు స్వంతంగా ఛాయాచిత్రాలు తీసే కంపెనీని నిర్వహించాడు. ఇప్పటికే ఆయన పలు వెడ్డింగ్ వీడియోగ్రఫితో పాటు జి.వి.కె, టి. సుబ్బిరామిరెడ్డి, రామోజీరావు సంస్థలతోనూ పనిచేస్తున్నాడు. అయితే గతంలో ఫొటో కెమేరా కంటికి మాత్రమే చిక్కే అందమైన చిత్రాలను అన్వేష్ మొబైల్ కెమేరాతో చిత్రీకరించి తన ప్రతిభను చాటుకున్నాడు.

ఇదిలా ఉండగా జాతీయ ఫిలిం ఇనిస్టిట్యూట్, ప్రవేశపరీక్షల్లోనూ సత్తాచాటాడు. పుణె, కోల్‌కతాలోని ఫిలిం అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్‌లు నిర్వహించిన ప్రవేశపరీక్షల్లో వేర్వేరుగా ర్యాంకులు సాధించాడు. సత్యజిత్‌రే ఇన్‌స్టిట్యూట్‌లో ఐదు సీట్లు ఉండగా, ఇంటర్వ్యూ, ఓరియెంటేషన్‌లలో జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. పుణె ఇనిస్టిట్యూట్‌లో అదే కోర్సుకు పది సీట్లుండగా ఓబీసీ కోటాలో మొదటిర్యాంక్ సాధించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఫైన్‌ఆర్ట్స్ డీగ్రీ చేసిన అన్వేష్ భవిష్యత్‌లో కళాత్మక సినిమాలు తీయడానికి సినిమాటోగ్రఫీ కోర్సు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు.

## ఇది యువతుల పండుగ!

**సంప్రదాయానికి పెద్ద పీట వేస్తారు తండావాసులు. పండుగల సమయాల్లో దుస్తులు, సంప్రదాయ ఆభరణాలు ధరిస్తారు. అలంకరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. వారి కట్టు, బొట్టు ఎప్పుడూ ప్రత్యేకమే. ప్రతి ఏటా శ్రావణ మాసంలో వారు తీజ్ పండుగను నిర్వహిస్తుంటారు. పెళ్లికాని బంజారా యువతులు తీజ్ పండుగ జరుపుకుంటారు.**



తెలంగాణలోని బంజారాలు ప్రతి ఏటా శ్రావణమాసంలో తీజ్ పండుగ జరుపుకుంటారు. పెళ్లి కాని యువతులు తమకు మంచి భర్త దొరకాలని ఈ పండుగ నిర్వహించుకుంటారు. ఈ ఏడాది ఆగస్టు 3వ తేదీ నుంచి 11 వరకు తీజ్ పండుగ జరుపుకొంటున్నారు. యువతులు తొమ్మిదిరోజులు ఉపావాస దీక్షలు చేస్తారు. ఆకు కూరలు తింటూ పూజలు చేస్తారు. గోధుమలు లేదా ధాన్యాన్ని బుట్టలో వేసి రోజూ వాటికి నీళ్లు పోస్తారు. చివరి రోజు యువతులంతా కలిసి మొలకెత్తిన ధాన్యాలతో ఉన్న బుట్టలతో ఊరేగింపుగా వెళ్తూ పండుగ జరుపుకుంటారు. మంచి భర్త దొరకాలని తొమ్మిది రోజుల పాటు శివపార్వతులను నిష్ఠతో పూజిస్తారు. చివరి రోజు ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లి బుట్టల్ని నిమజ్జనం చేస్తారు. కొత్త బట్టలు ధరించి ఊయలలు ఊగుతూ ఆనందంగా గడుపుతారు. శివపార్వతుల ప్రేమకు ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు. కొత్తగా పెళ్లైన వారుంటే తీజ్ పండుగ రోజు కొత్త పెళ్లికూతురు తన పుట్టింటికి వెళ్తుంది. పుట్టింటి వద్ద స్నేహితులతో సరదాగా గడుపుతుంది. పెళ్లి కాని యువతులు పండుగ రోజు రాత్రంతా మెలకువతో ఉండి ఆటపాటలతో గడుపుతారు.

# తెలంగాణ పాలనలో..
# యువ ఐఏఎస్‌లు!

**శ్రమ నీ ఆయుధం అయితే.. విజయం నీ బానిస అవుతుంది. ఈ స్ఫూర్తి మంత్రం అందిరికీ తెలుసు. కానీ, శ్రమను ఆయుధంగా చేసుకునేది.. విజయాన్ని బానిసగా మలుచుకునేది కొందరే. ఆ కోవకు చెందినవారే ఈ యువ ఐఏఎస్‌లు. సివిల్స్-2018లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఐఏఎస్‌కు ఎంపికై శిక్షణ పూర్తిచేసుకున్న యువ అధికారులు రాష్ట్ర పరిపాలనా విభాగంలోకి అడుగుపెడుతున్నారు.**



### అభివృద్ధి సూపర్ ఫాస్ట్

మాసండ మగ్దలిన్ పెర్టిన్, (ట్రైనీ) అసిస్టెంట్ కలెక్టర్ వనపర్తి జిల్లా

అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చాను. తెలంగాణ క్యాడర్ రావడం నాకు చాలా సంతోషం. శిక్షణలో భాగంగా చాలా జిల్లాలు తిరిగాం. పట్టణ, గ్రామాల ప్రజలతో మాట్లాడాం. తెలంగాణ రాష్ట్రంలో పనిచేయడం చాలా ఆసక్తిగా ఉంది. కొత్త రాష్ట్రంలో కొత్త సవాళ్లు, లక్ష్యాలు ఉన్నాయి. అన్నింటినీ అధిగమిస్తూ పురోభివృద్ధిలో ముందుకు వెళ్లడం గొప్ప విషయం. సముద్ర మట్టానికి ఎత్తున ఉండటం వల్ల చాలా ప్రాంతాల్లో నీటి కొరత ఉంటుంది. గ్రావిటీ ద్వారా నీరు అందుతున్న ప్రాంతాలు తక్కువే. వీటిని దృష్టిలో పెట్టుకొని మొదలు పెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతం. ప్రాజెక్టు గురించి విన్నాను.. ప్రత్యక్షంగా చూస్తే గాని తెలియలేదు. నిజంగా చాలా పెద్ద ప్రాజెక్టు. తెలంగాణ సాగునీటి కష్టాలను తీర్చుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక్కడి చరిత్ర, సంస్కృతి, పర్యాటక ప్రాంతాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. బౌద్ధమతానికి తెలంగాణ రాష్ట్రానికి ఎంతో అనుబంధం ఉంది. ఎన్నో బౌద్ధ నిర్మాణాలు ఇక్కడ ఉన్నాయి. కాకతీయులు, కుతుబ్‌షాహీలు, నిజాంల కట్టడాలు అద్భుతంగా ఉన్నాయి. ఇక్కడి ఆహార అలవాట్లు చాలా ప్రత్యేకం. హైదరాబాద్ బిర్యానీ సూపర్. వనపర్తి, గద్వాల, పోచంపల్లి ఇలా చాలా ప్రాంతాల్లో చేనేత కళ విలసిల్లుతున్నది. సివిల్స్ సాధించడం చాలా కష్టం అని అంటారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని, నిరంతరం స్ఫూర్తిని రగిలించుకుంటూ ముందుకు వెళ్తే అసాధ్యమేమి ఉండదు.

### ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం

తేజాస్ నందపాల్ పవార్, (ట్రైనీ) అసిస్టెంట్ కలెక్టర్, కామారెడ్డి జిల్లా

మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా నుంచి వచ్చాను. నాకు తెలంగాణ క్యాడర్ రావడం లక్కీగా ఫీల్ అవుతున్నాను. అభివృద్ధి, సంస్కృతి పరంగా రాష్ట్రం ఎంతో రిచ్. ముఖ్యమైన ప్రాంతాలు తిరిగాము. ఇక్కడిది యునిక్ కల్చర్. రోజురోజుకీ అభివృద్ధిలో దూసుకుపోతున్నది. ఇక్కడి ఆహారం, సాంప్రదాయాలు నాకు చాలా నచ్చాయి. కామారెడ్డికి వెళ్తే ప్రజలు ఎంతో ఆదరణ చూపెట్టారు. సొంత గ్రామంలో ఉన్న ఫీలింగ్ కలుగుతున్నది. ఇక్కడి ప్రజలు ప్రభుత్వం మీద ఎంతో నమ్మకంతో ఉన్నారు. అద్భుతమైన కల్చర్ ఉంది.. నేను సైనిక్ స్కూల్‌లో చదివాను. ఎన్‌డీఏలో ఉద్యోగం సాధించాలి.. దేశానికి నా వంతు సేవ చేయాలని కోరిక ఉండేది. అయితే ఎన్‌డీఏకు సెలెక్ట్ అయినప్పటికీ కొన్ని కారణాల వల్ల అవకాశం చేజారింది. అందరూ అదే యూనివర్సిటీల్లో చేరుతారు.. అందరూ అవే పుస్తకాలు చదువుతారు.. కానీ టాపర్ మాత్రం ఒక్కరే ఉంటారు. లర్నింగ్ ప్రాసెస్ అనేది ముఖ్యం. నాలెడ్జ్ అనేది ఒక్క రోజు.. వారం.. సంవత్సరంలోనో వచ్చేది కాదు. ఇది నిరంతర ప్రక్రియ. స్నేహితులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పరిస్థితులు, అనుభవాలు.. ఇలా ప్రతీ దాని నుంచి కొంత నాలెడ్జ్ వస్తుంది. అంతే తప్ప అప్పటికప్పుడే రాదు. ఏదైనా సాధించాలంటే నాలెడ్జ్, స్కిల్, పర్సనాలిటీ అనేవి చాలా ముఖ్యం. ఏది కావాలో ఎంపిక చేసుకునే అవకాశం పిల్లలకు ఉండాలి. ఎవరో సివిల్స్ ర్యాంకు కొట్టారని, ఇంకెవరో సాఫ్ట్‌వేర్ అయ్యారని.. లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవద్దు. మా తల్లిదండ్రులు నాకు ముందు నుంచి స్వేచ్ఛను ఇచ్చారు. మార్కులు మాత్రమే చూసి ఎవర్నీ అంచనా వేయలేం.

### మన సమస్యలు కండ్ల నిండా చూశాను..

అనుదీప్ దూరిశెట్టి, అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) భద్రాచలం జిల్లా

ట్రైనీ ఐఏఎస్ అధికారిగా నాకు భద్రాచలం చాలా నేర్చుకునే అవకాశాన్ని కలిగించింది. స్వయంగా గిరిజనుల వద్దకు వెళ్లి వారి సమస్యలు ప్రత్యక్షంగా చూసే అవకాశం కలిగింది. దట్టమైన ఆటవీ ప్రాంతంలో ఉన్న గిరిజనులను చూసిన తరువాత ప్రభుత్వ పరిపాలనను అక్కడకు తీసుకువెళ్లడం ఛాలెంజింగ్‌లా ఉంది. భద్రాచలం జిల్లాల్లో గిరిజనులు, గిరిజనేతరుల సమస్య, గిరిజనుల పోడు భూముల సమస్యలున్నాయి. మైదాన ప్రాంతాల భూముల సమస్యలు ఉన్నాయి. వీటన్నింటితో పాటు గిరిజనులకు అన్ని ప్రాంతాల ప్రజలతో సమానంగా విద్య, వైద్యం,పోషకాహారం అందించాల్సి ఉంది...నా తండ్రి విద్యుత్ సంస్థలో ఉద్యోగి... నేను చదువుకునే రోజుల్లో రైతులు ఇంటికివచ్చి నా తండ్రికి కృతజ్ఞతలు తెలిపేవారు.. చిన్న ఉద్యోగి రైతులకు చెందిన సమస్యలు పరిష్కరిస్తే.. ఇంత చదువు చదివిన మనం ఏమి చేయాలి? ప్రజలకు సర్వీస్ ఎందుకు చేయకూడదు అని ప్రశ్నించుకున్నాను.. అయితే నాకు ఐఏఎస్ కావాలనే కోరిక ఇంజినీరింగ్‌లోనే బలపడింది. పేరెంట్స్ బాగా సపోర్ట్ చేశారు.. ర్యాంకు గురించి ఆలోచించకుండా సొంతగా చదివాను. సివిల్స్ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. ఐఏఎస్‌గా తెలంగాణలో చేయాలనుకున్నా.... ఫస్ట్ ర్యాంకు రావడంతో తెలంగాణలోనే వచ్చింది. సొంత రాష్ట్రంలో పని చేసే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పుట్టి పెరిగిన నాకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న తెలంగాణకు, ఇప్పటి స్వరాష్ట్ర తెలంగాణకు తేడా స్పష్టంగా కనిపిసున్నది. అప్పుడు ఉపాధి కోసం చాలా మంది గల్ఫ్‌కు వెళ్లే వాళ్లు.. ఇప్పుడు ఉపాధి ఇక్కడే దొరుకుతున్నది. అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో పని చేసే అవకాశం వచ్చింది. గ్రోత్ రేట్ బాగుంది. ఇక్కడి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి. రైతుబంధు పథకం దేశంలో పీఎం కిసాన్ పథకమైంది. ఇలా అబివృద్ధిలో అగ్రగామిగా తెలంగాణ ఉన్నందుకు గర్వంగా ఫీలవుతున్నా... అధికారిగా అందరికి న్యాయం చేయాలన్నదే నా కోరిక. తెలంగాణ యువ రాష్ట్రం... ఇక్కడ యువకులు ఎక్కువగా ఉన్నారు. ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఇక్కడి యువత చేరుకోవాలి. హైదరాబాద్ ఒక్కటే కాదు.. ఒక్కో జిల్లాను ఒక్కో నోడల్ హబ్‌లా అభివృద్ధి చేసుకోవాలి.

**సివిల్స్ పోటీలో రాష్ట్ర విద్యార్థులు..**



గతానికి ఇప్పటికీ చాలా మారింది.. 2011 వరకు పెద్దగా సివిల్స్‌పై తెలంగాణ విద్యార్థులు దృష్టి కేంద్రీకరించలేదు.. ఇప్పుడిప్పుడే పరిస్థితి మారుతున్నది. సివిల్స్‌ను తెలంగాణ యువత లక్ష్యంగా ఎంచుకుంటున్నది. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే వాళ్లు తమపై తాము నమ్మకం ఉంచుకోవాలి? మనకు ఎందుకు రాదు అని ప్రశ్నించుకొని సాధిస్తామని ముందుకు కదలాలి... తెలంగాణ నుంచి టాపర్స్ వస్తారు... ఆ నమ్మకం నాకుంది... సివిల్స్‌కు ప్రిపేర్ కావాలనుకునే విద్యార్థులందరికీ నావంతు సహకారం అందిస్తున్నాను. వెబ్‌సైట్, బ్లాగులో నేను రాసుకున్న నోట్స్ అందుబాటులో ఉంచాను... ఇప్పటికే 15 వేల డౌన్లోడ్స్ అయ్యాయి. anudeepdurishetty.in, anudeepblog లో నోట్స్ ఉన్నాయి, సందేహాలు తీరుస్తూ సలహాలు ఇస్తున్నా. anudeepd7@gmail.com ద్వారా అభ్యర్థులు నన్ను సంప్రదించవచ్చు.

### ఇక్కడి విద్యార్థినే

బుడుమజ్జి సత్యప్రసాద్, ట్రైనీ ఐఏఎస్ (వెయిటింగ్)

మాది ఏపీలోని విజయనగరం జిల్లా. హైదరాబాద్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. ఇంటర్ ఇక్కడే చేశాను. నాడు విద్యార్థిగా ఉన్నాను.. నేడు ఐఏఎస్ ఆఫీసర్‌గా ఎదిగాను. చాలా సంతోషంగా ఉంది. రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతున్నది. శిక్షణలో భాగంగా హైదరాబాద్ సహా, పలు జిల్లాలు సందర్శించాము. ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రత్యేకత ఉంది. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి అక్కడి వైద్యం గురించి తెలుసుకున్నాం. ఇక్కడి ఆసుపత్రులు చాలా బాగున్నాయి. హైదరాబాద్‌కు మెట్రో ఒక మణిహారం. చాలా ఆకర్షణీయంగా ఉంది. గతంలో కంటే ఇప్పటికి ట్రాఫిక్ పెరిగింది. నగరంలో పెద్ద సంఖ్యలో ఎంఎన్‌సీ కంపెనీలు ఉన్నాయి. ఐటీ రంగంలో ప్రత్యేక ముద్ర వేసింది. చిన్నతనంలో వార్తా పత్రికలు ఎక్కువగా చదివేవాడిని. ముఖ్యంగా జిల్లా ట్యాబ్లాయిడ్స్ చూసేవాడిని. అందులో అధికారుల గురించి చదువడం వల్ల నాకు స్ఫూర్తి కలిగింది. కళాశాలలో ఉండగా మాజీ ఐపీఎస్ అధికారిణి కిరణ్ బేడీ ప్రసంగం నాకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. సివిల్స్ ద్వారానే సేవ చేయడం సాధ్యమని చాలా మంది అనుకుంటారు.. మంచిదే. కానీ సేవ చేయాలనుకుంటే చాలా మార్గాలున్నాయి. ఏ రంగానికైనా దానికంటూ ఓ ప్రత్యేకత ఉంటుంది.

### సొంత రాష్ట్రానికి సేవ

కోయ శ్రీహర్ష అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) జోగులాంబ గద్వాల జిల్లా

భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పథకాల అమలులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో తెలంగాణ ముందున్నది.. పౌరసరఫరాల విభాగంలో పేదలకు ఇచ్చే రేషన్ పక్కదారి పట్టడానికి అవకాశం లేకుండా టెక్నాలజీని బాగా వాడుతున్నారు. అత్యంత ఆధునికమైన టెక్నాలజీని వినియోగించి చాలా క్రియేటీవ్ ఐడియాతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం.. తెలంగాణ ప్రభుత్వం అతి తక్కువ సమయంలో పట్టుదలగా నిర్మించింది. కృష్ణా నదిలో నీళ్లు లేవు, గోదావరిలో నీళ్లున్నాయి. గోదావరి నీటిని పూర్తి స్థాయిలో కృష్ణా బేసిన్‌లో కూడ వినియోగించుకునే ప్రణాళికలు రూపొందించడమనేది క్రియేటీవ్ ఐడియానే.. నాది ఖమ్మం జిల్లా.. స్కూల్ విద్య అంతా ఖమ్మంలోనే జరిగింది. అయితే ఇంటర్‌కు మాత్రం హైదరాబాద్ వచ్చి చదువుకున్నాను. అప్పుడు నాకు ఖమ్మం, హైదరాబాద్ తప్ప ఏదీ తెలియదు.. చాలామందికి స్వరాష్ట్రంలో పనిచేసే అవకాశం రాదు.. కానీ నాకు ర్యాంకు రావడం వల్ల పురిటి గడ్డపై పని చేసే అవకాశం వచ్చింది. అందుకు చాలా సంతోషంగా ఉంది.గద్వాలకు వెళ్లిన తరువాతనే అసలైన తెలంగాణను నా కళ్లతో చూడగలిగాను. అక్కడి పేదల కష్టాలు చూశాను.. ప్రజలు చాలా వెనుకబడి ఉన్నారు. అలా వెనుకబడి ఉన్న ప్రజలను అభివృద్ధి చేయాలన్న పట్టుదల నాకు కలిగింది. తెలంగాణలో చాలామంది విద్యార్థులు సివిల్స్ వైపు వెళ్లడం లేదు. తెలంగాణ సమాజానికి సేవ చేయడానికి సివిల్స్‌ను ఒక లక్ష్యంగా ఎన్నుకోవాలని విద్యార్థులను కోరుతున్నా.

.. తిప్పన కోటిరెడ్డి, సిద్దార్థ్ బీసగోని

జి. భాస్కర్

## సుడోకు

డైలీ సుడోకు 114 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 1 | 2 | 8 | 6 | 7 | 4 | 3 | 9 |
| 3 | 7 | 4 | 2 | 9 | 5 | 6 | 8 | 1 |
| 8 | 9 | 6 | 1 | 4 | 3 | 7 | 2 | 5 |
| 6 | 3 | 1 | 5 | 8 | 2 | 9 | 4 | 7 |
| 7 | 4 | 5 | 6 | 3 | 9 | 8 | 1 | 2 |
| 2 | 8 | 9 | 4 | 7 | 1 | 3 | 5 | 6 |
| 9 | 2 | 8 | 3 | 1 | 6 | 5 | 7 | 4 |
| 1 | 6 | 3 | 7 | 5 | 4 | 2 | 9 | 8 |
| 4 | 5 | 7 | 9 | 2 | 8 | 1 | 6 | 3 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 115

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 4 | | | | | 6 | |
| | | | | 8 | 5 | 9 | | 7 |
| | | 8 | 6 | | | | | |
| | 3 | | 8 | | | | | 9 |
| | | 7 | 9 | | 2 | 5 | | |
| 9 | | | | | 3 | | 4 | |
| | | | | | 8 | 4 | | |
| 5 | | 6 | 3 | 1 | | | | |
| | 8 | | | | | 1 | | |

## ట్వీట్

పరిణితీ చోప్రా
@ParineetiChopra



లండన్‌లో కొత్త సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ సినిమాలో నాది చాలా కష్టమైన రోల్. ఇక్కడ నేను ఏదో హాస్టల్‌లో ఉన్నట్లు ఫీలవుతున్నా. సోషల్ మీడియాలో గడిపేందుకు, ఇంకేదైనా పని చేసేందుకు అస్సలు సమయం దొరకడం లేదు. ఇక్కడ వాతావరణాన్ని కూడా ఎంజాయ్ చేయలేకపోతున్నా.



పరిణితీ చోప్రాను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
1,31,86,593

## కామన్‌మ్యాన్ వాయిస్

అన్నా కశ్మీర్ గురించి మీ అభిప్రాయం? కేఏ పాల్, బాలకృష్ణ అభిప్రాయం కోసం ఎదురుచూస్తున్నా. వారి అభిప్రాయం విన్నాక స్పష్టత వస్తుంది. హోదాపై ఆ మధ్య బాలయ్య బాబు చక్కగా మాట్లాడారు తెలుసు కదా?
– Murali Buddha

నీలోని 'ఇగో' పరిమాణాన్ని బట్టి.. నీ జీవితంలో పరిణామాలుంటాయి.. అవును ఇది ఓ ప్రమాణం..
– Siddu Reddy

అవసరం కోసం ప్రేమలు చూపించి.. అవసరం తీరాక ప్రోటోకాల్ మాట్లాడేవాడే పొలిటిషియన్.
– Ravinder Ryada

నీది అంటూ ఈ లోకంలో ఏదైనా ఉందంటే అది నీ అంతరాత్మే. దానిని వదులుకోకు ఏ క్షణాన..
– SivaPrasad NewsCaster SP

## వైరల్ వీడియో



ఇప్పడంతా సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ నడుస్తున్నది. అదే కథాంశంతో వచ్చే సినిమానే ఎవరు. చాలా రోజుల తర్వాత రెజీనా తెలుగు తెరపై మెరవబోతున్న సినిమా. అడవిశేషు, నవీన్ చంద్రలతో ఉన్న ఈ థియేట్రికల్ ట్రైలర్ ఇప్పడు వీక్షకులను ఆకట్టుకుంటున్నది. అందుకే ట్రెండింగ్‌లో టాప్‌లో ఉన్నది.

EVARU Theatrical Trailer | Adivi Sesh | Regina Cassandra | Naveen Chandra | Venkat Ramji |PVP Cinema

Total views : 21,16,872+
Published on 4 Aug 2019

# రాజీవ్ రికార్డును బీజేపీ బ్రేక్ చేస్తుంది

## ఎన్నికల్లో లబ్ధి కోసమే

## ఆర్టికల్ 370 రద్దు: యశ్వంత్ సిన్హా



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** రాజీవ్ గాంధీ రికార్డును బీజేపీ బ్రేక్ చేస్తుందని ఆ పార్టీ మాజీ నేత, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా అన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏ లను రద్దు చేశారని ఆయన విమర్శించారు. ఓ ప్రైవేట్ టీవీ చానల్ ఇంటర్వ్యూలో యశ్వంత్ సిన్హా మాట్లాడుతూ.. 'కేవలం రాజకీయ ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏను రద్దు చేసింది. త్వరలో దేశంలోని పలు ముఖ్యమైన రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల్లో లబ్ధి కోసమే జమ్ముకశ్మీర్‌పై కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది' అని విమర్శించారు. '1984లో ఇందిరా గాంధీ హత్య తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ సానుభూతి కారణంగా 567 స్థానాల్లో 426ని గెలుచుకున్నది. ఆర్టికల్ 370 రద్దు ద్వారా రాజీవ్ గాంధీ రికార్డును బీజేపీ బ్రేక్ చేసే అవకాశమున్నది' అని యశ్వంత్ సిన్హా అభిప్రాయపడ్డారు. అయితే ఈ నిర్ణయంతో జమ్మకశ్మీర్ ప్రజలు పరాధీనమయ్యే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు.


# నిగ్రహం పాటించండి

## భారత్, పాక్‌కు ఐక్యరాజ్యసమితి సూచన



**జెనీవా, ఆగస్టు 6:** భారత్, పాకిస్థాన్ నిగ్రహం పాటించాలని ఐక్యరాజ్యసమితి సూచించింది. జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ను కేంద్ర ప్రభుత్వం సోమవారం రద్దు చేయడంతోపాటు, ఆ రాష్ట్ర విభజనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టిన బిల్లును రాజ్యసభ ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్, పాక్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ తెలిపారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని సూచించారు. గుటెరెస్ అధికార ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ ఈ మేరకు మీడియాకు చెప్పారు. కశ్మీర్‌లోని ఆంక్షల గురించి తమకు సమాచారం ఉందన్నారు. కశ్మీర్ సమస్య పరిష్కారంపై ఐరాస చొరవ చూపుతుందా అన్న ప్రశ్నకు డుజారిక్ బదులిస్తూ.. 'భారత్, పాక్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై మేం చాలా ఆందోళన చెందుతున్నాం. ఈ విషయంలో ఐరాస ప్రధాన కార్యదర్శి పాత్రలో ఎలాంటి మార్పు లేదు. ఇరు దేశాలు కోరితే మధ్యవర్తిత్వానికి ఎప్పుడూ సిద్ధమే' అని అన్నారు. ఇటీవల భారత్, పాక్ సరిహద్దుల్లో నియంత్రణ రేఖ వెంబడి సైనిక కార్యకలాపాలు పెరుగుదలపై భారత్, పాక్ యూఎన్ సైనిక పరిశీలన బృందం (యూఎన్ఎంఓజీఐపీ) తమకు నివేదిక ఇచ్చిందన్నారు. అయితే 1972 నాటి సిమ్లా ఒప్పందంతో యూఎన్ఎంఓజీఐపీ ప్రాధాన్యత కోల్పోయిందని భారత్ భావిస్తున్నది.






# క్షణం.. క్షణం..




- జమ్ముకశ్మీర్ ఆపరేషన్‌కు అత్యంత పకడ్బందీగా కసరత్తు
- నెల రోజులే వ్యవధి ఉందని, తర్వాత పరిస్థితులు
- చేతిలో ఉండవని ప్రధానికి 'రా' ఛీఫ్ గోయెల్ హెచ్చరిక
- 370, 35-ఏ ఆర్టికల్స్ రద్దుకు గోప్యంగా సుదీర్ఘ కసరత్తు
- బీజేపీ ఎన్నికల ప్రణాళికతోపాటే సన్నాహాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:**

జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసే చారిత్రాత్మక తీర్మానాలను రాజ్యసభలో ప్రవేశపెట్టి ఆమోదించడానికి ముందు అత్యంత రహస్యంగా చాలా సుదీర్ఘ కసరత్తు జరిగింది. రాజ్యసభ సోమవారం ఈ తీర్మానాన్ని ఆమోదించడానికి ముందే జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ రంగంలోకి దిగారు. అప్పటికే శ్రీనగర్‌లో ఉన్న అజిత్ దోవల్ జమ్ముకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చే ప్రక్రియను దాదాపు ఎనిమిది గంటల నుంచి పర్యవేక్షిస్తున్నారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పిస్తున్న ఆర్టికల్ 370తోపాటు ఆ రాష్ట్రంలోని శాశ్వత నివాసితులకు ప్రత్యేక హక్కులను కల్పిస్తున్న ఆర్టికల్ 35-ఏను రద్దుచేయాలన్నది బీజేపీ, జనసంఘ్‌ల దీర్ఘకాలిక లక్ష్యం. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గతనెల 5న పార్లమెంట్‌లో చేసిన చారిత్రాత్మక ప్రకటనతో ఈ ప్రణాళిక తుది అంకానికి చేరినట్టు తెలుస్తున్నది. ఈ మొత్తం ప్రణాళిక గురించి పూర్తిగా తెలిసినవారు కేవలం కొద్దిమంది మాత్రమే. రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా) కొత్త అధిపతి సామంత్ గోయెల్ గత నెల 5న ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో)లో ప్రధాని నరేంద్రమోదీని కలుసుకున్నారు. 370, 35-ఏ ఆర్టికల్స్‌ను రద్దుచేసి జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని తొలిగించేందుకు కేవలం నెలరోజుల వ్యవధి మాత్రమే ఉన్నదని, ఆ తర్వాత పరిస్థితులు చేయిదాటిపోవచ్చని గోయెల్ ఈ భేటీలో ప్రధానిని హెచ్చరించారు. ఆఫ్ఘనిస్థాన్ విషయమై తాలిబన్లతో ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు పాకిస్థాన్‌తో అమెరికా పూర్తిస్థాయి చర్చలు జరుపనున్నదని, ఈ చర్చల ఫలితంగా అమెరికాకు, పాక్ మద్దతున్న తాలిబన్లకు మధ్య సెప్టెంబర్ 1 నాటికి ఒప్పందం కుదరవచ్చని గోయెల్ హెచ్చరించారు. ఇదేగనుక జరిగితే ఆ తర్వాత పాకిస్థాన్‌కు అమెరికా సైనిక, ఆర్థిక సహకారాన్ని పునరుద్ధరించే అవకాశమున్నదని, ఫలితంగా కశ్మీర్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రమూకలకు పాక్ నుంచి ప్రోత్సాహం మరింత పెరుగుతుందని గోయెల్ వివరించారు.

కాగా, ప్రధానితో గోయెల్ భేటీ కావడానికి చాలా రోజుల ముందే ఆర్టికల్ 370 రద్దుపై బీజేపీ ఉన్నతస్థాయి బృందం, న్యాయ నిపుణులు (వీరిలో కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి అరుణ్ జైట్లీ కూడా ఉన్నట్టు తెలుస్తున్నది) నిశ్చితమైన అభిప్రాయానికి వచ్చారు. రాష్ట్రపతి ఉత్తర్వుతో ఈ ఆర్టికల్‌ను రద్దుచేసేందుకు వీలున్నదని, జమ్ముకశ్మీర్‌లో గవర్నర్ పాలన ఉంటే సులభంగా ఈ పనిచేయవచ్చని వారు అభిప్రాయపడ్డారు. వాస్తవానికి ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీజేపీ మ్యానిఫెస్టోను రూపొందిస్తున్నప్పుడే ఆర్టికల్ 370 రద్దుకు సన్నాహాలు ప్రారంభమైనట్టు ఆ పార్టీ సీనియర్ నాయకులు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఘనవిజయాన్ని అందించడంతో ఆర్టికల్ 370 రద్దు హామీని నెరవేర్చగలమన్న నమ్మకం తమ పార్టీకి కలిగిందని, దీంతో ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఈ ఆర్టికల్ రద్దుకు సంబంధించిన తీర్మానాలు, బిల్లుల ఖరారు ప్రక్రియ వేగవంతమైందన్నారు.

ఆ తర్వాత అమిత్‌షా జూన్ 26న ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ అర్వింద్‌కుమార్‌తో పాటు కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌గౌబాతో కలిసి శ్రీనగర్‌లో పర్యటించడంతో ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన సన్నాహాలు మరింత ఊపందుకున్నాయి. ఆర్టికల్ 370తోపాటు ఆర్టికల్ 35-ఏ రద్దుకు జాతీయ భద్రతా సంస్థలు సంపూర్ణ అంగీకారాన్ని తెలియజేయగా.. ఈ చర్య వల్ల కశ్మీర్ లోయలో హింస చెలరేగవచ్చని అంతర్గత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తంచేశాయి. అయితే జూలై 11న 'రా' అధిపతి గోయల్, జూలై 23న ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ కశ్మీర్ లోయలో పర్యటించిన తర్వాత వచ్చిన సమాచారాన్ని పరిశీలించిన అనంతరం ఈ ఆర్టికల్స్ రద్దు విషయంలో ముందడుగు వేయాలని నరేంద్రమోదీ సర్కారు నిర్ణయించుకున్నది. ఈ నేపథ్యంలోనే అజిత్ దోవల్ గత నెల 24న సైనిక, ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ ఆర్టికల్స్ రద్దుకు తుది నిర్ణయం ఎప్పుడు జరిగిందో స్పష్టంగా తెలియకపోయినప్పటికీ గత పక్షం రోజుల్లోనే ఈ నిర్ణయం జరిగి ఉండవచ్చని ఈ వ్యవహారం గురించి తెలిసినవారు చెప్తున్నారు.


### ముందు జాగ్రత్త చర్యలు

ఆర్టికల్స్ 370, 35-ఏ రద్దు సందర్భంగా హింసాత్మక ఘటనలు తలెత్తకుండా చూసేందుకు ముందుజాగ్రత్తగా ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను నిలిపివేయాలని ముందే నిర్ణయించుకున్న కేంద్ర హోంశాఖ గత వారం జమ్ముకశ్మీర్ ప్రభుత్వానికి 2 వేల శాటిలైట్ ఫోన్లను పంపింది. మరోవైపు అల్లరిమూకలను నియంత్రించేందుకు జూలై చివరి వారంలో పీర్‌పంజాల్‌కు హెరోన్ డ్రోన్లను పంపగా, సైనిక విమానాలు పలు దఫాలుగా ఆహారం, తాగునీరు, మందులు లాంటి సహాయ సామగ్రిని కశ్మీర్‌లోయలోకి తరలించాయి. అమర్‌నాథ్ యాత్రను రద్దుచేయడం, కశ్మీర్‌లోయ నుంచి పర్యాటకులు వెళ్లిపోవాలని ప్రభుత్వం సూచించడంతో ఆర్టికల్ 35-ఏని మోదీ సర్కారు రద్దుచేయబోతున్నదన్న వదంతులతో గత శుక్రవారం నుంచి అలజడి మొదలైంది. ఈ ఊహాగానాలు జోరందుకుంటుండటంతో అమిత్‌షా ఈ నెల 4న 'రా' చీఫ్ గోయెల్, ఐబీ చీఫ్ కుమార్‌తో సమావేశమై సిద్ధంగా ఉండాలని సూచించారు. 35-ఏ, 370 ఆర్టికల్స్ రద్దు విషయాన్ని మోదీ ప్రభుత్వం సోమవారం పార్లమెంట్‌లో ప్రకటించనున్నదన్న విషయం జాతీయ భద్రతా సంస్థలకు బహుశా అప్పుడే తొలిసారి తెలిసి ఉండవచ్చు.

## ఆర్టికల్ 370 రద్దు..

# ఇప్పుడే ఎందుకు?

- కేంద్రంలో సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ
- కలిసొచ్చిన విపక్షాల అనైక్యత
- పాక్ కవ్వింపు చర్యలు.. ట్రంప్ మధ్యవర్తిత్వ వ్యాఖ్యలు కూడా కారణమే
- ట్రిపుల్ తలాక్ బిల్లు.. వెంటనే అధికరణం 370రద్దు..
- విపక్షాలను ఉక్కిరిబిక్కిరి చేసిన అధికార పక్షం



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగ అధికరణం 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సోమవారం నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. అయితే, ఇంతటి కీలక నిర్ణయాన్ని ఇప్పుడే తీసుకోవడం వెనుక మోదీ ప్రభుత్వం చాలా కసరత్తు చేసినట్టు కనిపిస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో సొంత మెజారిటీతో రెండో దఫా అధికారంలోకి వచ్చిన అతితక్కువ సమయంలోనే మోదీ సర్కారు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న 370 అధికరణాన్ని రద్దు చేయాలన్న ఆలోచన ఇప్పటిది కాదు. జనసంఘ్ పార్టీ (1951 – 1977) నడుస్తున్న కాలంలోనే కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి అవసరం లేదన్న అభిప్రాయం ఉండేది. అయితే, కొన్ని కారణాల వల్ల అది ఆచరణసాధ్యం కాలేదు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు చతికిలపడటం, బీజేపీకి సొంత మెజారిటీ రావడంతో కశ్మీర్‌పై ఏండ్లుగా గూడుకట్టుకుని ఉన్న నిర్ణయాన్ని అమలు పరచడం అధికార పార్టీకి సులభమైంది. పాకిస్థాన్ కవ్వింపు చర్యలు, ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా బలగాల మోహరింపు, కశ్మీర్ అంశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం చేస్తాననడం కూడా అధికరణం 370 రద్దుకు వివిధ కారణాలుగా మారాయి. కశ్మీర్ స్వయం ప్రతిపత్తి అంశంపై మోదీ -1 హయాంలోనే ఓ నిర్ణయం తీసుకోవాలని అనుకున్నప్పటికీ అది పురోగతి సాధించలేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం, ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆర్టికల్ 370ని రద్దుపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవడం వీలైంది. దీంతోపాటు ఇటీవలే ప్రవేశపెట్టిన ట్రిపుల్ తలాక్ బిల్లుపై విపక్ష పార్టీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న సమయంలోనే అధికరణం 370 రద్దు నిర్ణయాన్ని తీసుకురావడంతో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బలంగా తిప్పికొట్టడానికి విపక్షాలకు తక్కువ సమయం మాత్రమే చిక్కింది. ఇది కూడా అధికార పక్షానికి కలిసొచ్చింది. అధికరణం 370 రద్దుపై కొన్ని ప్రాంతీయ పార్టీలు మద్దతు తెలుపడం, మరికొన్ని పార్టీలు సభను వాకౌట్ చేయడంతో రాజ్యసభలో కశ్మీర్ విభజన బిల్లు సులభంగా ఆమోదం పొందింది. కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొనడం, బీజేపీ వ్యతిరేక ప్రాంతీయ పార్టీలైన కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ , వామ పక్షాలు తదితర పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో బీజేపీకి ఈ పరిస్థితులు సానుకూలంగా పరిణమించాయి. దీంతో పాటు అధికరణం 370 రద్దు నిర్ణయంపై ఆప్, ఎస్పీ, బీఎస్పీ, బీజేడీ, ఏఐఏడీఎంకే తదితర పార్టీలు బీజేపీకి మద్దతు పలుకడంతో మార్గం మరింత సుగమమైంది. జమ్ముకశ్మీర్‌లో హింసను సృష్టించేందుకు పాక్ ప్రయత్నించడం, పాక్‌తో అమెరికా సన్నిహిత సంబంధాలు, ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా బలగాల మోహరింపు, భారత్‌పై ద్వైపాక్షిక చర్చలకు పాక్ ఒత్తిడి ప్రయత్నాలు సాగించడం, అల్లర్లు సృష్టించి కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తీసుకొచ్చి భారత్‌ను ఇరకాటంలో పెడుదామని పాక్ భావించడం ఇత్యాది కారణాల నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం అధికరణం 370 రద్దును ఈ సమయంలోనే తెరపైకి తీసుకొచ్చినట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

## ఉద్రిక్తతలను

# నివారించండి

- భారత్-పాక్‌ను కోరిన చైనా
- కశ్మీర్ పరిస్థితులపై ఆందోళన
- లడఖ్‌ను యూటీగా మార్చడంపై అభ్యంతరం

**బీజింగ్:** జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే అధికరణ 370ని రద్దు చేసిన నేపథ్యంలో చైనా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భారత్-పాక్ సంయమనంతో వ్యవహరించాలని, ఏకపక్షంగా యథాతథ స్థితిని మార్చేందుకు, ఉద్రిక్తతలు పెంచే చర్యలను మానుకోవాలని కోరింది. తాజా పరిణామాలపై చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ స్పందిస్తూ కశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితి పట్ల చైనా తీవ్రంగా ఆందోళన చెందుతున్నదన్నారు. 370వ అధికరణ రద్దుపై నేరుగా మాట్లాడకున్నా ఇరు దేశాలు సంయమనం పాటించాలని చైనా సూచించింది. మరోవైపు, లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడంపై అభ్యంతరం తెలిపింది. 'మా పరిధిలోని భూభాగాన్ని భారత్ తన భూభాగంగా చెప్పుకోవడం వ్యతిరేకిస్తున్నాం. దీనిపై మా వైఖరి స్పష్టంగా, నిలకడగా ఉంది' అని హువా అన్నారు. 'విదేశాల అంతర్గత వ్యవహారాల్లో భారత్ కలుగజేసుకోదు. ఆయా దేశాలు అలాగే ఉండాలి' అని భారత్ విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ అన్నారు.

# ప్రాధాన్యాలు మారుతాయి

- ఇక పాకిస్థాన్‌తో కశ్మీర్ అంశాన్ని చర్చించాల్సిన అవసరం లేదు
- అది పూర్తిగా మన అంతర్గత విషయమే
- ఐరాసలో ఉన్న పిటిషన్‌ను కూడా ఉపసంహరించుకోవాలి
- లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చటం వల్ల చైనా ప్రభావానికీ అడ్డుకట్ట పడింది
- జమ్ముకశ్మీర్‌పై విశ్లేషకుల అభిప్రాయాలు



**ఢిల్లీ:** కశ్మీర్ విషయంలో నెలకొన్న తాజా పరిస్థితులతో భారత-పాకిస్థాన్ మధ్య ప్రాధాన్య అంశాల్లో మార్పు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. జమ్ముకశ్మీర్ స్వయంప్రతిపత్తిని రద్దు చేసి, దానిని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చినందున.. ఇక కశ్మీర్ అంశంపై పాకిస్థాన్‌తో భారత్ చర్చించాల్సిన అవసరం లేదని విశ్లేషకులు కొందరు అభిప్రాయపడుతున్నారు. భారత విదేశాంగశాఖ మాజీ కార్యదర్శి శ్యాంశరణ్ అభిప్రాయం మేరకు.. 'గతంలో జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించడం ద్వారా ఆ ప్రాంతం వివాదాస్పద అంశమని భారత్ పరోక్షంగా అంగీకరించినట్టయింది. కానీ, ఇప్పుడు ఆ ప్రతిపత్తిని తొలగించినందున ప్రస్తుతం ఆ వివాదానికి ఆస్కారం లేదు. ఇప్పుడు కశ్మీర్ కేవలం మనదేశ అంతరంగిక అంశమే. ఈ నేపథ్యంలో భారత్-పాక్ మధ్య భవిష్యత్ చర్చలపై దీని ప్రభావం చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉంటుంది. 1994లో పార్లమెంట్ తీర్మానం మేరకు పాక్ ఆధీనంలోని కశ్మీర్ (పీవోకే), గిల్గిట్-బాల్టిస్థాన్ కూడా భారత్‌లోని అంతర్భాగాలేనని భారత్ వాదించవచ్చు' అని పేర్కొన్నారు. మరోవైపు, తాజా పరిస్థితుల నేపథ్యంలో కశ్మీర్‌కు సంబంధించి ఐరాస భద్రతా మండలి తీర్మానాలను పాకిస్థాన్ ప్రస్తావించే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. అయితే, దీనిని కూడా వ్యూహాత్మకంగా ఎదుర్కోవచ్చని, ఐరాస తొలి రెండు నిబంధనలను అమలు చేసేందుకు పాకిస్థాన్ నిరాకరించినందున మిగతా వాటి జోలికి వెళ్లాల్సిన అవసరం లేదని భారత్ వాదించవచ్చని వారు సూచిస్తున్నారు. గిల్గిట్-బాల్టిస్థాన్ విషయంలో పాకిస్థాన్ ఇదే వైఖరిని అనుసరించిందని, పీవోకే పాలన నేరుగా ఇస్లామాబాద్ నుంచే జరుగుతున్నదని వారు గుర్తు చేస్తున్నారు. జమ్ముకశ్మీర్ భవితవ్యంపై అక్కడి స్థానికుల నుంచే ప్రజాభిప్రాయ సేకరణ జరుపాలని దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఐరాస భద్రతామండలిలో వేసిన పిటిషన్‌ను భారత ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి ఓ ట్వీట్‌లో సూచించారు.


### మధ్యవర్తిత్వానికి తావు లేదు

షాంఘై కొఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్ సందర్భంగా భారత్-పాక్ చర్చలు ప్రారంభించాలని, అందుకు చైనా సహకరిస్తుందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రధాని నరేంద్రమోదీకి సూచించింది. కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వానికి సిద్ధమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తాజాగా ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆర్టికల్ 370 రద్దు, జమ్ముకశ్మీర్‌ను కేంద్రపాలితప్రాంతంగా చేయటం వంటి నిర్ణయాలతో ఇకమీదట ఈ అంశంలో మధ్యవర్తిత్వం ప్రతిపాదన కూడా ఎవరూ తేకుండా కేంద్రం గట్టిచర్యలు చేపట్టిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లడఖ్‌ను జమ్ముకశ్మీర్ నుంచి విభజించి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చటం కూడా మంచి నిర్ణయమని అంటున్నారు. ఇది వ్యూహాత్మక నిర్ణయమని, దీనివల్ల చైనా ప్రభావిత ప్రాంతంలో దేశభద్రత కోణంలో మరింత సమర్థంగా వ్యవహరించవచ్చని, కార్గిల్‌లోని షియాలు, లడఖ్‌లోని బౌద్ధుల విషయంలో సముచిత నిర్ణయాలు తీసుకునే అవకాశాలు పెరుగుతాయని చెబుతున్నారు. లడఖ్‌లో అక్కడ బౌద్ధవర్గాల్లో పెరుగుతున్న చైనా ప్రభావాన్ని తగ్గించవచ్చని అంటున్నారు.

# మరో పుల్వామా?

- జరిగే అవకాశం ఉందన్న పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్
- కశ్మీర్‌పై పాక్ పార్లమెంటరీ సంయుక్త సమావేశం
- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి
- అందులో ఆర్టికల్ 370ను చేర్చకపోవడంపై ప్రతిపక్షాలు అభ్యంతరం






ఇమ్రాన్‌ఖాన్, ఆర్టికల్ 370ను రద్దుపై పెషావర్‌లో పాకిస్థానీల నిరసన

**ఇస్లామాబాద్, ఆగస్టు 6:** ఆర్టికల్ 370ను రద్దు చేయడం వల్ల పుల్వామా లాంటి దాడులు మళ్లీ జరిగే అవకాశముందని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ చెప్పారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ను భారత ప్రభుత్వం రద్దు చేయడంపై చర్చించడానికి మంగళవారం పాకిస్థాన్ పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ఆజంఖాన్ ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడుతూ 'ఆర్టికల్ 370ను వ్యతిరేకిస్తూ కశ్మీర్ ప్రజలు ఆందోళనకు దిగితే భారత ప్రభుత్వం వారిని అణిచివేయడానికి ప్రయత్నిస్తుంది. ఇలాంటి అణిచివేత చివరికి పుల్వామా లాంటి ఉగ్రదాడికి దారితీయొచ్చు. అప్పుడు ఈ దాడికి మనమే కారణమని భారత్ మనపై నిందలు వేస్తుంది. మళ్లీ బాలాకోట్ లాంటి దాడులకు పాల్పడవచ్చు. అలాంటి దాడులను మనం తిప్పికొడుతాం. తర్వాత ఒకవేళ భారత్, పాక్ మధ్య యుద్ధం జరిగితే ఎవరూ గెలువరు. కానీ మొత్తం ప్రపంచానికే తీవ్ర పరిణామాలు ఉంటాయి. ఇది అణ్వస్త్ర బెదిరింపు కాదు' అని తెలిపారు. కశ్మీర్ విషయంలో జరుగుతున్న పరిణామాలపై అంతర్జాతీయ సమాజం స్పందించాలని కోరారు. మరోవైపు నియంత్రణ రేఖ వెంట భారత్ ఉల్లంఘనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ తీర్మానంలో పాకిస్థాన్ పేర్కొన్నది. అయితే జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ను ఆ తీర్మానంలో ప్రస్తావించలేదు. దీంతో ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. తీర్మానంలో ఆర్టికల్ 370ను ఎందుకు చేర్చలేదని ప్రభుత్వాన్ని నిలదీశాయి. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని, సమావేశాన్ని బహిష్కరిస్తామని హెచ్చరించాయి. దీంతో స్పీకర్ కలుగజేసుకుంటూ తీర్మానాన్ని సవరించిన తర్వాత సభను మళ్లీ సమావేశపరుస్తానంటూ వాయిదా వేశారు. ప్రతిపక్ష పార్టీ ముస్లిం లీగ్ నవాజ్ (పీఎంఎల్-ఎన్) నాయకుడు ఆశన్ ఇక్బాల్ మాట్లాడుతూ 'జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ను భారత ప్రభుత్వం రద్దు చేసింది. ఇది పాకిస్థాన్‌కు తీవ్రమైన విషయం. కానీ దీనిని తీర్మానంలో చేర్చలేదు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం. దీనిపై తీవ్ర నిరసన తెలిపాం' అని పేర్కొన్నారు. ఈ సంయుక్త సమావేశానికి పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ హాజరుకాలేదని, విదేశాంగ శాఖ మంత్రి షా మహమూద్ ఖురేషి దేశంలో లేరని తెలిపారు. కాగా ఈ సమావేశం ముగిసేలోగా జమ్ముకశ్మీర్ విషయంలో భారత్ చర్యను నిరసిస్తూ ఓ తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉంది. అయితే ఈ సమావేశం మంగళవారం ముగుస్తుందా? లేదా మరో రోజు పొడిగిస్తారా? అన్న విషయంపై స్పష్టత లేదు.

# కాంగ్రెస్‌లో భిన్నస్వరాలు

- చారిత్రక తప్పును సరిదిద్దారు అంటున్న పలువురు సీనియర్లు
- బీజేపీ నిర్ణయాన్ని స్వాగతించిన ద్వివేది, దీపేందర్ హుడా




జనార్ధన్ ద్వివేది

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 360 రద్దుపై కాంగ్రెస్ పార్టీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్‌లో జరిగిన చర్చల్లో కేంద్రం తీరుపై కాంగ్రెస్ మండిపడుతుండగా పలువురు ఆ పార్టీ సీనియర్లు మాత్రం బహిరంగంగా సమర్థిస్తున్నారు. మోదీ ప్రభుత్వం నిర్ణయానికి మద్దతునిస్తున్నారు. ఆర్టికల్ 370 రద్దుతో దేశ స్వాతంత్ర్య సమయంలో జరిగిన చారిత్రక తప్పిదం సరిదిద్దినట్లైందని కాంగ్రెస్ సీనియర్ నేత జనార్దన్ ద్వివేది మీడియాతో అన్నారు. 'ఇది చాలా పాత సమస్య. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక చాలా మంది పోరాట యోధులు ఆర్టికల్ 370 కొనసాగింపును అంగీకరించలేదు. నా రాజకీయ గురువు డాక్టర్ రామ్ మనోహర్ లోహియా కూడా గట్టిగా వ్యతిరేకించారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. దీన్ని ఎప్పుడో రద్దు చేయాల్సింది' అని అన్నారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని, పార్టీ అభిప్రాయం కాదన్నారు. కాంగ్రెస్ మాజీ ఎంపీ దీపేందర్ ఎస్ హుడా కూడా ఆర్టికల్ 370 రద్దును సమర్థించారు. 'నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం.. 21వ శతాబ్దిలో ఆర్టికల్ 370 అవసరం ఏ మాత్రం లేదు. దేశ ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర నిర్ణయంతో భారత్‌లో అంతర్భాగమైన జమ్ముకశ్మీర్ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. శాంతియుత వాతావరణంతో దీని అమలు బాధ్యత ప్రభుత్వంపై ఉంది' అని ట్వీట్ చేశారు. ఆర్టికల్ 370 రద్దుపై కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ, చీఫ్ విప్ భువనేశ్వర్ కాలితా సోమవారం తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. 'పార్టీ సభ్యులకు విప్ జారీ చేయమని కాంగ్రెస్ అధిష్ఠానం నాకు ఆదేశించింది. ఆర్టికల్ 370 రద్దుపై దేశ ప్రజల అభిప్రాయానికి ఇది వ్యతిరేకం. ప్రస్తుతం పార్టీ పతనావస్థలో ఉంది. నేను మరింత నాశనం చేయలేను' అని తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

# వారధిలేని ప్రయాణమెలా?


- ఢిల్లీ, కశ్మీర్ మధ్య ఉన్న వంతెన ఉనికిని కోల్పోనుంది
- ఆర్టికల్ 370 రద్దుపై ఆవేదన వ్యక్తం చేసిన కశ్మీర్ విద్యార్థులు
- రద్దు మంచిదేనన్న మరికొందరు విద్యార్థులు



కశ్మీరి విద్యార్థుల నిరసన

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** ఆర్టికల్ 370ను రద్దు చేయడంపై కశ్మీర్‌కు చెందిన విద్యార్థులు భిన్నంగా స్పందించారు. ఇర్ఫాన్ అనే విద్యార్థి మాట్లాడుతూ ఆర్టికల్ 370 అనేది ఢిల్లీ, కశ్మీర్ మధ్య వారధి (వంతెన)గా ఉండేదని, కానీ ఇప్పుడు ఆ వారధి ఉనికిని కోల్పోయే ప్రమాదముందని తెలిపారు. వారధి లేనప్పుడు ప్రయాణం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. 'ఆర్టికల్ 370 రద్దు ప్రకటన విషయంలో కేంద్రం హడావుడిగా వ్యవహరించినట్లు అర్థమవుతున్నది. కేంద్ర ప్రభుత్వంపై కశ్మీర్ ప్రజలకు నమ్మకం లేదు. ఆర్టికల్ 370 రద్దు ప్రకటనతో ఈ అపనమ్మకం ఇంకా పెరిగే అవకాశముంది. ఈ పరిణామాలను చూస్తుంటే కేంద్రం కశ్మీర్ ప్రజలతో ఆటలాడుతున్నట్లు కనిపిస్తున్నది' అని పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉండటానికి, పని చేసుకోవడానికి ద్వారాలు తెరిచారని, దీనివల్ల కశ్మీర్‌లోని నిరుద్యోగ సమస్య పరిష్కారవుతుందా? అని నిలదీశారు. 'జమ్ముకశ్మీర్‌లో ఉద్యోగ అవకాశాలు లేవు. అవినీతి పెరిగిపోయింది. కశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ చేపట్టే ఉద్యోగ పరీక్షలను సామాన్య వ్యక్తి అందుకోలేకపోతున్నాడు. అందుకే కశ్మీర్ యువత రాష్ట్రాన్ని వదిలి వేరే ప్రాంతానికి వలస వెళ్తున్నారు' అని ఇర్ఫాన్ చెప్పారు. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకుంటున్న కశ్మీర్‌కు చెందిన మరో విద్యార్థి స్పందిస్తూ ఆర్టికల్ 370ను రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం మోసానికి చిహ్నమని విమర్శించారు. ఢిల్లీలో న్యాయవిద్య చదువుతున్న శ్రీనగర్‌కు చెందిన విద్యార్థి ఇషాన్ మిచూ మాట్లాడుతూ 'చాలా కాలం తర్వాత ఓ మంచి నిర్ణయం తీసుకున్నారు. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏ అనేవి తాత్కాలికమైనవి. రాష్ట్రపతి ప్రకటనతో రాజ్యాంగంలో ఆర్టికల్ 35ఏను చేర్చారు. మళ్లీ రాష్ట్రపతి ప్రకటనతో దాన్ని తొలిగించవచ్చు. మొత్తానికి ప్రభుత్వం ఆర్టికల్ 370ను రద్దు చేయడం గొప్ప పరిణామం. ఇప్పుడు మేము జమ్ముకశ్మీర్‌లో ఉషోదయాన్ని చూస్తున్నాం' అని తెలిపారు. ఆర్టికల్ 370ను రద్దు చేయడానికి గత ప్రభుత్వాలు సాహసం చేయలేదని, కానీ ఇప్పుడు ఆ ఆర్టికల్ రద్దు కావడంతో జమ్ముకశ్మీర్‌లో ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పారు. మరో విద్యార్థి సౌరబ్ సింగ్ స్పందిస్తూ 'నాకు చాలా సంతోషంగా ఉన్నది. ఆర్టికల్ 370ను రద్దు చేయడం వల్ల జమ్ముకశ్మీర్‌కు ద్వారాలు తెరిచినట్లు అయ్యింది. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కొరత, నిరుద్యోగం లాంటి సమస్యలు ఉన్నాయి. ఇవి మెల్లమెల్లగా తొలిగిపోనున్నాయి. ఎందుకంటే ఇప్పుడే తొలి అడుగుపడింది' అని పేర్కొన్నారు.

# అజిత్ దోవల్ పాత్రలో అక్షయ్‌కుమార్?


అక్షయ్‌కుమార్


అజిత్‌దోవల్

ప్రస్తుతం ప్రధాన మంత్రి నరేంద్రమోదికి జాతీయ భద్రతా సలహాదారుడుగా పనిచేస్తున్నారు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అజిత్ దోవల్. ఇంటిలిజెన్స్, రక్షణ రంగంలో వ్యూహచతురుడిగా ఆయనకు పేరుంది. మిజోరాం, పంజాబ్ రాష్ట్రాల్లో తలెత్తిన తిరుగుబాట్లను అణచివేయడంతో పాటు కాందహార్ హైజాక్ ఘటనలో బందీలను విడిపించే ఆపరేషన్‌లో అజిత్‌దోవల్ ప్రధాన భూమిక పోషించారు. తాజాగా కశ్మీర్ పరిణామాలకు సంబంధించిన ముందస్తు వ్యూహాల్ని, భద్రతాపరమైన చర్యల్ని ఆయనే పర్యవేక్షించారు. బాలాకోట్ వైమానిక దాడుల వ్యూహకర్త కూడా ఆయనే. భారత్ సాధిస్తున్న వరుస సైనిక విజయాల వెనక చోదక శక్తిగా అజిత్‌దోవల్ దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన జీవిత చరిత్ర వెండితెర దృశ్యమానంకానుంది. అజిత్‌దోవల్ పాత్రలో అక్షయ్‌కుమార్ నటించబోతున్నారు. ఈ చిత్రానికి నీరజ్‌పాండే దర్శకత్వం వహించబోతున్నారు. గతంలో అక్షయ్‌కుమార్-నీరజ్‌పాండే కాంబినేషన్‌లో స్పెషల్ ఛబ్బీస్, రుస్తుమ్, టాయ్‌లెట్-ఏక్‌ప్రేమ్ కథా చిత్రాలు రూపొందాయి. ప్రస్తుతం అజిత్‌దోవల్ బయోపిక్‌కు సంబంధించిన స్క్రిప్ట్‌వర్క్ జరుగుతుందని, ఈ ఏడాది చివరలో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన కశ్మీర్ పరిణామాల వ్యూహకర్తగా పేరున్న అజిత్‌దోవల్ జీవిత కథ వెండితెరపై ఆవిష్కృతంకాబోతుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.


'రణరంగం' చిత్రంలో కాజల్‌అగర్వాల్

# పూరిజగన్నాథ్ దర్శకత్వంలో..!


విజయ్ దేవరకొండ

రామ్ హీరోగా పూరిజగన్నాథ్ రూపొందించిన 'ఇస్మార్ట్ శంకర్' అనూహ్య విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. గత కొంత కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న దర్శకుడు పూరిజగన్నాథ్ ఈ చిత్రంతో మళ్లీ విజయాల బాట పట్టారు. 'ఇస్మార్ట్ శంకర్' సక్సెస్‌తో రెట్టించిన ఉత్సాహంతో వున్న ఆయన తదుపరి చిత్రాన్ని క్రేజీ హీరో విజయ్ దేవరకొండతో తెరకెక్కించడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే హీరో విజయ్ దేవరకొండతో పూరి చర్చలు మొదలుపెట్టారని, విజయ్ కూడా ఆయనతో కలిసి పనిచేయడానికి సుముఖంగానే వున్నారని తెలిసింది. విజయ్ దేవరకొండ శైలికి పూరి జగన్నాథ్ మార్క్‌ని జోడించి ఈ చిత్రాన్ని తెరపైకి తీసుకురానున్నట్లు సమాచారం. కాగా ఈ చిత్రానికి నిర్మాత ఎవరనేది తెలియాల్సి ఉంది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని పూరిజగన్నాథ్ టీమ్ వెల్లడించనున్నట్లు తెలిసింది.



నాయకానాయికల మధ్య వయోభేదాలతో పట్టింపులు లేకుండా మంచి కథ, పాత్రలకు ప్రాధాన్యతనిస్తూ సినిమాలు చేస్తున్నానని అంటున్నది రకుల్‌ప్రీత్‌సింగ్. కమర్షియల్ సినిమాలతో అగ్ర కథానాయికగా గుర్తింపును సొంతం చేసు కున్న ఆమె ప్రస్తుతం విభిన్నమైన ఇతివృత్తాల్లో భాగమయ్యేందుకు ఆసక్తిని ప్రదర్శిస్తున్నది. రకుల్‌ప్రీత్‌సింగ్ కథానాయికగా నటించిన తాజా చిత్రం 'మన్మథుడు-2'. నాగార్జున కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. ఈ నెల 9న విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళ వారం హైదరాబాద్‌లో రకుల్‌ప్రీత్ సింగ్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఆ విశేషాలివి..

# హీరో చేస్తే ఒప్పు..! హీరోయిన్ చేస్తే తప్పా?

**'మన్మథుడు-2'లో మీ పాత్ర ఎలా ఉంటుంది? ఈ సినిమాను అంగీకరించడానికి కారణం ఏమిటి?**

ఇందులో అవంతిక అనే స్వేచ్ఛాస్వాతంత్ర్యాల్ని అభిలషించే పరిణితితో కూడిన అమ్మాయిగా కనిపిస్తాను. అందరిని ఆటపట్టిస్తూ సరదాగా నా పాత్ర సాగుతుంది. వినోదం, సెంటిమెంట్‌తో పాటు అన్ని రకాల భావోద్వేగాలతో శక్తివంతంగా ఉంటుంది. తనకన్నా రెట్టింపు వయసున్న వ్యక్తితో పరిచయం అవంతిక జీవితంలో ఎలాంటి మార్పుల్ని తీసుకొచ్చిందన్నది సినిమాలో ఆసక్తిని పంచుతుంది.

**ప్రచార వేడుకల్లో సినిమా మర్చిపోలేని అనుభూతుల్ని మిగిల్చిందని చెప్పారు?**

నా కెరీర్‌లో అత్యంత సంతోషంగా పూర్తిచేసిన సినిమా ఇదే. చిత్రీకరణ సమయంలో నాగార్జున, లక్ష్మి, ఝాన్సీ.. అందరం ఓ కుటుంబంలా కలిసిపోయాం. కారావ్యాన్‌లలోకి వెళ్లకుండా షూటింగ్ విరామ సమయంలో ఒకే దగ్గర కూర్చొని మాట్లాడుకునేవాళ్లం. 'షాట్ సిద్ధమైంది మాటలు ఆపేసి రండి' అని రాహుల్ చెప్పగానే ముచ్చట్లలోంచి బయటపడేవాళ్లం. సాయంత్రం ఆరు గంటలకు ప్యాకప్ చెప్పగానే కలిసే డిన్నర్ చేసేవాళ్లం. ఆ కలివిడితనం స్క్రీన్‌పై ఫ్యామిలీ సన్నివేశాలు సహజంగా రావడానికి ఉపయోగపడింది.

**రాహుల్ రవీంద్రన్‌తో ఉన్న స్నేహంతోనే ఈ సినిమాను అంగీకరించారా? దర్శకుడిగా అతడిలో మీకు నచ్చినదేమిటి?**

'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సమయంలో రాహుల్‌తో పరిచయం మొదలైంది. అతడిని ఓ పెద్దన్నలా భావిస్తాను. ప్రీప్రొడక్షన్స్‌కు రాహుల్ ఎక్కువ సమయాన్ని తీసుకుంటాడు. ఈ సినిమా షూటింగ్ ప్రారంభానికి నెల రోజుల ముందుగానే బౌండ్ స్క్రిప్ట్‌ను నాకు ఇచ్చాడు. కథపై పూర్తిగా అవగాహన ఉండటంతో ప్రతి రోజు సెట్స్‌కు వెళ్లేముందు డైలాగ్స్, సీన్స్ ఏమిటనే టెన్షన్ ఉండేదికాదు. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి? మిగతా క్యారెక్టర్స్‌తో ఉన్న అనుబంధం ఏమిటనేది ముందుగానే తెలియడంతో సులభంగా నా పాత్రలో ఒదిగిపోగలిగాను.

**బాలీవుడ్‌లో మీరు నటించిన 'దే దే ప్యార్‌దే' వయో అంతరాల ఆధారంగా సాగుతుంది. ఆ సినిమాతో ఈ చిత్రానికి ఏమైనా పోలికలు ఉంటాయా?**

వయసు అంతరం అనే పాయింట్ తప్పితే రెండు కథల్లో చాలా వైరుధ్యాలుంటాయి. 'దే దే ప్యార్ దే' పూర్తిస్థాయి ప్రేమకథతో సాగుతుంది. వయసు అంతరాల కారణంగా ఓ జంటకు ఎదురయ్యే పరిణామాలతో సరదాగా ఉంటుంది. 'మన్మథుడు-2' చిత్రాన్ని కుటుంబ, ప్రేమ, అనుబంధాలు.. పలు అంశాల్ని స్పృశిస్తూ తెరకెక్కించారు. 'దే దే ప్యార్ దే' పూర్తయిన తర్వాతే కథ విని ఈ సినిమాను అంగీకరించాను.

**మీరు చేసిన అవంతిక పాత్రలో బోల్డ్‌నెస్ ఎక్కువగా కనిపిస్తుంది. ట్రైలర్‌లో సిగరెట్ తాగుతూ కనిపించారు?**

సినిమాలో అవంతికకు సిగరెట్ తాగే అలవాటు ఉంటుంది. సిగరెట్ తాగడాన్ని బోల్డ్‌నెస్ అంటే ఎలా? హీరోయిన్ సిగరెట్ తాగే సన్నివేశాన్ని చూపించడానికో, సినిమాలో నాగార్జున ప్రియురాళ్ల గురించి చెప్పడానికో సరదాగా చేసిన సినిమా కాదిది. అవన్నీ కథలో అంతర్భాగంగానే ఉంటాయి. అవే కీలకం కాదు. కొద్ది క్షణాలు మాత్రమే కనిపించే సన్నివేశాల్ని ప్రేక్షకులు గుర్తుపెట్టుకోరని అనుకుంటున్నాను. నిజ జీవితంలో నేను సిగరెట్ కాల్చను. ఆ అలవాటు లేదు. కానీ క్యారెక్టర్ కోసమే ఈ సన్నివేశాల్లో నటించాను. .

**హీరోయిన్లు అలాంటి సన్నివేశాల్లో నటిస్తే ప్రేక్షకులు స్వీకరిస్తారని అనుకుంటున్నారా?**

దేశంలో నిత్యం ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయి. కానీ సమాజం అంగీకరిస్తుందో? లేదో అని చాలామంది వాటి గురించి మాట్లాడటానికి భయపడతారు. అదే సినిమాల్లోకి వచ్చేసరికి అలాంటివి చూపిస్తే సంస్కృతి సంప్రదాయాలను కించపరుస్తున్నారని చెబుతారు. చెడు అలవాట్ల వైపు వెళ్లమని ఎవరూ ప్రోత్సహించరు. మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరమని సినిమాల్లో ఆ సన్నివేశాలు వచ్చినప్పుడు హెచ్చరిస్తాం. సినిమాల్లో హీరోలు సిగరెట్లు తాగితే ఎవరూ పట్టించుకోరు. అదే హీరోయిన్లు అలాంటి సన్నివేశాల్లో నటిస్తే మాత్రం సమస్యగా భావిస్తుంటారు.

**ఈ మధ్యకాలంలో మీరు వయసు ఎక్కువగా ఉన్న హీరోలతో సినిమాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి?**

ఇలాంటి మాటల్ని నేను పట్టించుకోను. వయసు ఎక్కువగావున్న హీరోలతో రొమాన్స్, పాటలతో కూడిన కమర్షియల్ సినిమాలు చేస్తే విమర్శించడంలో తప్పులేదు. నిజజీవితంలో నా స్నేహితురాలు ఒకరు తన తండ్రి కంటే రెండేళ్లు చిన్నవాడైన వ్యక్తిని ప్రేమించి పెళ్లిచేసున్నది. ఆమె కథను తెరపై ఆవిష్కరించాలని అనుకున్నప్పుడు హీరోయిన్‌గా ఇరవై ఐదేళ్ల అమ్మాయే నటించాలి తప్పితే నలభై ఏళ్ల వారు నటిస్తే ఆ పాత్రకు న్యాయం జరగదు. 'మన్మథుడు-2' నాయకానాయికల మధ్య వయోభేదానికి కారణం ఉంటుంది. అవంతిక లాంటి మంచి పాత్ర లభించినప్పుడు వదులుకోవడంలో అర్థం లేదు. ఇలాంటి పాత్రలు అరుదుగా దొరుకుతాయి.

**వయసు ఎక్కువగా ఉన్న హీరోలతో నటించడం వల్ల అవకాశాలు తగ్గుతాయనే భయం ఉందా?**

అలాంటివి నేను నమ్మను. సీనియర్స్, జూనియర్స్ అనే ఆలోచనతో కాకుండా కథను నమ్మే సినిమాలు చేస్తాను. ఆ ఆలోచన ధోరణిని వీడాలి. సినిమాలకు, పాత్రలకు నటీనటులు ఎంతవరకు న్యాయం చేస్తున్నారనే చూడాలి తప్పితే వారి వ్యక్తిగత జీవితాలతో వాటిని ఆపాదించడం సరికాదు. దేశవ్యాప్తంగా తెలుగు సినిమాను అందరూ గౌరవిస్తున్నారు. పెళ్లిచూపులు, క్షణం, గూఢచారి లాంటి చిన్న సినిమాలతో పాటు వినూత్న కథాంశాలతో రూపొందించిన పెద్ద సినిమాలు విజయాల్ని అందుకున్నాయి. దర్శకనిర్మాతల ఆలోచన ధోరణులతో పాటు ప్రేక్షకులు మారుతున్నారు.

**ఈ సినిమాలో సహజీవనం గురించి చర్చించినట్లున్నారు. దానిపై మీ అభిప్రాయమేమిటి.**

నేను ఎవరితో రిలేషన్‌షిప్‌లో లేను. అలాంటప్పుడు దానిపై ఎలా అభిప్రాయం చెప్పగలను. సహజీవనం తప్పని చెప్పను. తమకు నచ్చినట్లుగా జీవించే హక్కు ప్రపంచంలో ప్రతి ఒక్కరికి ఉంది. నేను మాత్రం వివాహవ్యవస్థను గౌరవిస్తాను.

**తదుపరి సినిమాలేమిటి?**

ప్రస్తుతం తెలుగులో నితిన్‌తో ఓ సినిమా చేస్తున్నాను. ఇందులో క్రిమినల్ లాయర్‌గా నా పాత్ర వినూత్నంగా ఉంటుంది. అలాగే తమిళంలో సిద్ధార్థతో చేస్తున్న సినిమా అక్టోబర్‌లో విడుదలకానుంది. బాలీవుడ్‌లో ఓ చిత్రాన్ని అంగీకరించాను. ఆ వివరాల్ని త్వరలో వెల్లడిస్తాను.

# యంగ్ లుక్ కోసం..!


అమీర్‌ఖాన్

బాలీవుడ్ మిస్టర్‌పర్‌ఫెక్ట్ అమీర్‌ఖాన్ తాను పోషించే పాత్ర కోసం ఏం చేయడానికైనా సిద్ధపడుతుంటారన్న విషయం తెలిసిందే. 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్' పరాజయం తరువాత కొంత విరామం తీసుకున్న ఆయన తాజాగా 'లాల్‌సింగ్ చద్దా' చిత్రంలో నటిస్తున్నారు. 1994లో యాక్షన్ హీరో టామ్ హంక్స్ నటించిన హాలీవుడ్ చిత్రం 'ఫారెస్ట్ గంప్' ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. చారిత్రక ఘటనలకు సాక్షిగా నిలిచిన ఓ వ్యక్తి ఇతివృత్తంతో రూపొందనున్న ఈ చిత్రంలో అమీర్‌ఖాన్ యంగ్‌గా కనిపించనున్నారట. ఇందు కోసం ఆయన దాదాపు 20 కిలోల బరువు తగ్గారని తెలిసింది. ప్రత్యేక డైట్‌ని ఫాలో అవుతున్న ఆయన లాల్‌సింగ్ చద్దా పాత్ర కోసం చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ఈ చిత్రానికి సంబంధించి ప్రతి విషయంలోనూ అమీర్ మార్పులు చేర్పులు సూచిస్తూ ఎక్కడా ఎలాంటి చిన్న చిన్న పొరపాట్లు కూడా దొర్లకుండా సూచనలిస్తున్నారని తెలిసింది. ప్రీప్రొడక్షన్ వర్క్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ నుంచి ప్రారంభించనున్నట్టు చిత్ర వర్గాల సమాచారం. 'సీక్రెట్ సూపర్‌స్టార్' ఫేమ్ అద్వైత్ చందన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని వయాకమ్ 18 పిక్చర్స్‌తో కలిసి అమీర్‌ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మించనుంది.

# ఉండిపోరాదే ఇలలో..


తరుణ్, లావణ్య, రాజ్ కందుకూరి, లింగేశ్వర్, నవీన్

'కథను నమ్మి నిజాయితీగా తెరకెక్కించిన సినిమాల్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. వినూత్నమైన కథాంశాలతో రూపొందిన చిన్న సినిమాలు మంచి విజయాల్ని సాధిస్తున్నాయి. ఆ కోవలో ఈ సినిమా నిలవాలి' అని అన్నారు నిర్మాత రాజ్ కందుకూరి. తరుణ్‌తేజ్, లావణ్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఉండిపోరాదే'. నవీన్ నాయని దర్శకుడు. డాక్టర్ లింగేశ్వర్ నిర్మించారు. ఈ చిత్ర ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో నిర్మాత రాజ్ కందుకూరి విడుదలచేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మాట్లాడుతూ 'తల్లిదండ్రుల ప్రభావం పిల్లలపై ఎంతవరకు ఉంటుందనే కథాంశంతో రూపొందిస్తున్న చిత్రమిది. కుటుంబ బంధాలు, ప్రేమ, వినోదం, భావోద్వేగాల సమాహారంగా సాగుతుంది. పాటలకు, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది. నాయకానాయికలు కొత్తవారైనా చక్కటి అభినయాన్ని ప్రదర్శించారు. పతాకఘట్టాలు మనసుల్ని కదిలిస్తాయి. కథాగనుణంగా మంచి టైటిల్ కుదిరింది. వందశాతం సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. హృదయాల్ని స్పృశించే అందమైన ప్రేమకథ ఇదని, అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి త్వరలో విడుదల చేస్తామని దర్శకుడు పేర్కొన్నారు. హీరో మాట్లాడుతూ 'టీనేజ్ ప్రేమకథ ఇది. అంతర్లీనంగా మంచి సందేశం మిళితమై ఉంటుంది. యువతతో పాటు కుటుంబప్రేక్షకుల్ని మెప్పించే అంశాలుంటాయి' అన్నారు.

# పోలీస్ ఝాన్సీ


ఝాన్సీ

అయేషా హబీబ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'పోలీస్ పటాస్'. శశికాంత్ దర్శకత్వం వహించారు. భీమవరం టాకీస్ పతాకంపై తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మిస్తున్నారు. ఈ నెల 15న విడుదలకానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కల్యాణ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'విజయశాంతి తర్వాత యాక్షన్ సినిమాలు చేసే హీరోయిన్ల సంఖ్య తగ్గిపోయింది. రిస్క్ తీసుకోవడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. ఆ లోటును అయేషా తీరుస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. నిర్మాత రామసత్యనారాయణ మాట్లాడుతూ 'ఝాన్సీ అనే మహిళా ఐపీఎస్ అధికారి కథ ఇది. సంఘవిద్రోహ శక్తులపై ఆమె సాగించిన పోరాటం నేపథ్యంలో ఆసక్తికరంగా ఉంటుంది' అని అన్నారు. ఈ సినిమాలో డూప్ లేకుండా తాను యాక్షన్ సన్నివేశాల్లో నటించానని అయేషా హబీబ్ చెప్పింది.

